# శ్రీ తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు

## (కల్యాణోత్సవ, అభిషేక, రథోత్సవ, హనుమత్సంకీర్తనలు)

సంకలనం

**డా॥ కె. సర్వోత్తమ రావు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2023**

**SRI TALLAPAKA PADAKAVULA SANKEERTHANALU**
**(Kalyanotsava, Abhisheka, Rathotsava, Hanumatsankeerthanlu)**

**Compiled by**
**Dr. K. Sarvottama Rao**

T.T.D. Religious Publications Series No. 1460
© All Rights Reserved

*First Edition* : 2023

*Copies :* 500

*Published by*
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

*D.T.P:*
**Publications Division**
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press**
Tirupati - 517 507.

# ముందుమాట

**యెనలేని తిరువేంకటేశుడే దైవమని**
**వినగలిగినది గదా వినికి**
**అనయంబు నతని సేవానందపరులయి**
**మనగలిగినది గదా మనుజులకు మనికి ॥**

ఆంధ్ర వాగ్గేయకారులలో తాళ్ళపాక అన్నమయ్య పెద్దతిరుమలయ్య, చిన్న తిరుమలయ్య శ్రీవేంకటేశ్వరస్వామిని కీర్తించిన ధన్యజీవులు. వీరిలో 15వ శతాబ్దానికి చెందిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు పదకవితకు ఆద్యుడు. అన్నమయ్య శ్రీవారి మహిమలను, క్షేత్రాన్ని, తీర్థాలను మాత్రమే కాకుండా శ్రీవారి సేవలను సేవకులనుకూడా కొనియాడారు. విశేషంగా వివిధ దేవతామూర్తులతో శ్రీవారికున్న అభేదాన్ని, అనుబంధాలను కూడా విశ్లేషించారు.

ఈ తాళ్ళపాక కవుల సంకీర్తనలను శృంగార, ఆధ్యాత్మిక, యోగ కీర్తనలుగా పరిశోధకులు వింగడించారు. తిరుమల శ్రీనివాసుని సంకీర్తనలను ఒకసారి పరిశీలిస్తే మేలుకొలుపు మొదలు పవళింపుసేవదాక జరిగే అన్ని కైంకర్యాలకు సంబంధించిన సంకీర్తనలు, ఉత్సవ సంకీర్తనలు, బ్రహ్మోత్సవ సంకీర్తనలు, రథోత్సవ సంకీర్తనలు ఇలా అనేకం ఉన్నాయి. స్వామివారి సేవలను ప్రత్యక్షంగా దర్శించలేని అభాగ్యులను భాగ్యవంతులుగా చేస్తూ తాళ్ళపాక కవులు ఈ కీర్తనలలో కళ్ళకు కట్టినట్టుగా శ్రీవారి సేవలను కైంకర్యాలను వర్ణించి దర్శింపజేశారు.

సంగీతప్రియులు, పాఠకులు, జిజ్ఞాసువులు సందర్భోచితంగా ఆ యా సంకీర్తనలు కావాలంటే వెతుక్కోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఈ కష్టాన్ని సుఖతరం చేస్తూ ప్రసిద్ధ కవిపండితులు ఆచార్య కె.సర్వోత్తమరావు

గారు అన్నమాచార్య సంకీర్తనలలో కల్యాణోత్సవ సంకీర్తనలు, అభిషేక సంకీర్తనలు, రథోత్సవసంకీర్తనలు, హనుమత్సంకీర్తనలు అనే నాలుగు అంశాలకు సంబంధించిన సంకీర్తనలను ఒక చోట చేర్చి, వాటికి విడివిడిగా విశ్లేషణాత్మకమైన చక్కటి పీఠికతో **"శ్రీ తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు"** అనే పేరున తి.తి.దే. ద్వారా భక్తలోకానికి అందిస్తున్నారు.

స్వామివారికి ఉదయాస్తమానాలలో ఎన్ని కైంకర్యాలు జరిగినా వాటిలో కల్యాణోత్సవ ప్రత్యేకతే వేరు. ఎన్ని ఆలయాలలో కల్యాణోత్సవాలు ఉన్నా, నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల శ్రీవారి కల్యాణోత్సవం విశిష్టత ఎన్నటికీ తగ్గదు. తిరుమలలో ఎక్కువమంది భక్తులు దర్శించేందుకు అవకాశం ఉన్న సేవకూడా కల్యాణోత్సవ సేవయే. ఒకప్పుడు బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే కల్యాణోత్సవం అన్నమాచార్యుల కాలం నుండి నిత్యకల్యాణోత్సవంగా మారింది. స్వామివారు నిత్యకల్యాణ చక్రవర్తి కాగా అన్నమాచార్యులు నిత్యకన్యాదాత. స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులకు కట్టినట్లుగా అన్నమాచార్యులతోపాటు వారి వంశ్యులు తమతమ సంకీర్తనలలో అత్యద్భుతంగా వర్ణించారు.

ఇక తిరుమల శ్రీవారి మూలమూర్తికి ప్రతి శుక్రవారం జరిగే వారోత్సవం సంపూర్ణ మంగళస్నానం. శుక్రవారమే ఈ అభిషేకం జరపడానికి కూడా అనేకానేక కారణాలు లేకపోలేదు. శుక్రవార అభిషేక సమయంలో మాత్రమే స్వామివారి దివ్యమంగళ మనోహర సాలగ్రామ శిలా విగ్రహాన్ని నిజరూపంగా ఆపాదమస్తకం దర్శించే భాగ్యం దక్కుతుంది. ఈ సందర్భంలోనే స్వామివారి వక్షఃస్థలంలో కొలువై ఉన్న వ్యూహలక్ష్మీదేవిని దర్శించే భాగ్యం కలుగుతుంది. శ్రీవారి మూలమూర్తికి జరిగే శుక్రవారాభిషేకాన్ని దర్శించేభాగ్యం ఆలయ స్థలాభావంవల్ల ఏ కొద్దిమంది పుణ్యాత్ములకో దక్కుతుంది. ఈ దర్శనం అందరికీ లభించేది కాదు. అయితే



అన్నమాచార్యులు తమ అభిషేక సంకీర్తనలలో శుక్రవారంనాడు జరిగే అభిషేకాన్ని, ఆ సమయంలో స్వామివారి మనోహర సౌందర్యాన్ని సాక్షాత్తూ మన కళ్ళముందే జరుగుతున్నంత అనుభూతిని కలిగించేట్లుగా వర్ణించారు.

"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" రథసేవలో శ్రీహరిని దర్శిస్తే పునర్జన్మ ఉండదు. అని శాస్త్రాలు చెబుతున్నాయి. స్వామివారికి బ్రహ్మోత్సవాలలో జరిగే ఉత్సవాలలో రథోత్సవం ఒక ప్రముఖ ఘట్టం. ఈ రథోత్సవాన్ని అన్నమాచార్యులు అనేక సంకీర్తనలలో చాలా చక్కగా వర్ణించారు. రథం మానవ శరీరం అయితే అందులో కొలువుండే పరమాత్మయే శ్రీనివాసుడు. ఈ రథోత్సవ సేవలో రథం మోకులు(త్రాళ్లు) లాగుతూ అనేక భక్తజనులు తరిస్తారు. ఈ సేవకు ఫలితం ఆత్మానాత్మ వివేచనమని పండితుల అభిప్రాయం. దివ్యమంగళ రథంలో ఉభయ దేవేరులతో ఊరేగుతున్న మలయప్పస్వామి వైభవాన్ని, భక్తుల కోలాహలాన్ని గురించి తాళ్లపాక కవులు తమ సంకీర్తనలలో విశదంగా వివరించారు.

శ్రీవైష్ణవ సంప్రదాయంలో గరుత్మంతుని పెరియ తిరువడిగాను హనుమంతుని సిరియ తిరువడిగాను వర్ణిస్తారు. హనుమంతుడు జన్మించిన స్థలం కూడా తిరుమలగిరులలోని అంజనాచలమే. వాయుపుత్రుడైన హనుమంతుడు దాసభక్తికి ప్రతీక. తానే స్వయంగా 'దాసోహం కౌసలేంద్రస్య' అని చెప్పుకుంటాడు. వైష్ణవ క్షేత్రాలలో గరుడవాహన సేవకు ఎంత ప్రాధాన్యం ఉందో హనుమంత వాహనసేవకు అంతే ప్రాధాన్యత ఉన్నది. అటువంటి హనుమంతుని సేవానిరతిని వర్ణిస్తూ తాళ్ళపాక అన్నమాచార్యులు వారి వంశీయులు వివిధ సంకీర్తనలను రచించారు.

పై నాలుగు అంశాలకు సంబంధించి తాళ్ళపాక పదకవుల సంకీర్తనలను సంగీత ప్రపంచానికి సాహితీ ప్రపంచానికి మరింత చేరువ

చేస్తున్న ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది. ఆచార్య కె. సర్వోత్తమరావు గారికి శ్రీ వేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలు కలగాలని మనసారా ఆకాంక్షిస్తూ, భక్తమహాశయులు, సంగీత, సాహిత్యప్రియులు **"శ్రీ తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు"**అనే ఈ గ్రంథాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాను.

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.



# నివేదన

1955వ సంవత్సరం నేను శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో 'విద్వాన్' కక్ష్యలో చేరినప్పటి నుండి 'తాళ్లపాక వాఙ్మయ పరిచయం' నాలో దినదినాభివృద్ధితో సాగుతూంది. ఇందుకు ప్రధాన కారణం శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల మరియు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ కలిసి ఏటేట తాళ్లపాక వర్ధంతి ఉత్సవాలు అప్పటి త్యాగరాయనగర్ ప్రాంగణంలో జరుపుతుండడం. కాలాంతరంలో అన్నమయ్య ప్రాజెక్టు స్థాపితమయినా, ఆ ప్రాజెక్టు తిరుపతి మరియు ఇతర ప్రదేశాలలో ఉపన్యాసాలు ఏర్పాటు చేసినప్పుడు 'వక్తగా' పలుసార్లు ఆహ్వానింపబడడం వల్ల ఈ వాఙ్మయంపై పట్టు సాధించుకొన్నాను. ఆపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సదరు విశ్వవిద్యాలయం రజతోత్సవ సందర్భంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారే అప్పటి తెలుగు అధ్యయనశాఖలో అన్నమాచార్య పీఠం నెలకొల్పడం, ఆ పీఠానికి నన్నే 'రీడర్'గా ఎంపిక చేయడంతో అపారమయిన సముద్రంలో విహారం సలిపినట్లయింది. ఆ సందర్భంలోనే నేను తాళ్లపాక వాఙ్మయ సంబంధ పుస్తకాలు వ్రాయడం, ముద్రించడం, ఉచితంగా కూడా ఇవ్వడం లాంటివి జరిగాయి. అలాగే విశ్వవిద్యాలయాలలో 'తాళ్లపాక వాఙ్మయ సంబంధి' పరిశోధనలు చేసే పరిశోధకులకు పర్యవేక్షకునిగా ఆరు సిద్ధాంత గ్రంథాలు వెలువడడం, అవి ముద్రితం కావడం అన్నమయ్య సాహిత్య జిజ్ఞాసువులకు సంప్రీతి కలగడం లాంటివి జరిగాయి.

అన్నమయ్య పదసాహిత్యం ఒక పూలవనం. ఈ వనంలో పూసిన ప్రతిపుష్పం చిత్రవిచిత్ర వర్ణశోభితం. ఆ సాహిత్యంలో కనిపించే భక్తకోటిలో 'హనుమ' ఒకడు. అన్నమయ్య మాటలలో చెప్పాలంటే హనుమంతుడు శ్రీ వేంకటేశ సేవాగ్రగణ్యుడు. తిరుమలలో అంజనాద్రి చెంత హనుమంతుడు జన్మించాడని వివిధ పురాణాలు చెబుతున్నాయి. ఇందుకు తార్కాణంగా

ఆంజనేయుడు శ్రీవారి ఆలయానికి అభిముఖంగా అంజలిబద్ధుడై బేడి ఆంజనేయస్వామిగా నిలబడి ఉన్నాడు. అన్నమయ్య కూడా ఇదే విశ్వాసాన్ని స్థిరంగా తన సంకీర్తనల్లో పేర్కొన్నాడు. అలాంటి హనుమంతునికి సంబంధించిన కీర్తనలను ఒకచోట కూర్చి చక్కటి పీఠికను రాయడం జరిగింది.

తాళ్లపాక అన్నమయ్య శ్రీవారి ఆలయకవి. నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ సంవత్సరోత్సవాలను దగ్గర నుండి వీక్షించినవాడు. ఆ కారణంగానే అన్నమయ్య సంకీర్తనల రాశిలో అభిషేక సంకీర్తనలు, రథోత్సవ కీర్తనలు, కల్యాణోత్సవ కీర్తనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నేటికీ భక్తులు తాము దర్శించుకోవాలని కోరుకొనేవి ఇవి కావడంతో వీటికి కూడా నాతిదీర్ఘ పీఠికలను సమకూర్చడం జరిగింది. అన్నమాచార్యులతోపాటు వారి వంశ్యులు కూడా పై నాలుగు అంశాలను వర్ణిస్తూ సంకీర్తనలు చేశాడు. తాళ్ళపాక పదకవులు చేసిన ఈ నాలుగు అంశాలకు సంబంధించిన కీర్తనలు ఒక సంపుటంగా వెలువరిస్తే బాగుంటుందని భావించి 'శ్రీ తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు' అనే గ్రంథంగా తి.తి.దే.కి సమర్పించాము.

ఈ గ్రంథాన్ని తి.తి.దే. స్వీయముద్రణగా ముద్రించేందుకు అంగీకారం తెలిపిన శ్రీ కార్యనిర్వహణాధికారి వారికి మరియు అధికార ప్రముఖులకు హృదయపూర్వక ధన్యవాదములు.

'శ్రీ తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు' అనే ఈ గ్రంథం ఆస్తిక మహాశయులకు, ఆలయ ఉత్సవ విశేషాల గురించి తెలుసుకోవాలనే కుతూహలం కలిగిన చదువరులకు మార్గనిర్దేశమవుతుందని విశ్వసిస్తున్నాను.

**– కె. సర్వోత్తమరావు**



# విషయసూచిక

## కల్యాణోత్సవ సంకీర్తనలు (1 - 64)


1. వినతి
2. తాళ్లపాక పదకవులు – కల్యాణోత్సవాలు
3. కల్యాణ సంకీర్తనల వింగడింపు
4. దశావతారమూర్తుల కల్యాణాలు
5. గోపికా పరిణయాలు
6. అర్చావతారమూర్తుల కల్యాణాలు
7. జానపదబాణిలో వర్ణితమయిన కల్యాణాలు
8. కల్యాణ సంకీర్తనలలోని విశిష్ట పదజాలం
9. తి.తి.దే. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రముఖ కళాకారులు శ్రీవారి కల్యాణోత్సవాలలో పాడే పాటలు

అనుబంధం

ఉపకరించిన రచనలు


## అభిషేక సంకీర్తనలు (65 - 182)


1. నివేదన
2. తాళ్లపాకపదకవులు – శ్రీవేంకటేశ్వరుడు
3. తిరుమల శ్రీవారి గర్భాలయంలో పంచబేరమూర్తులు
4. అభిషేకం – పర్యాయపదాలు
5. తిరుమలలో పంచబేరములకు నిర్వహించే అభిషేకాలు
6. మలయప్ప స్వామికున్న కవచాలు
7. తిరుమలలో శుక్రవారాభిషేక ప్రాధాన్యం
8. తి.తి.దే. శాసనాలలో శుక్రవార అభిషేక ప్రశంసలు

9. తాళ్లపాకపదకవుల సంకీర్తనలలో శుక్రవారప్రశస్తి
10. సంకీర్తనలలో శుక్రవారాభిషేకం
11. ప్రస్తుతం తిరుమలలో శుక్రవారాభిషేక విధానం
12. అభిషేకంలో పరిమళద్రవ్యాలు – ఊర్ధ్వపుండ్రాల ద్రవ్యాలు
13. అభిషేక సంకీర్తనల వైవిధ్యం – దశావతార ప్రసక్తి
14. అభిషేక సంకీర్తనలు – రామకృష్ణావతారాల ప్రశంసలు
15. అభిషేక సంకీర్తనలు – పంచవ్యూహాలు
16. అభిషేక సంకీర్తనలు – ఋతువులు
17. అభిషేక సంకీర్తనలు – మధురభక్తి
18. అభిషేక సంకీర్తనలు – పౌరాణిక ప్రసంగాలు
19. అభిషేక సంకీర్తనలు – అధిక్షేపం
20. అభిషేక సంకీర్తనలు – సంప్రదాయకథనం
21. అభిషేక సంకీర్తనలు – ఆలంకారిక కథనం
22. అభిషేక సంకీర్తనలు – రసస్ఫూర్తి
23. అభిషేక సంకీర్తనలు – ఎత్తుగడలు
24. సంకీర్తనలలో రాగవిశేషాలు
25. సంకీర్తనలలో తమిళపదాలు
26. తాతల అడుగుజాడల్లో దౌహిత్రుడు
27. ఉపకరించిన రచనలు  తిరుమలేశుని అభిషేక సంకీర్తనలు
అనుబంధం 1 – కీర్తనలలోని కొన్నిపదాలకు అర్థాలు
అనుబంధం 2 – కీర్తనల అకారాది సూచిక
అనుబంధం 3 – శ్రీస్వామివారి శుక్రవార విశేషము
అనుబంధం 4 – కన్నడ కీర్తనలలో అభిషేకప్రశంసలు
అనుబంధం 5 – శ్రీపాదరేణు ప్రభావము



## రథోత్సవ సంకీర్తనలు (183 - 265)

1. రథం – పర్యాయపదాలు
2. వైదిక వాఙ్మయంలో రథాంశాలు
3. శాస్త్రాదులలో రథాంశాలు
4. భారతదేశంలో ప్రసిద్ధ రథాలయాలు
5. రథసంబంధి మరికొన్ని అంశాలు
6. తిరుమలలో రథోత్సవాలు
7. తాళ్లపాక పదకవుల రథసంకీర్తనలలో వైవిధ్యం
8. తాళ్లపాక పదకవుల రథసంకీర్తనలలో సాహిత్యాంశాలు
9. తాళ్లపాక పదకవుల రథోత్సవ సంకీర్తనలలో సంగీతాంశాలు

**అనుబంధం**

1. రథోత్సవ సంకీర్తనలు
2. తి.తి.దే. శాసనాలలో రథోత్సవాలు
3. తిరుమల రథోత్సవం – తరిగొండ వెంగమాంబ
4. రథోత్సవ సంకీర్తనలలో రథాలు – తేరులు
5. రథసంబంధి పదజాలం
6. కతిపయ శబ్దాలకు అర్థవిశేషాలు
7. ఉపకరించిన రచనలు

## హనుమత్సంకీర్తనలు (267 - 383)

1. వేదంలో 'కపి'
2. పురాణాలలో 'కపి'
3. వివిధ రామాయణాలలో హనుమజ్జనన వృత్తాంతాలు
4. విదేశాలలో హనుమత్కథలు
5. తమిళవాఙ్మయంలో హనుమత్ ప్రశంస
6. కన్నడ హరిదాస సాహిత్యంలో హనుమంతుడు
7. తెలుగు సాహిత్యంలో హనుమత్ప్రశంస
8. జానపద సాహిత్యంలో హనుమత్కథలు
9. తాళ్లపాక పదకవుల హనుమత్సంకీర్తనలు - విశేషాంశాలు
10. హనుమత్సంకీర్తనలలో శ్రీమద్రామాయణ సన్నివేశాలు
11. భారతంలో 'హనుమంతుడు'
12. సమీరకుమార విజయంలో 'పురుషామృగవృత్తాంతం'
13. హనుమత్ వైభవం
14. పదకవుల హనుమత్ క్షేత్ర సంకీర్తనలు
15. హనుమత్సంకీర్తనలు - తాళ్లపాక పదకవుల రచనావైశిష్ట్యం
16. తమిళ కర్ణాటక ప్రదేశాలలో హనుమదాలయాలు
17. హనుమత్ సంకీర్తనల అకారాది సూచిక

అనుబంధం-1

అనుబంధం-2

ఉపకరించిన రచనలు

# కల్యాణోత్సవ సంకీర్తనలు

ఆంధ్రవాఙ్మయచరిత్రను విమర్శనా దృష్టితో పరిశీలించేవారికి ఈ వాఙ్మయంలో ప్రసిద్ధులయిన ఎన్నో కవికుటుంబాలు, మరెన్నో పండిత కుటుంబాలు ఆలాగే అనేక వాగ్గేయకారకుటుంబాలు కనబడతాయి. కవి పండిత వాగ్గేయకార కుటుంబాలలో తాళ్లపాకవారికి ఇతరులెవ్వరు సాటిరారు. తాళ్లపాక కవుల సంఖ్య ఎన్నయినా పదకవులు మాత్రము ముగ్గురే. తాళ్లపాక అన్నమాచార్యులు. పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు. వీరు ముువ్వురు సప్తగిరీశుని సంకీర్తనములతో అర్చించినవారే. పవిత్ర జీవితం గడుపుతూ పద్మనాభుని శృంగార, అధ్యాత్మ సంకీర్తనలతో నుతించినవారే. ప్రత్యేకించి అన్నమయ్య అడుగుజాడల్లో ఇద్దరు నడచినవారే.

అన్నమయ్య సంకీర్తనలలో వివిధాంశాలున్నాయి. వాటిలో అందరి దృష్టిని ఆకట్టుకొనేవి ఉత్సవసంకీర్తనలు. ఏ వాగ్గేయకారుని రచనల్లోను ఇంతటి విస్తృతి కనిపించదు. కారణం అన్నమయ్య, ఆలయకవి కూడా కావడమే. అంతేకాదు తిరుమలలో ఎన్నో కొత్త ఉత్సవాలకు వారే ప్రథములు. అన్నమయ్య అడుగు జాడలో నడచిన పెదతిరుమలయ్య – రాజులు, మండలాధీశులు సమర్పించిన గ్రామాలను కూడా స్వామి ఉత్సవకైంకర్యాలకే అర్పించారు. అన్నమయ్య తిరుమలలో మొదలుపెట్టిన ఉత్సవాలలో ఒకటిగా భావింపబడే 'తిరునాళ్' కల్యాణోత్సవం. ఇందుకు ప్రబలాధారం రేవణూరి వేంకటార్యుని శ్రీపాదరేణు మాహాత్మ్యంలోని క్రింది పద్యం

**శ్రీలలరంగ మంగ మును శ్రీహరికెన్నడు ధారవోయుచోఁ**
**దాళులపాక యన్నమయ దాఁగడిగెం బదముల్ ధరిత్రి మా**
**తాళులపాక చిన్నన పదంబులు పాడిననాఁడె సర్వరాట్**
**శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁ జెల్లదే**

## కల్యాణ సంకీర్తనల వింగడింపు

తాళ్లపాకపదకవులు కల్యాణ సంకీర్తనలు రచించినారనడంలో రెండవ అభిప్రాయం లేదు. కాని ఏ కల్యాణాలని తేల్చడానికి తాళ్లపాక పదవాఙ్మయ పరిశీలన చాలా అవసరం. ఒక చిత్రమేమిటంటే తాళ్లపాక కవులకు 'కల్యాణ' కీర్తన సహజం కావడం. తాళ్లపాక తిమ్మక్క సుభద్రాకల్యాణ రచయిత్రి. తాళ్లపాక చిన్నన్న అష్టమహిషీ కల్యాణ రచయిత కావడం. అన్నమయ్య శృంగార మంజరి, పెదతిరుమలాచార్యుల చక్రవాళమంజరి – ఈ రెండూ కూడా కల్యాణ సంబంధి రచనలు కావడం. ఈ దృష్టితో పరిశీలిస్తే తాళ్లపాక పదకవుల కల్యాణ సంకీర్తనలను నాలుగు రకాలుగా వింగడించవచ్చు.

1. దశావతార మూర్తుల కల్యాణాలు
2. గోపికా పరిణయాలు
3. అర్చావతారమూర్తి కల్యాణాలు
4. జానపదబాణిలో వర్ణిత కల్యాణాలు

## దశావతారమూర్తుల కల్యాణాలు

త్రిమూర్తులలో విష్ణువు స్థితికారకుడు. ఆ కారణాన శిష్టరక్షణ, దుష్టశిక్షణ కోసం ధర్మసంస్థాపనం కోసం అవతారాలెత్తడం పురాణ కథల ద్వారా జగద్విదితం. మహవిష్ణువు అవతారాలెన్నో వున్నా 'దశావతారాలకే' ప్రసిద్ధి. మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన భార్గవరామ శ్రీరామ బలరామ శ్రీకృష్ణాద్యవతారాలే దశావతారాలు. వీటిలో మత్స్యావతారంలో సోమకాసుర విదళనం, వేదసంరక్షణ ప్రధానాంశాలు. కూర్మావతారం నుండి ఆదిలక్ష్మికి ప్రాధాన్యముంది. ఆలాగే పరశురామ, వామానావతారాల ప్రయోజనం వేరు వేరు కనుక కల్యాణాంశాలు అంతంత మాత్రమే. తాళ్లపాక పదకవులు దశావతారాలను అనేక రకాలుగా కీర్తించారు.



గృహస్థునికి 'కళ్యాణం' చాల అవసరం. సమాజానికి ఇతరుల కంటె గృహస్థు ఎక్కువగా సహాయపడతాడు. దాంపత్యజీవితం సమాజానికి మార్గదర్శకం. 'లెస్సయుండునె గృహకర్త లేని బ్రతుకు' లాగా 'గృహిణీ గృహ భాగ్యముచ్యతే' కూడా. అందుకే మానవుడు దైవసృష్టితో బాటు దేవేరులను కూడా జతచేశారు.

## లక్ష్మీనారాయణుల వివాహం

మహావిష్ణువు అవతారాలలో కూర్మావతారం రెండవది. క్షీరసాగర మథనం, అమృత సంపాదన ప్రధాన లక్ష్యాలు. ఈ మథనానికి దేవదానవులు నడుము బిగించారు. తనవంతు సాయం చేసినవాడు మహావిష్ణువు. అమృత మథన సమయంలో ఎన్నో పుట్టాయి. రత్నాలు, ఐరావతం, ఉచ్చైశ్రవం లాంటివి. దానవుల ఏకైక దృష్టి అమృతసంపాదన కనుక వీటిని పట్టించుకో లేదు. దేవాధిపతి వాటిని తన స్వంతం చేసుకొన్నాడు. హాలాహలవిషాన్ని మింగి శివుడు గరళకంఠుడయ్యాడు. సరిగ్గా అప్పుడే 'లక్ష్మి' పుట్టింది. లోగడ ఎన్నటినో వశం చేసుకొన్న 'ఇంద్రుడు' ఊరుకోవలసి వచ్చింది. ఇతర దిక్పాలకులు లక్ష్మీదేవి సౌందర్యానికి ఆకర్షితులై అనిమిషులయ్యారు. మహాలక్ష్మి ఒక్కొక్కరిని సాంతం శాంతంగా పరిశీలించింది. నిలుకడలేని వాయు స్వభావాన్ని గుర్తించింది. సంపదవున్నా లోభత్వమున్న కుబేరుని తిరస్కరించింది. పాశధరుడయిన యముని చూచి తనకు తగదనుకొన్నది. చివరకు తనకు తగినవాడు నల్లనయ్య, అని స్వామి వక్షస్థలంలో చేరింది. ఈ వృత్తాంతాన్ని ఎందరో కవులు కల్పనలతో రమణీయంగా వర్ణించారు. లోకంలో ఈనాడు ఏ పేరు గలిగిన వానికి వివాహమయినా 'వరాయ విష్ణురూపాయ' అనడం సంప్రదాయం.

నారం (నీరు) వాసంగా కలవాడు నారాయణుడు. ఆ నారాయణుని లక్ష్మి వరించింది. ఇదొక యోగం. కల్యాణయోగం. అందుకే తాళ్లపాక పదకవులు

**'ఎట్టుఁగూడెఁ బెండ్లి యోగ మిద్దరికి నీవేళ**
**అట్టె లక్ష్మీనారాయణయోగము' (20.201)**

అన్నారు. ఈ దృశ్యం చూసినవారు వధూవరులను బేరీజు చేసుకొన్నారు. నాయిక కమలవాసి. నాయకుడు కమలాక్షుడు. చక్రవాకస్తని ఆపె. చక్రాయుధు డతడు. నీలకుంతల ఆపె. నీలవర్ణుడు స్వామి. హేమాంగి ఆ వనితారత్నం. పీతాంబరుడతడు. పాలవెల్లి వధువుకు పుట్టిల్లు. పాలవెల్లి వరుని నివాసం. ఈ భావాన్ని కల్యాణోత్సవ సమయంలోనూ నాగవెల్లి కార్యక్రమంలోనూ తాళ్లపాక పదకవులు స్మరించారు. కనకాంబరుడు వరుడయితే కనకకుచగిరి వధువు. వనజనాభుడు పెళ్ళికొడుకయితే వనజలోచన పెళ్ళికూతురు. శంఖ ధరుడు స్వామి అయితే కంబుకంఠి స్వామిని. జలధిశయనుడు దేవుడయితే జలధికన్య దేవేరిగా నిలిపారు. చివరకు తాళ్లపాక పదకవులు చెలులకు హుకుం జారీచేశారు.

**నేఁడే పెండ్లివేళ నేఁడే నాగవల్లి**
**.... .... .... ..... .... ... ...**
**అలరు శ్రీవేంకటేశుఁడతఁడీకె మహాలక్ష్మి**
**వెలయఁగల సరి దీవించరే చెలులు (17.537)**

అని అర్చావతారమూర్తికి అనుసంధానించారు.

వివాహపు వేడుకలలో 'వరుని ఆగమనం' దర్జాతో కూడింది. లక్ష్మీ కల్యాణానికి నల్లనయ్య వచ్చిన తీరును పదకవులు వర్ణించిన తీరు 'లకిమి నాయకురాలి లలి మీఁదఁ బెండ్లాడి (17.230) పాటలో కనిపిస్తుంది.

**పసుపు వన్నె చీర బలుకాశగాఁగట్టి**
**పసురాకు దండ తలపై సుట్టి**

**మొసలి మొకము సొమ్ములు సెవులను ఁబెట్టి**
**వాఁడి బిల్ల కత్తి వలచేతఁ బరిజించి**
**పొఁడిమి బాల దసంకు పోఁచి నడంచి**



**ఆడుదాని పేరి మచ్చ అరుతనే సవరించి**
**కావరపు పెనుఁబాము గట్టుమీఁద నెక్కి**
**కావిరెక్క బొల్లిపిట్ట ఁగైకొని యెక్కి**

వచ్చాడట. పీతాంబరం, మకరికాపత్రాలు, నందకం, శంఖం, శ్రీవత్సచిహ్నం, శేషవాహనం, గరుడుని ఎక్కిరావడం లాంటివి లోకోత్తరత్వాన్ని విశదం చేసేవి.

లక్ష్మీనారాయణుల వివాహం సామాన్య జనుల వివాహంలాగ తాళ్లపాక పదకవులు వర్ణించకున్నా క్షీరసాగరమథన సమయంలో పరస్పర సంవీక్షణలోనే వివాహం సాగినట్లు వర్ణించారు.

**లక్ష్మీకల్యాణము లీలతోఁబాడేమిదే నేము**
**లక్ష్మీనారాయణువే లలనయు నీవును**

**చూపులు చూపులు మీకు సూసకము బాసికము**
**పూప చనుగుబ్బలివి బూచగుండలు**
**తీపుల మోవితేనెలు తీరని మధుపర్కము**
**రాపుగ ఁబెండ్లియాడరయ్య తగఁదగు మీకును**

**మాటలు మీకిద్దరికి మదనమంత్రములు**
**మేఁటి తలబ్రాలు మీలో మించు నవ్వులు**
**గాటమైన పులకలు కప్పుర వసంతాలు**
**నీటున ఁబెండ్లాడరయ్య నెరవేరె మీకును**

**కాఁగిలి కాఁగిలి మీకు కందువపెండ్లి చవికె**
**సాఁగిన కోరికలే పావకోళ్ళు (17.165)**

ఈ పాటలోని బాసికం – పూజకుండలు – మధుపర్కం – మంత్రాలు – తలబ్రాలు – వసంతాలు అన్నీ పెళ్ళికి సంబంధించినవే. కాని చూపులు,

స్తన సంపద, అధరామృతం, తీయని పలుకులు, ఆకర్షకమయిన నగవులతో వాటికి అనుబంధం చేయడంలోనే కవి చమత్కారం.

శ్రీకూర్మావతారంలోనే మహాలక్ష్మి సాక్షాత్కారం. అసలు క్షీరసాగర మథనం అమృతానికి కాదు. తనకు ఒక ఇల్లాలని తెచ్చుకోవడానికోసమని శ్రీవైష్ణవులు చమత్కరిస్తుంటారు. తెలివయిన వ్యక్తి తన మనసులోని ఆంతర్యాన్ని బయటికి ప్రకటించకుండా ఇతరులచేత కార్యసిద్ధికి ప్రణాళికలు వేసే లాగున మహావిష్ణువు దేవదానవులచేత సాగించిన లీలావినోదమిది.

**జలధిఁ దచ్చి లక్ష్మిని సంగడి (బెండ్లాడునాఁడు (7.21)**

అనడంలోని ఆంతర్యమిదే. వివాహమాడినవాడు శ్రీమన్నారాయణుడయినా తాళ్లపాక పదకవులకు వేంకటేశ్వరుడే.

**అలర శ్రీవేంకటేశుఁడతఁడీకె మహాలక్ష్మి**
**వెలయఁగల సరి దీవించరే చెలులు (17.539)**

అన్నదే వారి సమన్వయం. అందుకే ఇతరత్ర కూడా ఈ భావాన్ని ప్రతిధ్వనించారు. ఒక శోభనపు పాటలో

**దేవదానవులు ధీరతను**
**దావతి పడి వార్ధి దరువఁగను**
**శ్రీవనితామణిఁ జెలఁగి పెండ్లాడిన**
**శ్రీవేంకటగిరి శ్రీనిధికి** అని గుర్తు చేశారు.

మరోచోట

**వనజనాభుఁడు నిత్యవైభవాన (జేకొనె**
**అనయము నిదివో యాదిలక్ష్మిని**
**మునులాల ఋషులాల ముంచిన భూసురులార**
**సొనిసి యిందరు (గూడి సుముహూర్తమనరో (24.30)**



అని లక్ష్మీనారాయణమహోత్సవాన్ని తిలకింపజేశారు.

**'పెల్లగించి భూమెత్తి (బెండ్లి కొడుకు వాఁడె'**లో వరాహావతారస్ఫూర్తి లీలామాత్రంగా కనిపిస్తున్నది.

మహావిష్ణువు అవతారాలలో నాల్గవది నారసింహావతారం. తన్ను త్రికరణశుద్ధిగ విశ్వసించిన ఒక బాలకుని రక్షించడానికోసం, నాస్తిక భావ నిర్మూలనార్థం, భగవంతుడు సర్వత్ర ఉన్నాడని నిరూపించడానికోసం, కంబంలో ఆవిర్భవించిన మూర్తి నారసింహుడు. లోకకంటకుడయిన హిరణ్యకశిపుని సంహరించిన తరువాత రోషభీషణుడయిన స్వామిని శాంతింపజేసిన తల్లి 'ఇందిర'. వక్షస్థలంలోని లక్ష్మిని తొడలపై నిడుకొని వరాలు కుప్పించే దేవుడు నరకేసరి.

తాళ్లపాక పదకవులు నారసింహోపాసకులు. నారసింహ మంత్రం 32 అక్షరాలది కనుక 32 వేల కీర్తనలు అన్నమయ్య వ్రాశాడని ప్రతీతి. అంతేకాదు. అన్నమయ్య అహోబలంలో ఆదివన్ శఠకోపులదగ్గర 12 ఏళ్ళు ఉభయ వేదాంతం అభ్యసించినవాడు. నవనారసింహులను కీర్తనలలో మనోహరంగా వర్ణించినవాడు. శ్రీవేంకటేశ్వరాత్మక కీర్తనల తరువాత తాళ్లపాక పదకవులు ఎక్కువగా నారసింహకీర్తనలు వ్రాశారు. కర్నూలు జిల్లా అహోబిలంలో జరిగే ఉత్సవాలను పదకవులు కీర్తించారు.

**సేవించరో మొక్కరో చెలులాల నరులాల**
**కైవశమై వున్నవాఁడు కరుణాకరుఁడు**
**బాసికము గట్టుకొని బంగారు గద్దెమీఁద**
**లాసి కూచున్నాఁడదివో లకిమమ్మతో**
**సూసకపు వనితలు సోబాన (బాడఁగాను**
**భాసురమై యొప్పె నదె ప్రహ్లాదవరదుఁడు (28.16)**

**మునులు చదువ ఁగాను ముంజేతి కంకణాలతో**
**యెనసి నవ్వులు నవ్వీ నిందిరతో**
**అనయము ఁబేరటాండ్లారతు లెత్త ఁగాను**
**పని పూని వరాలిచ్చే ఁబ్రహ్లాదవరదుఁడు (24.16)**

ఇదే మోస్తరు అహోబలేశుని పెండ్లిని గూడ వర్ణించారు.

**పదఁతులాల సోబానఁ బాడరమ్మ**
**అదరి పెండ్లాడీని అహోబలేశుఁడు**

**యెదురు ఁగొండల మీఁద యిందిరా ఁదాను ఁగూచుండి**
**మదన కళలు రేఁగ మాఁటలాడి**
**పదిలపు ఁజూపులనే బాసికము గట్టుక**
**అదివో పెండ్లాడీని అహోబలేశుఁడు**

**కందువ పెండ్లి పీఁటైన గద్దె మీఁదను**
**అందమైన శ్రీవేంకటాద్రి గరుడాద్రిని**
**అందుకొని పెండ్లాడీ నహోబలేశుఁడు (28.489)**

చినతిరుమలయ్య 'కంతుని వోజల' పెండ్లి జరిగినట్లు వర్ణించాడు. కంతుడే ఒజ్జ. ఒజ్జ పురోహితుడన్నమాట. మరి బాహ్యమయిన తెర. తలబ్రాలు సోబనాలు లేవే అనే సందేహం కలిగే ఆస్కారం కనుక

**"కాంతకును నీకును కనురెప్పలె తెర**
**దంతపు నవ్వులె మీఁకు ఁదలఁబ్రాలు**
**రంతుల వూరుపులె రవళి సోబనాలు**
**చెంతల మీకీ పెండ్లి చెల్లెఁగా నేఁడు" (9.129)**

అని బాహ్యాడంబరాలను కళ్ళముందు నిలిపినాడు.

చాలవరకు తాళ్లపాక పదకవులు నారసింహసంకీర్తనలలో లక్ష్మి, ఇందిరా శబ్దాలకే ప్రాధాన్యమిచ్చారనడంలో సందేహం లేదు.



**సీతారాముల కల్యాణం**

తాళ్లపాకపదకవులు ఆంధ్రులకున్న శ్రీమద్రామాయణప్రీతిని అర్థం చేసుకొన్నవారు. అందుకే అన్నమయ్య రామాయణ రచన కూడా చేశాడు. కాని అలభ్యం. తెలుగునాటగల ఒంటిమిట్ట, గుత్తి, విజయనగరాదులలోని శ్రీరామమందిరాలను దర్శించి కీర్తనలు పాడారు. సీతారాముల కల్యాణాన్ని మూడురకాలుగా పదకవులు కీర్తించినారని చెప్పవచ్చు.

మొదటిది – స్తుతులలో కల్యాణం పేర్కొనడం

**అరిది యజ్ఞము గాచు రాఘవా!**
**అట్టె హరివిల్లు విరచిన రాఘవా!**
**సిరులతో జనకుని యింటను**
**జెలఁగి పెండ్లాడిన రాఘవా! (1.392)**

ఇక రెండవది – రామాయణం కాలంనాటి పాత్రగా తన్ను భావించుకొని సహచరుల సంభాషణలలో సీతారాముల కల్యాణం ప్రస్తావించడం.

**యేతులకు హరివిల్లు యీతఁడా విరచి యట్టె**
**సీతఁ బెండ్లి యాడెను యీ చిన్నరాముఁడా (2-490)**

ఒక వక్తగా, కవిగా రామాయణ సన్నివేశాలను పేర్కొంటూ సీతారామ కల్యాణాన్ని ప్రస్తావించడం.

**ఇతఁడే పరబ్రహ్మ మిదియె రామకథ**
**శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము**
**ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె (11.224)**

వైవాహికతంతులను కళ్ళార కట్టినట్లు వర్ణించడం మరో విధానం.

**సిగ్గరి పెండ్లి కూఁతుర! సీతమ్మ**
**దగ్గరి సింగారబొమ్మ! తలవంచకమ్మ**

**అల్లనాఁడే రాఘవుఁడు హరువిల్లు విరిచెను**
**యెల్లినేఁడే పెండ్లాడీ నిదివో నిన్ను**
**మెల్లగా జనకుఁడు నిన్నిచ్చీనట వీఁడె**
**వెల్లవిరి నీ మాట వినవమ్మా**

**అదె పెండ్లి తెరయెత్తి రండనే వసిష్ఠుఁడుండి**
**చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా**
**మొదల రాముని కంటె ముంచి తలఁబ్రాలు వోసి**
**సుదతి యాతని మోము చూడవమ్మా (32.40)**

ఆలాగే

**కంకణదారాలు గట్టి కాలు దొక్కితివి మీరు**
**బింకాన బువ్వ మందరో పొత్తుల నమ్మ (32.40)**

కీర్తన చివర **'వావిలి పాటనుండి శ్రీవేంకటగరి తెంకల నిన్నుఁగూడి తిరమాయ నమ్మ'** అని చరణాంతంలో వావిలిపాటి – వాయల్పాడు గ్రామంలోని స్వామిని నుతించడం వల్ల బహుశః అక్కడి పట్టాభి రామాలయ కల్యాణోత్సవం కావచ్చు.

## రుక్మిణీ పరిణయం

శ్రీమద్భాగవతంలోని రమణీయఘట్టాలలో రుక్మిణీ కల్యాణ మొకటి. శ్రీయుతాకారుడు, మానినీ చిత్తచోరుడయిన కృష్ణుని రుక్మిణి వలచింది. అతనినే వివాహమాడాలని సంకల్పించింది. కాని సోదరుడు రుక్మి శిశు పాలుని కిచ్చి పెళ్ళిచేయదలచినాడు. తల్లిదండ్రులు అసహాయులు. ఆ కారణంతో రుక్మిణి అగ్నిద్యోతనుని ద్వారా తన సందేశాన్ని, కర్తవ్యాన్ని, ఉపాయాన్ని విశదంగా చెప్పి పంపింది. శ్రీకృష్ణుడు సమ్మతించాడు. శౌర్యమే ఉంకువగా రుక్మిణిని వివాహమాడతానని భరోసా ఇచ్చాడు. రుక్మిణి కాత్యాయని పూజకు విచ్చేసిన వేళ ఆమెను అరదముపై నెక్కించుకొని కృష్ణుడు తన పత్తనానికి తీసుకువెళ్ళాడు. రుక్మిణిని వివాహమాడినాడు.



తాళ్లపాక పదకవులు రుక్మిణీ కల్యాణాన్ని అనేక రీతుల వర్ణించినారు. **'నేరుపుననే రుకుమిణి దేవి ఁదెచ్చినయట్లు'** (2.277) అని నేర్పును ప్రశంసించినారు. ఆడినమాట తప్పనివాడు అనడానికి ఉదాహరణగా

**'జలధి ఁదచ్చి లక్ష్మిని సంగడి ఁబెండ్లాడునాఁడు**
**అలరి రుక్మిణి ఁబెండ్లి ఆడె నాఁడు**
**సెలసు విల్లు విఱిచి సీత ఁబెండ్లి యాడె నాడు**
**పలికి బొంకని మాటపట్టు నాకు నిమ్మీ (9.21)**

అని వాగ్దానవరరూపంలో ఉటంకించినారు. అంతేకాదు

**కిట్టి రుక్మిణీదేవి ఁగృష్ణుఁడు పెండ్లాడివచ్చె**
**పెట్టు ఁడిందరికి నేఁడు పెండ్లి విడేలు (9.53)**

అని ఆదేశించినారు. **'విందు వలెనె విచ్చేసి రుకుమిణి సందడి ఁబెండ్లాడిన సరసునికి'** కైవారములు చేశారు.

ఒక్క సంకీర్తనలో మాత్రం రుక్మిణీ వివాహంలోని వైవాహికపు తంతులు కనిపిస్తాయి.

**నిండు సోబనము నేఁడు నెయ్యపు దంపతులకు**
**మెండుగ నారతు లెత్తి మీఁద సేసలు చల్లరే**
**కట్టుఁడు కలవడాలు ఘనమైన తోరణాలు**
**గట్టిగా ఁబట్టణము సింగారించరే**

అని హుకుం జారీ చేసేలా వక్కాణించారు.

**పాడరె సోబనాలు పైపైన పేరఁటాండ్లు**
**యీడా దనక వీదు లేఁగించరే**
**జాడతో వాయించరె పంచమహావాయిద్యాలు**
**యీడనె పెండ్లి కట్నాలియ్యరె యిద్దరికి (9.55)**

అని సాంగోపాంగ వివాహ విధులను జతచేశారు. బువ్వము విందు – గంధాక్షతల ప్రాధాన్యం గల కీర్తన ఇది.

**సత్యభామా పరిణయం**

తాళ్లపాక పదకవులు తమ సంకీర్తనలలో రుక్మిణీసత్యభామలనే పలుమార్లు ప్రస్తావించినారు. ఆపై నీళాప్రసక్తి కనిపిస్తుంది.

**సరుస రుక్మిణిని సత్యభామకును**
**వరుఁడగు వేంకట వరదుఁడు వీడే (1.26)**

శ్రీకృష్ణుని దేవేరులలో 'సత్య' విలక్షణాంగన. సత్రాజిత్తు కుమారిత సత్యభామ. సత్రాజిత్తు కుమారిత సత్యభామ. సత్రాజిత్తు సూర్యుని నుండి శ్యమంతకమణిని వరంగా స్వీకరించాడు. అయితే కృష్ణుడు ఆ మణిని అడిగాడు సత్రాజిత్తు ఇవ్వలేదు. ఒకరోజు సత్రాజిత్తు తమ్ముడు ఆ మణిని ధరించి అడవికి వెళ్ళాడు. మరణించాడు.

తన తమ్ముని మరణానికి, మణి అపహరణానికి కృష్ణుడే కారకుడని సత్రాజిత్తు నిందవేశాడు. ఆ నింద బాపుకోవడానికోసం కృష్ణుడు ప్రసేనుడు వెళ్ళిన దిక్కుకు కదలివెళ్ళాడు. ఒక గుహలో జాంబవంతుని, శ్యమంతకమణిని చూచాడు. జాంబవంతునితో ఘోరంగా పోరాడినాడు. జాంబవంతుడు శ్రీరాముడే కృష్ణుడని భావించి పోరు చాలించి మణితోబాటు జాంబవంతుడు తన కూతురు జాంబవతిని కూడా ప్రసాదించాడు. సత్రాజిత్తు తాను నోరు జారినందుకు వగచి మణిని, తన కుమార్తెను కృష్ణుని కిచ్చి వివాహం చేశాడు. సత్యతోడి వివాహం పదాలలో కనిపించకున్నా



**'తలఁప సత్యభామకుఁబతి పంకజ**
**దళనేత్రునకును ఁదల ఁబ్రాలో' (17.443)**

అని వర్ణించారు. తలఁబ్రాలు వివాహపు తంతు.

**షోడశకన్యాపరిణయం**

నరకాసురుడు బలగర్వంతో నరులను దేవతలను పీడించే రాక్షసుడు. అదితి కర్ణకుండలాలను, వరుణచ్ఛత్రాన్ని అపహరించినవాడు. పదారువేల స్త్రీలను చెరపట్టినవాడు. శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించాక విచిత్ర పరిస్థితి ఏర్పడింది. చెరపెట్టబడిన 16వేల స్త్రీల గతేమిటో. అందుకే కృష్ణుడు తానే వారిని వివాహమాడినాడు. పోతన ఆ పదారువేలమందిని గుణవతీ వ్రతధన్య లుగా, రాజకన్యలుగా వర్ణించినాడు. శ్రీకృష్ణుని విలోకించి అతడే ప్రాణ వల్లభుడని వరియించినారట. రక్కసుడు బంధించినా పురుషోత్తముని చేరగలి గామని సంతసించినారట. శుభముహూర్తాన పదారువేల రూపాలతో పదహారు వేల రీతులతో శాస్త్రోక్తంగా వరించాడని వర్ణన (దశమ. 206.219).

తాళ్లపాక పదకవులు

**'అరుదున మును నరకాసురుఁడు**
**సిరులతో ఁజెరలు దెచ్చిన సతుల**
**పరువపు వయసుల ఁబదారు కలను**
**సొరిది ఁబెండ్లాడిన సుముఖునికి' (5-18)** అని

**'సరుస ఁబదారువేల సతుల ఁబెండ్లాడు నాఁడు' (9-21)** అని

**దాసక్రీడల లోని రాజీవాక్షుఁడు**
**ఆస ఁబదారువేల ఁబెండ్లాడినవాఁడు (24.370)** అని

**గరిమఁ జెరలు మాన్చి కాంతలఁ బెండ్లాడినట్టు (2.277)**

**ధరఁ బదారు వేలు కాంతల ఁబెండ్లాడి (4.529)**

**పాండవుల మనుపఁగ పదారువేల ఁబెండ్లాడరో (4.287)**

అని చాల సందర్భాలలో కీర్తించినారు. ఒకరి చెరబడ్డ స్త్రీలను ఇతరులెవ్వరు వివాహమాడడానికి సిద్ధపడరు. శ్రీకృష్ణుని ఔదార్యానికి ఇది మచ్చుతునక.

**గోపికా పరిణయాలు**

శ్రీకృష్ణుని బాల్యచేష్టలకు రేపల్లెలో మురిసినవారు కొందరయితే, శ్రీకృష్ణ ప్రేమకు పరితపించిన వారు కొందరు. వారే గోపికలు. రామానుగ్రహ పాత్రులు. అందుకే కృష్ణయ్య రాసక్రీడలో వారిని ఆనందాబ్ధి ముంచినాడు. ఈ ఘట్టం శ్రీకృష్ణకర్ణామృతంలో విశదంగా వర్ణితం. ఆలాగే భాగవతంలో తాళ్లపాక పదసాహిత్యంలో గోపికలతోడి శ్రీకృష్ణసాహచర్యం బహువిధాల వర్ణితం.

**ఎఱఁగ గొల్లపడుచ నిల్లు గాచుకుండఁగాను**
**మఱి కృష్ణుఁడు వచ్చి నా మయి చెమరింపించెనే (18.18)**

కీర్తనలో కృష్ణుని దుడుకుతనాలు వర్ణితం. పాపట దువ్వుతానంటూ దగ్గరికి చేరి బాసికం కట్టాడట. చాఁపే నంటా చేత సేసలు చల్లినాడట. కైదండ పట్టే నంటా కంకణం కట్టేశాడట. తగరు వలె మాటాడి తలపు చొక్కించి నాడట. ఈలాంటి పాటలు పడుచుపిల్లల శైశవ క్రీడలుగా గ్రహించడం సబబు. ఈ భావాన్ని పదకవులు లోకోత్తరంగా మలచినారు.

**పరగ రేపల్లె గోపభామల ఁబెండ్లాడు నాఁడు**
**యిరవై యిచ్చిన బాస యిమ్మీ నాకు (9.25)**

**అర్చావతార మూర్తుల కల్యాణాలు**

తిరుమల శ్రీవారి ఆలయంలో 'పంచబేరాలు' ఉన్నాయి. వాటిలోఉత్సవ వరులు 'మలైయప్పస్వామి'. ఈ స్వామి శ్రీదేవి భూదేవులతో కల్యాణోత్సవాలలో పాల్గొంటారు. స్వామి వేంకటేశ్వరుడయితే వేంకటేశ్వర కల్యాణ మనడం సబబుగా అనిపించినా స్వామి అర్చావతారమూర్తి. ఆతడే వైకుంఠ నాథుడు. అతడే దశావతారమూర్తి. అతడే శ్రీనివాసుడు. వైకుంఠవిరక్తుడై



స్వామిపుష్కరిణీ తీరంలో నెలకొన్న ధ్రువమూర్తి. అందుకే ఇది శ్రీనివాస కల్యాణం. శ్రీవారి కల్యాణం.

తిరుమలలో కల్యాణోత్సవాలు ఎప్పటి నుండి అనడం కుతూహలం కలిగించే విషయం. శాసనాధారాల బట్టి క్రీ.శ.1485, క్రీ.శ.1494, క్రీ.శ.1547 లలో కల్యాణ ప్రసక్తిగల శాసనాలు కనిపిస్తున్నాయి. క్రీ.శ. 1547 శాసనం గోవిందరాజస్వామి కల్యాణాలను ప్రస్తావించడం వల్ల ఆనాటికే తిరుమలలో కల్యాణోత్సవాలు ఉండి ఉండాలి. క్రీ.శ.1546 శాసనం తిరువేంగళనాథయ్య శాసనం. ఇతడు పెదతిరుమలయ్య కుమారుడు. తిరుమల కైంకర్యార్థం కొండవీటి నెందలూరు, మల్లవరం గ్రామాలను అర్పించడం శాసనాంశం. దీనికి బలంగా సాహిత్య ఆధారాలు కూడా లోగడ ప్రస్తావితం.

తిరుమలలో కుడ్యాలమీద, స్తంభాలలో కల్యాణోత్సవ చిత్రాలున్నాయా అనడం కూడా ఒక ప్రశ్న. ఈ అంశం గురించి డా॥ రమేశన్ గారు

"This is an interesting sculpture showing the marriage of Lord Srinivasa to Goddess Padmavathi. In the top of the sculpture one shows Kinnaras, Yakhas and Gandharas floating in the atmosphere. The scene depicts the Kanyadanam where the bride is offered with ablutions to the bridegroom" అని ధ్వజస్తంభ మంటపంలోని చిత్రణ గురించి వ్రాశారు. ఆలాగే తిరుమామణి మంటపంలో విష్ణువు గజారూఢుడై ఊరేగే దృశ్యాన్ని ఉటంకిస్తూ "This is a rare sculpture of Vishnu as seated on a Gaja Vahana" అన్నారు. "వారణ మాయిరం" అనే పాశురంలో వరుడు గజమెక్కి రావడం ఒక సన్నివేశంగా వర్ణితం కూడా.

కల్యాణోత్సవం జరిగే ప్రదేశాలు కూడా క్రమంగా మారినట్లు సుస్పష్టం. తాళ్లపాక వారు 'వాలి కొలువుండే' తిరువాముడి మంటపాన' అన్నారు. ఈ

మంటపం క్రీ.శ.1417 నాటిది. క్రమంగా యాగశాలకు, కల్యాణ మంటపానికి మారింది. ఆపై కొంతకాలం రంగనాయకుల మంటపం. ప్రస్తుతం తిరుమల రాయల మంటపానికి చేరువులో ఒకప్పుడు వేదవిద్యార్థులు అధ్యయనం చేసిన చోటు. వ్యాసరాయలు తపము గావించిన చోటు కూడా. భవిష్యత్తులో ఆర్జిత సేవలకు అనుగుణంగా ఆలయం బయట మార్పు చేయాలనే ఆలోచన కూడా లేకపోలేదు. ఏది ఏమయినా కల్యాణోత్సవాలకు ప్రాముఖ్యముంది.

ఒకప్పుడు కల్యాణోత్సవం బ్రహ్మోత్సవాలలో భాగం. అంతేగాదు ఐదు రోజుల పర్వం. తొలిరోజు అంకురార్పణ. సోమబ్రహ్మ ప్రతిమలకు ప్రత్యేక పూజ. తిరుమామణి మంటపంలో మలయప్ప స్వామికి, ఉభయ దేవేరులకు తిరుమంజనం. ఆపై తిరువీధులలో ఊరేగింపు. తిరుమామణి మంటపం ముందు ఊయల సేవ. హంస వాహనంపై శ్రీదేవి. చాతక వాహనంపై భూదేవి. సామాన్యుల వివాహాలలో లోగా పూలమాలికల సమర్పణ. ఆపై స్వామికి ఇరువైపుల ఉభయ దేవేరుల వేంచేపు. పాలతో పాదప్రక్షాళన. అభిజిత్ లగ్నసమయంలో తిరుమామణి మంటపానికి వేంచేపు. హోమకార్య నిర్వహణ. రాత్రి ఊరేగింపు. ఆపై తిరుమరై వివాహమంటపానికి వేంచేపు.

రెండవరోజు స్వామివారిక ఉభయ దేవేరులకు చందన మహోత్సవం. శేషవాహనంలో ఉభయదేవేరులతో ఊరేగింపు. మూడవరోజు హోమక్రియలు. వైకుంఠ విమానంలో స్వామి దేవేరులతో తిరువీధులలో ఊరేగింపు. నాల్గవ రోజు ముత్తయిదువలకు చందన తాంబూల సమర్పణ. స్వామివారు హంస వాహనంలో ఉభయదేవేరులతో ఊరేగడం. శ్రీదేవీ భూదేవులు పల్లకిలో ఊరేగడం. అయిదవరోజు రాత్రి స్వామి గజవాహనంలో ఉభయదేవేరులు పల్లకిలో ఊరేగింపు. ఈ కల్యాణోత్సవ కాలంలో వేంకటాచల మాహాత్మ్య పఠనం, నాచ్చియార్ తిరుమొళి నియతంగా సాగడం.



తాళ్లపాక పదకవుల సంకీర్తనలలో చాలవరకు పై అంశాలు కనిపిస్తాయి. 'తిరువీదుల మెరసే దేవదేవుడు' కీర్తనలో 'పెనచి పదోనాడు పెండ్లిపీట' (7.192) అని ఉంది.

**తిరుకొడి యెక్కెనదే దేవుని కల్యాణానకు (25-432)**

**బలసి అంకురార్పణ మిదివో (22.96)**

**మంచి శుభముహూర్తమున శ్రీమంతులిద్దరు**
**చంచులఁ బూవు దండలు చాచుకొనేరదివో (14.110)**

**సంతోసాన నాడె పెండ్లి చవికెలోఁగూచున్నాడు (29.480)**

తిరుమలలో జరిగేది శ్రీదేవిభూదేవీ సహిత కల్యాణమని తాళ్లపాక పదకవులు స్పష్టం చేశారు.

**భూమి నలమేల్మంగను భూపతి గౌఁగిట కూడె**
**ఆనుక శ్రీవేంకటేశు డలమేలుమంగయును**
**లోననె భూమాతయును లోలురైరి తాము (16.295)**

బ్రహ్మోత్సవాల భాగంగా జరిగే కల్యాణోత్సవాలు నిత్యకల్యాణాలుగా ఎపుడు మారాయనడం చెప్పడం కష్టం. సర్కారు సేవ ఆర్జితసేవగా మారినపుడు ఏర్పడ్డాయని ఒక భావన. భక్తాదుల కోరిక ప్రకారం జరుపబడేవనడం ఒక వాదన. తాళ్లపాక పదకవులు నిత్యకల్యాణం, పచ్చతోరణం - దినపెండ్లి లాంటి పదాలను పలుమారు ఆవృతం చేయడం గమనింపదగ్గది.

**నెల మూడు శోభనాలు నీకు నతనికి దగు**
**కలకాలమును నిచ్చ కల్యాణమమ్మ (7.280)**

**పచ్చ దోరణము బలుకు లింటికని**
**పచ్చి మాత్రలనే కట్టె బాసికము**

**ముచ్చట లేనగవుల ముంగిట ముగ్గులు వెట్టి**
**నిచ్చ కల్యాణము లాడనే నెలంత (5.18)**

**తిరువెంకటమున దినపెండ్లిగల**
**తరుణుల పతికిని దలబ్రాలో (17.443)**

తాళ్లపాక పదకవుల సంకీర్తనలలో కొన్ని ఏరి ఇవి కల్యాణ సంకీర్తనలని స్పష్టంగా చెప్పడం చాలాకష్టం. కాకపోతే కొన్ని శబ్దాలబట్టి చెప్పడానికి వీలుంది.

**తిరువీదుల మెరసే దేవదేవుఁడు (7.192)**

**తిరువీదు లేగీని దేవతలు జయవెట్ట (2.121)**

**దేవుఁడు కోనేటిదండ దిరువీధి మెరసే (12.4)**

**గరుడధ్వజం బెక్కె కమలాక్షు పెండ్లికి (2.21)**

**మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు (14.110)**

తాళ్లపాక పదకవులు కల్యాణకీర్తనలలో వర్ణించిన కొన్ని అంశాలు ప్రాకృత నేత్రాలకు దృగ్గోచరాలు కావు. వాటిలో సేనాపతి కప్పుర విడేలు సమర్పణ చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనం మించడం. భాష్యకారులు విందు చెప్పడం (12.4) లాంటివి.

వాస్తవికతకు దగ్గరి కీర్తన 'తిరువీధిలేగీని' ఈ కీర్తనలో వివాహానంతరం రథమధిరోహించి పూరేగడం ప్రధానాంశం.

**తిరువీధులేఁగీని దేవతలు జయవెట్ట**
**హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున**
**కనకపు గొండవంటి ఘనమైన రథముపై**
**దనుజ మర్దనుఁడెక్కె తరుణులతో (2.122)**



తాళ్లపాక పదకవులు ఉత్తమ భావుకులు. పైగా మధురభక్తితో శృంగార కీర్తనలు వ్రాసినవారు. ఆధ్యాత్మికతతో యోగ, లేదా వేదాంతాది రహస్యాలను సమ్మేళనం చేసి కల్యాణకీర్తనలలో కూడా వాటిని పొందుపరచి వ్రాశారు. కొన్ని ఈనాటి పాఠకలోకానికి 'ఎబ్బెట్టు' కావచ్చు. కాని మధురభక్తి ఉపాసకులకు ఆ 'ఎబ్బెట్టు' ఉండదు. అన్యోన్య దాంపత్యదృష్టితో వాటిని పరిశీలించడం సబబు.

**యాగదృష్టి (29.216)**

స్వామీ! కామయాగం మొదలెట్టు. సుదతి మోవి తేనెలు సోమపానం. మదన పరిభాషలు వేదమంత్రాలు. కౌగిలి యాగశాల.

**సామ్యత్వం (9.202)**

స్వామి! నీవు జలనిధివి. ఆమె సింగారజలనిధి. నీవు యౌవన జలనిధివి. ఆమె నవవిధులకు నిలయ.

**సారూప్యం (20.191)**

చెక్కిలిపై చేయి శేషపర్యంకం. స్తన సంపద శంఖచక్రాలు. చెమట జలధి, కస్తూరి నీలవర్ణం. నివ్వెర అనిమిషత్వం, వలపు భక్తవాత్సల్యం.

**జానపద బాణిలో వర్ణితమయిన కల్యాణాలు**

శిష్టసాహిత్యానికి జానపదసాహిత్యానికి వారధి లాంటిది వాగ్గేయకార సాహిత్యం. ఈ సాహిత్యంలో శిష్ట, జానపద సాహిత్య లక్షణాలు రెండూ వున్నాయి. కల్యాణ కీర్తనలోనూ వీటిని గుర్తించవచ్చు. జానపద సాహిత్యంలో స్త్రీ పురుషుల జీవన విధానం సూచించే పాటలెన్నో. పెళ్ళిపాటలు, బాంధవ్య గీతాలెన్నో. వాటిలో బంతులాట పాటలు, బువ్వం పాటలు. అయిరేణి పాటలు, గంధం పాటలు ఆలాగే తలంటుపాట, ఊయెలపాట, వసంతాలపాట, పానుపు పాటలు, ఈలాంటివి శైవంలోనూ వైష్ణవంలోనూ ఉన్నాయి. తాళ్లపాక

పదకవులు జానపదులలో 'బాల యవ్వనలు' పాడే కల్యాణకీర్తనలను, యువతుల కల్యాణ పాటలను వ్రాసినట్లు స్పష్టం. మొదటి దానిలో అమాయ కత్వం, సహజత్వం, రెండవదానిలో ఎగతాళి ఆటపట్టించడం లాంటివి కనిపిస్తాయి. ఈ పాటలలో కవి ఒకసారి నాయకపక్షం. మరోసారి నాయిక పక్షం. ఇంకొకసారి ఈ తంతునంతా నడిపించే పెద్దరికం. బొమ్మల పెండ్లిండ్ల వరుసలో సాగే పాటలెన్నో.

**ఈడగు పెండ్లి ఇద్దరి చేసేము**
**చేడెలాల ఇది చెప్పరుగా**
**కొత్త చవికెలో కొమ్మ నిలిచితే**
**పొత్తున తలబాలు వోసేనట**
**ఇత్తల శ్రీవేంకటేశుఁడు నవ్వుచు**
**హత్తి సతిఁగూడె పాదరుగా**
**పెంచి యిద్దరము బొమ్మపెండ్లిండ్లు సేతమంటే**
**కొరంచి నాతో తానేల సిగ్గులు వడేనే (12.243)**

**వెలఁది యీకె యీకె ఇదిగో వీడిఁగో పెండ్లికొడుకు**
**యెలమి నుపచారాలు ఇన్నియును జేయరే**
**అంబుజపాణికిని హారములు గట్టరే**
**బింబాధరికి ఁగొప్పు వెట్ట ఁగదరే**
**కఁబుకఁఠిని కప్రపు బొట్టు వెట్టరే**
**అంబర మధ్యమను ఆరతులు యెత్తరే (29.15)**

తాళ్లపాక పదకవులు జానపదగేయ వరుసలను గుర్తించి శోభన పాటలు, ఆరతి పాటలు, తలబ్రాలు పాటలు, మంగళం పాటలను కూడా వ్రాసి కల్యాణ కీర్తన రాశిని సుసంపన్నం చేశారు.

**సోబాన : సోబానఁ బాడేము మేము సుదతులము (21.40)**



**తలంబ్రాలు : ధరుణీపతికిని ఁదలఁబాఁలో బహు**
**దారతునకు ఁదల ఁబాలో (17.443)**

**ఆరతి : ఎత్తరే ఆరతులీపె కింతులాల**
**మంగళం మరలి మరలి జయమంగళము**

తాళ్లపాక పదకవులు కల్యాణకీర్తనలను శ్రీరాగం, మంగళ కైశికి, సాళంగం, సామంతం, హిందోళ వసంతం, బౌళి, పాడి, నాగవరాళి, మాళవి, బౌళి, పళపంకజం, కేదారగౌళ, రామక్రియ, లలిత, నాదరామక్రియాది రాగాలలో పాడి వైవిధ్యం ప్రకటించారు.

'కల్యం సుఖం అణయతి ప్రాపయతి' ఇతి కల్యాణమ్. సుఖాన్ని కలిగించేది కల్యాణం. కల్యాణ శబ్దానికి పర్యాయంగా పరిణయం. ఉద్వాహం, పాణిగ్రహణం, దార గ్రహణం లాంటవి ప్రసిద్ధాలు. తెలుగులో పెండ్లి, పెండిలి, పెళ్ళి, లగ్నం పర్యాయపదాలు. తమిళులు 'తిరుమణం' కల్యాణం శబ్దాలు వాడతారు. కన్నడిగులు 'లగ్న'మని వ్యవహరిస్తారు.

వ్యక్తుల కల్యాణాలు ఆయావ్యక్తులకు లేదా కుటుంబాలకు శ్రేయో దాయకం. కాని ఆలయాలలో జరిగేవి గ్రామానికి, దేశానికి, లోకాలకు మంగళదాయకం, 'దేవుని పెళ్ళికి అందరు పెద్దలే' అనడం ఆలయ కైంకర్యాల పట్ల అందరికి బాధ్యతను గుర్తుచేయడానికే. ప్రతి ఆలయంలోనూ ఈనాడు 'కల్యాణాలు' జరుపుతున్నారు. వాటిలో తిరుమల శ్రీనివాసుని కల్యాణాద్భుత గాత్రుని కల్యాణం కమనీయం. రమణీయం.

### కల్యాణ సంకీర్తనలోని విశిష్టపదజాలం

**అంకురార్పణం :** వైదిక క్రియా కలాపాలు ఆటంకాలు లేకుండా శుభప్రదంగా జరగడానికి ప్రాచీనులు సూచించిన ఒక విధానం అంకురారోపణం. అంకురార్పణం. అంకురశబ్దానికి 'మొలక' అని అర్థం. భూమిలో నాటిన లేదా చల్లిన లేదా ఒక పాత్రలో ఉంచిన విత్తనాలు మొలకెత్తినట్లయితే

చైతన్య ముందని ఒక స్థూలభావం. ఈ 'అంకురాలు' మొలకెత్తినవేళ యజమానికి కలిగే సంతోషం ఇంతింతరాదు. మొలకలు ఎలావస్తాయో ఆశించిన ఫలం కూడా లభిస్తుందని విశ్వాసం.

వివాహానికి కొన్నిరోజుల ముందుగా పుట్టమన్నును తీసికొని వచ్చి అయిదు కొత్త మూకుళ్ళలో పోసి నవధాన్యాలను పాలతో తడిపి అందులో ఉంచుతారు. ఆ మూకుళ్ళను పంచపాలికలంటారు. ఈ కార్యక్రమాన్ని పెళ్ళినాడయినా చేసే సంప్రదాయం లేకపోలేదు. విధిపూర్వకంగా ఆ పాలికలను పూజించి వివాహమండపం దగ్గర పెడతారు. 16వ రోజు పండగనాడు మరల ఆ పాలికలకు పూజచేసి మొక్కలతో కూడా మట్టిని బయటపోస్తారు. ఆ మొలకలు ఎలా వస్తాయో అలాగే ఆశించిన ఫలం శుభప్రదమవుతుందని ఒక విశ్వాసం. ఈ పుట్టమన్ను తెచ్చే కార్యక్రమం పెళ్ళికి ముందు 9 లేదా 7 లేదా 5 లేదా మూడవరోజున శుభసమయంలో నృత్యగీతాదులతో గృహానికి పూర్వ దిక్కున నుండిగాని ఉత్తరం వైపున నుండిగాని ఒకపాత్రతో మట్టిని తీసుకొని రావాలని ఒక నియమం.

శ్రీవైఖానస ఆగమం ప్రకారం అంకురార్పణానికి పదస్థాన పట్టిక వుంది. ఆ పట్టిక

**ఉత్తరం**

| | | | | |
|---|---|---|---|---|
| | **అంకురాణి** | **కుబేరః** | **తాంబులాన్ అక్షతాన్** | |
| **పడమర** | **వరుణః** | **బ్రహ్మ** | **ఇంద్రః** | **తూర్పు** |
| | **పుష్పం, గంధం** | **యమః** | **కరకం** | |

**దక్షిణం**

ఈ కార్యక్రమం ప్రాణాయామానంతరం 'శ్రీ.......... స్వామినః వైవాహికాంగం అంకురార్పణాఖ్యాం కర్మ కరిష్యే'తో మొదలవుతుంది.



బ్రహ్మేంద్రాది దేవతల ఆవాహనంతరం ఓషధీసూక్త పఠనం సాగుతుంది. రాత్రివేళ శుభ ముహూర్తంలో 'ఇదం విష్ణుః, విష్ణోర్నుక' మితి మంత్రాలలో అంకురాలను గ్రహించి విధినియమాన్ని పాటించి 'యేతే శతమితి' వారుణ మంత్రంతో జలసేకం చేయాలని నియమం.

ఇంట, ఆలయంలో సర్వత్ర ధాన్యలక్ష్మి తాండవించాలని పంచభూతాత్మక మయిన విశ్వమంతా సస్యశ్యామలమై ఆహార సమస్య లేకుండా క్షేమంగా ఉండాలనడమే అంకురార్పణ భావన.

**అయిరేణి :** 'అయిరేణి' అని వాఙ్మయరూపం. 'అరివేణికుండ'లోక వ్యవహారంలోని శబ్దం. అయిరాణి. అయిరేణి లాంటివి కూడా ఉన్నాయి. కొందరు 'ఇంద్రాణి' అయిరాణి అయిందని అంటారు. శచీదేవి సూచకం. వివాహకాలంలో నాల్గవరోజు జరిపే నాగవల్లిలో అయిరేణికి, శచీపూజకు ప్రాధాన్యముంది. అయిరేణి కుండలు తెచ్చి యిచ్చేవారికి నేటికి గౌరవాదులున్నాయి.

**బచ్చెనల మెఱుఁగు గుబ్బల అయిరాణి దెచ్చి 5-189**

**అశ్మారోహణం :** అశ్మ అంటే రాయి. వధువు కాలి మీది వరుడు తొక్కడం అశ్మారోహణం. ఆ రాయి సన్నికల్లు కావడం విశేషం. వధువు రాయివలె పటిష్ఠంగా ఉండాలని అంతరార్థం. దీర్ఘసుమంగళత్వాన్ని సూచించేదని నమ్మకం. ఈ సందర్భంలో 'ఓం ఆరోహే మామశ్యా నమశ్యేవ త్వగ్ం స్థిరా భవ' మంత్రం చెప్పడం ఒక విధి.

**దోమటి దొడికి ముందే తొక్కేఁ బాదాలు 13-100**

**ఘనమైన కాఁకల ఁగాలు ద్రొక్కి 5-120**

**కంకణం :** దేవతల రక్షణను కోరుతూ సంకల్పించిన కార్యం నిర్విఘ్నంగా కొనసాగడానికి రక్షను వరుని కుడిచేతిని కట్టడం. వధువుకు ఎడమచేతికి

కట్టడం. ఈ కంకణాలను నాల్గవరోజు విధిగా విప్పేయాలనడం శాసనం. ఇది వధూవరులకు భౌతికమయిన ఉపద్రవాలు కలగకుండా చేసే మంత్రాత్మక మయిన తంతు.

వైఖానస ఆగమం ప్రకారం ఇది రక్షాబంధనం. ప్రతి సరబంధనం కూడా. ఈ సందర్భంలో ప్రాణాయామం తరువాత.... 'శుభ తిథౌ అస్య దేవ దేవః స్వామినః దేవ్యోశ్చ వివాహదీక్షా కౌతుక పూజాం కరిష్యే' అంటూ విహిత పూజలు నిర్వహించి స్వామివారికి, దేవేరులకు కంకణాలు కట్టడం ఆచారం. ఆపై ఆచార్యులు కంకణధారణ చేస్తారు. ఈ సందర్భంలో 'స్వస్తి సూక్త' పఠనం నియతం. సమస్త దేవతలు శుభం కలిగింతురు గాక అనడం ప్రధానాశయం. మహావిష్ణువు పంచాయుధాలు సర్వత్ర రక్షించి కల్యాణ కైంకర్యాన్ని నిర్విఘ్నంగా చేయాలని ప్రార్థించడం ఆచార్యుల వంతు.

**గండుమీరి ముంజేతులలో కంకణదారాలు కట్టె 13-100**

**కంకణదారాలు గట్టె ఁగలికి 14-1457**

**కలగొను చూపులే కంకణాలు 2-412**

**తంబ్రాలు :** సంస్కృతంలో 'ఆర్ద్ర అక్షతారోపణం' ఇదొక వైవాహిక తంతులోని ఒక పరిభాష. ఆర్ద్ర అంటే తడిసిన అక్షత దెబ్బతినని బియ్యాన్ని వధూవరుల శిరస్సులపై పరస్పరం పోయించడమని సామాన్య అర్థం. దాక్షిణా త్యులలో 'అక్షతారోపణానికి' ప్రాధాన్యం ఎక్కువ. దాక్షిణాత్యులు 'వరికి' ప్రాధాన్యమిచ్చే వారు. వరిని వండించడంలో నిపుణులు. అందుకే పవిత్ర కార్యాలన్నిట వడ్లకు, బియ్యానికి ప్రాధాన్యం కల్పించుకొన్నారు.

క్షతమంటే దెబ్బతిన్నది. అక్షతమంటే దెబ్బతిననిది. అవే అక్షతలు. వివాహంలో అక్షతలు తయారుచేసే విధానం దక్షిణదేశంలో రకరకాలు. అలాగే వధూవరులు పరస్పరం అక్షతలు ఆరోపణం చేసుకోవడంలోని ప్రాంతీయ ఆచారాలు భిన్నభిన్నంగా ఉన్నాయి. ఏది ఏమైయినా పవిత్ర



మంత్రాలతో మొదట వరుడు వధువుపై ఆపై వధువు వరునిపై, ఆపై వరుడు వధువుపై తలంబ్రాలు వేసుకోవడం. నాల్గవసారి ఇద్దరు పోసుకోవచ్చు. ఈ సందర్భంలో వధూవరుల జన్మనక్షత్రాలు, నక్షత్రాధి దేవతలు, ఆరాశి రాశ్యధిపతులను చంద్రుని 'ప్రజాపతిః స్త్రియాం యశః' మంత్రంతో స్మరించడం ఒక భాగం. తొలిసారి వేయడం సంతానాభివృద్ధికి, రెండవసారి వేయడం పశువృద్ధికి, మూడవసారి వేయడం యజ్ఞసమృద్ధికని పెద్దలు చెబుతారు.

తెలుగులో 'తలంబ్రాలు' అక్షతలకు మారుపేరు. ఇది అచ్చ తెలుగుపదం. నేటి వాడుకలో చాలావరకు మరుగుపడిన శబ్దం. 'ప్రాలు' ధాన్యవాచకం. చిన్నయసూరి బాలవ్యాకరణంలో 'తలంబ్రాలు మొదలగు సమాసంబుల ద్రుతంబునకు లోపంబు లేదు'. అని సూత్రీకరించి ఒడిఁబ్రాలు, సేసఁబ్రాలు లాంటి ఉదాహరణాలు ఇచ్చాడు. ఈ సందర్భంలో పఠింపబడే మంత్రం 'కపిలాగ్ం స్మారయంతు' అందుకే ఈ కార్యక్రమానికి 'కపిలావాచనం' అని పేరు. ఒకరిపట్ల ఒకరు తృప్తి కలిగి వుండడానికే ఈ ప్రక్రియ. పాడిపంటలు అన్న సంపద, సత్సంకల్పాల వృద్ధికోరడం విశేషం.

స్వామికి జరిగే వైవాహిక విధులలో 'అక్షతారోపణం' ఉంది. ఆచార్యులు 'స్వస్తి సూక్తం' చదవడం విశేషం. చివర

**'ఓం ధ్రువన్తే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః**
**ధ్రువన్త ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువమ్'**

అనడం సంప్రదాయం. 'ముత్యాల తలంబ్రాలు' పోయడం తిరుమలలోని విశేషం.

**దంతపు నవ్వులె మీకు తలంబ్రాలు 9-129**

**ఒడి శ్రీ వేంకటపతికి శ్రీసతికి**
**అదరిన తలంబ్రాలందె నిదె 22-96**

**అందియ్యరో తలఁబ్రాల కాయిత్తముల నుండి 12-61**

**హత్తి తలఁబాలు నారాయణుని ఁబోయు మనరే 20-182**

**తాళి :** సంస్కృతంలో అయితే మంగళసూత్రం. ఈ సంస్కృత శబ్దానికి పర్యాయంగా ద్రావిడభాషలలో తాళి, బొట్టు, పుస్తె లాంటివి కనిపిస్తాయి. తమిళంలో 'తాళ్' అంటే బీగం. బీగం వేసిన ఇల్లు ఎలా భద్రమో ఆలాగే వివాహిత అయిన స్త్రీకి భద్రత.

వరుడు వధువు మోడలో కట్టే సూత్రం మంగళసూత్రం. ఇది శుభకర మయినది. మంగళదేవత, లక్ష్మీదేవిని ఆ సూత్రంలో ఆవహింపచేసి వధువు మెడలో కట్టబడేది. పరిణయానికి ఇతర చిహ్నాలకన్నా ఈ తాళి చిహ్నమే గొప్ప.

మంగళసూత్రధారణకు వేదమంత్రం లేదని కొందరి అభిప్రాయం.

**మాంగల్యం తన్తునానేన**
**లోకరక్షణహేతునా**
**కంఠే బధ్నామి సుభగే**
**రక్షన్తు శరదాం శృతమ్'** అన్న శ్లోకమే తిరుమలలో ప్రమాణం. పసుపు అద్దడం ఈ మాంగల్యానికి మరింతబలం చేకూర్చేది. తలంబ్రాలపై పెట్టి తీసుకు వచ్చిన మంగళసూత్రాన్ని ముత్తైదువలు, పెద్దలు స్పృశించడం వల్ల మాంగల్య బలం పెరుగుతుందని పరమవిశ్వాసం. మెడలో కట్టే రెండుముడులు వేశాక మూడవ ముడిని వదలుగా వేయడం ఆచారం. ఆపై ముడులకు కుంకుమ పూయడం దేశాచారం.

**సిరుల ఁగట్టినతాళి శ్రీధరభావమాయ 20.191**

**తిరనాళ్ళు :** నాళ్ తమిళశబ్దం. రోజు అని అర్థం. తిరు పవిత్ర వాచకం. మంగళకరమయిన రోజు తిరునాళ్. బ్రహ్మోత్సవ కాలం ఆలయానికి, ఆలయ



ప్రాంతవాసులకు తిరునాళ్. 'నాళాం నాళాం తిరునాళాం' అన పాట. తిరునాళ్ళ ప్రకటన జరిగాక ఎవరూ ఊరు వదలి వెళ్ళరాదని కట్టడి.

**మొదలి తిరునాళ్ళకు మొక్కేమునేము 2.194**

తిరుకొడి. 'తిరు' మంగళవాచకం. 'కొడి' జెండా లేదా ధ్వజం. వైష్ణవాలయాలలో ఎగరవేయబడే పవిత్రమయిన కొడి గరుడధ్వజ.

**తిరుమొళి :** దీనినే 'నాచ్చియార్ తిరుమొళి' అంటారు. గోదాదేవి రచించిన 'వారణమాయిరం' అని మొదలయ్యే 10 పాశురాలు చదవడం శ్రీవైష్ణవ వివాహ సంప్రదాయాలలో చాలా ముఖ్యమయినది. తిరుమల శ్రీవారి కల్యాణోత్సవాలలో ఈ సంప్రదాయం నేటికీ ఉంది.

**తిరువాముడి :** శ్రీవైష్ణవులకు ప్రత్యేకించి దాక్షిణాత్య రామానుజ సంప్రదాయవాదులకు నాలాయిరం చాలా ముఖ్యమయినది. పన్నిద్దరు ఆళ్వారుల పాశురాల సంకలనం నాలాయిరం. నాలాయిరంలో ఒక భాగం. 'తిరువాయ్‌మొళి'. ఇది ఛాందోగ్యోపనిషత్ వివరణమని ప్రసిద్ధం. నమ్మాళ్వార్ రచితం. 1102 పాశురాలు గల భాగం. శ్రీవైష్ణవాలయాలలో 'నాలాయిరం' ఆయా ఉత్సవాల సందర్భాలలో నియతంగా శ్రద్ధగా పఠించడం నేటికి సాగుతున్న ఆచారం.

**తట్టలై తిరువాముడి ఘనులు పాడేరు 12-4**

**తిరువీధి :** తమిళంలో 'శ్రీ'కి ఇంచుమించు పర్యాయంగా 'తిరు' వాడకం ఎక్కువ. ఊర్లపేర్లలోనూ, వ్యక్తుల పేర్లముందర, ఆలాగే పవిత్రతను చెప్పే కళ 'తిరు'ను జోడిస్తారు. ఆలయం పవిత్రం. ఆ పవిత్ర ఆలయం చుట్టూవున్న నాలుగు వీధులు తిరువీధులు. పాశురాలలో 'తిరు' అన్నది లక్ష్మీదేవినే సూచిస్తుంది. అందువల్ల ఉత్సవమూర్తులు ఊరిగే వీధులు మంగళకరమయిన వీధులు తిరువీధులు.

**నాగవల్లి :** 'నాకబలి' నాగవల్లిగా మారిందని అంటారు. 'నాకం' అంటే స్వర్గం. బలి అంటే పూజ. స్వర్గంలోని 33 కోట్ల దేవతలను పూజించడమని స్థూలాభిప్రాయం. దేవతల ఆశీస్సులు వధువుకు లభించడమే గాకుండా ఆమెను ఆశ్రయించు 'విశ్వావసుత్ర' అనే గంధర్వుడు వధువును వదలివెళతాడని విశ్వాసం.

నాగవల్లి నాల్గవరోజు కార్యక్రమం. ఈ కార్యక్రమ విధానం రకరకాలుగా జరుపబడుతూ వుంది. వరుని అలుకను మామ తీర్చడం ఒక నెపం. ముత్తైదువలు నడుస్తుండగా పురోహితుడు 'వాతో దేవతా సూర్యదేవతా' అనే మంత్రాలు చదువుతుంటే వరుడు కదలడం.

నాకబలి నాడు వేసే ముగ్గులకు ప్రత్యేకత ఉంది. తెలుపు, పసుపు, ఎరుపు రంగుకల బియ్యపు పిండి పసుపు కుంకుమాలతో పుష్కరాకారంగా ముగ్గులు, మధ్యలో ఏనుగు ఆకారం గల ముగ్గు. కొందరు ఉప్పుతో ఏనుగు పప్పుతో ఏనుగు తీర్చిదిద్దుతారు. ఏనుగు ఆకారాల చుట్టు 32 చిన్న పిడత లుంటాయి. ఆ పిడతలకు దారాలు తీసివేస్తే పిడతలను ఇష్టమున్నవారు తీసుకువెళతారు. ఆలా తీసుకెళ్ళిన వారి యింట ఉన్నవారికి వివాహం జరుగు తుందని ఒక ప్రబల విశ్వాసం. ఈ నాకబలిలో మంత్రాలు చాలా తక్కువ. ప్రధానంగా ఆడువారికి ప్రాధాన్యమున్న తంతు.

**నేఁడేపెండ్లి నీకు నేఁడే నాగవల్లి 12-243**

**పానుపు పరచరె బలు నాగవల్లి నేఁడు 16-295**

**పంచమహావాద్యాలు :** వివాహాలలో మంగళకరమైన వాద్యాలు వాయించడం సంప్రదాయం. చెవులకు విందుచేసే రాగాలతో వాద్య సంగీతం అందరిని ఆకర్షిస్తుంది. మరి ఆలయాలలో పంచమహావాద్యాలు భేరి, కాహళ, పటహం, శంఖం, జయఘంటలు మోగుతాయి. గ్రామస్థులకు దూరంలో ఉన్నవారికి ఆలయకైంకర్యాలు ఆటంకాలు లేకుండా జరుగుతున్నాయని భావన.



**పరుషలు :** వాడుకలో స్వస్థలం పరస్థలం అంటాం. ఆలాగే ఒక క్షేత్రానికి ఇతర ప్రాంతాలనుండి వచ్చినవారిని 'పరస్థలులు' అనడం అలవాటు. ఇదే 'పరషగా' మారింది. కర్ణాటక దేశంలో తమ ఆవుల్ని ఇతరత్ర అమ్ముకోవ డానికి వెళుతుంటారు. ఇలాంటి వాటికోసం 'సంతలు' జరుగుతాయి. కర్ణాటకంలో 'ఎద్దులపరష' అని కూడా వ్యవహారం. అన్నమయ్యలో 'పరషశబ్దం చాలా చోట్ల కనిపిస్తుంది. కన్నడాంధ్ర సరిహద్దు ప్రాంతాలలో ఈ శబ్దానికి వ్యాప్తి ఎక్కువ.

**పాణిగ్రహణం :** ప్రాచీన సంప్రదాయాలలో 'పాణిగ్రహణ మహోత్సవం' అనడానికే ప్రసిద్ధి. తరువాతి కాలంలో వివాహం, లగ్నం లాంటివి వచ్చాయి. వరుడు వధువు చేతిని పట్టుకొని అగ్నిహోత్రుని దగ్గరికి తీసుకొని వెళతాడు. ఈ సందర్భంలో 'గృహ్ణామి తే సుప్రజాస్త్వాయ హస్తం' అనే మంత్రం పఠించడం సంప్రదాయం. 'నా గృహస్థాశ్రమం కోసం నన్ను గృహిణిగా స్వీకరిస్తాను' అని మంత్రాభిప్రాయం. ఇవి ఆరుమంత్రాలు. తెలుగు సామెతల్లో 'అందరిలోకి చిన్నోడు పెళ్ళికేమో పెద్దోడు' అనడం వివాహపు తంతును సూచించేదే.

**గరిమెల cబాణి గ్రహణము చేసిన**
**సిరుల cజెలుల గలసీనcటే 4.355**

**పెళ్ళిపీట :** పీటలు అనేక రకాలు. వ్యాసపీఠం, గురుపీఠం లాంటివి. భోజనానికి కూర్చునే పీట ఎత్తయింది. ఒక్కొక్కరికి ఒక్కొక్క పీట. కాని పెళ్ళిపీట నిడివైనది. కనీసం నలుగురు కూర్చోగలిగింది. మంగళకరమైంది. ఇతర మయిన వాటికి వాడనిది. ఆ పీటలపై తెల్లని వస్త్రం కప్పి వధూవరుల్ని కూర్చోపెడతారు. కొన్నిచోట్ల 'ఆలయాల నుండి పెళ్ళిపీటలు' తెచ్చే సంప్రదాయ ముంది.

**వొనరి పెండ్లిపీటపై నున్నారదివో 14.110**

**సుంకులంc బెండ్లి పీcట cగూచుండ cబెట్టరో 14.365**

**తరుణికి నితనికి తగు పీcట వెట్టరే 29.15**

**బ్రహ్మముడి :** సృష్టికర్తయైన బ్రహ్మ అన్నిటిని నడిపించే వాడు. స్త్రీ పురుషులకు వివాహం నిశ్చయించేవాడు. బ్రహ్మ, అతని నిర్ణయమే బ్రహ్మముడి. వివాహకాలంలో పసుపు చీర అంచును, వరుని ఉత్తరీయం అంచును కలిపి ముడివేయడం. బ్రహ్మముడిని తెలుగువారు 'కొంగుముడి'గా వ్యవహరిస్తారు.

ఈ సందర్భంలో 'ధ్రువంతేరాజా' మంత్రం పఠిస్తారు. ఆపై అగ్ని ఎదుట నమస్కరించి వరుడు 'పుషాత్వేతో' ఇంటి యజమానరాలవుగా సర్వానికి పెత్తనం వహించి తీర్చిదిద్దుకొందువు గాక అనే అర్థంగల మంత్రం పఠిస్తాడు.

**కూడ మంచివేళ కొంగులు ముళ్ళు వేతామంటే 12.243**

**వొక్కటైరి కొంగుముళ్ళు వొనరగ వేయరో 14.365**

**బువ్వము బంతి :** వాడుకలో అవ్వ బువ్వ అనడం సహజం. ఆ బువ్వ పెండిలిదయితే బువ్వము బంతి - బువ్వం పంక్తి లేదా పంక్తి భోజనం. దీనినే హరి బువ్వం. బుజము బంతి అంటారు. స్థూలంగా చెప్పాలంటే వైవాహికపు తంతులలో ఇది ఒకటి. బంధువులు కలసి ఆరగించడం ఈ విందు విశేషం. వీటిని సంబంధించి ప్రాంతీయ ఆచారాలెన్నో వున్నాయి.

**పొత్తుల విందులు దెచ్చి బువ్వమున నిడరే 9-55**

**బువపు పెండ్లి మేలు బొందిన నిధానము 8-84**

**భాష్యకారులు :** శ్రీవైష్ణవంలో భగవద్రామానుజుల వారికి భాష్యకారులని పేరు. వేదభాష్యం వ్రాయడం వల్ల ఈ పేరు స్థిరమయింది. వివాహాదులలో భాష్యకారులకు ఏలాంటి ప్రాధాన్యం లేదు. కాకపోతే తిరుమలలో వైఖానసాగమం ప్రధానమైనా చాలా కార్యక్రమాలలో 'రామానుజుల కట్టడి' పాటింపబడుతుండడం వల్ల అందుకు సూచనగా తాళ్లపాక పదకవులు 'భాష్య కారులు' అని ప్రయోగించి వుండవచ్చు.



**వెలయ భాష్యకారులు విందు చెప్పి 12-4**

**మంగళాష్టకాలు :** ఏ పవిత్రకార్యానికైనా ప్రాచీనులు మంగళాదీని, 'మంగళమధ్యాని' మంగళాంతానిచ అని నిర్దేశించారు. వివాహాలలో వధూవరుల మధ్య తెరపట్టి శ్రవణానందకరంగా పురోహితులు చదివే శ్లోకాలే 'మంగళాష్టకాలు' (8 శ్లోకాల సముచ్చయం) నూతన వధూవరులకు మంగళం కలగాలని చదివే శ్లోకాల సముచ్చయం. ఇందులో లక్ష్మీనారాయణులు పార్వతీ పరమేశ్వరులు, వాణీ పద్మభవులు కొత్తగా వివాహం చేసుకొనేవారికి ఆయు రారోగ్యభోగభాగ్యాలను ఇచ్చి కాపాడాలనే శుభాకాంక్ష కనబడుతుంది. ప్రత్యేకంగా సీతారాములు గాని రుక్మిణీకృష్ణులు గాని దశావతారమూర్తులు గాని ఈ వధూవరులను అనుగ్రహించాలని కోరే మంగళశ్లోకాలు చదివే సంప్రదాయముంది.

వైఖానస సంబంధి గ్రంథాలలో కనిపించే మంగళాష్టక కార్యక్రమం.

**"శ్రీమత్పూర్ణ సుధాంశు శోభిత తనుశ్శుక్లాంబర స్సుందరః**
**సత్త్వాఢ్యస్సు చతుర్భుజ శ్శుభనిధిర్విష్ణు ర్వినోదీ విరాట్**
**భక్తా భీష్టఫల ప్రదాన నిపుణ శ్శశ్వత్ప్రసన్నాననః**
**పాయాద్వో భగవాన్ పురాణపురుషః కుర్యాత్సదా మంగళమ్**

**మునులు మంగళాష్టకములు చదువరో 14.365**

**మధుపర్కం :** పెరుగు, తానే సమంగా కలిపి కంచు పాత్రలో పోసి దానిపై కంచుమూత పెట్టి దారాలతో గట్టిగా బంధిస్తారు. ఇదే మధుపర్కం. కొందరు దానితో నేయి కలపాలని, అటుకులు కూడ కలపాలని అంటారు. ఇది 'పూజ' కనుక మధుపర్కం పూజా అనికూడ వ్యవహారం.

కన్యాదాన కాలంలో వరునికి మధుపర్కం ఇస్తారు. ఇవి గొప్ప కార్యం. పిల్ల తండ్రి వరుని కాళ్ళు కడిగి. 'కూర్చ' అనే దర్భగ్రంథిని అతని కింద వేసి కూర్చోబెట్టి మధుపర్కం అందిస్తారు. ఆపై కల్యాణ వస్త్రాలు సమర్పిస్తారు.

**ముహూర్తం :** వధూవరుల జన్మనక్షత్రాదుల బలిమిని గుర్తించి వివాహం కోసం పురోహితులు నిర్ణయించే లగ్నం ముహూర్తం. ఇతర వైదిక కార్యాలలో కూడా ముహూర్తబలం పాటించినా వివాహముహూర్తం కాలనిర్ణయంలో ఎంతో శ్రద్ధ తీసుకోవడం నాటికీ నేటికీ సమానమే. మంచి ముహూర్తము అంటే వర్ణ, వశ్య, నక్షత్ర, యోని, గ్రహ, గణ, రాశి నాడీకూటములను చూడడం. ప్రత్యేకించి చంద్రబలం, గురుబలాదులు, ఆలాగే ముహూర్త నిర్ణయంలో దేశాచారాలకు విశ్వాసాలకు ప్రాధాన్యమివ్వడం. జ్యోతిష్కుల నిర్ణయమే 'ముహూర్తానికి' పరిష్కారం.

**మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు**
**చంచుల, బూవు దండలు చాతుకొనేరదివో 14-110**

**సూసకాల పేరటాండ్లు సోబానఁ బాడరో**
**మోసపోక యిటే ముహూర్తమడుగరో 14-385**

**విడిది :** 'విడు' ధాతువుకు వదలు, వేరుగా ఉండడం లాంటి అర్థాలు న్నాయి. వైవాహికపు తంతులో పెళ్ళికొడుకు వారికి ఏలాంటి లోపాలు కలగ కుండా వుండడానికోసం ప్రత్యేకంగా ఒక బస ఏర్పాటు చేస్తారు. విడియుటకు గాను ప్రత్యేకంగా సమకూర్చిన గృహసీమ విడిది. విశ్రాంతికి ఆలవాలం విడిది. 'దండు విడిసింది' అని ప్రయోగం.

**విరహపు రాజదె విడిదికి రాగా**
**సిరులఁ జేసెనిదె సింగారములు 4.71**

**సప్తపది :** ఏడడుగులు వధూవరులు కలసి నడవడం సప్తపదిలో ప్రధానాంశం. వరుడు అగ్నిహోత్రునికి ఉత్తరదిశగా వధువు చేత తూర్పునకు గాని ఉత్తరానికి గాని కుడికాలుతో ఏడడుగులు వేయడం సప్తపది. ఈ ఏడడుగుల వల్ల స్నేహబంధం ఏర్పడుతుందని విశ్వాసం. ఒక్కొక్క అడుగుకు ఒక్కొక్క ప్రయోజనాన్ని పెద్దలు చెప్పారు. ఈ సందర్భంలో చెప్పే మంత్రం 'ఏకమిషే'.



ఓ చిన్నదానా! నీవు నావెంట నడు. విష్ణుమూర్తి నీవు వేసే మొదటి అడుగువల్ల అన్నాన్ని, రెండవ అడుగువల్ల బలాన్ని, మూడవ అడుగువల్ల మంచి కార్యాలను, నాలుగవ అడుగువల్ల సౌఖ్యాన్ని, ఐదో అడుగువల్ల పశు సమృద్ధిని, ఆరో అడుగువల్ల ఋతుసంపదలను, ఏడో అడుగువల్ల ఏడుగురు హోతలను అనుగ్రహించును గాక అన్నదే సారాంశం. ఆపై చెప్పబడే 'సఖా సప్తపది' మంత్రంలో స్నేహం గొప్పతనం వివరించబడింది. భార్యను స్నేహితు రాలిగా చూడమనడం ఒక ఆదేశం. భార్యకూడా నీవుకూడా పొరబాటు లేకుండా ఉండు అంటుంది. 'నీవు ఆకాశం. నేను పృథివిని, నీవు మనస్సువి, నేను వాక్యాన్ని అంటే వరుడు నేను సామను, నీవు ఋక్కువు అంటాడు. సంతానం సూనృత భాషణంతో (సత్యవాక్కులతో) ప్రకాశించాలని కోరుకోవడం ఈ సప్తపదిలో ఒక ప్రత్యకత.

**సేనాపతి :** దేవతల సేనాపతి విష్వక్సేనులు. శైవులు వినాయక ప్రార్థనతో శుభకార్యాలు మొదలుపెట్టినట్లే శ్రీవైష్ణవులు విష్వక్సేనుల పూజకు ప్రాధాన్య మివ్వడం విశేషం.

**విష్వక్సేనం సకల విబుధ ప్రౌఢ సైన్యాధినాథం**
**ముద్రాచక్రే కరతలయుగే శంఖదండౌ దధానమ్**
**మేఘశ్యామం సుఫణిమకుటం పీతవస్త్రం శుభాంగం**
**ధ్యాయేద్దేవం విజితదనుజం సూత్రవత్యాసమేతమ్.**

**సేసలు :** 'నలుగులు పోసుకోవడమే' పాస పెట్టడం, 'కన్నడంలో సేసె ఇక్కువుదు' బియ్యాన్ని రెండు పిడికిళులలో పట్టుకొని నడుము భుజాల మీదుగా తలపై జారవిడవడం.

**చిక్కని నీ నవ్వులె సేసపాలు 11-40**
**సేసపాలు సిగ్గున దోసిట నీపై నించేను 14-457**
**చెలియ నీ మోహములే సేసపాలు 20-412**

**హారతి :** ఆరతి అనికూడా వ్యవహారం. పూజాంతంలో, మంగళ కార్యాంతంలో స్త్రీలు సాగించే ప్రక్రియ. మంగళం కోరి పాడేది మంగళ హారతి. వధూవరులు పీటలపై కూర్చొని వుండగా వధూవరుల అక్కలు గాని చెల్లెళ్ళుగాని పాడడం. తోబుట్టువారలకు ప్రాధాన్యం కల్పించిన విధి. హారతులనేక రకాలు.

**మెండుగ నారతులెత్తి మీఁద సేసలు చల్లరే 9.55**

**అంబరమధ్యకును ఆరతులు యెత్తరే 29.15**

తాళ్లపాకవారి సంకీర్తనలలో ఎక్కడగాని శ్రీదేవి, మహీదేవి, వైకుంఠ కాయకుని గోత్రాదుల ప్రశంసలు మరికొన్ని వైవాహికపుతంతులు కనిపించవు. ఆలాగే దేవకామిను లాడరో' (12-4) కీర్తనలో 'చిత్తగించి యాగసాల చేరె హనుమంతుడు' అనడం పరిశీలించదగ్గ అంశం. ఆలాగే నందవరీకవంశజ, తాళ్లపాక వారికి సన్నిహిత అయిన తరిగొండ వెంగమాంబ తాళ్లపాక వారి కీర్తనలను క్షుణ్ణంగా పరిశీలించి తన వేంకటాచలమాహాత్మ్యం (పంచమాశ్వాసం 193.... 276) పద్మావతీ శ్రీనివాస కల్యాణ విశేషాలను పద్యాలుగా వ్రాసి నట్లు స్పష్టమవుతున్నది.

మంగళమమ్మకున్ సకల
మంగళమంజుల నేత్రికిన్ జయా
మంగళ మిందిరాసతికి
మంగళ మీ యలమేలు మంగకున్
మంగళమందు నే మరియు
మంగళమందును దేవలోక ది
వ్యాంగన లెల్ల నీ సతికి
నారతు లిత్తురు వేంకటేశ్వరా!

* * *



**తి.తి.దే. అన్నమాచార్యప్రాజెక్టు ప్రముఖ కళాకారులు**

**కల్యాణోత్సవాలలో పాడే పాటలు (అకారాదిక్రమంలో)**


| కీర్తన | రాగం | సంపుటం | పుట |
|---|---|---|---|
| అంగన లీరే యారతులు | సురటి/లలిత | 19.346 | 44 |
| అదె శ్రీవేంకటపతి | సాళంగం | 14.365 | 44 |
| ఆదరో పాదరో | మంగళకౌశిక | 22.96 | 45 |
| ఇద్దరికిద్దరే సరి | .......... | ........ | 46 |
| ఈడగు పెండ్లి | మధ్యమావతి/గుండక్రియ | 12.38 | 47 |
| ఈపెకు నితఁడు | సాళంగనాట | 16.295 | 47 |
| ఎట్టుగూడె | గౌళ | 20.201 | 48 |
| కట్టరో కలువడాలు | పాడి | 25.432 | 49 |
| గరుడధ్వజంబెక్కె | రామక్రియ | 3.21 | 50 |
| చూడరమ్మ సతులాల | మధ్యమావతి/లలిత | 26.246 | 51 |
| జయమంగళము | మధ్యమావతి/గుండక్రియ | 2.431 | 51 |
| జయలక్ష్మి | లలిత | ..... | 52 |
| తిరువీధుల మెరసే | శ్రీరాగం | 7.192 | 53 |
| తిరువీధులేగీని | సాళంగం/మోహన | 3.122 | 54 |
| దేవకా కామిను | సాళంగం | 12.4 | 55 |
| దేవదుందుభులు | శ్రీనగరి | 24.30 | 56 |
| నిండుసోబనము | భూపాలం | 9.55 | 57 |
| నెల మూఁడు శోభనాలు | వరాళి | 7.280 | 57 |
| నేడే నాగవెల్లి | భైరవి/రామక్రియ | 20.558 | 58 |
| పసిడి యక్షంత | సామంతం | 3.194 | 59 |
| పిడికిటి తలంబ్రాలు | శ్రీరాగం | 5.185 | 59 |

| | | | |
|---|---|---|---|
| పెట్టని కోటందరికి | బౌళి | 5.186 | 60 |
| పెనగొన్న కౌగిళ్ళ | మంగళకౌశిక | 14.457 | 61 |
| పురుషులలో | దేశాక్షి | 26.119 | 62 |
| మంచిముహూర్తమున | సామంతం | 14.110 | 63 |
| మరలి మరలి | రాగమాలిక | ...... | 63 |
| మొక్కరమ్మ చెలులాల | దేసాళం | 29.480 | 64 |
| లక్ష్మీకల్యాణము | ఆహిరి | 17.165 | 65 |
| వెలఁదియీకె | పాడి | 29.15 | 65 |
| సుదతులకితనికి | నాగవరాళి | 13.100 | 66 |
| శోభనమే | వసంతం/రీతిగౌళ | 5.18 | 67 |
| క్షీరాబ్ధికన్యకకు | మంగళకౌశిక | 20.295 | 68 |


ఇవేకాక తాళ్లపాక పదసాహిత్యంలో కల్యాణోత్సవ సంబంధి కీర్తనలు సుమారు నాలుగుపదులు దాకా ఉన్నాయి. భవిష్యత్తులో గాయకులు స్వరపరచి శ్రవణానందకరంగా పాడగలరని మా విశ్వాసం. కొందరు భక్తజనుల కోరిక మేరకు మరికొన్ని స్వామి సంబంధి కీర్తనలు కూడా ఈ కార్యక్రమంలో జత చేస్తున్నారు. మరికొన్ని పాటలు – చక్కని తల్లికి – అంగనకు నీవే ఆది మూలమే – ఏమని పొగడుదుమే – జగడపు చనవుల – గోవిందనామాలు– మంగళసూత్రమొకటే లాంటివి కూడా పాడుతున్నారు. శ్రోతలు తన్మయులవు తున్నారు.

సామవేద సామగాన సప్తస్వరములను
బాముతో నీ సతి నిన్ను పాడిన యట్టి
ఆముకొన్న తాళ్లపాక అన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకట నిలయ.... శరణంటిమి.



## సురటి / లలిత

అంగన లీరే యారతులు
అంగజగురునకు నారతులూ ॥పల్లవి॥

శ్రీదేవితోడుతఁ జెలఁగుచు నవ్వే
ఆదిమపురుషుని కారతులు
మేదినీరమణి మేలము లాడేటి
ఆదిత్య తేజున కారతులూ ॥అంగన॥

సురలకు నమృతము సొరిది నొసంగిన
హరి కిదివో పసిఁడారతులూ
తరమిది దుష్టుల దనుజుల నడఁచిన
అరిభయంకరున కారతులూ ॥అంగన॥

నిచ్చలుఁ గల్యాణనిధియై యేఁగేటి
అచ్చుతునకు – నివె యారతులూ
చొచ్చి శ్రీవేంకటేశుఁడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులూ ॥అంగన॥
(19.346)

* * *

## సాళంగం

అదె శ్రీవేంకటపతి అలిమేలు మంగయును
కదిసి వున్నారు తమకమున ఁబెండ్లికిని ॥పల్లవి॥

బాసికములు గట్టరో పైపై దంపతులకు
శేసపాలందియ్యరో చేతులకును
సూసకాల పేరటాండ్లు సోబానఁ బాడరో
మోసపోక యిట్టే ముహూర్తమడుగరో ॥అదె॥

గక్కునను మంగళాష్టకములు చదువరో
తక్కనే జేఁగంట వేసి తప్పకుండాను
నిక్కి నిక్కి చూచేరదే నెరిఁ దెర ఁదియ్యరో
వొక్కటైరి కొంగుముళ్ళు వొనరఁగ వేయరో ॥అదె॥

కంకణదారములను కట్టరో యిద్దరికిని
సుంకులఁ బెండ్లిపీఁటఁ గూచుండఁ బెట్టరో
లంకె శ్రీవేంకటేశు నలమేల్ మంగను దీవించి
అంకెల ఁబానుపు మీఁద నమరించరో ॥అదె॥
(14.365)

* * *

## మంగళ కౌశిక

ఆడరో పాడరో అప్సరో గణము
వీడెము లిందరో విభవము నేఁడు ॥పల్లవి॥

కమలారమణుని కల్యాణమునకు
తమినదె గరుధ్వజ మెనఁగె
తెమలుచు మ్రోసెను దివ్యదుందుభులు
గమనించరో దివిఁగల దేవతలు ॥ఆడ॥

వెలయఁగ లక్ష్మీవిభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలఁగి కైకొనరో శ్రీవైష్ణవులు ॥ఆడ॥

బడి శ్రీవేంకటపతికి శ్రీసతికి
ఆడరిన తలఁబా లందె నిదె



నడచీఁ బరుషలు నానాముఖముల
ముదుపులు చదువరొ ముయిగా నరులు ॥ఆడ॥
(22.96)

* * *

ఇద్దరికిద్దరే సరి యీడుకు జోడుకుఁదగు
గద్దరి కన్నుల జూడ ఁగలిగెఁగా మనకు ॥పల్లవి॥

పంతపు చెలిచన్నుల పసిడికాంతులకు
కాంతుని పీతాంబరపు కాంతులు సరి
దొంతుల చెలి నీలపుతురుము కాంతులకు
వంతులమేని నీలవర్ణము సరి ॥ఇద్దరి॥

జలజాక్షి వెలలేని జఘన చక్రమునకు
చలమరి వల కేలి చక్రము సరి
కులికేటి యీ యింతి కుత్తిక శంఖమునకు
చలవాయ రమణుని శంఖముసరి ॥ఇద్దరి॥

కమలాక్షి శ్రీవేంకటపతి గూడుటకు
రమణుఁడంటిన సమరతులు సరి
తమితోడ నిద్దరికి తారుకాణాలైనట్టి
సముకపు మోహముల సంతసములు సరి ॥ఇద్దరి॥

* * *

## మధ్యమావతి / గుండక్రియ

ఈడగు ఁబెండ్లి యిద్దరి జేసేము
చేదెలాల ఇది చెప్పరుగా ॥పల్లవి॥

పచ్చికబయళ్ళ cబదతి యాద cగా
ముచ్చట cగృష్ణుcడు మోహించి
వెచ్చపు పూదండ వేసి వచ్చె నట
గచ్చుల నాతని cగానరుగా ||ఈడగు||

ముత్తెపు ముంగిట ముదిత నడువ cగా
వుత్తముcడే చెలి వురముననూ
చిత్తరువు వ్రాసి చెలcగి వచ్చె నొళ
జొత్తుమాని యిటు చూపరుగా ||ఈడగు||

కొత్త చవికెలో cగొమ్మ నిలచితే
పొత్తున cదలcబాలు వోసెనటా
యిత్తల శ్రీవేంకటేశుcడు నవ్వుచు
హత్తి సతిగూడె నని పాడరుగా ||ఈడగు||

(12.38)

* * *

## సాళంగనాట / ఖమాస్

ఈపెకు నితcడు దగు నితని కీపె దగు
చూపులకు పండుగాయ శోభనము నేcదు ||పల్లవి||

పిలువరె పెండ్లికూcతుc బెండ్లిపీcటమీcదికి
చెలcగి తానెదురు చూచీ దేవుcడు
బలువుగా నిద్దరికి బాసికములు గట్టరె
కలిమెల్ల మెరసి సింగారించరే ||ఈపె||

ఆతలc దెచ్చిపెట్టరె ఆ పెండ్లికూcతురు
యీతcడే జంట శోభన మిద్దరికిని
కాతరాన బువ్వానకు గక్కనc బెట్టcగాను మరి
రేతిటనుండియు వేగిరించేరు వీరు ||ఈపె||



పానుపు వరచరె బలు నాగవల్లి నేcడు
పూని తెర వేయరె పొలc తులాల
ఆనుక శ్రీవేంకటేశుcడలమేలుమంగయును
లోననె భూకాంతయును లోలులైరి తాము ||ఈపె||

(16.295)

* * *

## గౌళ

ఎట్టుగూడెc బెండ్లియోగ మిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మీనారాయణ యోగము ||పల్లవి||

నెలcత కమలవాసి నీవు కమలాక్షుcడవు
పొలcతికి నీకుc గూడె పొంతనాలు
వలుద చక్రవాకాలు వనితకు చాలు నీవు
యెలమిc జక్రాయుధుcడ విద్దరికిc దగును ||ఎట్టు||

తరుణి నీలకుంతల తగు నీలవర్ణుcడవు
సరుస మీకే తగు నమ్మంధము
నిరతి హేమవర్ణాకె నీవు పీతాంబరుcడవు
సరవి నిద్దరి కొక్కజాతియ్యము ||ఎట్టు||

పాలవెల్లిc బుట్టె నాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలు మేలు యిద్దరికి మేనవావి
యీ లీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సోలి మాకుc బెట్టరాదా సోబనవిడేలు ||ఎట్టు||

(20.201)

* * *

### పాడె

కట్టరో కలువడాలు గక్కన వాకిళ్లను
పట్టరో వులుపలు శోభనద్రవ్యములను ॥పల్లవి॥

తిరుకొడి యెక్కెనదె దేవుని కల్యాణానకు
గరుడపటము పైఁడి కంబ మందును
ధరపై బ్రహ్మాది దేవతలెల్లాను వచ్చిరదె
వరుసతో వాయిద్యాలు వాయించరో ॥కట్టరో॥

ముంచి హోమములు సేసి మునులు సంభ్రమమున
అంచెల గడియ కుదు కట్టె పెట్టిరి
పెంచముగ ఁదెరవేసి పెండ్లిపీఁట వెట్టిరదె
మించ ఁబేరటాండ్లు నర్మిలి ఁబాడరో ॥కట్టరో॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యలమేల్మంగయు
యీవేళ ఁదలబాలు ఇట్టె పోసిరి
బూవములు పొత్తునను భుజియించి రిప్పుడిట్టె
వేవేలకు ఁగప్పురపు విడేలియ్యరో ॥కట్టరో॥
(25.432)

* * *

### రామక్రియ

గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి
పరుష లదివో వచ్చె ఁబై పై సేవించను ॥పల్లవి॥

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరంగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరుడ॥



కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥గరుడ॥

వేసిరి కానుక లెల్ల వేవేలు కొప్పెరల
పోసీ రదే తలఁబాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁదాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి ॥గరుడ॥
(3.21)

* * *

### మధ్యమావతి / లలిత

చూడరమ్మ సతులాల సోబాన ఁబాడరమ్మ
కూడున్నది పతి ఁజూడికుడుత నాంచారి ॥పల్లవి॥

శ్రీమహాలక్ష్మియట సింగారాలకే మరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపు గళలకేమరుదు
కోమలాంగి యీ చూడికుడుత నాం చారి ॥చూడ॥

కలశాబ్ధికూతురట గంభీరాల కమరుదు
తల ఁపలోకమాతయట దయ మరి యేరుదు
జలజనివాసినియట చల్లఁదన మేమరుదు
కొలఁది మీర యీ చూడికుడుత నాం చారి ॥చూడ॥

అమరవందిత యట అట్టెమహి మేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు

తమితో శ్రీవేంకటేశుఁడానె వచ్చి పెండ్లాడె
కొమెర వయస్సు చూడికుడుత నాం చారి ॥చూడ॥
(26.246)

* * *

## మధ్యమావతి / గుండక్రియ

జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి ॥పల్లవి॥

శరణాగతపారిజాతమా
పోరి నసురులపాలి భూతమా
అరుదైన సృష్టికి నాది మూలమా వో
హరి నమో పరమపుటాలవాలమా ॥జయ॥

సకల దేవతా చక్రవర్తి
వెకలివై నిండిన విశ్వమూర్తి
అకలంకమైన దయానిధి
వికచముఖ నమో విధికి విధి ॥జయ॥

కొలిచిన వారల కొంగుపైఁడి
ములిగిన వారికి మొనవాఁడి
కలిగిన శ్రీవేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా ॥జయ॥
(2.431)

* * *

## లలిత

జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి ఁబెరసితి వమ్మ ॥పల్లవి॥



పాలజలనిధిలోని పసనైన మీఁగడ
మేలిమి తామెరలోని మించు వాసన
నీలవర్ణు నురముపై నిండిన నిధానమవై
ఏలేవు లోకములు మమ్మేలవమ్మ ॥జయ॥

చందురుతోడ ఁబుట్టిన సంపదల మెరుగవో
కందువ బ్రహ్మల ఁగాచే కల్పవల్లివో
అందిన గోవిందునికి అండనే తోడునీడై
వుందానవు మా యింటనే వుండవమ్మా ॥జయ॥

పదియారు వన్నెలతో బంగారు పతిమ
చెదరని వేదముల చిగురు బోఁడి
ఎదుట శ్రీవేంకటేశు నిల్లాలవై నీవు
నిధుల నిలిచే తల్లి నీవారమమ్మ ॥జయ॥
(2.288)

* * *

## శ్రీరాగం

తిరువీధుల మెరసీ దేవదేవుఁడు
గరిమల మించిన సింగారములతోడను ॥పల్లవి॥

తిరుదండెలపై నేఁగీ దేవుఁడిదే తొలునాఁడు
సిరుల రెండవనాఁడు శేషుని మీఁద
మురిపేన మూఁడోనాడు ముత్యాల పందిరిక్రింద
పోరి నాలుగోనాఁడు పువ్వుఁ గోవిలలోను ॥తిరు॥

గక్కన నయిదవనాఁడు గరుడునిమీఁద
యెక్కెను ఆరవనాడు యేనుఁగు మీఁద
చొక్కమై యేడవనాఁడు సూర్యప్రభలోనను
యిక్కువఁ దేరును గుఱ్ఱ మెనిమిదోనాఁడు ॥తిరు॥

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాఁడు
పెనచి పదోనాఁడు పెండ్లిపీట
యెనసి శ్రీవేంకటేశుఁడింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీఁదను ॥తిరు॥

(7-192)

* * *

## సాళంగనాట / మోహన

తిరువీధి లేఁగీని దేవతలు జయవెట్ట
హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున ॥పల్లవి॥

కనకపు cగొండ వంటి ఘనమైన రథముపై
దనుజమర్దను cడెక్కె cదరుణులతో
వినువీధి cబడెగెలు వేవేలు కుచ్చులతోడc
బెనగొనcగ cగదలె భేరులు మ్రోయcగను ॥తిరు॥

వరుస cజంద్రసూర్యులవంటి బండికండ్లతోడ
గరుడధ్వజు cడొరసీ cగడు దిక్కులు
పరగు వేదరాసులే పగ్గాలు పట్టితియ్యcగ
సరుగ దుష్టుల cగొప్ప జయము చేకొనెను ॥తిరు॥

ఆటలుc బాటలు వింటా నలమేల్మంగయు cదాను
యీటున శ్రీవేంకటేశుc డెదురు లేక
వాటపు సింగారముతో వాకిట వచ్చి నిలిచీ
కోటాన cగోటి వరాలు కొమ్మని ఇచ్చుచును ॥తిరు॥

(3-122)

* * *



## సాళంగం

దేవకామిను లాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుఁడు కోనేటిదండc దిరువీధి మెరసే ॥పల్లవి॥

యెత్తిరి గరుడధ్వజ మిందిరాపతిపెండ్లికి
యిత్తర సురలు మును లిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చె నదె కప్పురవిడేలు
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుఁడు ॥దేవ॥

కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టె పేరటాండ్లు నేఁడిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్టలై తిరువాముడి ఘనులు వాడేరు ॥దేవ॥

వెలయ భాష్యకారులు విందుచెప్పెc బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీవేంకటేశుc డలమేలుమంగc గూడె
వెలసేరు పెండ్లిచవికెలోన నదివో ॥దేవ॥

(12.4)

* * *

## శ్రీరాగం

దేవదుందుభులు నలుదిక్కులందు
తావులనే వేవేలు ధ్వనులియ్య cగాను ॥పల్లవి॥

వేంకటాద్రిదేవుఁడదే వేడుకతో cబెండ్లాడీ
లంకెల నిప్పుడే కమలాదేవిని
కొంకక ముప్పది మూఁడు గోట్లు దేవతలాల
పుంకువ విచ్చేయరో మహోత్సవవేళ ॥వేంక॥

వనజనాభుఁడు నిత్యవైభవాన ఁజేకొనె
అనయము నిదివో యాదిలక్ష్మిని
మునులాల ఋషులాల ముంచిన భూసురులాల
సొనిసి యిందరు ఁగూడి సుముహూర్త మనరో ॥వేంక॥

సురకన్యలాల భూసురనాగకన్యలాల
మరిగి కూడీ నలమేలుమంగ నితఁడు
నిరతి శ్రీవేంకటనిలయుని నీకెను
యిరవుగో దీవించి యిందరును ఁబాడరో ॥వేంక॥

(24.30)

* * *

## భూపాలం

నిండు సోబనము నేఁడు నెయ్యపు దంపతులకు
మెండుగ నారతులెత్తి మీఁద సేసచల్లరే ॥పల్లవి॥

కట్టుఁడు కలువడాలు ఘనమైన తోరణాలు
గట్టిగాఁ బట్టణము సింగారించరే
కట్టి రుక్మిణీదేవి ఁగృష్ణుఁడు పెండ్లాడి వచ్చె
పెట్టుఁడిందరికి నేఁడు పెండ్లివిడేలు ॥నిండు॥

పాడరె సోబనాలు పైపైనె పేరటాండ్లు
యీడా డనక వీదు లేఁగించరే
జాడతో వాయించరె పంచమహావాయిద్యాలు
యీడనె పెండ్లి కట్నా లియ్యరె యిద్దరికి ॥నిండు॥

పొత్తుల విందులు దెచ్చి బువ్వము నిడరే
హత్తి గంధాక్షత లీరె అందరు నేఁడు



నిత్తెమై శ్రీవెంకటాద్రినిలయుఁడీ కృష్ణుడు
తత్తరాన నీకె ఁగూడె దగ్గరి సేవించరే ॥నిండు॥

(9.55)

* * *

## వరాళి / బృందావన సారంగ

నెలమూఁడు శోభనాలు నీకు నతనికి ఁదగు
కలకాలమును నిచ్చ కల్యాణమమ్మా ॥పల్లవి॥

రామనామమతనిది రామవు నీవైతేను
చామన వర్ణమతఁడు చామవు నీవు
వామను ఁడందు రతని వామనయనవు వీవు
ప్రేమపు (మీ) యిద్దరికి పేరుబలమొకటే ॥నెల॥

హరిపేరాతనికి హరిణేక్షణవు నీవు
కరిఁగాచె ఁదాను నీవు కరియానవు
సరిఁదా జలధిశాయి జలధికన్యవు నీవు
బెరసి మీ యిద్దరికి ఁబేరుబలమొకటె ॥నెల॥

జలజనాభుఁడతఁడు జలజముఖివి నీవు
అలమేలుమంగవు నిన్నలమె ఁదాను
ఇలలో శ్రీవేంకటేశుఁడిటు నిన్నురాన మోచె
పిలిచి పేరు చెప్పె ఁబేరుబలమొకటే ॥నెల॥

(7.280)

* * *

## భైరవి / రామక్రియ

నేఁడే నాగవెల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో ॥పల్లవి॥

అల్లదే దేవుని రథ మల్లదే గరుడధ్వజ
మెల్ల లోకములు గెల్చి యేగీనదే
యిల్లిదే లక్ష్మీభూము లిద్దరు దేవుళ్ళు వీరె
చల్లేరు శాసలు తాము సరికి బేసికిని ॥నేఁడే॥

సేనాపతి యల్లవాఁడే చేరి దేవతలు వారే
శ్రీనారాయణుఁడు చెలఁగీ నదే
ఆనుక యడుగడుగు కారగించీ వీధులను
వానలుగా అందరికి వరము లొసఁగుచు ॥నేఁడే॥

దేవదుందుభులు మ్రోసె దిక్కులెల్లాఁజల్లనాయె
శ్రీవేంకటేశుఁడితఁడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రతుకుఁడు
వేవేలు శోభనముల వేడుక కాఁడితఁడు ॥నేఁడే॥

(20.558)

* * *

## సామంతం / కల్యాణి

పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసల ఁబేరటాండ్లు దేవుని పెండ్లికిని ॥పల్లవి॥

శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపు ఁబెండ్లి ముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె
దేవతలు రారో దేవుని పెండ్లికిని ॥పసిఁడి॥



కందర్పజనకునికి ఁగమలాదేవికి ఁబెండ్లి
పందిలిలోపల ఁదలఁబాలు నేఁడు
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరిపెండ్లికిని ॥పసిఁడి॥

అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలి తిరుణాళ్ళకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరము లివె
కదలి రారో పరుష ఘనుల పెండ్లికిని ॥పసిఁడి॥

(3.194)

* * *

## శ్రీరాగం

పిడికిటి తలంబ్రాల పెండ్లికూఁతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లికూఁతురు ॥పల్లవి॥

పేరుకల జవరాలె పెండ్లికూఁతురు పెద్ద
పేరుల ముత్యాల మెడ పెండ్లికూఁతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లికూఁతురు విభు
పేరు కుచ్చ సిగ్గువడీ పెండ్లికూతురు ॥పిడి॥

బిరుదుపెండెము వెట్టెఁబెండ్లి కూతురు నెర
బిరుదు మగని కంటె ఁబెండ్లి కూఁతురు
పిరిదూరి నప్పుడే పెండ్లికూఁతురు పతి
పెరరేచి నిదివో పెండ్లికూఁతురు ॥పిడి॥

పెట్టెనె పెద్ద తురుము పెండ్లికూఁతురు నేడె
పెట్టెదు చీరలు గట్టె బెండ్లికూఁతురు

గట్టిగ వేంకటపతి కౌఁగిటను వడి
వెట్టిన నిధానమైన పెండ్లికూఁతురు ॥పిడి॥
(5.185)

* * *

## బౌళి

పెట్టని కోటిందరికి ఁబెండ్లికొడుకు బొమ్మఁ
బెట్టె నసురలకెల్ల ఁబెండ్లి కొడుకు ॥పల్లవి॥

పెల్లగించి భూమెత్తీ ఁబెండ్లికొడుకు వాఁడె
పిల్లఁగోవి రాగాల పెండ్లికొడుకు
పెల్లైన యీవుల పెండ్లికొడుకు వాఁడె
పిల్లఁదీపు పెన్నుద్ది పెండ్లికొడుకు ॥పెట్టని॥

పెంచపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం
పించిన కోపగించీ ఁబెండ్లికొడుకు
పెంచకప్పుడే పెరిగె ఁబెండ్లి కొడుకు వల
పించె ఁజక్కని సిరి ఁబెండ్లి కొడుకు ॥పెట్టని॥

పెంట పెరుగుల దొంగ పెండ్లి కొడుకు భూమిఁ
బెంటి పోతుల ఁగూరిచె ఁబెండ్లి కొడుకు
గెంటు లేని వేంకటగిరి మీఁదను వాఁడె
పెంట వెట్టుకున్నవాఁడు పెండ్లి కొడుకు ॥పెట్టని॥
(5.186)

* * *

## మంగళ కౌశిక

పెనగొన్న కాఁగిళ్ళ పెండ్లాడవయ్యా
అనిశముఁ బాయలేని అలమేలు మంగను ॥పల్లవి॥



అంకెల మంచిగుణము లనేటి నూలున నీకు
కంకణాదారాలు గట్టెఁ గలికి
లంకెలుగా నీపై వలపు లనే బంగారుతో
కొంకులేని మనసుల కొంగుముళ్లు వేసెను ॥పెన॥

ఆసల నిండుఁజూపు లనేటి మేటిమొగ్గల
బాసికము గట్టె నీకుఁ బడఁతి
వాసితో నవ్వులనే వలువముత్యాలనే
నేసపాలు సిగ్గున దోసిట నీపై నించెను ॥పెన॥

బెరసి మనోరథము పెండ్లి పీఁటమీఁద
మరిగి నిన్నుఁగూడె మగువ
అరుదై శ్రీవేంకటేశ అధరామృత బువ్వ
మెరపులేని రతుల యింట విందు వెట్టెను ॥పెన॥
(14.457)

* * *

## దేశాక్షి

పురుషులలో నెల్లా పురుషోత్తముఁడు వాఁడె
తిరుతేరు మీఁద నేఁగీ దేవదేవోత్తముఁడు ॥పల్లవి॥

చెక్కులు మెరవఁగాను సేసముత్యాలు రాలఁగా
యెక్కువైన తేరుమీఁద నేఁగీ వాఁడె
యిక్కువలు గరఁగుచు యిరువేల నొరగుచు
చిక్కని నవ్వుల నవ్వీ చెలులతో వాఁడె ॥పురు॥

నిమ్మపంట వేసుకొంటా నిక్కినిక్కి చూచుకొంటూ
యెమ్మెలకు ఁదేరి మీఁద నేఁగీ వాఁడె

తమ్ములము సొరెఁజేసి తగవల్లెవాటువేసి
చెమ్మఁ జెమట గందాల ఁజెలరేఁగీ వాఁడె ॥పురు॥

అలయుచు సొలయుచు నలమేలుమంగ ఁగూడి
యెలమి ఁదిరుతేరుపై నేఁగీ వాఁడె
బలిమి శ్రీవేంకటాద్రి పతి యీ పెండ్లికొడుకు
నిలువుఁ జక్క ఁదనాన నిండుకొనీ వాఁడె ॥పురు॥
(26.169)

* * *

## సామంతం

మంచి ముహూర్తమున శ్రీమంతులిద్దరు
చంచులఁ బూవుదండలు చాతుకొనే రదివో ॥పల్లవి॥

సొరిదిఁ బేరటాండ్లు సోబానఁ బాడఁగాను
హరియు సిరియుఁ బెండ్లియాడేరదే
తొరలి యంతటా దేవదుందుభులు మొరయఁగ
గరిమ బాసికములు గట్టుకొనే రదివో ॥మంచి॥

మునులు మంగళాష్టకములు చదువుచుండఁగ
పెనగుచు నేసలు పెట్టే రదే
ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువఁగ
వొనరి పెండ్లి పీఁటపై నున్నారదివో ॥మంచి॥

అమరాగంగన లెల్లాను ఆరతు లియ్యంగాను
కొమరార విడే లందుకొనే రదివో
అమరి శ్రీవేంకటేశుఁడలమేలుమంగఁ గూడి
క్రమముతో వరములు గరుణించే రదివో ॥మంచి॥
(14.110)

* * *



## మధ్యమావతి / రాగమాలిక

మరలి మరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము ॥పల్లవి॥

కమలారమణికి కమలాక్షునకును
మమతల జయజయ మంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము ॥మరలి॥

జలధికన్యకును జలధిశాయికిని
మలయుచును శుభమంగళము
కలిమికాంతకా కలికి విభునికుని
సుళువుల యారతి శుభమంగళము ॥మరలి॥

చిత్తజుతల్లికి శ్రీవేంకటపతికి
మత్తిల్లిన జయమంగళము
యిత్తల నత్తల యిరువుర కాఁగిటి
జొత్తుల రతులకు శుభమంగళము ॥మరలి॥

* * *

## దేసాళం

మొక్కరమ్మ చెలులాల మోహనాకారుఁడు వీఁడె
వెక్క సపుచేఁతల శ్రీవేంకటేశుఁడు ॥పల్లవి॥

సంతోసాన నాడె పెండ్లి చవికెలోఁ గూచున్నాఁడు
మంతనము లాడు కొంటా మగువలతో
పొంతనే సరసాలాడీ భూపతి చెరువు దండ
వింతసింగారాలతో శ్రీవేంకటేశుఁడు ॥మొక్క॥

జోడై రత్నాల సొమ్ముల వెట్టుకున్నాడు
వాడి కైన వూడిగపువారితో ఁగూడి
వీడెములు సేసుకొంటా వికవిక నవ్వుకొంటా
వేడుకకాఁడైనాడు శ్రీవేంకటేశుడు ॥మొక్క॥

తలకొన్న కమ్మఁబూవు దండలతో నున్నవాఁడు
లలిఁ బూసిన పరిమళాలు మించగా
పలురతుల దనిసి బాగుగా దేవుళ్లు దాను
విలసిల్లీ నిదిగో శ్రీవేంకటేశుఁడు ॥మొక్క॥
(29.480)

* * *

## ఆహిరి

లక్ష్మీకల్యాణము లీలతోఁ బాడే మిదే నేము
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥పల్లవి॥

చూపులు చూపులు మీకు సూసకము బాసికము
పూఁప చన్నుగుబ్బలివి బూజగుండలు
తీపుల మోవి తేనెలు తీరని మధుపర్కము
దాపుగఁ బెండ్లి యాడరయ్య తగుఁ దగు మీకును ॥లక్ష్మీ॥

మాటలు మీకిద్దరికి మదనమంత్రములు
మేటి తలఁబాలు మీలో మించు నవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటున బెండ్లాడరయ్య నెరవేరె మీకును ॥లక్ష్మీ॥

కౌఁగిలి కౌఁగిలి మీకు కందువ పెండ్లిచవికె
పాకిన కోరికలే పావ కోళ్లు



ఆఁగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
వీఁగక పెండ్లాడవయ్య వేడుకాయ మీకు ॥లక్ష్మీ॥
(17.165)

* * *

## పాడి

వెలది యీకె యీకె ఇదిగో వీఁడిగో పెండ్లికొడుకు
యెలమి నుపచారాలు ఇన్నియునుఁ జేయరే ॥పల్లవి॥

అంబుజపాణికిని హారములు గట్టరే
బింబాధరికిఁ గొప్పు వెట్టఁగదరే
కంబుకంఠికిని కప్రపు బొట్టు వెట్టరే
అంబరమధ్యకును ఆరతులు యెత్తరే ॥వెలది॥

కలువకంటికి మంచికాటుక వెట్టఁగదరే
తలిరుఁబోఁణికి పూలదండ వేయరే
మలయజగంధికి బొమ్మలపెండె మందియ్యరే
అలినీలవేణికి నట్టె సింగారించరే ॥వెలది॥

కరిగమనకును బాగాలు చేతి కొసఁగరే
హరిమధ్య కొడ్డాణ మమరించరే
ఇరవుగా శ్రీవేంకటేశ్వరునిఁ బెండ్లాడె
తరుణికి నితనికి తగు పీఁట వెట్టరే ॥వెలది॥
(29.15)

* * *

## నాగవరాళి

సుదతుల కితనికి సోబనవేళ
వుదుటునఁ జెలులెల్ల నూడిగాలు శాయరే ॥పల్లవి॥

ఇద్దరు పెండ్లికూతులకితఁడు గట్టె బాసిక
మొద్దికఁ గప్పురవీడే లొడిఁబెట్టెను
పెద్దిరికాన నడుమఁ బెండ్లిపీటపైఁ గూచుండె
వొద్ద నుండి సతులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతు॥

రెండుచేతుల శాసలు రెట్టించి చల్లఁ దొడఁగె
దండలిద్దరి మెడలఁ దగుల వేసె
గండుమీరి ముంజేతులఁ గంకణదారాలు గట్టె
వుండినట్టే చెలులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతు॥

భూమి నలమేల్మంగను భూసతిఁగాఁగిటఁ గూడె
దోమటి దొడికి ముందే తొక్కెఁ బాదాలు
యీమేఁటి శ్రీవేంకటేశుఁడిన్ని విధాల మెఱసె
నోముచును చెలులెల్ల నూడిగాలు సేయరే ॥సుదతు॥

(13.100)

* * *

## వసంతం / రీతిగౌళ

శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి ॥పల్లవి॥

అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతోఁ జెరలు దెచ్చిన సతుల
పరువపు వయసుల బదారువేలను
సొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి ॥శోభ॥



చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవగళించి
విందువలెనె తావిచ్చేసి రుకుమిణి
సందడిఁ బెండ్లాడిన సరసునికి ॥శోభ॥

దేవదానవులు ధీరతను
దావతిపడి వార్ధి దరువఁగను
శ్రీవనితామణి ఁజెలఁగి పెండ్లాడిన
శ్రీవేంకటగిరి శ్రీనిధికి ॥శోభ॥

(5.18)

* * *

## మంగళ కౌశిక

క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం ॥పల్లవి॥

జలజాక్షి మోమునకు జక్కవకుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువుమాణిక్యములనీరాజనం ॥క్షీరా॥

చరణ కిసలయములకు సకియరంభోరులకు
నిరతమగు ముత్తేలనీరాజనం
అరిది జఘనంబునకు నతివనత నాభికిని
నిరతి నానావర్ణనీరాజనం ॥క్షీరా॥

పగటు శ్రీవేంకటేశుపట్టపురాణియై
నెగడు సతికళలకును నీరాజనం

జగతి నలమేల్మంగ చక్కఁదనముల కెల్ల
నిగుడు నిజశోభనపు నీరాజనం ॥క్షీరా॥

(20.295)

లక్ష్మీ మహీ తదనురూప నిజానుభావ
నీళాది దివ్య మహిషీ కరపల్ల వానామ్
ఆరుణ్య సంక్రమణతః కిల సాంద్రరాగౌ
శ్రీవేంకటేశ! చరణౌ శరణం ప్రపద్యే

* * *



# అనుబంధం - 1

'దేవరందరె తిమ్మప్ప' అని కన్నడిగుల ప్రబల విశ్వాసం. విజయ నగర పాలకుల కాలంలో హరిదాసు లెందరో తిరుమలకు విచ్చేసి సేవించి ఉత్సవవైభవాన్ని కీర్తించినవారే. జానపదబాణిలో వందల దేవర నామగళు పాడి పరవశించినవారే. వారిలో 'వాదిరాజ' నామాంకితుల రచనలలో "స్త్రీయరెల్లరు బన్నిరె" పాట ఒకటి. ఈ పాట 'పద్మావతీ కల్యాణాన్ని సంగ్రహంగా వర్ణిస్తుంది. ఇవేగాక కన్నడంలో మరికొన్ని శ్రీనివాస కల్యాణ కృతులు కూడా ప్రసిద్ధాలు.

'స్త్రీయరెల్లరు బన్నిరె శ్రీనివాసన పాడిరే' అని ఎత్తుగడ. ఈ పాట పాడేవారికి 'హయవదనుడు' ముక్తి ప్రసాదిస్తాడని వాదిరాజుల నమ్మకం.

శ్రీనివాస కాంతె కైగె కంకణవన్నె కట్టిద
శ్రీనివాసను పద్మావతిగె మాంగల్యవనె కట్టిద
పద్మావతియ మదువె నోడె ముద్దుబాలెయరెల్ల బన్నిరే
శ్రీనివాసన మదువ నోడె స్త్రియరెల్లరు బన్నిరె

అంటూ చివర వాదిరాజుల వారు

"జయ జయ శ్రీనివాసనిగె జయజయ పద్మావతిగె
ఒలిదంతహ శ్రీహరిణె నిత్యశుభమంగళ
శేషాద్రిగిరివాస శ్రీదేవి అరసగె
కల్యాణ మూరుతిగె నిత్యజయమంగళ" అని ముగించారు.

వాదిరాజుల పదాలలో 'హయవదన' అంకితపదం. వారు హయగ్రీవోపాసకులు. పండిత ప్రకాండులు.

* * *

# అనుబంధం - 2

'వారణ మాయిరమ్'

ఆళ్వారులలో ఒకతె అయిన గోదాదేవి పాడిన 'నాచ్చియార్ తిరుమొళి'లో ఆరవదశకం 'వారణ మాయిరమ్'తో మొదలవుతుంది. చెలికత్తెలతో గోదాదేవి తనకు భగవంతునితో వివాహమయినట్లుగా కలగంటినని చెప్పడం ఈ దశక విశేషం. ఈ ప్రబంధంలో వరాగమనం ముహూర్త పత్రికను వ్రాసికొని కల్యాణమంటపానికి వరప్రవేశం – నిశ్చితార్థం – ప్రతిసరబంధం – వరప్రేషణం – పాణిగ్రహణం – అగ్నిప్రదక్షిణం – అశ్మ స్థాపన – సప్తపదులు – లాజహోమం – వసంతోత్సవం అనే వైదిక వివాహ ప్రక్రియ సాంగోపాంగంగా నిరూపితం. ఈ కారణం వల్లనే శ్రీవైష్ణవులు వివాహకాలంలో ఈ ప్రబంధాన్ని అనుసంధానిస్తున్నారు. ఈ ఆరవదశకం లోని తొలి పాశురం

వారణమాయిరం శూళవలం శెయ్‌తు
నారణ నమ్బి నడక్కిణ్ణా నెన్దె తిర్
పూరణ పొఱ్కుడం వైత్తు ప్పుఱమెంగుమ్
తోరణం నాట్టక్క నాక్కండేన్ తోళి నాన్

ఓ చెలీ! మోహనాకారుడయిన శ్రీకృష్ణుడు వేయి ఏనుగులతో చుట్టబడినవాడై ఊరికి ప్రదక్షిణంగా వచ్చుచున్నపుడు పురజనులు ఊరంతయు సింగారించి పచ్చని తోరణముల గట్టి పూర్ణకుంభములతో నెదురేగి అతనిని స్వస్తి వాచన పురస్సరముగా వైదికాగ్రేసరులు తోడ్కొని వచ్చుచుండగా అతనికి మంగళార్థమై తమ తమ వాకిటి తిన్నెలయందు తీర్థపరిపూర్ణములగు సువర్ణ ఘటములనుంచి నీరాజనముల నిచ్చుచు పురజనులందరును అమితోత్సాహంతో మహోత్సవమును పరిపాలించునట్లు నేను కలగంటిని అని పైపాశురం భావం.



తిరుమలలో 'వారణమాయిరమ్' అనుసంధానించడానికి ముఖ్య కారణం ఆండాళ్ 'వేంగడవర్కెన్నై విధిక్కిట్రియే' అని తిరుమలవాసుని స్మరించడం. రెండవది తిరుమల శ్రీవైష్ణవక్షేత్రం కావడం ఈ అంశాన్ని చెప్పే సంస్కృత శ్లోకం.

ఆముక్తమాల్యవరదే భవుక ప్రదీపద్యోతే
పురాణమహితం వ్రత వృత్త బంధం
గీత్వా ప్రబంధ ముపదిష్టవతి ప్రభూషేత్వద్
వేంకటేతి వచనాను విధౌ ప్రసీద



# ఉపకరించిన ముఖ్య రచనలు

1. అన్నమయ్య సంకీర్తనల్లో వివాహసంబరాలు – **యడ్రదొడ్డి సుభాషిణి**

2. కల్యాణకీర్తనలు – **కె. సర్వోత్తమరావు**

3. కల్యాణ సంస్కృతి – **ఎక్కిరాల కృష్ణమాచార్య**

4. తాళ్లపాక పదసాహిత్య సంపుటాలు – **తి.తి.దే. ప్రచురణలు**

5. తిరుమల దర్శిని – **కె.సర్వోత్తమరావు**

6. తిరుమలలో తిరునాళ్లు – **సి.గోవిందరాజు**

7. తిరుమలవాసుని కల్యాణోత్సవం – **కె.సర్వోత్తమరావు**

8. నిత్యాను సంధానము – **దర్శనసార్వభౌమ శ్రీసుదర్శనాచార్యస్వామి**

9. శ్రీనివాస కల్యాణ గీతమాలిక – **సం. కామిశెట్టి శ్రీనివాసులు**

10. శ్రీవేంకటేశ్వర వైభవము – **పండిత వేదాన్తం జగన్నాథాచార్యులు**

11. శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రోక్తపాణిగ్రహణవిధిః – **వేదాన్తం విష్ణుభట్టాచార్య**

12. సప్తపది – **ఎస్.బి.రఘునాథాచార్య**

13. హరికొలువు – **జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

* * *

# అభిషేక సంకీర్తనలు

## శ్రీవారి అభిషేక వర్ణన

నగ్నస్వరూప సౌందర్య దర్శనవేళ
భైరవమూర్తి వైభవము గంటి
క్షీరపూర్ణ ఘటాభిషేక సంభ్రమవేళ
జినదేవమూర్తి విన్ననువు గంటి
కర్పూర కస్తూరికాలేపనాభిషే
కమువేళ నౌమాపతమును గంటి
హైమోత్తరీయ సమర్పణార్పణ వేళ
పరశక్తిమూర్తి సుందరత గంటి

మంగతాళి ధరించి సర్వాంగ శోభ
వెలయువేళ నీ విష్ణుత్వ మెలమిఁగంటి
సర్వదేవతాత్మకమయి జరగు నీదు
శుక్రవారాభిషేక ముత్సుకతఁ గంటి

– శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి

## తాళ్లపాక పదకవులు - శ్రీవేంకటేశ్వరుడు

తెలుగు సాహిత్యంలో పండితుల కుటుంబాలు, కవికుటుంబాలు, కవిపండిత కుటుంబాలనబడేవి చాలా ఉన్నాయి. వైష్ణవ కవిపండిత కుటుంబాలలో తాళ్లపాక కుటుంబానికున్న ఖ్యాతి ప్రశ్నించడానికి వీలు లేనిది. ఈ కుటుంబంలో తాళ్లపాక అన్నమాచార్యులది అగ్రస్థానం. పొత్తపినాడుకు చెందిన కడప మండలం రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామం నివాసంగా ఈ కుటుంబం వర్ధిల్లింది.

తిరుమల ఆలయంలో జరిగే సుప్రభాతం మొదలు ఏకాంత సేవదాకా జరిగే కైంకర్యాలలో పాల్గొని పాటలు పాడినవారు ఈ పదకవులే. అంతేగాక కల్యాణోత్సవం, ఉట్లపండుగ, కార్తీక వనభోజనోత్సవం లాంటి అనేక ఉత్సవాలను ప్రవేశపెట్టిన ఘనతకూడా వీరిదే. తాళ్లపాక పదకవుల రచనలలో ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలు ప్రధానమయినవి. వీటిలో 'అభిషేక సంకీర్తనలకు' ప్రత్యేక స్థానముంది. ఈ సంకీర్తనలు రచించినవారు తాళ్లపాక అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు. ఈ సంకీర్తనల విశేషాలను పరిచయం చేయడమే ఈ సంకలన ధ్యేయం.

### తిరుమల శ్రీవారి గర్భాలయంలో పంచబేర మూర్తులు

ఆళ్వారులు సేవించిన 108 దివ్యదేశాలలో ఒకటయినదీ, కన్నడ హరిదాసులు కీర్తించినదీ, జాతిమత కుల వర్ణ వివక్ష లేక అసంఖ్యాక భక్తజనులచే దర్శింపబడేదీ, ఆంధ్రప్రదేశ్‌లోని పరమపవిత్ర క్షేత్రాలలో సుప్రసిద్ధ మయినదీ తిరుమల క్షేత్రం. ఈ తిరుమలలో శ్రీవరాహస్వామి ఆలయమున్నా 'కలౌ వేంకటనాయకః' అనే ప్రసిద్ధిబట్టి శ్రీవేంకటేశ్వరునికే ప్రాధాన్యం.

శ్రీ వేంకటేశ్వరుడు స్వయంభువు. సాలగ్రామ శిలామూర్తి. ఈ స్వామి ఆవిర్భవించిన చోటునే గర్భాలయ మంటారు. తమిళంలో గర్భాలయానికి 'కరువరై' అని ప్రసిద్ధి. ఈ స్థానాన్ని ఆనందనిలయ మంటారు. ఈ ఆనంద నిలయంపై ఉన్న బంగారు గోపురమే ఆనందనిలయవిమానం.

తిరుమల శ్రీనివాసాలయం గర్భగుడిలో పంచబేరమూర్తులున్నాయి. మొదటిమూర్తి ధ్రువమూర్తి. ఆగమ పరిభాషలో ధ్రువబేరం. నిలబడ్డ భంగిమలో ఉన్నందువల్ల స్థానకమూర్తి. ఈ మూర్తినే తమిళులు తిరువేంకటముడైయాన్, పెరియప్పెరుమాళ్ అని సేవిస్తారు.

రెండవ మూర్తి భోగశ్రీనివాసమూర్తి, రజతమూర్తి, ఆగమ పరిభాషలో కౌతుకబేరం, పురుషబేరం అనిపేర్లు. ఈ స్వామినే తమిళులు 'మనవాళ ప్పెరుమాళ్' అంటారు. ఈ స్వామిని 'సర్వాధిక శ్రీనివాస' అనికూడా అంటారు. మూడవ మూర్తికి కొలువు శ్రీనివాసమూర్తి, అనిరుద్ధ బేరములని పేర్లు. పంచలోహమూర్తి. ఆగమ పరిభాషలో 'బలిబేరం'. వ్యవహారంలో దర్బార్ శ్రీనివాసమూర్తి 'లేఖక శ్రీనివాస' అనిపేర్లు.

నాల్గవమూర్తి ఉగ్రశ్రీ శ్రీనివాసమూర్తి. పంచలోహ మూర్తి. ఆగమ పరిభాషలో 'స్నపనబేరం'. అచ్యుతబేరం అనిపేరు. ఈ మూర్తినే తమిళులు 'వేంకటత్తురైవర్' అని కీర్తిస్తారు. ఐదవమూర్తి ఉత్సవ శ్రీనివాసమూర్తి. పంచలోహమూర్తి. ఆగమ పరిభాషలో 'ఉత్సవబేరం'. అయినా వాడుకలో 'మలైయప్ప'. ఈ స్వామినే 'మలైక్కునియ నిన్ఱ పెరుమాళ్, మలైక్కినియనిన్ఱ పెరుమాళ్, మలైపెరుమాళ్, ఉర్చవర్' అని తమిళులు ఆరాధిస్తారు. ఈ పంచబేరములన్నీ స్వామి సంకల్ప జనితములని భవిష్యోత్తర పురాణం (14-VV24 నుండి 23) వివరించింది. అయితే మూలబేరం కాక మిగిలిన విగ్రహాలు 9, 10 శతాబ్దాల నాటివని శ్రీసాధుసుబ్రహ్మణ్య



శాస్త్రిగారు Tirupati Sri Venkateswara (P.110) గ్రంథంలో తమ అభిప్రాయం ప్రకటించారు.

**అభిషేకం - పర్యాయపదాలు**

ఆగమ విధానాలను అనుసరించి ఆయా ఆలయాలలో పూజలు జరుగుతాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమానికే ప్రాధాన్యం. పంచబేరాలకు జరుపబడే పూజావిధానాలలో 'అభిషేకం' ఒకటి. అభిషేక శబ్దానికి పర్యాయపదాలుగా అభిషేచనం, తిరుమంజనం, తిరుమజ్జనం, మజ్జనం లాంటివి కనిపిస్తాయి. ఇవన్నీ సమానార్థకాలయినా వాడుకలో మాత్రం మూలవరులకు జరిగే అభిషేచనాన్ని 'అభిషేకం'గా, ప్రత్యేకించి శుక్రవార అభిషేకోత్సవంగా భక్తులు కీర్తిస్తారు. ఇతర బేరాలకు జరిగే అభిషేకం 'స్నపన తిరుమంజనంగా' ప్రసిద్ధి. అలాగే బ్రహ్మోత్సవాలలో చివరిది చక్రస్నానం. ఈ కార్యక్రమం స్వామిపుష్కరిణిలో నిర్వహింపబడుతుంది - సుదర్శన చక్ర ప్రాధాన్యం కారణంగా దీనికి చక్రస్నానమనిపేరు.

శ్రీ వేంకటేశ సహస్రనామస్తోత్రంలో 'జామదగ్న్య సరస్తీర్థ జలసేచన తర్పితః (898) పరశురామ సరస్తీర్థమందలి జలసేచనముచే తృప్తినొందింపబడినవాడు, నభోగంగాభిషిక్తః (901) ఆకాశగంగా జలముచే అభిషేకింపబడినవాడు, పాండవతీర్థాభిషిక్తాంగః (874), పాండవ తీర్థ జలముచే అభిషిక్త దేవుడు, హేమాంబుజసరః స్నాయీ (826) బంగారు తామరల సరస్సున స్నానము సేయువాడు లాంటి నామములున్నాయి.

తాళ్లపాక పదకవులు తమ పదాలలో మజ్జన శబ్దానికి ప్రాధాన్య మిచ్చారు. అనేక కీర్తనలలో ఇతర మజ్జనాలకంటె పన్నీటి మజ్జనాన్ని అత్యధికంగా ప్రస్తావించారు.

పడతి మోహరసము పన్నీటి మజ్జనము (7.166)

నెలత చెమటలే పన్నీటి మజ్జనము నీకు (22.502)

పన్నీట మజ్జన మార్చి పావడాలఁ దడివొత్తి (19.91)

మంచి మంచి పన్నీట మజ్జన మవధరించి (17.532)

మంతన మాడేటివేళ మజ్జన మాడేటివేళ (19.136)

మజ్జన శబ్దం తరువాత అభిషేక శబ్దానికి, జలక శబ్దానికి ప్రాచుర్యముంది.

ఆకాశనదియె నీకు నభిషేకము (17.494)

చేరి సేసే అమృతాభిషేకము వలె (17.502)

చప్పుడుగాక పన్నీట జలకమాడి (17.493)

పన్నీట జలకమాడీనదే సర్వేశుఁడు (13.363)

రాజులకు పట్టాభిషేకం, కవిశ్రేష్ఠులకు కనకాభిషేకం మన సంప్రదాయంలో ఉన్నవే. లౌకిక వ్యవహారంలో పట్టాభిషేకం, మంగళాభిషేకం, కనకాభిషేకం లాంటివి ప్రసిద్ధములే.

**తిరుమలలో పంచబేరములకు నిర్వహించే 'అభిషేకాలు'**

వైఖానస ఆగమం ప్రకారం మూలమూర్తి ప్రతిబింబమే 'కౌతుకబేరం', ఈ మూర్తికి జరిపే సమస్త కైంకర్యాలు ఆదిమూర్తికి జరిపినట్లే. తిరుమల గర్భాలయంలో స్వామి పాదాలకు దగ్గరున్న కౌతుకబేరమూర్తికి అంటే భోగశ్రీనివాసమూర్తికి ప్రతిరోజు ఉదయం తోమాల సేవకు ముందుగా ఆకాశగంగాతీర్థజలాలలతో 'అభిషేకం' జరుగుతుంది. అలాగే ఈ కౌతుక బేరానికి బుధవారం బంగారు వాకిలి దగ్గర ఆరాధన మండపంలో సహస్ర కలశాభిషేకం జరుగుతుంది. మరి ఉగ్రశ్రీనివాసమూర్తి బేరానికి ద్వాదశ తిరువారాధనం నాడు రాత్రి 10



గంటలకు బంగారు వాకిలి దగ్గరి ఆరాధన మంటపంలో శ్రీదేవి భూదేవేరులతో సహా తిరుమంజనాదులు జరుగుతాయి. ఉభయ దేవేరులతో కూడిన మలైయప్పస్వామికి ప్రతిరోజు రంగనాయకుల మండపంలో ఆర్జిత అభిషేకోత్సవం జరుపబడుతుంది. ఈ స్వామికే బుధవారం నాడు సహస్రకలశాభిషేకం బంగారు వాకిలి ముందుగల ఆరాధన మంటపంలో జరుగుతుంది. స్వామివారి తిరునక్షత్రమయిన 'శ్రవణ' నక్షత్రం రోజున కూడ ఆనందనిలయంలో ఏకాంత అభిషేకం జరుపబడుతుంది. సంప్రోక్షణ కంటె భిన్నమయిన క్రియాకలాపంతో కూడిన పవిత్రోత్సవ దినాలలో, బ్రహ్మోత్సవాలలో, పుష్పయాగం జరిగే రోజులలో ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామికి స్నపన తిరుమంజనాదులు వైభవంగా జరుగుతాయి.

మూలమూర్తికి మాత్రం శుక్రవారం మాత్రమే అభిషేకం. ఆనంద నిలయంలోని వెండిపాత్రలలో ఉంచబడిన సాలగ్రామాలకు నిత్యాభిషేకం నియతం.

**మలయ్యప్పస్వామికున్న 'కవచాలు'**

మలయప్పస్వామి కున్న ప్రాధాన్యం విస్మరించరానిది. ఆ స్వామికి బంగారు కవచం, వజ్రకవచం, ముత్యాలకవచాలున్నాయి. సహజంగా స్వామి బంగారు కవచాలతోనే దర్శనమిస్తాడు. అయితే ప్రతిసంవత్సరం జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్రం ముగిసేలా మూడురోజుల అభిషేకాలు జరుగుతాయి. తొలిరోజు బంగారు కవచం తీసి అభిషేకాదులు నిర్వహించాక వజ్రకవచం తొడుగుతారు. రెండవరోజు ముత్యాలకవచం (ముత్యంగి) ధరింపజేస్తారు. మూడవరోజు మరల సువర్ణ కవచమే తొడుగుతారు. ఈ జ్యేష్ఠమాసంలో జరిగే ఉత్సవంలోనే కవచ రహిత మలయప్పస్వామిని దర్శించడానికి వీలుంటుంది. విగ్రహరక్షణార్థమే ఈ 'కవచాలు'. ఈ అభిషేకాన్ని జ్యేష్ఠాభిషేక మహోత్సవమంటారు.

బంగారం లోహరాజం. తాళ్లపాక పదకవుల రచనలలో బంగారం ప్రశస్తి, ప్రసక్తి రెండూ ఎక్కువే.

బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము (1.23) కనకమయమైన గోపురములను (1.227) ముంగిట పసిఁడి కుంభములను (1.1) అదివో పైఁడి మేడల హరినగరు (2-111) బంగారు పచ్చడము (20.5) బంగారు సురటి (20.78) బంగారపు పువ్వులచీర (22.212) పసిడారతులు (19.346) బంగారు చిమ్మనగోవి (28.335) బంగారు మొలనూళ్ళు (28.383) బంగారు సరుపణులు (5.342) బంగారపు కొప్పెరల (5.256) బంగారు గరుడునిపై (4.365) బంగారు వోడ (4.389) బంగారపుటల మేలుమంగ (3.166) బంగారు యేరుతోడి (17.504) మొదలైనవి.

ఇలాగే ముత్యాల ప్రసక్తి కూడా ఎక్కువ. ముత్యపు పూసలు (24.49) ముత్యాల సరులు (6-147) అచ్చపు కుచ్చుముత్యాల హారములు (5.503) ముత్తేల నామము వాడు (7.116) ముత్తేలగద్దియ (5.68) ముత్తెపు నివాళి (7.292) ముంగిట ముత్యము (3.577). స్వామి శరణాగత వజ్రపంజరుడు. బంగారు, ముత్యాల వస్తుసామగ్రులే ఇంతవుండగా స్వామికి బంగారు, ముత్యాల, వజ్రాల కవచాలుండడంలో వింతేమి లేదు.

### తిరుమలలో శుక్రవారాభిషేక ప్రాధాన్యం

తిరుమలలో మూలవరులకు శుక్రవారం రోజు అభిషేకం జరపబడడానికి పదికారణాలను పెద్దలు చెబుతుంటారు. మొదటిది - వైకుంఠ విరక్తుడయిన 'స్వామి' భృగుమహర్షి ఆనతితో శుక్రవారం భూలోకానికి వచ్చాడని ఐతిహ్యం. రెండవది - స్వామి వల్మీకంలో దాగి తపస్సు చేస్తుండగా బ్రహ్మ ధేనురూపం దాల్చి శుక్రవారం క్షీరసేచనం



చేశాడని మరో కథనం. మూడవది స్వామికోసం తొండమానుడు ఆలయం కట్టడానికి సంకల్పించినపుడు స్వామి గర్భాలయాన్ని శుక్రవారంనాడు పాలతో ప్రక్షాళనం చేయమని ఆదేశించినట్లు మరో వృత్తాంతం. నాల్గవది - తొండమాన్ చక్రవర్తి శుక్రవార అభిషేక స్మరణం చేయడంవల్ల తన సంరక్షణలో ఉంచిన రాఘవుని పత్నిని, కుమారుని అప్పగించి ఆడినమాట నిలబెట్టుకొన్నవాడయినాడని ఇంకొక కథ. ఐదవది స్వామి పద్మసరోవరప్రాంగణంలో మహాలక్ష్మీ సాక్షాత్కారం కోసం కఠినతమమయిన తపస్సు చేస్తే శుక్రవారం రోజే అమ్మవారు సాక్షాత్కరించిందట. ఇక ఆరవది - పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం శుక్రవారం జరగడం. ఇవన్నీ పౌరాణిక సాక్ష్యాలయితే పల్లవ రాణి అయిన సామవై 8-6-966వ సంవత్సరం రజతభోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని అర్పించడం. (తమిళమాసం ఆణినెల, బహుళ తృతీయ, శ్రవణనక్షత్రం, శుక్రవారం కావడం). ఆలాగే భగవద్రామానుజులవారు శ్రీవారికి లక్ష్మీహారం అర్పించి అలంకరించారట. (ఆ రోజు రామమాలికా యోగం, శుక్ల ద్వాదశి ఉత్తరఫల్గునీ నక్షత్రం, శుక్రవారం). అన్నింటికి మించి వైఖానస ఆగమం శుక్రవార అభిషేకాన్ని బలపరచడం విశేషం.

అభిషేకానికే కాదు, అభిషేకస్మరణకు అత్యంత ప్రాధాన్యముంది. తొండమాన్ ఒక చక్రవర్తి. శ్రీనివాససేవానిరతుడు. ఒకరోజు రాఘవుడనే విప్రుడు చక్రవర్తి దగ్గరికి వచ్చి తాను క్షేత్రదర్శనానికి వెళుతున్నానని, అంతవరకు తన భార్యను, కుమారుని కాపాడవలసిందిగా కోరాడు. చక్రవర్తి సరేనన్నాడు. వారిని ఒక ఇంటిలో ఉంచాడు. వారికి ఆరునెలలకాలం అవసరమయిన సామగ్రిని సమకూర్చాడు. అయితే పనుల తొందరవల్ల ఆపై రాజు వారి రక్షణను విస్మరించాడు. వారు చనిపోయారు. ఈలోగా రాఘవుడు తీర్థయాత్రల నుండి రానే వచ్చాడు. భార్యా పుత్రుల గురించి విప్రుడు రాజును ప్రశ్నించాడు. రాజు

విస్తుపోయాడు. అయినా తమాయించుకొని 'స్వామీ! నాకుమార్తె తిరుమలేశుని శుక్రవార అభిషేక దర్శనార్థం వెళ్ళింది. వారితో మీ భార్య, కుమారుడు కూడా వెళ్ళారు. వారు క్షేమంగా వస్తారని భరోసా ఇచ్చాడు. తొండమానుకు భయమేసింది. ఆడినమాట నిలుపుకోవడాని కోసం చక్రవర్తి రహస్యమార్గంలో తిరుమల చేరుకొన్నాడు. స్వామిని ప్రార్థించాడు. స్వామి కరుణించాడు. భార్యాసుతులు బతికారు. ఆపై వారిని విప్రరాఘవునికి అర్పించాడని ఐతిహ్యం. శుక్రవార అభిషేకస్మరణ తొండమాన్ చక్రవర్తిని కాపాడింది.

## తి.తి.దే. శాసనాలలో శుక్రవార అభిషేక ప్రశంసలు

మూలవరులకు నియతంగా శుక్రవారాభిషేకం కట్టడి క్రీ.శ. 1517 నుండి ఏర్పడిందని పలువురు చరిత్రకారుల అభిప్రాయం. ఈ క్రీ.శ.1517 (2-1-1517) శాసనంలో శ్రీకృష్ణదేవరాయలు తిరుమలకు విచ్చేసి దేవునికి 'యెనిమిది దినాల వరిశ పుళుగు కాపుకు తిరుపతి గొడగనార్టి సుంకంగ 1000 ఇంతవట్టున్ను' సమర్పించాడు. క్రీ.శ.1532 (27-3-1532)లో తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారు రెండుగ్రామాలు సమర్పిస్తూ అనేక కైంకర్యాలకు నియమనం చేస్తూ 52 పన్నీటి చెంబులతో 'పుళుగు కాప్పు ముర్రై'కు, కట్టడి చేశారు. ఆ సందర్భంలో ఒకపన్నీటి చెంబు దాతకు దక్కేటట్లు నియమనం సూచించారు. ఆలాగే 23-8-1534 నాటి భండారం సిరుతమ్మ రాయలు సంవత్సరంలోని అన్ని శుక్రవారాభిషేకాలకు (తిరువెంగడ ముడైయాన్ పుళుగుకాప్పు ముఱై శుక్కిరవారత్తునాళ్ అముదు సెయ్‌దరుళం) తగిన వ్యవస్థ కల్పించాడు. తారీఖు తెలియని తిరునిన్రఊర్ ఉడయాన్ శాసనంలో శుక్రవారం స్వామికి (తిరుముగత్తుక్కు కర్పూరత్తూకం నడక్కక్కడవ దానవుం) కప్పురక్కాప్పు అలంకరణకు నియమనం చేసినట్లు (4-525) తెలుస్తున్నది.



అభిషేకసమయంలో తాళ్ళపాకవారు దగ్గరుండి నలుగు పాటలు అభిషేకపు పాటలు పాడడం నిర్వహిస్తూ, అభిషేకానంతరం పాడే వారికి తాంబూల చందనాదులనిచ్చి సత్కరించేలా నియమనం చేశారు. ఈ కట్టడికి క్రీ.శ.1532, 1534 శాసనాలు (4-14 టి.టి 5-153) ప్రమాణం. ఇవేగాక క్రీ.శ.1561లో రాయసం సోదరులు 'పునుగు కాప్పులకు' ప్రత్యేక వ్యవస్థ చేసినట్లు స్పష్టమవుతుంది.

## తాళ్లపాక పదకవుల సంకీర్తనలలో 'శుక్రవార' ప్రశస్తి

తిరుమలలో శ్రీవారికి శుక్రవారాభిషేకం ప్రాచీనకాలంలో ఎలా జరిగేదో తెలుసుకోవడానికి తగిన ఆధారాలు లేవు. అయినా శ్రీనివాస పదసేవారాధ్యులయిన తాళ్ళపాక కవులు తమ సంకీర్తనలలో అభిషేకవర్ణనలు చేశారు. ఆ వర్ణనల బట్టి ఆ పదకవులు స్వామి సన్నిధిలోనే వుండి అభిషేకందర్శిస్తూ పాటలు పాడినట్టు అర్థమవుతోంది.

చూడరమ్మ యిదె నేఁడు సుక్కరారము
వేడుక చక్కదనాలు వేవేలైనాఁడు (17.498)

చూడఁజూడ నింతలోనే సుక్కరారము నేఁడు
ఆడనీడ విభవాలే అమరె దేవునికి (17.526)

చొక్కపు నీ పెండ్లి నేఁడె సుక్కరారము
అక్కరతో నిన్నియు నవధరించవయ్యా (18.557)

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని - శేషాచార్యుల వ్రాతప్రతి

నేఁడె సుక్కురారము నెలఁతలాల
పోఁడిమి సేవ సేయరే పుణుఁగు కాపు (8-153)

## సంకీర్తనలలో శుక్రవారాభిషేకం

తాళ్లపాకవారి కాలంనాటికి శుక్రవారం వేళ స్వామికి ఆపాదమస్తకం పునుగు తైలంపూసి, కుంకుమపూవు మొదలగువాని అనుకుతో నలుగుపెట్టి, పన్నీటితోను ఆపై శుద్ధోదకంతోను జలకమార్చి తుడిచి, తడి ఆరగా కర్పూరధూళి చల్లి మేదించి, అదికూడా ఆరగా పునుగుతైలం రాచి, ముత్యాల తిరునామం, మంగతాళి మొదలయిన దివ్యాభరణాలతో, వస్త్రాలతో పుష్పహారాలతో అలంకరించేవారిని కీర్తనలబట్టి తాళ్ళపాక కవుల ఇతర రచనలబట్టి విశదమవుతున్నది.

ఎ) సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణము గట్టి – శేషాచార్యుల వ్రాతప్రతి
నిండు సింగారముతోడ నిలువు గోణము గట్టి (23.376)

బి) దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను చేవ మీర నించి (17.527)
తట్టు పుణుఁగా మీఁద దట్టముగ నించుకొని తెట్టలై (17.532)
పొరి మెఱుఁగుఁ జెక్కులఁబూసిన తట్టుపుణుఁగు
కరగి యిరుదెసలఁ గారఁగాను (17.485)

సి) పటకంపుఁ గాఁగుల పరిమళాలెల్లా
ఘటియించి కుంకుమతో ఁగడు మేదించి (5.256)

డి) తతిగొని పన్నీటి ధారలు పైపై నించి నించి
సతముగాఁ బెద్దలు మజ్జన మార్చఁగా (17.529)
అంచలఁ బన్నీటి బిందె లందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా (17.530)
బంగారు మేడలలోనఁ బన్నీట మజ్జన మాడి
అంగము తడి యొత్తగా నదే దేవుఁడు (3.125)



ఇ) కప్పురపు ధూళి మేనఁ గలయ నలది నప్పు
డప్పుడే పో బలభద్రుడని యందురు (17.486)
పటికపు గిన్నెలను పచ్చకప్పురము దెచ్చి
ఘటనఁ జాఁతేరు శ్రీ కాంతునికి (17.488)
ఘనశంఖపాణి గాన కప్పురకాపువేళ
తన మేను నిధానమై తగి యున్నాఁడు (17.491)

డి) చెలఁగి పుళుగు కాపు శ్రీవేంకశుఁడు పూసి
పలురత్నాల సొమ్ములఁ బరగీని (17.452)
అంచఁ దట్టు పుణుఁగు పూసెలమేలు మంగ నెద
నుంచుకొంటేనే మెత్తురు యోగీంద్రు లెల్లా (17.496)
తట్టుపుణుఁగలఁదుక తాళిగా నలమేల్మంగ గట్టుకొంటి (17.497)

ఇ) తెలిమించు నాణిముత్తియపు నామంబు–పరమయోగివిలాసమ

ఎఫ్)వొక్కట నలమేలుమంగ నురమునఁ గట్టిరిదె (17.531)
తనిసి యలమేల్మంగఁ దాళిగాఁ గట్టుకొనె (17.532)
లక్ష్మి యలమేలుమంగే లలి నీ తాళి (17.494)
తాళిగా నలమేల్మంగ గట్టుకొంటి (17.427)

జి) పెక్కు నవరత్నములు పెద్దరాసి వోసినట్టు
యెక్కువ దండలు గట్టిరి మూరితికి (17.531)
అలమేలు మంగతోడ నట్టె సొమ్ము ధరించగ (4.177)
మించిన సొమ్ములతోన మిన్నుముట్టినవేళ (17.486)

తాళ్ళపాకవారి కాలంలో స్వామికి దేహమంతటా పునుగు పట్టడం వర్ణితం. పైగా ఆ తైలాన్ని నిప్పుపట్టి కరిగించి వెండిపళ్యాలలో నించి మేను నిండా పట్టించి దిద్దేవారిని

తట్టుపునుఁగె కూర్చి చట్టలు చరిచి నిప్పు
పట్టి కఱఁగించి వెండిపళ్యాల నించి
దట్టముగ మేని నిండ పట్టించి దిద్దు

అనే సంకీర్తన పాదాలబట్టి స్పష్టమవుతున్నది. అయితే సంప్రదాయవాదులయిన శ్రీవీరరాఘవాచార్యులవారు.

The application of the scented oil over the entire body of the Murti is of recent origin. It may be pointed out here that the whole body was not anointed nor was the application made all round the year. The current practice is to apply the civet oil daily to the feet and not to the face. When the application of civet oil for the whole body commenced we can not say. Jx History of Tirupati (Vol. 1-329-331) లో వ్రాశారు.

తాళ్లపాకవారి అభిషేక సంకీర్తనలలో రకరకాలయిన కప్పురక్కాప్పు, పునుగుక్కాప్పు, పన్నీరుకాప్పు, కుంకుమక్కాప్పు, తిరువందిక్కాప్పు, చందనక్కాప్పు లాంటివే కాకుండా ఇతరాంశాలు కూడా ఉన్నాయి. వాటిలో ఆకాశగంగాజలాభిషేకం (17.494) పురుషసూక్త పఠనం (17.503) పలువేద ఘోషములు (17.488) పంచమహావాద్యాలు (17.532) హారతి పట్టడం (17.506) లాంటివి చెప్పుకోదగ్గవి.

## ప్రస్తుతం తిరుమలలో శుక్రవారాభిషేక విధానం

ప్రస్తుతం ప్రతిశుక్రవారం బ్రాహ్మీ ముహూర్తం 3.30 – 5.00 గంటల మధ్య శుక్ర వారాభిషేకం జరుపబడుతున్నది. ఈ సేవ ప్రస్తుతం ఆర్జిత సేవ. అంటే భక్తాదులు నిర్దిష్టరుసుము చెల్లించి పాల్గొనేసేవ. ఈ సేవలో పూరా అభిషేకం, గంబూరా గిన్నె, సివెట్ గిన్నె, జాఫ్రా గిన్నె,



మస్క్ గిన్నె లాంటివి ఉన్నాయి. ఈ పరిమళ ద్రవ్యాలతో భక్తులు విమాన ప్రదక్షిణ పూర్వకంగా లోనికి ప్రవేశిస్తారు. బంగారు వాకిలిదగ్గర అర్చకులు వీటిని స్వీకరిస్తారు.

మూలవరులకు జరిగే అభిషేకంలో నాలుగు దశలున్నాయి. ఆకాశగంగ నుండి తెచ్చిన తీర్థజలంతో అభిషేకం మొదలవుతుంది. ఈ అభిషేకానికి బంగారు తాపడం గల శంఖాన్ని వాడతారు. శుద్ధోదకం తరువాత క్షీరాభిషేకం. ఆపై మరల జలాభిషేకం జరుగుతుంది. పురుషసూక్తంతో ఈ కార్యక్రమం మొదలవుతుంది. అభిషేక సమయంలో పంచసూక్తాలు, పంచోపనిషత్తులు శ్రావ్యంగా వేదపండితులు గానం చేస్తారు. ఇదే మొదటిదశ.

ఇక రెండవదశ పులికాప్పు. చందన, జవ్వాది కర్పూరం, కుంకుమ మిశ్రిత ద్రవ్యాలను మూలమూర్తికి అలదడం. ఆపై శుద్ధోదక అభిషేకం. చందన కర్పూర కుంకుమ జవ్వాదిమిశ్రిత జలాన్ని తిరుమంజన తీర్థమంటారు. ఈ తీర్థాన్ని వెండిపాత్రలలో సేకరిస్తారు.

ప్రస్తుతం స్వామినామపు కర్పూర చూర్ణాన్ని తిలకం కస్తూరిని పునుగు తైలం కలిపి శ్రీపాదరేణువుగా ప్రసాదిస్తున్నారు. ఆలాగే అభిషేకపు సుగంధి తీర్థాన్ని పాదతీర్థంగా ప్రసాదిస్తున్నారు. అయితే అన్నమయ్య వంశీకుడయిన రేవణూరి వేంకటాచార్యుని కాలంలో స్వామి మేనెల్ల మేదించిన, మేదించడంలో శ్రీపాదాల పడిన కర్పూరధూళితోడి పునుగు తైలాన్ని దానితో మిళితమయిన పాదతీర్థానికి శ్రీపాదరేణువని ప్రసిద్ధి.

అభిషేకంలో మూడవదశ 'తాయార్ తిరుమంజనం' ద్విభుజ వక్షస్థల లక్ష్మికి కస్తూరి హరిద్రాకుంకుమలతో శ్రీసూక్తంతో అభిషేకం. ఆపై తడియొత్తి 'ఉల్‌శాత్తు' (24 మూరల సరిగంచు ధోవతి 12 మూరల ఉత్తరీయ వస్త్రం) సమర్పిస్తారు. సభా అరై (విమానప్రాకార ప్రదక్షిణంలో

శ్రీవారి వస్త్రాలను భద్రపరచే గది నుండి) తెచ్చిన నూత్నవస్త్రం తలకు చుట్టి కిరీటంతో అలంకరిస్తారు. క్రమంగా ఇతర ఆభరణాలను అలంకరింపజేసి తరువాత తెర తీస్తారు. ఈ మధ్యకాలంలోనే నాలాయిరంలోని నీరాట్టం పాశురాల గానం ఉంటుంది. ఈ దివ్యప్రబంధ గానం గురించి డా॥ ఎం.ఎస్. రమేష్‌గారు.

It is true that a number of pasurams from the Nalayira Divya Prabhandha are recited near the garbhagrha during the daily sevas. But a careful observance of the position makes it clear that the recitation is more in nature of a gap filler.

This provides the necessary religious background and atmosphere to the Arjitasevadars who have to wait till the curtain is drawn and they again have the darsan of the Deity అని యథార్థ కథనాన్ని రమ్యంగా చెప్పారు.

అభిషేకంలో నాల్గవదశ ఊర్ధ్వపుండ్రధారణ. దీనినే తమిళంలో 'తిరుమణిక్కాప్పు' అంటారు. ఈ నామం కన్నులనిండా నొసటిభాగాన అలంకరిస్తారు. శుక్రవారం తీర్చిదిద్దిన నామాలు గురువారం నాడు మాత్రమే సడలించబడతాయి. గురువారం నాడు నామాన్ని బాగా తగ్గించడం వల్ల స్వామి నేత్రాలు స్పష్టంగా కనబడతాయి. దీనినే నేత్రదర్శనం అంటారు.

**అభిషేకంలో పరిమళ ద్రవ్యాలు - ఊర్ధ్వపుండ్రాల ద్రవ్యాలు**

ప్రతి శుక్రవారం జరిగే అభిషేకసమయంలో స్వామివారి మూల మూర్తికి 84 తులాల పచ్చకర్పూరం, 36 తులాల కుంకుమ పువ్వు, 1 తులం కస్తూరి, 1.5 తులం పునుగుతైలం 24 తులాల పసుపుపొడి ద్రవ్యాలు వాడుతున్నారు.



ప్రతి శుక్రవారం అభిషేకానంతరం తీర్చే ఊర్ధ్వపుండ్రాలకు గాను 16 తులాల పచ్చకప్పురం, 1/12 తులాల కస్తూరి వినియోగిస్తారు. బ్రహ్మోత్సవాలలో మాత్రం తేడా ఉంది. ఈ ఉత్సవాలకు ముందు వచ్చే శుక్రవారంనాడు, బ్రహ్మోత్సవ సందర్భాలలో వచ్చే శుక్రవారం, బ్రహ్మోత్సవాల ముగింపు తర్వాత వచ్చే శుక్రవారం నాడు ఊర్ధ్వపుండ్రం తీర్చడానికి ప్రత్యేక దిట్టం వుంది. బ్రహ్మోత్సవ సమయంలోని మూడు లేదా నాలుగు శుక్ర వారాలను రెట్టశుక్రవారాలని, రెట్టింపు శుక్రవారాలని తమిళులు ప్రత్యేకంగా గుర్తిస్తారు. తమిళంలో ఇరట్టై అంటే రెండు లేదా జత అని అర్థాలు.

**అభిషేక సంకీర్తనల వైవిధ్యం - దశావతార ప్రసక్తి**

అభిషేక రూపమయిన సంకీర్తనలలో దశావతారములను అనుసంధానించి చెప్పడం తాళ్లపాకవారి ప్రత్యేకత. శ్రీవేంకటేశ్వరుడు అర్చామూర్తి అయినా ఆతడే విష్ణువని నిరూపించడం ఒక ప్రయోజనమయితే సుజనరక్షణ, దుష్టజనశిక్షణాది శక్తులు స్వామికి కలవని నిరూపించడం మరో ప్రయోజనం. దశావతారాలను పూర్తిగా అనుసంధానించి తాళ్లపాక పదకవులు పాడిన కీర్తనలు రెండు.

ఎ) శ్రీ వేంకటేశ్వరునికి చెలి యలమేలుమంగ
వోవరిగా నెలకొని పురముపై నున్నది

పొంచి మచ్చమైన నాఁటి పొలుసుకంపులు వాయ
సంచులఁ బన్నీట మజ్జన మార్పరే
అంచెఁ గూర్మవరాహము లైనట్టి సొగటు తీర
మించఁ గర్పూర ధూళి మెత్తరే మేనను

నరసింహపు గదరు నాఁటి వామనపు జిడ్డు
పరశురాముని గబ్బు పచ్చినీడను
పరిమళము గట్టిన బంగారు గిన్నెఁ దెచ్చి
పొరిఁ దిరుమేనఁ దట్టుపునుఁగిట్టె నించరే

గొల్లముంజు రాచబిడ్డ కోరి బుద్ధుడైన సిగ్గు
చొల్లు గుఱ్ఱపు నూఁగు రొచ్చులు మానునా
ఇల్లిదె శ్రీవేంకటేశుఁడీ రూపై తానున్నవాఁడు
యెల్ల పూలదండలు సొమ్ము లెక్కించరే (7-198)

బి) పదియుఁ బదియుఁ గాను పరమాత్ముఁడితనికి
వెదకి చవులు దెచ్చి విందు లిట్టే సేయరే

పొలుసు పైఁ బారెనట బురద మేలంటెనట
యిల మన్ను మోచెనట యీ దేవుడు
నెలవైన రాకాసి నెత్తుటఁ దోఁగినాఁడట
కల పన్నీ రెల్లఁ బోసి కడుగరే దేహము

బాపన జిడ్డంటెనట పట్టెనట ముమ్మరము
కైపగు నల్లని కోక గట్టినాఁడట
చాపలానఁ జెంచుదాని సంగడిఁ దిరిగెనట
కోపులఁ గప్పురధూళి గుప్పరే యీతనికి

కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతలఁ దట్టుపుణుఁగు పూయరే నేఁడు
యింతట శ్రీవేంకటేశు నెద నలమేలుమంగఁ
గాంతునికి మెడగుచ్చి కట్టరే మొక్కుదము (19.335)

తొలిపాట, మొదటిచరణంలో మత్స్య, కూర్మ, వరాహావతారాలు రెండవ చరణంలో నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ



అవతారాలు, మూడవ చరణంలో శ్రీకృష్ణబలరామ కల్కి అవతారాలు చెప్పబడ్డాయి. ఈ పాటలో జంతువుల సహజస్థితులు, ఆయాజాతుల లక్షణాలు చాలచక్కగా సమన్వయింపబడ్డాయి. కంపు, సొగటు, గదరు, జిడ్డు, గబ్బు, ముంజు, సిగ్గు, చొల్లులు పోవడానకి పన్నీరు, కర్పూర, పునుగు, పూలదండలు అవసరమవడం రమ్యంగా ఉంది. కారణం స్వామి అమ్మవారితో ఉన్నాడట.

రెండవ పాటలో కూడా దశావతారాల వర్ణన ఉంది. ప్రతిచరణం మొదటిపాదంలో రెండు అవతారాల వర్ణనలున్నాయి. కాకపోతే 'విందుల కోసం' ఆహ్వానించడం ప్రత్యేకత. విందులకు వెళ్ళేవారు శుభ్రంగా తానమాడడం. పరిమళ ద్రవ్యం పూసుకోవడం, అందమయిన దుస్తులు ధరించడం సహజం. స్వామికి అలమేలుమంగతో అనుబంధం పెనగొన్న వేళ విందులు పెట్టడం సహజంగా ఉంది.

## అభిషేక సంకీర్తనలు - రామకృష్ణావతారాల ప్రశంసలు

తాళ్లపాక పదకవులు తమ అభిషేక సంకీర్తనలలో అక్కడక్కడ రామకృష్ణావతారాలనే వాచ్యం చేస్తూ వర్ణించారు. తిరుమల స్వామి వెంకటరాముడు, వెంకటకృష్ణుడు కూడా అనే భావం కావచ్చు.

కప్పురపు ధూళి మేనఁగలయ నలఁది నప్పు
డప్పుఁడే పో బలభద్రుడని యందురు
కుప్పలైన తట్టుపుణుఁగునఁ దొప్పఁ దోగినంటా
తప్పటి చెలులే క్రిష్ణుఁడని యందురు (17.486)

బలభద్రుడు తెల్లని మేనికాంతులవాఁడు. కృష్ణుడు నల్లనివాఁడు. శ్రీ వేంకటేశ్వరునిపై కర్పూరపు ధూళి పడినవేళ బలరాముడని, నల్లని పుణుగు మెత్తినవేళ కృష్ణుడని భక్తులు భావిస్తారట. 'రామభద్రలాగే

బలభద్ర శబ్దం కూడా ప్రసిద్ధమే. బలభద్రునికే బలరాముడని కూడా పేరు.

శ్రీవైష్ణవులకు శ్రీమద్రామాయణం పారాయణ గ్రంథం. శరణాగత రక్షణకు శ్రీరాముడే ఆదర్శమూర్తి. తిరుమల గర్భాలయంలోని శ్రీసీతారామ లక్ష్మణుల పంచలోహమూర్తులు ఇటీవల తీర్థమిచ్చే చోట మార్చబడ్డాయి. సాధారణంగా రాజ్య పట్టాభిషేకం వేళ పన్నీటి స్నానం నియతం. ఆ తరువాత పూలవృష్టి. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకొని

అదరి రామునికిఁ బట్టాభిషేకమైనట్టు
కడలేని పన్నీటి కాపమరెను
పొడవై యందె సురలు పుష్పవృష్టి నించినట్టు
కడుఁగడుఁ గర్పూర కాపమరెను (17.501)

అని వర్ణించారు తాళ్లపాక పదకవులు.

### అభిషేక సంకీర్తనలు - పంచవ్యూహాలు

విశిష్టాద్వైత సంప్రదాయం ప్రకారం పరమాత్మని కరుణా స్వరూపమే పరా, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చారూపములుగా ఐదువిధాలు. పరమపదంలోని పరంజ్యోతి స్వరూపం 'పరా' అని చెప్పబడుతుంది. ఆ లాగే వైకుంఠవాసుడయిన వాసుదేవుడు జీవులకోసం వ్యూహ వాసుదేవు డయినట్లుగా, సృష్టికార్యంకోసం నీలమేఘశ్యాముడైన నారాయణుడుగా కూడా అవుతాడని ఆగమాలు ఘోషిస్తున్నాయి. ఈ నేపథ్యంతో తాళ్లపాక పదకవులు అభిషేకసంకీర్తనలను కొన్నిటిని రచించారనడం సుస్పష్టం.

అదనఁ గప్పుర కాపు అవధరించేవేళ
అదివో నారాయణత్వ మమరె నీకు



నిదుల నేకోదకము నీ రూపమే కనక
పొదలుచు నిది వల్లఁ బుట్టె నీ జగము 17.495

నారము అంటే నీరు. నీరే నివాసముగా కలవాడు నారాయణుడు. ఇక్కడ చిలుకబడునది పన్నీరు. ఇది నీరే. పన్ + నీరు. పన్నీరు. అనేక నదుల నీరన్నమాట. నదులకు సముద్రమే శరణ్యం. అందువల్ల పన్నీటికాపు సహజ లక్షణమయింది. సమస్త నదులు సంద్రంలో కలిసిపోయి ఏకోదకమవుతుంది. సర్వజీవుల తుది మజిలీ అదే. ఇలాంటిదే మరొకటి–

మిక్కిలి కప్రకాపా మీఁద నిండాఁ జాఁతఁగాను
చక్క నాల్గుచేతులతో సర్వేశ్వరుఁడు
తక్కక శుక్లాంబరధరుఁడైన విష్ణుఁడే
పక్కనఁ దానని చెప్పి ప్రత్యక్షమై వుండెను (17.500)

### అభిషేక సంకీర్తనలు - ఋతువులు

స్వామి కాలపురుషుడు. కాలాతీతుడు. కాలనియంత. కాలస్వరూపుడు. కాలమంటే ఋతువనే అర్థముంది. ఋతువులు ఆరు. తాళ్లపాక పదకవులు. అభిషేక వర్ణనలలో హేమంత, వర్ష, వసంత ఋతువులను జతచేశారు.

హేమంత కాలము నేఁడు యిటు నీ తిరుమేన
ఆముకొని జనియించినట్లుండెను
భూమి గల కప్పురము పొడిసేసి నిలువెల్లా
నేమముతో నిందరును నీకుఁ జాతఁ గాను
వానకాలము నీలవర్ణముతోఁ దిరుమేన
సోనయై కురిసినట్టు చూపట్టెను

సేనగా దట్టుపుణుఁగు చిత్తడిగా సర్వాంగాలు
పూని యిందరును నీకుఁ బూయఁగాను

వసంతకాలము తానె వచ్చి నీ తిరుమేన
యెసఁగినట్టు శ్రీవేంకటేశ తోఁచెను
వెస నలమేల్మంగతో వింత సొమ్ము నీ వురాన
పొసగిం చందరు నిన్నందరు బొగడఁగాను 23.142

హేమంతకాలంలో మంచు కురుస్తుంది. మంచు తెల్లనిది. మంచు బాగా కప్పడంలో వస్తురూప పరిజ్ఞానంలో తడబాటు తప్పదు. ఆలాగే స్వామికి మంచులాంటి తెల్లని కప్పురధూళి కప్పినారట. భూమిగల కప్పురమంతా వాడినారట. నల్లటి పునుగు అలదినవేళ వానకాల భ్రాంతి కలిగింది. అలమేలు మంగతో వింతసొమ్ములు ధరించినవేళ వసంతం వచ్చినట్ల యిందట. ఇలాగే కర్పూరధూళిని శరత్కాలంగా చెప్పారు (17-489).

## అభిషేక సంకీర్తనలు - మధురభక్తి

భక్తి విభేదాలలో మధురభక్తి ఒకటి. ఈ భక్తి శ్రీవైష్ణవంలో నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ల పాశురాలలో కొత్త పంథా తొక్కింది. భగవంతుడొకడే పురుషోత్తముఁడు. ఇతరులందరు స్త్రీప్రాయులు. ఈ భావన కాశ్మీరశైవంలో కూడా ఉంది. త్యాగరాజాదుల రచనలలోను "పంకజ నయన! నా కుంకుమ నీవె" లాంటి పాదాలలోను కనిపిస్తుంది. తాళ్లపాక పదకవులు శృంగార సంకీర్తనలనే పేరుతో ఈ మధురభక్తిని వటవృక్షము చేసినారు. ఈ మధుర భక్తిలో కవి నాయిక పక్షం వహించడం ఒకతీరు.

చిక్కని సింగారరాయ శ్రీవేంకటేశ నీకు
అక్కన నున్న తరుణి యన్నియును గాదా



యింతి చూపు వెన్నెలలు యిటు నీపైఁ బోసితేనే
కాంతి నీ కదే కప్పుర కాపు కాదా
పంతాన గిన్నెల తోడి పచ్చకప్పురపు ధూళి
యింతయు నీమై నలదే నిది గొంతవలెనా (17.533)

చూపులను వెన్నెలతో పోల్చడం కవిసమయం. వెన్నెల తెల్లనిది. హాయి కూర్చేది. చల్లనిది. కప్పురకాపు అంతే. ఇది పై కావు. అలుమేలు మంగ లో కాపు. అందువలన ఈ కాపు లెందుకయ్యా అని ప్రశ్న. ఇలాంటిదే 'చొక్కపు నీ పెండ్లి నేఁడె సుక్కురారము' (18.557). ఈ పాటలో పదతి చెమటలే పన్నీటి జలకమయితే, ముద్దుమాటలు వేదమంత్రాలయితే, పయ్యెద కొంగు తడియొత్తయితే, నవ్వు కప్పురకాపయితే, కనుచూపు తట్టుపునుగయితే, వూర్పులు చల్లగాలయితే, కౌగిలి అంటుతామెరల పూజలయితే ఇంకేమి కావలె అన్నాడు పదకర్త.

## అభిషేక సంకీర్తనలు - పౌరాణిక ప్రసంగాలు

అనేక పౌరాణిక వృత్తాంతాలను అభిషేక సంకీర్తనలలో జత చేయడం తాళ్లపాక పదకవుల విధానాలలో ఒకటి. స్వామికి పునుఁగు కాపు పెట్టడం ఒక నియమం. ఈ పునుఁగు నల్లనిది. వాసనతో కూడింది. పునుఁగు కాపు చాతిన స్వామి పదకవులకు

శిసువులఁ దెచ్చునాఁడు చీఁకటి యంటెనో కాని
మసలక కరిఁగాచే మదమంటెనో (17.526)

గా కనిపించడం విశేషం. రామకృష్ణులు సాందీపని దగ్గర విద్యలు నేర్చారు. గురుదక్షిణగా మరణించిన గురుపుత్రుని కోసం కదిలారు. సముద్రుడు చెప్పిన ఆచూకితో యమపురికి కదిలారు. యముడు వచ్చినవారు లీలా మనుష్యులయిన విష్ణుమూర్తులని గ్రహించాడు. 'ఏమిసేయుదు ఆనతిమ్మని' యముడు ప్రార్థించాడు. అంత కృష్ణుడు

"చెప్పెద మా గురునందనుఁ
దప్పు గలుఁగఁ జూచి నీవు దండనమునకున్
దెప్పించినాఁడ వాతని
నొప్పింపుము మాకు వలయు నుత్తమ చరితా
(భాగ. 10-1424)

అని ప్రార్థించాడు. అపుడా యముండు 'వీఁడె వీనిం గొని పొండని భక్తితోడ గురునందను నిచ్చినాడట (10-1425). నాచన సోమన ఉత్తర హరివంశంలో కూడా స్వామి 'బ్రాహ్మణ శిశువులను అప్పగించిన వృత్తాంతమున్నది. విప్రకుమారులను తేవడానికి కృష్ణార్జునులు బయలుదేరారు. సముద్రం అడ్డువచ్చింది. అపుడు కృష్ణుడు రథగమనానికి అనువుగా 'శిలాసదృశ మార్గము' సిద్ధం చేయమని ఆదేశించాడు. సముద్రుడు ఆలాగే చేశాడు. కృష్ణార్జునులు ఉత్తరసాగరం దాటారు. ఆపై గంధమాదనం చేరారు. ఆ తరువాత బురద మయ ప్రదేశం చేరుకొన్నారు. అక్కడ రథం కదలలేదు. ఆ ప్రదేశమంతా 'చీకటి కొండ' (ఉత్తరహరివంశం 2.49) అయిందట. అంత కృష్ణుడు చక్రం ప్రయోగించాడు. ఒక పురుషుడు ప్రత్యక్షమైనాడు. జనార్దనుడు ఆ తేజస్సులో ఉరికి కాసేపటికి మరణించిన 'ముప్వర సుతులతో' వచ్చాడు. వారిని బ్రాహ్మణుల కప్పగించాడట. ఈ వృత్తాంతాన్ని దృష్టిలో పెట్టుకొని 'చీకటి యంటెనో' అని తాళ్లపాక పదకవులు ఊహించారు.

ఆలాగే 'మసలక కరిఁగాచే మదమంటెనో' పాదాలలో గజేంద్రుని రక్షించడం చెప్పబడింది. చీకటి నలుపు. ఏనుగు నలుపు. ఈ నలుపులు స్వామికి అంటాయనడం ఉత్ప్రేక్ష. ఆలాగే పదకవులు

నొట్టి తన విష్ణుమాయ నొడలిపై వాలినట్టు.
తట్టుపుణుఁ గమరెను దైవాలరాయనికి (17.503)



అని వర్ణించారు. ఈ మాయకు లెక్కలేని ఉదాహరణాలను పౌరాణిక పరిజ్ఞానంతో జతచేయవచ్చు. అమృత మథనంలో మోహిని అవతారం రూపమాయ. తన గురించిన అంశాలను బలికి విశదీకరించేవేళ మాటలమాయ. యశోదకు తన నోట బ్రహ్మాండ భాండాలను చూపడంలో శిశుమాయ లాంటివి. మానవుల కున్న విస్మృతి కూడా మాయయే. తన అనుగ్రహం లేనిదే మానవుడు మాయా బంధననిర్ముక్తుడు కాడని కృష్ణుడే గీతలో స్వయంగా చెప్పాడు.

తాళ్లపాక పదకవులు స్వామికి జరిపే పన్నీటి అభిషేకాన్ని
గోవర్ధన గిరినెత్తిన గోవిందుని మీఁదటను
"వావిరిఁ గురిసే జడివానల" (17.502)

అని ఉపమించారు. ఈ పాటలోని పాదాలు శ్రీకృష్ణుడు దేవేంద్ర గర్వభంగంకోసం, గోగోపాలకుల సంరక్షణార్థం, గోవర్ధనగిరి ఎత్తిన వృత్తాంతాన్ని స్పష్టం చేస్తుంది. ఈ సందర్భంలో ఇంద్రుడు పుష్కలావర్త మేఘాలను విడిపించి "గోవుల్ జనుల్ సద్యోమృత్యువు పొంద రాల్గురి యుఁడీ" (పోతన భాగవతం 10-800) అని ఆనతిచ్చాడు. ఆ సందర్భంలో

"హరి దోర్దండము కామ గుబ్బ శిఖరం బాలంబిముక్తావళుల్
పరగన్ జాఱెడు తోయబిందువులు గోపాలాంగనా పాంగ హా
సరుచుల్ రత్నచయంబు గాఁగ నచలచ్ఛత్రంబు శోభిల్లెఁ ద
ద్గిరిభి ద్దుర్మదభంజియై జలధరాక్లిన్న ప్రజారంజియై" (10.92)

స్వామి వెలుగొందినాడు. ఇంద్రుడు కురిపించిన జడివాన గోగోపకుల పాలిట కృపారసవర్షం కావడమే విశేషం. పన్నీరు చిలికిన వేళ తుళ్ళింత సహజం, చలివేళ కూడా అంతే. ఈ అంశాన్ని పోతన" శరీరంబులు భారంబులయిన మ్రానువడు గోపకులను, గోపకులం

బట్టుక, దట్టంబయిన వానకొట్టునం బెట్టువడి బడుగు నడుములు నులుసువడ వడంకుచు, గోవిందునిం జీరు గోపికలను, గోపికా జన కఠినకుచ కలశ యుగళంబులు మఱుంగునం దలలు పెట్టుకొని పరవశులయిన శిశువులుం గలిగె (10.902) అని వర్ణించాడు. ఈ వృత్తాంతాన్నే పదకవులు 'పునఁగు కాపుకు' కూడా అనుసంధానించి

తివిరి గోవర్ధన మెత్తిననాఁడు నిండుకొని
ధ్రువమై మేఘకాంతులు తొలఁకినట్టుండెను (23.154)

అని వర్ణించారు. మరోచోట స్వామిలో బలరామావతారాన్ని ఆరోపిస్తూ

యమునా నది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానది నలుపు అంటిన యట్టుండె (3.166)

అని వర్ణించారు.

సూర్యుని కుమార్తె యమున. ఈమె నదీరూపంలో ప్రవహిస్తూ సాగేది. బలరాముడు బంధువుల్ని చూడడానికి వెళ్ళినపుడు గోపికలతో యమునలో తానమాడడానికి దిగాడు. యమునను రమ్మన్నాడు. యమున రాలేదు. 'నీవు రాకపోతే నిన్ను చీలుస్తా'నని బలరాముడు హలం పట్టాడు. ఆమె భయపడి స్త్రీరూపంలో ప్రత్యక్షమై వినీలాది రత్నం ప్రసాదించింది. హలాన్ని 'దివుటడం' వల్ల యమున నలుపు పోయింది. తెల్లగా మారిపోయింది. యమున నలుపంతా స్వామివారికి అంటుకొన్నదని విశేషార్థం.

## అభిషేక సంకీర్తనలు– అధిక్షేపం

భక్తి సాహిత్యంలో 'అధిక్షేపం' ఒక వింత ప్రక్రియ. ఈ అధిక్షేపంలో అత్యంత స్నేహం, అరమరికలేని అనురాగం, ఎదుటి వాడు ఏమీ అనుకోడులే అనే నిబ్బరం, విశ్వాసం అన్నీ వుంటాయి. కొన్ని



సందర్భాలలో 'అతిపరిచయాదవజ్ఞా' లాగా హద్దుదాటడం మాటల్లో వ్యక్తం కావచ్చు. పదకవులు ఈ అధిక్షేపాన్ని కూడా అభిషేకవర్ణనలలో వాడుకొన్నారు.

నించిన తట్టుపుణుఁగు నీ వెంత పూసినాను
ముంచిన రేపల్లె గొల్లముంజు వొయ్యీనా (17.487)

కులికి కులికి యెంత కుంకుమ నీ వలఁదిన
యెలమి నలుపే కాక యెఱ్ఱనయ్యీనా (17.487)

చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టె రాత్రులు మేన నంటినట్లుండెను (4.177)

పన్నీట మజ్జనమాడి పైపై తడిసూళ్ళొత్తి
వున్నతి నీవు నిలుచుండఁగాఁ జూచి
మున్నే నీ వెవ్వతెనో ముట్టుదానిఁ బొంది వచ్చి
విన్నాణాలు చూపేవంటా వేరొకతె నవ్వెను (17.491)

## అభిషేక సంకీర్తనలు –సంప్రదాయ కథనం

తమకాలం నాటి అభిషేక సంప్రదాయాలను వాచ్యంగా ఒకచోట, భంగ్యంతరంగా మరోచోట చెప్పడం తాళ్లపాక పదకవుల విధానం. స్వామి వక్షస్థలంలో అమ్మవారున్నారు. ఈ అంశం గురించి విశేషమయిన పరిశోధన గావించిన డా॥ ఎం.ఎస్. రమేశ్‌గారు (The Festivals and Rituals at Tirumala Temple - P.300).

The mulavigraha has Sridevi on the right breast. This placement exactly follows the rules given in the Bhrugu Samhita and Lakshmikalpa. According to these two authorities Lakshmi should be in the upper portion of the

right breast of the Lord and above the Srivatsa. It is said that Srivatsa represented the Mulaprakrti and Lakshmi its adhistana devata. The placement of both Srinivasa and Lakshmi in the Mulavigraha at Tirumala are therefore as prescribed in the Agamas"

అని అన్నారు. శ్రీవారి వక్షస్థలంలోని అమ్మవారికి జరిగే తిరుమంజనాన్ని "తాయార్ తిరుమంజనం" అనడం వైష్ణవ సంప్రదాయం. ఆళ్వార్లు 'అలర్మేల్ మంగై యురైమార్బా' అని ప్రశంసించారు. ఆ దృష్టితోనే తాళ్లపాక కవులు ప్రత్యేకించి అభిషేక సంకీర్తనలు అన్నిటా,i.e. కొన్నిచోట్ల పల్లవిలో, మరికొన్ని చోట్ల చివరి చరణాలలో, అలర్మేల్ మంగను నియతంగా కీర్తించారు.

పల్లవిలో – శ్రీవేంకటేశ్వరునికి చెలి యలుమేలుమంగ
వోవరిగా నెలకొని పురముపై నున్నది (7.198)

మూడవ చరణం ఆది పాదంలో
అలమేలుమంగ వురమందుండె యనురాగము (7.493)

మూడవచరణం రెండవ పాదంలో
యీవల నలమేల్మంగ నెదఁగట్టుక (17.489)

మూడవచరణం మూడవపాదంలో
మించి శ్రీవేంకటపతి మెడ నలుమేలుమంగ (19.569)

మూడవ చరణం నాల్గవపాదంలో మాత్రం 'అలమేలుమంగ' సమాసం లేదు. కారణం కీర్తన అంతం కావడం. స్వామి ప్రధానం. శంఖచక్రాదులు, పురుష కారిణి అమ్మ, స్వామిలో ఒకభాగమే. విడివిడిగా వున్నవన్నీ చివర ఏకం కావడం ఒక ధర్మం. శ్రీనివాస మూర్తి



ఏకరూపుడనడానికే చివరిపాదం 'ఐక్య' భావనతో పూర్తిచేయడం. ఇది తాళ్లపాక పదకవుల విధానం.

మూలవరుల అభిషేక సమయంలో లక్ష్మి అమ్మవారికి కస్తూరి మరియు హరిద్రాచూర్ణంతో శ్రీసూక్త పారాయణంతో అభిషేకం జరపడం ఆనవాయితి. ఆ సందర్భంలోనే స్వామివారి మెడలోని బంగారు హారానికి కూడా ప్రత్యేక అభిషేకం. దీనినే 'తాళి'గా పదకవులు ప్రస్తుతించారు.

అలరి శ్రీవేంకటేశుఁడలమేలుమంగ మెడ
తాళిగాఁ గట్టుక లోలో దక్కియున్నాఁ డీతఁడూ (17.490)

లక్ష్మీపతివి గాన లాగుల నీ వురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీ తాళి (17.494)

**అభిషేక సంకీర్తనలు – ఆలంకారిక కథనం**

తాళ్లపాక పదకవులు అభిషేక సంకీర్తనలలో 'అలంకారాలకు' కూడా ప్రాధాన్యమిచ్చారు. ఇవి పఠితల అవగాహనకు, భావవిస్తృతికి, సామాన్యులకు అందుబాటులో లేని దృశ్యాల సూక్ష్మ పరిశీలనకు, కవితారమ్యతకు దోహదం చేస్తాయి. వీటిలో ప్రధానమయినవి సహజాలంకారాలు. ఇలాంటివి స్వభావోక్తికి దగ్గరగా ఉంటాయి. మచ్చుకు – క్షీరాబ్ధి దృశ్యనేపథ్యాలుగా సాగిన కీర్తనలు.

క్షీరాబ్ధిలోపలి శ్రీవల్లభుని మీఁదట
చేరి సేసే అమృతాభిషేకము వలె (17.502)

అమృతము దచ్చేవేళ నట్టే మేనఁదుంపుర్లు
తమితోడ నిండుకొని దట్టమైనట్లుండె (17–527)

పచ్చ కప్పురము మేనఁ బలుమారు మెత్తఁగాను
తచ్చి పున్నమ చంద్రుఁడే తానై వున్నాడు (17.530)

పొంతల నమృతమే పోగై నట్టున్న వాఁడు (3.125)

పాలజలధిపై నీలిపట్టు నిండాఁ గప్పినట్టు
కాళిమతోడ పులుగు కాపమరెను (17.50)

నిండు నైరావతముపై నీలి జగ గప్పినట్టు (17.506)

నిండిఁ గల్పవృక్షము నిండాఁ బూచినట్టు (7.493)

ఇక రెండవది తిరుమల గిరులతో సంబంధాన్ని పెంచిన రీతిలో అభిషేక సంకీర్తనలు.

సైకపు నీలాద్రినుండి జలజల బారేటి
రేకల సెలయేరుల రీతి (2.50)

అంచలఁ దట్టు పుణుఁగు అవధరించేటి వేళ
యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను (3.165)

పొంచి నీలగిరి మీఁదఁ బొసఁగి బంగారుకొండ
అంచెలఁ గీలించినట్టి యందమో కాక (19.569)

తోరమైన పూదేనెలతోడి యంజనాచలము
కారు కమ్మినటువలెఁ గనుపట్టె నిపుడు (17.505)

గొప్ప యింద్ర నీలాల కొండ మంచు గప్పినట్టు (17.508)

కాంచనపు గనులతోఁ గలయ శేషాచలము
ముంచి శ్రీవేంకటేశ్వర మూర్తి యాయ ననుచు (17.496)

'ప్రకృతికిన్ భాష్యప్రణేతల్ కవుల్' తాళ్లపాక పదకవులు ప్రకృతి ప్రేమికులు. ప్రకృతి తత్త్వరహస్య కోవిదులు. ప్రకృతిలోని నిశ్చలత్వాన్ని, చలత్వాన్ని దర్శించినవారు. స్థావర జంగమాత్మక దృశ్యాల సరళులను



సూక్ష్మంగా పరిశీలించినవారు. ఈ నేపథ్యం అభిషేక సంకీర్తనలలో సుస్పష్టం.

అంచలఁ బన్నీటి బిందె లందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా
వంచి సముద్రము మీఁద వానలు కురిసినట్టు
పొంచి యన్నిటాను ఉప్పొంగుచు నున్నాఁడు (17.530)

తత్తరాన తెల్లమొయిలు తనుఁ బొదిగిన యట్టు
కొత్తగాఁ గప్పురపు కాపు కుప్పిరి దేవునికి (17.531)

మించిన హారములెల్ల మేన నించుకొన్నవేళ
మంచి మంచి నక్షత్రమండలమై యుండెను (3.165)

తాళ్లపాక పదకవులకు 'నీలమేఘోపమానం' చాల ఇష్టం.

నెప్పున కళ్ళతోడి నీలమేఘమై వున్నాడు (17.493)

మేకొని నీవే నిండు మేఘవర్ణుఁడవు గాన (17.494)

కసుగందని కాలమేఘము వలెను (17.498)

విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు (17.506)

నీలమేఘము వంటి యీ నీర జాక్షుపై (8.153)

తిరుమల పుష్పమంటపంగా ప్రసిద్ధి. తిరుమలలో పూలతోటలు నిలిపినవారు తిరుమలనంబి, అనంతాళ్వాన్‌లు. అంతేగాక తిరుమలలో 'పుష్పయాగానికి' చాలా ప్రసిద్ధివుంది. తిరుమలలో పూలు ముడువరాదని నియమం కూడా. తాళ్లపాకపదకవులు అభిషేకసంకీర్తనలలో 'పుష్పోపమానా లను' విరివిగా వాడారు. అలంకార ప్రియుడు కదా స్వామి!

వున్నతి నలమేల్మంగ నురమున నుంచువేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను (3.165)

దట్టముగ నుంచి తెల్లఁ దామెరపువ్వునకు
ముట్టి అవయవములు మొలచినట్టుండే (17.508)

అలమేలుమంగ కాఁగి లంటుదామెరలపూజ (18.557)

మించి యలమేలు మంగ మెడఁగట్టుకున్నవాఁడు
పొంచి బంగారు తామర పువ్వువలెను
అదన నల్లకలువలట్టె ముంచుకొన్నట్టు (7.493)

ఉపమల తరువాత పదకవుల అభిషేక సంకీర్తనలలో ఉత్ప్రేక్షలే ఎక్కువ. ఈ అలంకారాలలో ఊహకే ప్రాధాన్యం. మచ్చుకు-

వుడివోని కల్పభూజమొద్దికఁ గొమ్మలతోనే
పొడవెల్లాఁ దెల్లనై పూచెనో కాక
యెడలేక తిరుమేన నింతటా మెత్తి రిదివో
కడలేని హరికిని కప్పుర కాపు (19.569)

స్వామికి కల్పతరువుకు పోలిక. కల్పతరువులాగే స్వామి సర్వమూ ఇవ్వ గలవాడే. శరీరము తరువయితే చేతులు కొమ్మలు. కల్పతరువు స్వామి నీలవర్ణుడే. కప్పురము తెలుపు.కల్పవృక్షం పూలు తెలుపు. ఇవేకాక జవ్వనవనాలు (17.501) మేఘపుష్పాలు (17.494) చూపు వెన్నెలలు (17.533) లాంటి వాటిలో 'రూపకం' పోషితం.

పదకవులలో పండితకవులు, పామరకవులు, ఉభయకవులున్నారు. ఉభయ కవులలో కూడా సమాజానికి దగ్గరి వారు, సమాజానికి సుదూరం వారున్నారు. కాని తాళ్లపాక పదకవులు భాషలో, భావనలో, భక్తిమత ప్రచారంలో పామరులను మరచిపోలేదు. సామాన్యులు కూడా అర్థంచేసు



కొనేలా ఉపమలు వాడినారు. అభిషేక సంకీర్తనలలో కూడా ఈ నైజం కనిపిస్తుంది.

స్వామికి పన్నీటికాపు తరువాత కప్పురపు కాపు చాతడం సంప్రదాయం. ఈ భావాన్ని పదకవులు వర్ణించిన తీరు ఊహాతీతం.

ఘనశంఖపాణిఁ గాన కప్పురకాపువేళ
తన మేను నిధానమై తగియున్నాడు
మనసిజగరిడిలో మఱి సాము సేసివచ్చి
అనుఁగు పుప్పొడిఁ దోగి యట్టెయున్నాఁడీతఁడు (17.490)

మల్లురు గరిడిలో సాము సేయడం నైజం. ఆ సాము చలం కోసం, రక్షణకోసం, ఎదుటివానిని మట్టుపెట్టడం కోసం, పుష్టికోసం, తుష్టికోసం, రాయలంతటి వాడుకూడా సాము చేసేవాడట. రోజూ చేసే ఈ సాము 'మనసిజగరిడి' ఈ సాము శయనగృహంలో. సాములో విజయం సాధించిన వానిని పూలతో సత్కరించడం సహజం. ఆలాగే పూబోడితోడి సాములో పుండరీకాక్షునిదే విజయం. ఒళ్ళంతా 'పుప్పొడి' దీనికి సాక్ష్యం.

ఇలాగే ప్రజలందరికీ తెలిసిన, అనుభవంలోని అంశం విలువయిన వస్తువులను పెట్టెలో దాచడం. స్వామి సొమ్ములపెట్టె.

పెట్టిన సొమ్ముల తోడి పెట్టెవలె నున్నవాఁడు (17.493)

అంతేగాదు 'అమ్మ' కూడా సొమ్ములపెట్టె కావడం విశేషం.

తెలివి సొమ్ముల పెట్టె తెరచినట్టు
అలమేలుమంగ వురమున నెలకొనె నిదే (17.503)

అని వర్ణించడంలో ఔచిత్యముంది.

తాళ్లపాక పదకవులు సంగీత సాహిత్య విశారదులు. సాహిత్య సృష్టికి అవసరమయిన భావన వారికి కొండంత. అవగాహన సముద్రమంత. వ్యక్తీకరణ ఆకాశమంత. ఈ కవులు భావనావసరాన్ని సంకీర్తనలలో పదే పదే నొక్కి వక్కాణించారు

భావింప సకల సంపద రూపమదివో 1.23
పరమ యోగీంద్రులకు భావగోచరమైన 2.58
భావములోనా బాహ్యము నందును 3.561
భావింపగల తపఃఫల పుణ్యుఁడు 4.528
భావములు ఒక్కరూపైన భావతత్త్వము 10.17

పదకవుల అభిషేక సంకీర్తనలను నిశితంగా పరిశీలిస్తే స్వామిని ఉపమించిన వాటిలో కొన్ని పృథ్వీసంబంధాలు. మరికొన్ని అప్ సంబంధాలు. ఇంకాకొన్ని తేజస్సంబంధాలు. మరేవో కొన్ని ఆకాశ సంబంధితాలు కావడం విశేషం. ఇవన్నీ రూపభావనలు. పండ్లలో నేరేడు పండుగా, పువ్వులలో నల్లకలువలుగా, తేజములలో వెన్నెలమొలకగా, మబ్బులలో నల్ల, తెల్ల, కాల మేఘాలుగా వర్ణించడం సహజత్వానికి దగ్గరగా వుండే అంశాలు. పుణుగుకాపుతోడి స్వామిని చమరీమృగంతో (17.499) పోల్చడం అరుదైన ఒక అంశమే. అలాగే స్వామిని పంటల రాసులనడం తాళ్లపాక పదకవుల వ్యవసాయాను రక్తిని సుస్పష్టం చేస్తుంది.

కన్నెలు పదారు వేలు గలవాడవు మొదలు
చన్నుల పంట రాసులు సరిమోవఁగలవో (17.497)

## అభిషేక సంకీర్తనలు – రసస్ఫూర్తి

అభిషేక సంకీర్తనలలో రసోపమానాలు కూడా కనిపిస్తాయి. వీటిలో 'హాస్యస్ఫురణ' ప్రధానమయింది. మూలవిరాట్టు నల్లనివాడు.



ఆస్వామికి కప్పురకప్పువేళ తెల్లదనం వచ్చింది. కారణం తరుణుల తెల్లనవ్వులు. ఇదొక కవి సమయం. ఆలాగే నలుపయిన వానికి పుణుఁగు కాపు మరి నల్లదనం తెచ్చిపెట్టింది. కాని కవి సతుల కాటుక కనుచూపులను కారణంగా చెప్పాడు. స్వామి "పుంసాం మోహన రూపాయ" అనడానికే ఈ కల్పనలు.

స్వామి నల్లనివాడు. అమ్మవారు కరిగమన. గజాంతం ఐశ్వర్యమని ప్రసిద్ధి. అమ్మవారి వెంటబడిన స్వామికి 'పునుగుకాపు' మరింత నైల్యం సమకూరింది. దానినే 'సామజసిరి' అన్నారు పదకవులు (17.485) మానవులందరు ఒక చిత్త ప్రవృత్తి కలవారు కారు. కొందరు రసికులు. భ్రమరాలవంటివారు. కృష్ణుడు కూడ ఆలాంటి వాడని ఒక కల్పన. అతడు నలుపు కావడానికి 'చీఁకటి తప్పు' (17.491) కారణం కావడం విశేషం. పునుఁగు కాపువల్ల మరింత నల్లదనం. బహుశః తమోభిసారి కత్వమని కవి చమత్కార భావన.

స్వామి అభిషేకంలో చివరి లేపనం కుంకుమలేపనం. ఈ లేపనం స్వామి ఉరము మీద అచ్చువేసినట్లుగా ఉన్నదట. అచ్చుపోసే వ్యక్తి చాల జాగ్రత్తగా అచ్చుకట్టులో ఏమాత్రం సందులేకుండా ద్రవాన్ని పోయాలి. స్వామికున్న గొల్లెతల సహవాసం జగత్ప్రసిద్ధం. గొల్లెతల గుబ్బల కుంకుమ నిగ్గు స్వామి ఉరముమీద అచ్చువేసినట్లుగా ఉందని 'ఇందుకే కాఁబోలు' (17.528) కీర్తనలో వర్ణించారు. ఆలాగే అభిషేకానంతరం స్వామి

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁడనెడి పుప్పొడి రాసి
వెలయ మరుదు ముద్రవేసినట్లుండె (17.508)

అని వర్ణించారు. 'ముద్ర'వేయడం రక్షణకు గుర్తు. ముద్ర ప్రభుత్వ అంగీకారాన్ని తెలియజేసే చిహ్నం. అలమేలుమంగా శ్రీనివాసులు మరల ఎడబాయ కూడదని మరుదు వేసిన ముద్ర అనడంలో ఔచిత్యముంది.

కొన్ని కీర్తనలోని 'రసరాజ ఆవేశం' సామాన్యుల అనుభవాలకు అందనిది. పైగా ఇవికూడా భక్తి వికృత రూపాలా అనే ఆభాస కలిగించేవి.

మొలనూలి గంటలు మ్రోయగా నీ శిరసున
నలరు తట్టుపుణుఁగు అట్ట నీ కంటి
యెలమి మర్మాలు నీకు నెక్కడనో తాఁకెనంట
తెలిగన్నులను నీ దిక్కే చూచీని (7.502)

తట్టుపుణుఁ గలదుక తాళిగా నలమేల్మంగ
గట్టుకొంటి బంతి రతీ కంకేయఁ జుమ్మి (17.497)

అన్నమయ్య అమ్మవారిని 'నవసరములదీ నలినాక్షి – అలమేలు మంగఁ దెచ్చి అరుతగట్టుకొనగా పొలసి నవరసాలు పొడచూపెనో' అని అంటే పెదతిరుమలాచార్యులు (19.345)

'గొప్ప నవరసముల గుళిగైనాఁడు' (17.499)

అని వర్ణించడంలో ఏకరూపత కనిపిస్తుంది.

శృంగారం రసరాజం. శృంగారానికి మహావిష్ణువు అధిపతి. శృంగారానికి వికృతిరూపం సింగారం. తాళ్లపాక పదకవులలో మూలవరులను సింగారదేవుడు (3.125) గా కీర్తించారు. తమ సంకీర్తనలలో విశేషంగా సింగార శబ్దాన్ని ప్రయోగించారు. సింగారానికి బంగారానికి దగ్గరి సంబంధముంది.

సహజ శృంగారాలు జడిసె శ్రీపతికి (17.531)
సింగార దేవుడు (3.125)



శ్రీవేంకటేశుమేన సింగారము గాను (17.485)
అన్ని సింగారాలకుఁ దానమరినాఁడు (17.490)
చిక్క సింగారరాయ శ్రీవేంకటేశ (17.533)
పొదిగానీ సింగారపు భోగములెల్లాను (7.493)
చెప్పరాదు యీతని సింగారాలు (23.148)
సింగారాలు మీఁద మీఁద సేయరే చెలులు (23.330)
నిండు సింగారము తోడ నిలువుగోణము గట్టి (23.375)
జిగి సింగార రసము చేరి నీపై నొలుకగా (23.498)
చెందమ్మి పూవుదండలు సింగారించుకొనువేళ (19.336)

ఆలాగే తాళ్లపాక పదకవుల అభిషేక సంకీర్తనలలో స్వామి 'సొమ్ముల' సూచన ఏవో మూడు నాలుగు కీర్తనలలో తప్ప అన్నిట వుంది.

పెక్కు నవరత్నములు పెద్ద రాసి వోసినట్టు (17.533)

గుట్టుతోడ సొమ్ములెల్లా గుచ్చి కుచ్చి కట్టుకొని (17.532)

మించిన హారములెల్ల మేన నించుకొన్న వేళ (3.165)

ఒట్టుకొన్న భూషణాలు వొడలెల్ల నిండగా (17.493)

అయితే ఆ సొమ్ములేవో తెలుసుకోవడానికి తాళ్ళపాక పదకవుల ఇతర సంకీర్తనలే ఆధారాలు – మచ్చుకు

చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలు వలెనున్నవి
యీడులేని కన్నులివె యినచంద్రులు

కంటి గంటి వాఁడె వాఁడె ఘనమైన ముత్యాల
కంటమాల లవే పదకములు నవె
మింటి పొడలైనట్టి మించు కిరీటం బదె

జంటల వెలుగు శంఖ చక్రాలివె

మొక్కు మొక్కు వాఁడె వాఁడె ముందరనే వున్నాఁడు
చెక్కులనే నగవుతో జిగిమోమదె
వుక్కి లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె

ముంగై ముత్తెమురాలును నవె మొల కఠారును నదె
బంగారు నిగ్గులవన్నె పచ్చబట్టదె
యింగిత మెరిగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటి నిధ్ధానమైన మూలభూతమదే (1.133)

ఇటువంటి వర్ణనలే పురందరదాసు, ప్రసన్న వెంకటదాసులు లాంటి కన్నడ హరిదాసుల రచనల్లో కనిపిస్తున్నాయి.

## అభిషేక సంకీర్తనలు – ఎత్తుగడలు

తాళ్ళపాక పదకవుల పాటలు చాలవరకు పల్లవి మూడు చరణాలతో కనబడతాయి. పల్లవుల ఎత్తుగడలలో గాయకుల ప్రతిభ, కవి నేర్పు రెండూ ప్రస్ఫుటమవుతాయి.

ఎ) కవి తన అనుభూతులను స్వయంగా వాచ్యం చేయడం.
కంటి శుక్రవారము గడియ లేడింట.

అలమేల్మంగ నండ నుండే స్వామిని (శేషాచార్యుల వ్రాతప్రతి)

బి) సహచరులను ఆహ్వానిస్తూ అనుభూతిని పంచుకోవడం.

ఇలాంటివే తాళ్లపాక పదకవులలో ఎక్కువ

సేవింపరో జనులాల చేరి మొక్కరో
భావింప నున్నాఁడిందరి భాగ్యము వలెను (20.406)



సి) కవి ఆదేశపూర్వకంగా కైంకర్యాలు చేయమని పురమాయించడం.

చేతులెత్తి మొక్కరమ్మ చేరి యారతెత్తరమ్మ (17.539)

నేఁడె సుక్కురారము నెలఁతలాల
పొడిమి సేవసేయరే (8.153)

బంగారు మేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁద మీఁద సేయరే చెలులు (23.330)

డి) కవి స్వామితో సంభాషణ సాగించేరీతిలో చెప్పడం.

నిన్నుఁజూచి వెంగేలు నేనాడఁజుమ్మీ
నిన్ను కన్న మాటలకే వేరొకతె యాడెను (17.491)

ఇ) స్వామి ఆధిక్యతను ప్రకటిస్తూ చెప్పడం.

అప్పుఁడు దైవాల రాయఁ డాది మూలమీతఁడు
యిప్పుఁడిట్ట మహిమల నెక్కుడాయ నీతఁడు (2.150)

ఎఫ్) కవి నివేదన పూర్వకంగా విన్నపం చేసే రీతిలో చెప్పడం.

భోగించవయ్యా మంచి భోగములెల్ల
తీగె సాగిన మోహమే దిష్టి సంపదాయను (23.498)

అవధరించవయ్యా అట్టె కలకాలము
తవిలి సేవలు సేసీఁ దరుణి నీకు (22.502)

## సంకీర్తనలలో రాగ విశేషాలు

తాళ్లపాక పదకవులు అభిషేక వర్ణనలకు సామంతం, దేసాళం, శంకరాభరణం, బౌళి, లలిత, మలహరి, శ్రీరాగం, హిందోళ వసంతం, సాళంగనాట, సాళంగం, ముఖారి, పాడి, ఆహిరి, మలహరి, బౌళి, రామక్రియ, లలిత, ధన్నాసి, శుద్ధవసంతం, సౌరాష్ట్రం, దేవగాంధారి,

మాళవిగౌళ, నాదరామక్రియ, దేశాక్షి, నాగవరాళి రాగాలను వాడినట్లు స్పష్టం. ఎక్కువ కీర్తనలు శంకరాభరణం, శ్రీరాగాలలోను, తరువాతి వరుసలో సామంతం, దేసాళంలోనూ ఉన్నాయి.

### సంకీర్తనలలో 'తమిళపదాలు'

భారతదేశంలోని ప్రసిద్ధమతాలలో శైవానికి, వైష్ణవానికి గణనీయ మయిన ఆదరణ ఉంది. వైష్ణవంలో ఉపశాఖ లెన్నివున్నా భగవద్రామానుజుల విశిష్టాద్వైత వైష్ణవానికి దక్షిణభారతదేశంలో గట్టి పునాదివుంది. ఈ మత ప్రచారానికి వైష్ణవాలయాలు ఆటుపట్టు కావడం వల్ల ద్రవిడప్రబంధాలకు, ద్రావిడ సంబంధి ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యం పెరిగిందనడంలో అభిప్రాయభేదం లేదు. వీటిలో 'ఆలయ పరిభాష' ఒకటి. ఈ పరిభాషలో కూడా 'తమిళానికి' పెద్దపీట. ఈ కారణం వల్లనే వైష్ణవ సంబంధి గ్రంథాలు వ్రాసినవారు తమ రచనలలో తమిళశబ్ద జాలాన్ని యథాతథంగా స్వీకరించి గ్రంథస్థం చేశారు. తాళ్లపాకవారి వాఙ్మయంలో 'తమిళ సంబంధి పదజాల ప్రయోగం' విశిష్టమయింది. ప్రత్యేకించి తాళ్లపాక పదకవుల అభిషేక సంకీర్తనలలోనూ వీటిని గుర్తించవచ్చు. మచ్చుకు చాతు, తిరుమంజనం, తిరుమేను, తిరువందికప్పు, పుణుగుకాప్పు మొదలయినవి.

### చాతు

అంతటఁ గప్పురము చాతు కదే దేవుఁడు (3.125)

ఘటనఁజాతేరు శ్రీకాంతునికి (17.488)

కమలనాభునికి కప్పురకాపు మేన
సముచితముగాఁ బై పై చాఁతి నపుడు (17.527)

ఇది ద్రావిడశబ్దం. 'సాత్తు' తమిళరూపం. ఈ శబ్దానికి to put on adorn used in reference to idols, wearing లాంటి అర్థాలున్నాయి. బ్రౌణ్యం to put vestments or garlands above an idol అనే అర్థాలిచ్చాయి. అర్పించడం. అద్దడం రెండూ 'చాతు'కు అర్థాలే.



### తిరుమేని

హేమంత కాలము నేడు యిటు నీ తిరుమేన (23.142)

యెడలేక తిరుమేన నింతటా మెత్తిరిదివో (19.569)

తిన్న కప్పురధూళి తిరుమేననెల్లా మెత్తి (19.91)

పొదలెఁ దిరుమేనను పుణుఁగు కాపు (7.493)

తిన్నని చెమటల్లా తిరుమేన నెల్లానిండి (7.137)

ఇది అచ్చమయిన వైష్ణవ పరిభాష. వైష్ణవులు తమ యింటివి 'తిరుమాళిగె' అంటారు. స్వామి ఊరిగే వీథులు తిరుమాడవీథులు. తిరుచూర్ణము, తిరువారాధనము లాగే మిశ్రసమాసం తిరుమేను. మేను అంటే దేహము. 'తిరు' శ్రీవాచకము. స్వామి విగ్రహరూపాన్ని 'తిరుమేను' అనడం ఇతరుల మేనులకంటె భిన్నమయినది, పవిత్రమయినదని చెప్పడానికే. తమిళ నిఘంటువులు 'అంగమలత్తిలై పోలుం తిరుమేని అడిగళుక్కు' అనే దివ్యప్రబంధ ప్రయోగం అనుసరించి idol of deity or sacred person of a deity saint అని అర్థవివరణ చేశారు.

### కాప్పు

ఇదికూడా ద్రావిడశబ్దమే. వైష్ణవంలో ఈ శబ్దానికి వ్యాప్తి. పెరియాళ్వార్లు తనకు సాక్షాత్కరించిన స్వామిని దర్శించి 'పల్లాండు' పాశురం పాడారు. ఆ పాశురం చివర 'తిరుక్కాప్పు' అన్నారు. ఈశబ్దం 'రక్షణ' అనే అర్థంలో వాడబడుతుంది. తమిళ నిఘంటువులు Invocation of deities at the commencement of a poem to facilitate its successful completion to commence a temple

festival అనే అర్థాలిచ్చారు. బ్రౌణ్యం Protection guard అనే అర్థాలిచ్చాయి. 'కాపు' లేపనం కావచ్చు. కప్పురక్కాప్పు, పుణుగు కప్పు, కుంకుమ క్కాప్పు.

**తిరువంది క్కాప్పు**

ఇయ్యలమేల్మంగ కాంతులెత్త తిరువండి కాపు (19.292)

ఇది వైష్ణవ ఆలయపరిభాష. తమిళ నిఘంటువులు 'తిరుమలైయిల్ ఎళుందరుళి ఇరుక్కిన్ఱ వణక్కు తిరువందిక్కాప్పు సమర్పిక్కై కాగ' అనే దివ్యప్రబంధ వ్యాఖ్యానం ఉదాహరించి Ceremonial rites for averting the evil at the close of daily worship or festival in a temple అని వివరణ ఇచ్చారు. దిష్టి తీయడమని చెప్పవచ్చు.

**కర్పూర క్కాప్పు**

బ్రౌణ్యం Camphor 'పచ్చకర్పూరము' లాంటి అర్థాలిచ్చాయి. స్వామి చుబుకానికి పచ్చకర్పూరం అద్దడం అనంతాళ్వాన్ కాలం నుండి మొదలయింది. కర్పూరం తెల్లనిది. పచ్చకర్పూరం సువాసన యుక్తం. తీర్థాదులలో కలపడం ఆనవాయితి.

పచ్చకప్పురము మేనఁ బలుమారు మెత్తగాను (17.530)

పూసేవు కప్పురధూళి (17.497)

కప్పుర కాపులదివో (23.148)

**పుణుఁగు కాప్పు**

తమిళనిఘంటువులు civet cat - Gland in the anal pouch of the civet cat. uncertnous substance of the civet cat అనే అర్థాలిచ్చాయి. బ్రౌణ్యం 'పునుగు' అనే శబ్దానికి The perfume called civet పునుగు చట్టము A civet bag or gland sold as drug



పునుగుపిల్లి The small Indian civet Viverricula malaccnsis (F.B.I) అని వివరణ ఇచ్చింది.

**సాలగ్రామము**

విష్ణు భక్తులు పూజించురాయి అని బ్రౌణ్యం అర్థం ఇచ్చింది. తిరుమలలో స్వామి వారికి వ్యాసరాయలు సాలగ్రామహారం సమర్పించారట. ఇవి గండకి నదిలో లభ్యమవుతాయని ప్రసిద్ధి. ఈ సాలగ్రామాలలో అనేక రూపాలున్నాయి. సాలగ్రామానికి సంబంధించి ప్రత్యేక గ్రంథాలే వెలువడ్డాయి.

కప్పురపు ధూళి మేనగలయ నలది నప్పుడు
నీలవర్ణుడితడు పన్నీరు జలకమాడె
యాలో సాలగ్రామరూపము యందురు (17.486)

**తిరుమంజనము / తిరుమజ్జనము**

అంచలఁ బన్నీటి బిందెలందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా (17.530)

మదనజనకునికి మజ్జనవేళ
పదివేలభోగములు పరగీనదే (18-557)

'The sacred bath given to an idol' అని బ్రౌణ్యం. వైష్ణవాలయాలలో ప్రత్యేకించి వైఖానస ఆగయం ప్రకారం పూజాదులు జరిగేచోట గర్భాలయంలోని పంచబేరములకు మంత్రోదకాలతో చేసే పంచామృత స్నానమే తిరుమంజనము. తిరుమలలో కౌతుక బేరానికి నిత్యతిరుమంజనం. స్నపనసేవలో స్వామికి, సూక్ష్మ వస్త్రం ధరింపజేసి సుగంధ పుష్పతైలాను లేపనంతోనూ, తదనంతరం గోక్షీరం, గంధోదకం,

మధువు, హరిద్రోదకాలతో అభిషేకం చేయడం. తదుపరి జీవస్థానం చేర్చడం తిరుమజ్జనం.

తాళ్లపాక పదకవులు సామాన్య జనుల భావోద్వేగాలను జాగ్రత్తగా గుర్తించినవారు. అందువల్లనే భాషపట్ల కూడా వారు సారళ్యానికి ప్రాధాన్య మిచ్చారు. జీవద్భాషను వాడుకొన్నారు. భావప్రకటనలో సామాన్యుల ఉచ్చారణారీతుల్ని 'యాసను' యథాతథంగా వాడుకొన్నారు. ఇంతటి విశాలదృష్టి ఇతరులలో కనిపించదు.

వరుషించే (వర్షించే) 17.488, నిదుల (నిధుల) 17.49 ఏమైనాఁగా (ఏమయిననుగాని) 17.499 భరణులు (బరిణెలు) 17.533 చాపలాన (చాపల్యాన) 19.335) బ్రమ (భ్రమ) 13.506 మచ్చావతారము (మత్స్యావతారము) 17.500 అచ్చెర (ఆశ్చర్యము. అచ్చెరువు) లాంటి పదజాలాన్ని యథాతథంగా వాడుకొన్నారు.

కోవరపు గొల్లెతలు (17.528) పచ్చిచేసిన నెలతల చేతలు (17.529) సహజశృంగారాలు (17.531) చిక్కని నవ్వులు (17.531) మొలచిన వెన్నెల మొలక (3.165) చీఁకటి తప్పు (4.177) పొగరు వెన్నెల (17.485) సామజసిరి (17.483) తప్పటి చెలులు (17.486) తడిసూళ్ళు (17.486) వెన్నెలజడ్లు (17.487) మెఱుగుల కుప్ప (17.452) మేఘపుష్పాలు (17.494) బేసబెల్లి గొల్లెతలు (17.497) బంతిరతి (17.497) కటుక ఆసమున (17.500) జవ్వనవనాలు (17.501) చీకటి తెగద్రొమ్మింగు (17.502) పుప్పొళ్ళ పోగు (7.137) ఊడిగపు నిబ్బరము (19.91) గయ్యాళి మదరాగము (19.292) రతిచెనకులు (22.502) పొగరు మించులు (23.498) కలగంపరూపులు (13.506) లాంటి పదబంధాలు అసంఖ్యాకములు. వీటిని ప్రత్యేకంగా పరిశీలించవలసి వుంది.



ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవూ
అంతరాంతరము లెంచి చూడఁ బిండెంతె నిప్పటి యన్నట్లు
శ్రీ వేంకటపతి నీవైతే మేముఁ జేకొని వున్న దైవమని
యీవలన శరణని యెద నిదియె పరతత్త్వము నాకు

(అన్న. అధ్యా.179 ఠేకు)

**తాతల అడుగుజాడల్లో దౌహిత్రుడు**

తాళ్లపాక అన్నమయ్య కుమార్తె తిరుమలాంబ. తిరుమలాంబ భర్త రేవణూరి తిరుమల కొండయార్యుడు. ఈ పుణ్యదంపతుల కుమారుడే శ్రీవత్స గోత్రజుడయిన రేవణూరి వేంకటార్యుడు. ఇతని కృతులలో శ్రీ పాదరేణు ప్రభావము ప్రశస్తమయింది. ఈతని కాలము పదునేడవ శతాబ్ది తుది భాగము గాని పదునేడవ ఆరంభము దాని కావచ్చని పరిశోధకుల అభిప్రాయం.

అన్నమాచార్యులు వేంకటాచల మాహాత్మ్యం రచిస్తే మనుమడు శ్రీ పాదరేణు మహాత్మ్యం రచించాడు. ఈ గ్రంథప్రతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయంలో ఉంది. ఈ కాగితపు ప్రతి నెం.6277. ఈ గ్రంథంలో నాలుగు ఉల్లాసాలున్నాయి. లభ్యమయిన ఏకైక ప్రతి ఆధారంగా శ్రీ పంగనామల బాలకృష్ణమూర్తి గారు పరిశ్రమించి 1955 లో పరిష్కరించి తి.తి.దే. తరపున ముద్రించారు.

శ్రీ పాదరేణు మహాత్మ్యములోని చాల పద్యాలకు అన్నమయ్య పెదతిరుమలయ్యల అభిషేక సంకీర్తనలు ఆధారంగా కనిపిస్తున్నాయి. తాతగారి బాటలో నడవడం ఒక కారణమయితే, తనకాలంలో తిరుమలలో జరిగే ఉత్సవదర్శనము కూడా సామ్యానికి కారణం కావచ్చు.

కాని రేవణూరి వేంకటార్యునికి తిరుమల ఆలయ అనుబంధం ఉన్నట్టు చెప్పలేము.

తాళ్లపాకవారు స్వామివారి అభిషేక వర్ణనలలో ఋతుసామ్యమును జోడించినారు. రేవణూరి వేంకటార్యుడు ఈ భావనతో ఒక సీస పద్యాన్ని రచించాడు.

అతి సురభి ప్రసిద్ధత చేత నిరతంబు
గీర్తింపఁ గా వసంతర్తు వగుచుఁ
బటుధూళి ధూసర ప్రచురతా విస్ఫూర్తి
గీర్తింపఁగా నిదాఘర్తు వగుచు
సరసార్ధ గంధవత్యురు ధర్మసంసక్తి
గీర్తింపఁగాఁ బ్రావృదర్తు వగుచు
బహుతీర్థనైర్మల్య భావసేవాప్రాప్తి
గీర్తింపఁగా శరదర్తు వగుచు

వితత గీతావాప్తిచేఁ దుషారత వహించి
కించి దున్నత శిశిరర్తు క్రియ నెసంగి
వెలయు శ్రీవేంకటాద్రీశ నిలయుఁడైన
శ్రీనివాసుని శ్రీపాదరేణు విలను (2.28)

ఆలాగే తాళ్లపాక పదకవులు శ్రీనివాసుని పంటరాసులుగా (17.497) వర్ణించారు. ఈ భావాలకు పూర్ణత్వం కల్పించే విధంగా వేంకటార్యుడు రూపకాలంకారముతో

తిరుమంత్రాఖ్యహలంబుఁ బూని కృషికృద్ధీమంతుఁడాత్మీయ హృ
ద్ధరణిన్ దున్ని ద్వయార్థబీజములు నిండంజల్ల, నంకూరమై
పరగన్ బూచిన మోక్షశాలికిని పైపై సత్తువల్ నింపు దా
నెరవై శేషగిరీంద్ర పాదరజ ముఖొంపంగ నిద్ధారుణిన్ (3.39)



మోక్షప్రాప్తికోసం ప్రయత్నించే ధీమంతుడనే కర్షకుడు, తిరుమంత్రమనే నాగలిబట్టి తన హృదయక్షేత్రాన్ని బాగా దున్ని ద్వయ మంత్రాక్షరాలు చల్లగా అవి మొలకలెత్తి వెన్ను తొడిగితే మోక్షమనే శాలి సస్యానికి శ్రీపాదరేణువు మంచి ఎరువవుతుందని అత్యుదాత్తంగా ప్రశంసించాడు. తాళ్లపాక పదకవులు ఆధ్యాత్మికాంశాలకు నస్యోవమానాలు విరివిగా వాడుకొన్నవారే. మూలవరుల అభిషేకమూర్తిలో దశావతారాలను దర్శించారు తాళ్లపాకపదకవులు. వాటిని కవితా చమత్కారంతో రక్తకట్టించారు. ఈ భూమికనే భావించి రేవణూరి వేంకటార్యకవి మరోరూపంలో శ్రీపాదరేణువునకు సంబంధము కల్పించి ద్విపద పంక్తుల కూర్చినాడు.

మీను చెక్కులపైన మృదువు రేణువును
పూని కూర్మముఁ గాచు పొదుపు రేణువును
ఘోర కోలము కోల కొనల రేణువును
నారసింహుని గోళ్ళ నసల రేణువును
గుజ్జు వామన కుంభ కుంభ రేణువును
రజ్జు పారును కళారంభరేణువును
రాతి నాతిని జేయు రాపు రేణువును
రీతి నీలపుటంశ రేపు రేణువును
కపట లప్పుని పొది గట్టు రేణువును
నెపమ గుబ్బపు చొంగ నెట్టు రేణువును. (3.46)

అలాగే ద్వితీయోల్లాసంలో 'శ్రీమన్నహోమంగళంబయ్యో' దండకంలో 'వేద చోరాసురున్ ద్రుచ్చిలిన్ మచ్చుగాఁ జేసె నే రేణువున్' అని వరుసగా దశావతారాలకు రేణువుకు సంబంధము కల్పించాడు. 'కలౌ వేంకటనాయకః' కనుక

శ్రీమదలమేలు మంగా
భామాలింగనత నొడలి పట్టికలు కురం
గీ మదమున నగు వేంకట
ధాముని పదరేణువున్ సదా సేవింతున్' అని స్పష్టము చేశాడు.

### శ్రీహరి పాదతీర్థం

తాళ్లపాకవారి పదరాశిలో 'శ్రీహరి పాదతీర్థ'మను పదజాలంతో కనిపించే కీర్తన లేదు. కాని శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో (పుట 34) శంకరాభరణ రాగంలోని

శ్రీహరిపాద తీర్థంబే చెడని మందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు

కారమై కంటగించని కడుఁ జల్లని మందు
నూఱని కాచని యట్టి నున్నని మందు
కోరికతో వెలవెట్టి కొని తేవల్లని మందు
వేరు వెల్లంకులు కూర్చనట్టి వెందువోని మందు

గుఱుతైన రోగములు గుణము చేసే మందు
దురితములు పెడబాపే దొడ్డ మందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించే మందు
నరకము సొరనట్టి నయమయిన మందు

పొంకముతో భయములు పొందనియ్యని మందు
మంకు బుద్ధులు మాన్పి మన్నించే మందు
పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నుని మందు
సెంకించక తనదాసులఁ జేపట్టే మందు



కీర్తన ఉదాహరించారు. అయితే ఆకరము చూపలేదు. కాని రేవణూరి 'శ్రీపాద రేణుప్రభావము'లో పై కీర్తనలోని భావమే పలుచోట్ల (1.39) (2.21) (2.26) (4.25.34) వర్ణితం.

తిరుమలను, తిరుమలేశుని తిరుమల ఉత్సవాలను వర్ణించిన కవులెందరో గాని శుక్రవార శ్రీపాదతీర్థప్రభావాన్ని తీర్థాన్ని వర్ణించిన వారు నలగురైదుగురే.

కాకమాని మూర్తికవి రాజవాహన విజయములో

అప్పప్ప చూడవలదా
యప్పని కోవెల పటీరహైమజలంబుల్
కప్పురము పునుఁగు మృగమద
మెప్పట్టున తావిగల్గు భృగుదివసమునన్'

అని వర్ణితం. కర్తపేరు తెలియని 'వెంకటాచలనివాసములో'

తీర్థ తీర్థ మహాతీర్థ తీర్థపాద
శరణు శరణయ్య శరణార్థి శరణు శరణు

అని వర్ణితం. రేవణూరి వేంకటార్యుడు శ్రీ పాదరేణుప్రభావములో

శ్రీ వేంకటేశు పాదర
జో విహృతి వికుంఠనగర శోభితనదికిన్
పావన విరజాహ్వయము ప్ర
భావంబు దలిర్పఁ గలిగెఁ బ్రస్తుతులు దగన్ 3.35

అని నదులతో జోడించి శ్రీపాదరేణువును వర్ణించినాడు.

* * *

# ఉపకరించిన రచనలు

**తెలుగు**

తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవవిశేషాలు
– డా॥ గోవిందరాజు

తాళ్ళపాక కవుల పదకవితలు – భాషాప్రయోగ విశేషాలు
– డా॥ వేటూరి ఆనందమూర్తి

తాళ్ళపాక పదసాహిత్యము – తి.తి.దేవస్థానముల ప్రచురణలు.

పదార్చన – డా॥ చిట్రాజు గోవిందరాజు

వరాహభవిష్యోత్తర పురాణములలోని శ్రీవేంకటచలమాహాత్మ్యము
– డా॥ సి. లలితారాణి

శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము
తొలి పరిష్కరణ – పీఠిక – వేటూరి ప్రభాకరశాస్త్రి

శ్రీపాదరేణు ప్రభావము – రేవణూరి వేంకటార్యుడు

శ్రీ వేంకటాచలేతిహాసమాల అను॥ ఎస్.సి.వి.నరసింహాచార్య

శ్రీ వేంకటేశ సహస్రనామ స్తోత్రము – డా॥ ఎస్.సి.వి.నరసింహాచార్య

శ్రీవేంకటేశ్వర స్తుతిరత్నమాల – శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

శ్రీవేంకటేశ్వర వైభవము – పండిత వేదాంతం జగన్నాథాచార్యులు

హరికొలువు – జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

**ఆంగ్లం**

Golden Jubilee Souvenir T.T. Devasthanams

History of Tirupati T.K.T. Veeraraghavacharya



The Festivals and Rituals at Tirumala Temple Dr. M.S. Ramesh

The Tirumala Temple N. Ramesan

Tirupati Sri Venkateswara Sadhu Subrahmanya Sastry

**హిందీ**

అన్నమాచార్య ఔర్ సూరదాస్ డా॥ ఎం. సంగమేశం

* * *

## తిరుమలేశుని
## అభిషేక సంకీర్తనలు



షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥పల్లవి॥

అలరు విశ్వాత్మకున కావాహన మిదె పర్వ
నిలయున కాసనము నెమ్మి నిదె
అల గంగాజనకున కర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జనమిదె ॥షోడ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకార మిదె
సరి శ్రీమంతునకు భూషణములివె
ధరణీధరునకు గంధపుష్పధూపములు
తిరమిదె కోటిసూర్యతేజునకు దినము ॥షోడ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీఁది దేవునికి
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడ॥

(3.134)

## బౌళి

అన్నిట భాగ్యవంతుఁడ వవుదువయ్యా
పన్నినందు కల్లా వచ్చు భామ నీకిపుడు ॥పల్లవి॥

పడతి మోహరసము పన్నీటి మజ్జనము
కడలేని ఆపె సిగ్గు కప్పురకాపు
నిడుద కన్నుచూపుల నించిన తట్టుపునుగు
తొడిబడ సులభాన దొరకె నీకిపుడు ॥అన్ని॥

కామిని కెమ్మోవి కాంతి కట్టుకొనే చంద్రకావి
ఆముకొన్న మోము కళలు ఆభరణాలు
దోమటి మాటల విందు ధూపదీపనైవేద్యాలు
కామించి నటువలెనే కలిగె నీకిపుడు ॥అన్ని॥

అలమేలుమంగ నవ్వులు అంగపు పువ్వుదండలు
కలసి వురాన నీకె కట్టిన తాళి
చలపట్టి ఈకె రతి సకల సంపదలు
ఇల నబ్బె శ్రీవేంకటేశ! నీకు నిపుడు ॥అన్ని॥

(7.164)

## ముఖారి

అన్ని సింగారాలకుఁ దా నమరి నాఁడు
వన్నెలఁ బొద్దొక చాయ వాఁడాయ నితఁడూ ॥పల్లవి॥

జలజాక్షుఁ డటుగాన జలక మాడేటి వేళ
జలజాకరము వలె సరినున్నాఁడు
చలివాసి సిగ్గులతో జవ్వనులు గొలువఁగ
నిలుచున్నాఁ డదివో నిచ్చలాన నీతఁడు ॥అన్ని॥



ఘనశంఖపాణి గాన కప్పుర కాపు వేళ
తన మేను నిధానమై తగి యున్నాఁడు
మనసిజగరిడిలో మఱి సాము సేసి వచ్చి
అనుఁగుఁ బుప్పొఁడి దోఁగి యట్టే వున్నా డీతఁడూ ॥అన్ని॥

నీలవర్ణుఁ డటుగాన నించిన పుళుగు వేళ
తొలిచేందుకు భరణి తానై వున్నాఁడు
అలరి శ్రీవేంకటేశుఁ డలమేలు మంగ మెడ
తాళిగాఁ గట్టుక లోలో దక్కియున్నాఁ డీతఁడూ ॥అన్ని॥

(17–490)

## శంకరాభరణం

అప్పుఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు
యిప్పు డిట్టి మహిమల నెక్కుడాయ నీతఁడు ॥పల్లవి॥

చేకొని.... చేసిన పన్నీరు కాపు
జోకఁ గాలువలై సొరిది జార
సైకపు నీలాద్రి నుండి జలజల బారేటి
రేకల సెలయేరుల రీతి నున్న దిదివో ॥అప్పుడు॥

తెప్పలుగా గుప్పినట్టి తెల్లని కప్పుర కాపు
చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను
పుప్పొడిఁ దోఁగిన కల్పభూజము నిలుచున్న
చొప్పున నున్నాఁ డిదివో సొంపులు మీరుచును ॥అప్పుడు॥

పొందుగ నంతటి మీఁదఁ బూసిన పునుగు కాపు
కందువ మాణిక్యములగవి యైనట్టు
అంది శ్రీ వేంకటేశ్వరు కదె యలమేలుమంగ
చెంది యరతాెఁ గట్టఁగా శ్రీవిభుఁడై నిలిచె ॥అప్పుడు॥

(2–50)

## శంకరాభరణం

అప్పుడు మజ్జన మాడీ నంగనఁ గూడి
కుప్పలుఁ దెప్పలుగాఁ గుమ్మరించరో ॥పల్లవి॥

బంగారు కొప్పెరల పన్నీరు నించి
రంగైన పచ్చకప్పురపు ధూళొత్తి
చెంగటఁ గస్తూరి ధూళి చికిలి గావించి
పొంగారుఁ దట్టు పుణుఁగు పోయరో గిన్నెలను ॥అప్పుడు॥

పటికంపుఁ గాఁగుల పరిమళా లెల్లా
ఘటియించి కుంకుమతోఁ గడు మేదించి
అటునిటు గొజ్జంగ నీరందంద నించి
కుటిలకుంతలులు పైఁ గుమ్మ రించరో ॥అప్పుడు॥

బలుసింగాణులఁ గదంబము గంధమును
కలపము గావించి గంబూరముతో
వెలయ మజ్జన మాడీ వేంకటాద్రి విభుఁడు
చెలగి యింతులు చేరి సేస చల్లరో ॥అప్పుడు॥
(5-256)

## పాడి

అల్లవాఁడె భావించరె అంగన లిందరుఁ గూడి
వుల్లములో తన మాయ లుబ్బెనో శ్రీహరికి ॥పల్లవి॥

నేలా మిన్నుఁ గొలవఁగ నిక్కి మిన్నేటి నురుఁగు
అలరి యీ హరిమేన నంటుకొనెనో
పాలవెల్లి తచ్చఁబోఁగాఁ బైఁబడెనో తుంపురులు
మేలిమి కప్పుర కాపు మెత్తిరో యీ హరికి ॥అల్ల॥



చిత్తగించి రేపల్లెఁ జీకటి తప్పు సేయఁగా
అత్తల చీఁకటి నలుపంటుకొనె నేమో
వొత్తి కరిఁ గావఁబోవగా నొలికెనో పై మదము
మొత్తమిఁ బుళుగు కాపు ముంచిరో శ్రీహరికి ॥అల్ల॥

అలమేలుమంగఁదెచ్చి అఱుతఁ గట్టుకొనఁగా
పొలసి నవరసాలుఁ బొడ చూపెనో
నెలవైన సొమ్ములెల్లా నిండుకొనె మేన నెల్లా
అలరి శ్రీవేంకటాద్రి నందమైన హరికి ॥అల్ల॥
(19-345)

## సాళంగనాట

అవధరించవయ్యా అట్టె కలకాలము
తవిలి సేవలు సేసీఁ దరుణి నీకు ॥పల్లవి॥

నెలఁత చెమటలే పన్నీటి మజ్జనము నీకు
తళుకుఁ బయ్యద కొంగు తడియొత్తు
కలికి నవ్వులే కప్పురకాపు నీకు
పొలుపొందఁ జూపులే పుణుఁగు కాపు ॥అవ॥

మగువ యంగరాగమే మంచి చంద్రగావిదట్టి
తగుఁ గాఁగిటి చేతులే తమ్మిపూజలు
చిగురుఁ బెదవులే శ్రీ తులసీదళములు
మొగి రతి చెనకులే మునుకొన్న సొమ్ములు ॥అవ॥

అలమేలుమంగ తానే యక్కున నుండే దేవులు
పలుకులే వేదమంత్రపాటలు
యెలమి శ్రీవేంకటేశ, యెంచి చూచితే నీకు
జలజాక్షి సరసాలు సకలసంపదలు ॥అవ॥
(22-502)

## దేసాళం

ఇందుకే కాఁబోలు నీవు యిట్టే యవధరించేవు
కందువ లన్నియు నీమై గనియై నట్లుండే ॥పల్లవి॥

హరి! నీవు కప్పుర కా పవధరించేవేళ
విరివిగా నిందరు భావించి చూచితే
తరుణుల నవ్వువెల్లా దట్టమై నీ మేని మీఁద
పెరిగి పెరిగి యట్టే పేరిన యట్లుండే ॥ఇందు॥

భువనేశ! నీవు తట్టుపుణుఁగు చాఁతు కొనఁగ
యివల నీ దాసులెల్లా నెంచి చూచితే
కవగూడి నీ సతుల కనుచూపు లెల్లాను
తివిరి నీ మేని మీఁద తిరమై నట్లుండే ॥ఇందు॥

శ్రీవేంకటేశ! నీ చెలి యలమేల్మంగతో
తావున మెరసేది నేఁ దలఁచి తేను
కోవరపు గొల్లెతల గుబ్బల కుంకుమ నిగ్గు
వేవేలయి నీ యందచ్చు వేసిన యట్లుండే ॥ఇందు॥
(17–528)

## సామంతం

ఇన్నిటికి మూలము యీతని రూపు
యెన్నఁగ నుపమలకు నిరవై నట్లుండె ॥పల్లవి॥

కమలనాభునికి కప్పురకాపు మేన
సముచితముగఁ బై పై చాఁతి నపుడు
అమృతము దచ్చేవేళ నట్టే మేనఁ దుంపుర్లు
తమితోడ నిండుకొని దట్టమైనట్లుండె ॥ఇన్ని॥



దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను
చేవ మీద నించి సేవ సేసే యప్పుడు
వేవేలుగా యమునలో వేమారు నీఁదులాడఁగా
కావిరి కాళిమ నిండాఁ గప్పినయట్లుండె ॥ఇన్ని॥

అలమేలుమంగ తోడ నట్టే శ్రీవేంకటపతి
కెలమితో సొమ్ము వెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడఁగా గుబ్బల మీఁదఁ
గల పసెల్లా వచ్చి కమ్ముకొన్నట్లుండె ॥ఇన్ని॥
(17–527)

## శంకరాభరణం

ఇవి గొన్ని నగుఁబాట్లిఁక వలెనా
కవగూడి నీవు నీవే కావా యెపుడు ॥పల్లవి॥

నించిన తట్టు పుణుఁగు నీ వెంత పూసినాను
ముంచిన రేపల్లె గొల్ల ముంజు వొయ్యీనా
పొంచి నీవు మేనఁ గప్పుర మెంత చల్లుకొన్నా
అంచల వెన్నల జిడ్డవి విడిచీనా ॥ఇవి॥

కులికి కులికి యెంత కుంకుమ నీ వలఁదిన
యెలమి నలుపే కాక యెఱ్ఱనయ్యేనా
చలువఁ బన్నీట నీవు జలక మెంతాడినాను
సొలపుల నీ మనసు సుద్దమయ్యీనా ॥ఇవి॥

చొక్కపు శ్రీవేంకటేశ! సొమ్ములెన్ని నించుకొన్నా
అక్కున నలమేల్మంగ నవి మించీనా
నిక్కపు నీవే చేఁత నీలోనే చేసినాను
దిక్కులందుఁ గతలయి తిరుగకుండీనా ॥ఇవి॥
(17–487)

## రామక్రియ

ఈ దేవదేవునికి నిందిరా రమణునికి
సాదించి నటువలె సర్వమూ నమరే ॥పల్లవి॥

అదరి రామునికిఁ బట్టాభిషేకమైనట్టు
కడలేని పన్నీటి కాపమరెను
పొడవై యందె సురలు పుష్పవృష్టి నించినట్టు
కడుఁగడుఁ గర్పూర కాపమరెను ॥ఈ దేవ॥

పాలజలధిపై నీలిపట్టు నిండాఁ గప్పినట్టు
కాళిమతోడ పులుగు కాపమరెను
కేలి నందు పసిఁడి తీఁగెలు నిండఁబాఁకినట్టు
సోలిఁ బెట్టినటువంటి సొమ్ములు నమరెను ॥ఈ దేవ॥

చంచుల శ్రీవేంకటేశు జంట పెనఁబెట్టినట్టు
యెంచి నలమేలుమంగ యెద నమరె
అంచెల జవ్వనవనా లట్టే వికసించినటు
పొంచి ఇద్దరి మేనుల పువ్వుదండ లమరెను ॥ఈ దేవ॥

(17–501)

## పాడి

ఊడిగపు చెలులార! వొద్దనుండి సేవింపరో
వేడుక లన్నియు నేఁడు వెల్లివిరులాయ ॥పల్లవి॥

గోవర్ధనగిరి నెత్తిన గోవిందుని మీఁదటను
తావిరి ఁగురిసే జడివానల వలే
ఆవేళఁ బన్నీట నభిషేకము సేయఁగ
వేవేలు దెరఁగుల విభవము లమరె ॥ఊడి॥



క్షీరాబ్ధి లోపలి శ్రీవల్లభుని మీఁదట
చేరి సేసే అమృతాభిషేకము వలె
గారవానఁ జేసేటి కప్పురకాపమరెను
నేరుపులు హరికిని నిబిడము లమరె ॥ఊడి॥

చీఁకటి దెగ మ్రింగిన శ్రీకృష్ణుని మీఁదటను
ఆఁకలఁ దట్టుపుణుఁ గమరె నిదే
కాఁకల శ్రీవేంకటేశు కౌఁగిట నలమేల్మంగ
యేఁకటతో గూఁడ గాను యిరవాయ సిరులు ॥ఊడి॥

(17–502)

## ధన్నాసి

ఊడిగపు నిబ్బరాన వొరపు లెరఁగరు
తాడుపడి గోళ్ళేల తాఁకించేరే మీరు ॥పల్లవి॥

పన్నీట మజ్జనమార్చి పావడాలఁ దడివొత్తి
చన్ను లేల తాఁకించేరే సతులాలా
తిన్నని కప్పురధూళి తిరుమేన నెల్లా మెత్తి
వున్నతపుఁగొప్పు లేల వూఁదేరే మీరు ॥ఊడి॥

తట్టుపుణుఁగలఁది యంతటా మెరుఁగులు వెట్టి
చుట్టుఁబయ్యద లేఁటికి సోఁకించేరే
గట్టిగా సొమ్ములు వెట్టి కడు సింగారాలు సేసి
వట్టి మీ చెమట లేల వడియించేరే ॥ఊడి॥

అలమేలుమంగ నురమందు నెలవు కొలిపి
యెలమి శ్రీవేంకటేశు నేల నవ్వేరే
బలిమి నానాజాతిపండ్లు నైవేద్య మిచ్చి
అలమి మోవిపండ్లయేమి చూపేరే ॥ఊడి॥

(19–91)

## శంకరాభరణం

ఊడిగపు వారెల్లా నొద్ద నుండరో
వేడుక యేకాంతమున వెలసీని దేవుఁడు ॥పల్లవి॥

నిలువు గోణము గట్టి నిలుచుండి పన్నీట
జలక మాడీ నదే సర్వేశుఁడు
తలపాగ చుట్టుచుట్టి తడిసూళ్ళు మేననొత్తి
తొలఁగ కుత్తరీయముతో నున్నాఁడు దేవుఁడు ॥ఊడి॥

కప్పుర కాపు మేనఁ గలయ మెత్తించు కొంటా
చిప్పిలగఁ జెమరించీ శ్రీవిభుఁడు
ముప్పిరిఁ బాటలు వింటా మునులు నుతించఁగాను
దప్పిదేరి సింగారానఁ దానున్నాఁడు దేవుఁడు ॥ఊడి॥

తట్టు పుణుఁ గలఁదుక తరి సొమ్ములు నించుక
యిట్టే యలమేల్మంగ నెదఁగట్టుక
పట్టి యారగించుకొంటా పలులోకా లేలుకొంటా
మెట్టి శ్రీవేంకటాద్రిని మెఱసీని దేవుఁడు ॥ఊడి॥

(13–363)

## సామంతం

ఎట్టు వలసినా వచ్చు నింతుల మాట
నెట్టు కొన్న వారి వారి నేరుపు లింతే ॥పల్లవి॥

కప్పురపు ధూళి మేనఁ గలయ నలఁది నప్పు
డప్పుడే పో బలభద్రుఁడని యందురు
కుప్పలైన తట్టుపుణుఁగున దొప్పఁ దోగీ నంటా
తప్పటి చెలులే క్రిష్ణుఁడని యందురు ॥ఎట్టు॥



నీలవర్ణుఁ డితఁడు పన్నీరు జలకమాడె
యాలో సాలగ్రామ రూపమని యందురు
తొలిమి నిర్వాణాన తడిసూళ్ళొత్తు వేళ
పొలిచి నీ సతులెల్లా బుద్ధుఁడందురు ॥ఎట్టు॥

మించిన సొమ్ముల తోన మిన్ను ముట్టిన వేళ
లంచలఁ ద్రివిక్రముఁడని యందురు
కొంచక యలమేలుమంగ కోరి మెడఁగట్టుకొంటే
యెంచి శ్రీవేంకటపతి యితఁడందురు ॥ఎట్టు॥

(17–486)

## శుద్ధవసంతం / హిందోళవసంతం

ఎన్ని మహిమల వాఁడే యీ దేవుఁడు
కన్నుల పండువ లెల్లాఁ గదిసినట్లుండెను ॥పల్లవి॥

పోలింప కప్పురకాపు పురుషోత్తమునికి
యే లీల నుండెనని యెంచి చూచితే
పాల జలనిధిలోనఁ బవ్వళింపఁగా మేన
మేలిమి మీఁగడంటిన మెలపుతో నుండెను ॥ఎన్ని॥

తట్టు పుణుఁగు కాపు దైవశిఖామణికి
యెట్టుండెనని మతి యెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలోఁ జేసిన రాసక్రీడల
నట్టే రాత్రులు మేన నంటినట్టుండెను ॥ఎన్ని॥

అలమేల్మంగతోడ నట్టె సొమ్ము ధరించగా
యెలమి శ్రీవేంకటేశు నెంచి చూచితే
కలిమిగల యీ కాంత కౌఁగిట బెనఁగ గాను
నిలువెల్లా సిరులను నింపిన యట్లుండెనూ ॥ఎన్ని॥

(17.507) (4–177)

## లలిత

ఎన్ని రూపులైనాఁ జూప నితఁడే నేర్చు
మున్నే యనంతావతారముల వాఁడు గనక ॥పల్లవి॥

పన్నీటి మజ్జన వేళ భావించి చూచితేను
మిన్నక నాభికిఁ గిందు మీనుసోగయై
మన్నేరుపైఁ దొరుగఁగా మించి యెదురెక్కి నిలు
చున్న మచ్చావతారమై వున్నాఁడు దేవుఁడు ॥ఎన్ని॥

మిక్కిలి కప్రకా పామీఁద నిండాఁ జాఁతఁగాను
చక్క నాల్గు చేతులతో సర్వేశ్వరుఁడు
తక్కక శుక్లాంబరధరుఁడైన విష్ణుఁడే
పక్కనఁ దానని చెప్పి ప్రత్యక్షమై వుండెను ॥ఎన్ని॥

పొసఁగఁగఁ బుళుకాపున నల్లనగు మేన
పసిఁడి యలమేలమ్మంగపైఁ గటుక
ఆసమున రుక్మిణిఁ బెండ్లాడే గోవిందునివలె
వెస శ్రీవేంకటేశుఁడు వెలయించె నిపుడు ॥ఎన్ని॥

(17-500)

## మలహరి

ఏకతాన వున్నవాఁడు యిదివో వీఁడె
చేకొని మొక్కరో మీరు చేతులెత్తి యిపుడు ॥పల్లవి॥

మంచి మంచి పన్నీట మజ్జన మవధరించి
పంచమహావాద్యాలతో పరమాత్ముఁడు
అంచలఁ గప్పురకాపు అంగముల మెత్తుకొని
కొంచక నిలుచున్నాఁడు గోణాముతోడను ॥ఏక॥



తట్టుపుణుఁ గా మీఁద దట్టముగ నించుకొని
తెట్టలై వేదనాదాల దేవదేవుఁడు
గుట్టుతోడ సొమ్ములెల్లా గుచ్చికుచ్చి కట్టుకొని
వెట్టదీర సురట్ల విసరించుకొంటాను ॥ఏక॥

తనిసి యలమేల్మంగఁ దాళిగాఁ గట్టుకొనె
వెనుకొని యిదెవో శ్రీవేంకటేశుఁడు
మునుకొని యారగించి మూఁడు లోకములు మెచ్చ
చనువరి సతులతో సరసమాడుతాను ॥ఏక॥

(17-532)

## సాళంగం

ఏమని కొనాడవచ్చు నితని చక్కఁదనము
మోము చూచినంతలోనే మోహింపించీ నితఁడు ॥పల్లవి॥

మదనజనకుఁ డిట్టే మజ్జన మాడేటి వేళ
కదిసి హస్తాలుఁ దానుఁ గారుకమ్ముచు
చదలఁ గడళ్ళ తోడి సముద్రమె రూపై
యెదుట నిలుచున్నట్టు యిదె వున్నాఁ డీతఁడు ॥ఏమని॥

హరి కప్పురపు ధూళి యలఁదు కొనిన వేళ
సిరుల మించఁగను చూచిన వారికి
అంది శరత్కాల మందలి తెల్లని మేఘ
మిరవై రూపై వున్న ట్టెన్నికాయ నీతఁడు ॥ఏమని॥

కావింపఁ బుళుగు పూసి కడు నల్లనై సొమ్ముల
యీవల నలమేల్మంగ నెదఁ గట్టుక
కావిరి నింద్రనీలపుగని రూపై వుండినట్టు
శ్రీవేంకటేశ్వరుఁడు చెలువొందె నీతఁడు ॥ఏమని॥

(17-489)

## శంకరాభరణం

ఏమని చెప్పుదమమ్మ యీతని సౌభాగ్యము
కోమలపు జవ్వనము గుఱుతైనట్టుండే ॥పల్లవి॥

వొట్టుచుఁ గప్పుర కాపు వూడిగపు వారెల్లా
అట్టే దేవునికి నలఁదఁగాను
దట్టముగ మంచి తెల్లఁదామెరపువ్వునకు
ముట్టి అవయవములు మొలచినట్టుండే ॥ఏమని॥

తనివొంద గిన్నెలతోఁ దట్టుపుణుఁగులు దెచ్చి
పొనుపొందఁ దిరుమేనఁ బుయ్యఁగాను
పనివడి గొప్ప నిడుపాటి నేరేడుఁబండు
కనుపట్ట పురుషాకారమై నట్టుండే ॥ఏమని॥

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁడనెడి పుప్పొడి రాసి
వెలయు మరుఁడు ముద్ర వేసినట్లుండే ॥ఏమని॥

(17-508)

## దేసాళం

ఏమని తలఁత మమ్మ నింకా నీ దేవుని
ఆముకొన్న పరబ్రహ్మమై వున్నవాఁడు ॥పల్లవి॥

నెప్పున నీళ్ళతోడి నీలమేఘమై వున్నాఁడు
చప్పుడు గాక పన్నీట జలక మాడి
కప్పురపు మాఁకు వలె కడు మించి వున్నవాఁడు
ముప్పిరిఁ బచ్చకర్పూరమున ఁదొప్పఁ దోఁగి ॥ఏమని॥



తట్టు పుణుఁగు భరణి తానైనట్టున్నవాఁడు
గట్టిగాఁ బుణుఁగు మేనఁ గడు నించుకా
పెట్టిన సొమ్ములతోడి పెట్టెవలె నున్నవాఁడు
వొట్టుకొన్న భూషణాలు వొడలెల్లా నిండఁగా ॥ఏమని॥

కళలతో లక్ష్మీకాంతుఁడై వున్నవాఁడు
అలమేలుమంగ వురమందు నుండఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డేలికై తా నున్నవాఁడు
నలువంక సర్వలోకనాయకుఁడు గనక ॥ఏమని॥

(17-493)

## సాళంగనాట

ఏమని పొగడవచ్చు నిటువంటి చెలువము
కామితార్థముల నిచ్చే కల్పవృక్ష మితఁడు ॥పల్లవి॥

పలు వేదఘోషములతో బంగారు బిందెల నించి
జలకమార్చే రదె శౌరికి
మెలుపు వనము మీఁద మేఘము లురుములతో
జలజల వరుషించే చందమాయ నిదివో ॥ఏమని॥

పటికపు గిన్నెలను పచ్చకప్పురము దెచ్చి
ఘటనఁ జాఁతేరు శ్రీకాంతునికీ
తటుకనఁ దనభావఁ దగఁ బెక్కు చంద్రు లెల్లా
నటన నమృతకిరణాలు నలి నించినట్లు ॥ఏమని॥

అందుపైఁ దట్టు పుణుఁగలఁది యలమేల్మంగ
నిందరు శ్రీ వేంకటేశు యెదఁగట్టిరి
చందమై బ్రహ్మాండము సర్వసంపదలతోడ
కందువ మెరసినట్లు కానిపించె నిదివో ॥ఏమని॥

(17-488)

## రామక్రియ

ఏమైనాఁగా నేరుచు నీ దేవుఁడు
కామించిన వారి వారి కల్పవృక్షము ॥పల్లవి॥

చప్పుడుగాఁ బన్నీటను జలకము లాడేవేళ
గొప్ప నవరసముల గుళిగైనాఁడు
దెప్పరమై కప్రకాపు దేహానఁ బూసిన వేళ
తప్పకుండ ఘనసార తరువైనాఁడు ॥ఏమై॥

అంచలఁ దట్టుపుణుఁగు అలఁదుకొనినవేళ
మించినట్టి చమరీమృగ మైనాఁడు
కాంచనపు సొమ్ములు అంగముల ధరియించువేళ
కొంచని సంపంగి పువ్వుగుత్తియైనాఁడు ॥ఏమై॥

మిక్కిలి యలమేల్మంగ మెడఁ గట్టుకొన్న వేళ
దక్కినట్టి ముంగిటినిధాన మైనాఁడు
యెక్కువై శ్రీవేంకటేశుఁ డిట్టే కొలువున్న వేళ
పక్కన నన్నిటాఁ బరబ్రహ్మమైనాఁడు ॥ఏమై॥
(17-499)

## శ్రీరాగం

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమునఁ గళలెల్లా మొలచినట్లుండె ॥పల్లవి॥

జగదేకపతి మేనఁ జల్లిన కర్పూరధూళి
బిగిగొని నలువంకఁ జిందఁగాను
మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనక
పొగరు వెన్నెల దీగఁ బోసినట్లుండె ॥ఒక॥



పొరి మెఱుఁగుఁ జెక్కులఁ బూసిన తట్టుపుణుఁగు
కరఁగి యిరుదెసలఁ గారఁగాను
కరిగమనవిభుఁడు గనకమోహమదము
తొరిగి సామజసిరి దొలఁకి నట్లుండె ॥ఒక॥

మెఱయ శ్రీవేంకటేశు మేన సింగారము గాను
తఱచయిన సొమ్ములు ధరియించఁగా
మెఱుఁగుఁబోణి యలమేలుమంగయుఁ దాను
మెఱపు మేఘము గూడి మెఱసినట్లుండె ॥ఒక॥
(17-485)

## దేశాక్షి

కంటిమయ్య నీ చేఁతలు కన్నులపండుగ గాను
పెంటలైన ముచ్చటలే ప్రియము నీకు ॥పల్లవి॥

మంతన మాడేటి వేళ మజ్జన మాడేటి వేళ
ఇంతి తోడి సరసము లింపులు నీకు
అంతలోఁ గప్పురకావు అవధరించేటివేళ
సంతతపు వసంతము చవులు నీకు ॥కంటి॥

పొందుల వేళలఁ దట్టుపుణుఁగు పూసేటి వేళ
ఇందుముఖితోడి మాట లితవు నీకు
చెందమ్మి పూవు దండలు సింగారించుకొనే వేళ
విందుల మోవి యీవులు వేడుక నీకు ॥కంటి॥

సొలసి నవ్వేటివేళ ఇమ్ము లిడుకొనే వేళ
అలమేల్మంగ కూటమి అనువు నీకు
యెలమి శ్రీవేంకటేశ! ఇద్దరుఁ బెండ్లాడే వేళ
కొలువులోని మొక్కులు కొసరు నీకు ॥కంటి॥
(19-136)

## శ్రీరాగం

కంటి మిదివో నేము కన్నులపండుగ గాను
జంటలఁ గొలువై నీవు చనవియ్యఁ గాను ॥పల్లవి॥

హేమంతకాలము నేఁడు యిటు నీ తిరుమేన
ఆముకొని జనియించినట్లుండెను
భూమిఁగల కప్పురము పొడిసేసి నిలువెల్లా
నేమముతో నిందరును నీకుఁ జాతఁగాను ॥కంటి॥

వానకాలము నీలవర్ణముతోఁ దిరుమేన
సోనయై కురిసినట్టు చూపట్టెను
సేనగా దట్టుపుణుగు చిత్తడిగా సర్వాంగాల
పూని యిందరును నీకుఁ బూయఁగాను ॥కంటి॥

వసంతకాలము తానె వచ్చి నీ తిరుమేన
యెసఁగినట్టు శ్రీవేంకటేశ! తోఁచెను
వెస నలమేల్మంగతో వింతసొమ్ము నీ వురాన
పొసగించందరు నిన్నిందరు బొగడఁ గాను ॥కంటి॥

(23-142)

## బౌళి

కంటి వటవయ్య నీవు కన్నుఁ గొనల
వెంటనే చెయివట్టి తెర వేయవయ్య ఇపుడు ॥పల్లవి॥

కంకణ సూడిగములు గల్లురనఁగాఁ జెలి
పంకముగాఁ గస్తూరి నీ పై నలఁది
సుంకులఁ గుచాలు నిన్ను సోకెనంటా సిగ్గువడి
అంకెలఁ దలవంచుక అదివో నవ్వీని ॥కంటి॥



మొలనూలి గంటలు మోయగా నీ శిరసున
నలరు తట్టుపుణుఁగు అట్ట నీ కంటి
యెలమి మర్మాలు నీకు నెక్కడనో తాఁకెనంటా
తెలిగన్నులను నీ దిక్కే చూచీని ॥కంటి॥

మట్టెల రవళితోడ మంచము మీఁదట నుండి
అట్టుగా మెప్పించె నిన్నాఁడి భావాల
ఇటె శ్రీవెంకటేశ! యింత సేయించితివంటా
ముట్టి మోవి తేనె లాని మోహము చల్లీని ॥కంటి॥

(7-512)

## ఆనందభైరవి

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని ॥పల్లవి॥

సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ము మొలచుట్టి
తుమ్మెద మైచాయ తోన నెమ్మది నుండే స్వామిని ॥కంటి॥

పచ్చ కప్పురమె నూతి పసిఁడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది
అచ్చెర పడిచూడ అందరి కన్నుల కింపై
నిచ్చ మల్లె పూవువలె నిటు తా నుండే స్వామిని ॥కంటి॥

తట్టు పునుఁగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరఁగించి వెండి పళ్యాల నించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరి స్వామిని ॥కంటి॥

(శేషాచార్యుల వారి వ్రాతప్రతి)

## మలహరి

కన్నుల పండుగలుగా కని మొక్కుదురు నీకు
యిన్నిటా మరుని తండ్రి యీతఁడే పో యనుచు ॥పల్లవి॥

చాలఁ బన్నీట మజ్జన మాడేటి వేళ నిన్ను
పోలించి పొగడుదురు బుదు లెల్లాను
నీలవర్ణమే వచ్చి నిలిచి పురుషాకార
మీలీలఁ దాలిచె నేఁడు యిదివో యనుచు ॥కన్నుల॥

నిగిడి కప్పురధూళి నిండా నీ మేన నించఁగాఁ
దగ నానందింతురు నీ దాసులెల్లాను
వొగిఁ బాలజలధికి వొడ్డిన సప్తాంగాలు
జిగి మొలిచె నిదివో చెలువుగా ననుచు ॥కన్నుల॥

అంచఁ దట్టుపుణుఁగు పూసెల మేలుమంగ నెద
నుంచు కొంటేనే మెత్తురు యోగీంద్రులెల్లా
కాంచనపు గనులతోఁ గలయ శేషాచలము
ముంచి శ్రీవేంకటేశ్వరమూర్తి యాయ ననుచు ॥కన్నుల॥

(17-496)

## శ్రీరాగం

కప్పురమునకు ఁగప్పురమై
చిప్పిలుఁ దావి మించె నితఁడు ॥పల్లవి॥

బంగారమునకు బంగారమై
శృంగారమమరె శ్రీహరికి
అంగమయిన మొల పీతాంబరమున
కొంగు బంగారై కూడె నితఁడు ॥కప్పు॥



తట్టుపుణుఁగునకుఁ దట్టు పుణుగయి
ఘట్టి మేన మించెఁగా యీతఁడు
నెట్టన నొసల నిండిన కస్తూరి
బొట్టు చెమటతోఁ బొలిచె నితఁడు ॥కప్పు॥

పన్నీట పాదాన పన్నీరే తానయి
యిన్నిట శ్రీవేంకటేశుఁడిదే
ఉన్నతి జలధి నుదయమున
కన్నియ కౌఁగిట ఘనుఁడితఁడు ॥కప్పు॥

(4-నిడు-7)

## పాడి

కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీ మహిమలే పరబ్రహ్మ మాయ ॥పల్లవి॥

ఆకాశము వంటి మేన నమరే మూర్తివి గాన
ఆకాశనదియె నీకు నభిషేకము
మేకొని నీవే నిండు మేఘ వర్ణుఁడవు గాన
నీకు మేఘపుష్పాలే పన్నీరు కాపు ॥కోటి॥

చంద్రుఁడు నీ మనసులో జనియించె నటుగాన
చంద్రికలు కప్రకాపై సరి నిండెను
యింద్రనీలపు గనులు యిలధరుఁడవు గాన
తంద్రలేక యాపె చూపే తట్టుపుణుఁగాయను ॥కోటి॥

లక్ష్మీపతివి గాన లాగుల నీ వురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీ తాళి
సూక్ష్మమై శ్రీవేంకటేశ! చుక్కల పొడవు గాఁగ
పక్ష్మ నక్షత్రములే యాభరణ హారములు ॥కోటి॥

(17-494)

## ఆహిరి

కోనే ఉద్దండను నీకు కోరిక లెల్లాఁ జెల్లె
పూని సర్వసంపదల పురుషోత్తమా ॥పల్లవి॥

అదనఁ గప్పూర కాపు అవధరించే వేళ
అదివో నారాయణత్వ మమరె నీకు
నిదుల నేకోదకము నీ రూపమే కనక
పొదలుచు నిదివల్లఁ బుట్టె నీ జగము ॥కోనే॥

ఆరీతిఁ గప్పూరకావు అవధరించేవేళ
క్షీరాబ్ధిశాయి వనుట ఁజెల్లెను నీకు
తేరి పాలఁ బుట్టెను నీ దేవుల మహిమ గన
ఆరయఁ బాలే జీవుల కాధార మాయను ॥కోనే॥

నీ తట్టు పుణుఁగు వేళ నీలవర్ణ నామమబ్బె
ఘాత నల్లని రాత్రిఁ బగలు నీ మేను
ఆతుమ శ్రీవేంకటేశ! అలమేలుమంగ నీకు
నీతి నురమెక్కిఁ గన నిండె సొమ్ము లెల్లను ॥కోనే॥

(17–495)

## దేసాళం

చిక్కని సింగారరాయ! శ్రీవేంకటేశ! నీకు
అక్కున నున్న తరుణి యన్నియునుఁ గాదా ॥పల్లవి॥

యింతి చూపు వెన్నెలలు యిటు నీపైఁ బోసితేనే
కాంతి నీ కదే కప్పురకాపు గాదా
పంతాన గిన్నెల తోడి పచ్చకప్పురపు ధూళి
యింతయు నీ మై నలఁదే నిది గొంతవలెనా ॥చిక్కని॥



చెలి బొమ్మజంకెనల చీఁకటి పైఁబోసితేనే
కలిమి నదే పుణుఁగు కాపు గాదా
పలు భరణుల తోడి పచ్చి తట్టు పుణుఁగెల్లా
నిలువున నలఁదేవు నీకు నిది వలెనా ॥చిక్కని॥

వనిత మేని కాంతులు వడి నీపైఁ జిమ్మితేనే
సునిసి నీ కవే పెక్కు సొమ్ములు గావా
అనుగు శ్రీవేంకటేశ! అలమేలుమంగఁ గూడి
తనియ సొమ్ము వెట్టితి తగు నిది నీకు ॥చిక్కని॥

(17–533)

## నాదరామక్రియ

చెప్పరాదు నీ వుండేటి చెలువములు
చిప్పిలీ నీ మేన నెల్లా సింగారాలు ॥పల్లవి॥

కతలుగాఁ బానుపుపై కాఁగిటఁ బెనఁగే వేళ
సతి చెమటే పన్నీటి జలకములు
యితవుగా లోలోన యెనసి వుండేటి వేళ
గతి కూడ నవ్వే నవ్వు కప్పుర కాపు ॥చెప్పు॥

సొలసి సొలసి నీతో జోడై వుండేటి వేళ
తలిరుఁ బోడి చూపులే తట్టుపుణుఁగు
పులుకని తమకాన పురమెక్కి నట్టివేళ
నిలువు మేని కాంతి నీ మేని సొమ్ములు ॥చెప్పు॥

అంగపురతులఁగూడి అలసి వుండేటి వేళ
అంగన మోవి తీపులే యారగింపులు
చెంగట నలమేల్ మంగ శ్రీవేంకటేశ! నిన్ను
నంగవించి కూడె నీవే యఖిల భోగాలు ॥చెప్పు॥

(7–129)

## మాళవిగౌళ

చెప్పరాదు యీతని సింగారాలు
ముప్పిరి గొని సిరులు ముంచెనో కాని ॥పల్లవి॥

అండనే కప్పుర కాఁపు లదివో దేవునికి
మెండుకొని అమరెను మేన నెల్లాను
పుండరీకాక్షుఁడు గాన పొదలి తెల్లని కాంతి
నిండుకొని నిలువెల్లా నెరసెనో కాని ॥చెప్ప॥

తట్టుపుణుఁగు కాఁపు దైవాలరాయనికి
దట్టమై యమరె నిదె తనువెల్లాను
చుట్టు నెమలి పెంచము చుంగుల నల్లని కాంతి
అట్టె అంగముల నెల్లా నలమెనో కాని ॥చెప్ప॥

అలమేలుమంగ పురమందు శ్రీ వేంకటేశున
కెలమి నమరె యిదె యీ తనువున
మొల పీతాంబరమున మొలచిన పైఁడికాంతి
అలరి మెడను సొమ్ము లాయనో కాని ॥చెప్ప॥
(23-148)

## సామంతం

చెప్పరాని మహిమల శ్రీదేవుఁడితఁడు
కప్పి కన్నుల పండుగగాఁ జూడరో ॥పల్లవి॥

అద్దుచుఁ గప్పురధూళి యట్టె మేన నలఁదఁగా
వొద్దిక దేవునిభావ మూహించితేను
మద్దులు విరిచినట్టి మంచి బాలకృష్ణునికి
మద్దుల కాంతి మేన మలసినట్టుండె ॥చెప్ప॥



అమరఁ దట్టుపుణుఁగు అవధరించఁగాను
తమితోఁ బోలికె లెల్లఁ దచ్చి చూడఁగా
యమునానది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానది నలుపు అంటిన యట్టుండె ॥చెప్ప॥

అంగముల శ్రీవేంకటాధిపున కింతటాను
సింగారించి సొమ్ములెల్లఁ జెలరేఁగఁగా
బంగారపు టలమేలుదుంగ నురాన నుంచఁగా
బంగారము మేననెల్లాఁ బరగి నట్టుండె ॥చెప్ప॥
(3-168)

## శంకరాభరణం

చేతు లెత్తి మొక్కరమ్మ చేరి యార తెత్తరమ్మ
యేతులే బూమెల్లా నిండె నీ దేవదేవునికి ॥పల్లవి॥

తతిగొని పన్నీటి ధారలు పై నించి నించి
సతముగాఁ బెద్దలు మజ్జన మార్చఁగా
అతివల చనుఁగొండ లంగము లొత్తినందుకు
యితవులై తోఁచె నేఁడు యిందిరాపతికి ॥చేతు॥

కప్పురపుధూళి మేనఁ గలయఁగ గంపెడేసి
నెప్పున సందుసందుల నిగిడించఁగా
దొప్పులెత్తి గొల్లెతల చూపులు దాఁకిన కుమ్మె
లప్పు దన్నియునుఁ గప్పె నందువల్ల హరికి ॥చేతు॥

తట్టుపుణుఁగలఁది యందపు టలమేలు మంగ
నట్టే పురము మీఁద నమరించఁగా
నెట్టనఁ బచ్చి సేసిన నెలఁతల చేఁతలలో
చిట్టకము లెల్లాఁ గప్పె శ్రీవేంకటపతికి ॥చేతు॥
(17-529)

## శంకరాభరణం

చూడఁజూడ వింతలోనే సుక్కరారము నాఁడు
ఆడ నీడ విభవాలే అమరె దేవునికి ॥పల్లవి॥

మేటి పాలజలధిలో మీఁగడ లంటెనో కాని
వీటనే దొంగిలినట్టి వెన్న లంటెనో
మాటుక యాకాశ గంగ మరు గంటెనో యనఁగ
ఆటల గర్పూరపు కాపు లమరె దేవునికి ॥చూడ॥

శిసువులఁ దెచ్చునాఁడు చీఁకటి యంటెనో కాని
మసలక కరిఁ గాచే మద మంటెనో
సుసరాన నీలికాసె సొగ లంటెనో యనఁగ
అసుదై పుణుఁగు కాపు లమరె దేవునికి ॥చూడ॥

పరమతేజంబైన ప్రభలు చల్లెనో కాని
వురము శ్రీపతి యున్న వొరపు లివి
అరిది శ్రీవేంకటేశు కలమేలుమంగతోడ
అరలేక సొమ్ములెల్ల నమరె దేవునికి ॥చూడ॥

(17-526)

## బౌళి

చూడరమ్మ యిదె నేఁడు సుక్కురారము
వేడుక చక్కదనాలు వేవేలైనాఁడు

చప్పుడుతోఁ బన్నీటి మజ్జనముతో నున్నవాఁడు
అప్పుడే ఆది నారాయణుని వలె
కప్పురకాపా మీఁదఁ గడుఁ బూసుకొన్నవాఁడు
ముప్పిరిఁ బులు కడిగే ముత్యమువలె ॥చూడ॥



పొసఁగ నప్పటిఁ దట్టు పుణుఁ గలఁదు కొన్నాఁడు
కసుగందని కాల మేఘమువలెను
సుసరాన మేనునిండా సొమ్ము వెట్టుకొన్నవాఁడు
పసలఁ బదారు వన్నె బంగారు వలెను ॥చూడ॥

అలమేలుమంగ నురమందు నిడుకొన్నవాఁడు
యెలమి సంపదలకు నిల్లువలెను
అలరుచు శ్రీవేంకటాద్రిమీఁద నున్నవాఁడు
తలపోసి చూడఁగ దొంతరకొండవలెను ॥చూడ॥

(17-498)

## సామంతం

చొక్కపు నీ పెండ్లి నేఁడె సుక్కురారము
అక్కరతో నిన్నియు నవధరించవయ్యా ॥పల్లవి॥

పడఁతి చెమటలే పన్నీటి జలకము
వెడఁగు ముద్దుమాటలు వేదమంత్రాలు
యెడయని యాకె పయ్యెద కొంగే తడియొత్తు
అడియాలపు మజ్జన మవధరించవయ్యా ॥చొక్కపు॥

తరుణి సెలవి నవ్వు తగిన కప్పురకాపు
తరమైన కనుచూపు తట్టుపుణుఁగు
విరుల తావి వూర్పులే విసరేటి చల్లగాలి
అరుదైన వుపచార మవధరించవయ్యా ॥చొక్కపు॥

అలమేలుమంగ కాఁగి లంటుదామెరల పూజ
పోలివోని మేని కాంతి భూషణములు
యెలమి శ్రీవేంకటేశ! ఇద్దరునుఁ గూడితిరి
అలవడె విభవము లవధరించవయ్యా ॥చొక్కపు॥

(18-558)

## దేవగాంధారి

జోడు గూడితి రిద్దరు సొంపగు జాణలె మీరు
తోడ నీళ్ళాడరయ్య దొరకె మీ కిపుడు ॥పల్లవి॥

చెలియ గుబ్బల మీఁది చెమట పన్నీరుకాపు
కలకలమను నవ్వు కప్పురకాపు
మలసేటి వినయపు మాటలు వేదమంత్రాలు
వెలసె మజ్జనవేళ వింతలాయ మీకు ॥జోడు॥

కాంత మేనితావి యలుకటి చందనపు కాపు
పొంతఁ గడకుంటే చూపు పునుఁగు కాపు
సంతసపు సరసాలు జరపేటి వూడిగాలు
యింతటా మజ్జనవేళ యితవాయ మీకు ॥తోడు॥

ఇయ్యలమేల్మంగ కాంతు లెత్తే తిరుపండి కాపు
గయ్యాళి మదరాగము కస్తూరి కాపు
ఇయ్యెడ శ్రీవేంకటేశ! యెనసితి రిద్దరును
వొయ్యన మజ్జనవేళ వొరపాయ మీకు ॥జోడు॥

(19-292)

## లలిత

దీపించఁ జక్కదనము దేవునికిని
పైపైఁ జల్లేరు నేఁడు పన్నీరుకాపు ॥పల్లవి॥

వుడివోని కల్పభూజ మొద్దికఁ గొమ్మలతోనే
పొడవెల్లాఁ దెల్లనై పూచెనో కాక
యెడలేక తిరుమేన నింతటా మెత్తి రిదివో
కడలేని హరికిని కప్పురకాపు ॥దీపించ॥



తిరమై యాకాసమందు తెల్లని చంద్రుని మీఁద
వరుస నిల మేఘము వాలెనో కాక
సరసనే శశివర్ణమై నందు
పురిగొన నించి రిదే పుణుగుకాపు ॥దీపించ॥

పొంచి నీలగిరి మీఁదఁ బొసగి బంగారుకొండ
అంచెలఁ గీలించినట్టి యందమో కాక
మించి శ్రీవేంకటపతి మెడ నలమేలుమంగఁ
జంచులఁ బెట్టి పూసిరి చందనకాపు ॥దీపించ॥

(19-569)

## శ్రీరాగం

దేవతలు సేవించఁగా దివ్యదుందుభులు మ్రోయ
శ్రీవల్లభుని భావము చెలులెల్లఁ జూడరే ॥పల్లవి॥

నిండుసింగారముతోడ నిలువు గోణము గట్టి
అండఁ బన్నీటి మజ్జన మవధరించి
దండిగా శిరసున తడిసూదులు చుట్టుక
వుండెడి దేవుని భావ మువిదలు చూడరే ॥దేవ॥

కప్పురకాపు మేన కలయఁగ మెత్తి మెత్తి
చిప్పిలఁ దట్టుపుణుఁగు చికిలి సేసి
చొప్పుగా నవరత్నాల సొమ్ములు మేనఁ జాతి
ఇప్పుడున్న హరిభావ మింతు లెల్లఁ జూడరే ॥దేవ॥

అలమేలుమంగ నురమందు నెలవు కొలిపి
తలకొన నంతటాఁ బాదండలు వేసి
చెలఁరేగి యారగించి శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువై వున్న భావము కొమ్మలెల్లఁ జూడరే ॥దేవ॥

(23-376)

## దేసాళం

దేవదుందుభులతోడ తేటతెల్ల మైనాఁడు
సేవించక యిదే వీఁడే సింగారదేవుఁడు ॥పల్లవి॥

బంగారు మేడలలోనఁ బన్నీట మజ్జనమాడి
అంగము తడి యొత్తఁగా నదే దేవుఁడు
ముంగిట బులుకడిగిన ముత్యమువలె నున్నాఁడు
కుంగని రాజసముతో కొండవంటి దేవుఁడు ॥దేవ॥

కాంతులు మించిన మాణికపు దోరణము కింద
అంతటఁ గప్పురము చాతు కదే దేవుఁడు
పొంతల నమృతము పోగై నట్టున్న వాఁడు
సంతతము సంపదల సరిలేని దేవుఁడు ॥దేవ॥

తట్టు పుణుఁగు నించుక దండిసొమ్ములెల్లాఁ బెట్టి
అట్టెల మేల్మంగ నరుతఁ గట్టి
నెట్టన నమ్మినవారి నిధానమై వున్నవాఁడు
పట్టపు శ్రీవేంకటాద్రిపతియైన దేవుఁడు ॥దేవ॥

(3-725)

## శంకరాభరణం

దేవ నీ వునికి తేటతెల్లమాయను
భావించ మాకుఁ గన్నుల పండుగాయను ॥పల్లవి॥

పన్నీటి జలకములు భామకనుచూపులును
యెన్నికెఁ గూడుక నీమై నేరులై పారె
తిన్నని చెమటెల్లా తిరుమేన నెల్లా నిండి
అన్నిటా ముత్యాల పెనుహారము లాయ ॥దేవ॥



తెల్లని కప్పురకాపు తెఱవనవ్వులు గూడి
పొల్లుగాని పుప్పొళ్ళ పోగులాయను
మెల్లనె నీవు రూపుల(?) మించుల రవలు రేఁగి
వొల్లనె తడిసూళ్ళ వొత్తు లాయను ॥దేవ॥

అంగంపుఁ బుఱుగు కాపు అలమేలుమంగఁ గూడి
సింగారాలాయను మంచి సిరులాయను
ముంగిట శ్రీవేంకటేశ! మోహనపు మీ కూటమి
సంగతిఁ బువ్వుదండల జాడలాయను ॥దేవ॥

(7-137)

## ధన్నాసి

నానారూపధరుఁడు నారాయణుఁడు వీఁడె
పూనిన వుపమ లెల్లాఁ బొసఁగె నితనికి ॥పల్లవి॥

గరిమ నేరులు వానకాలమునఁ బెనగొని
సొరిది సముద్రము చొచ్చిన యట్లు
పురుషసూక్తమున విప్రులు సేసే మజ్జనము
అరుదుగఁ బన్నీ రెల్లా నమరే నీ హరికి ॥నానా॥

అట్టే వెల్లమొయిళ్లు ఆకసాన నిండినట్టు
గట్టిగా మేన నిండెను కప్పురకాపు
నొట్టి తన విష్ణుమాయ నొడలిపై వాలినట్టు
తట్టు పుణుఁ గమరెను దైవాలరాయనికి ॥నానా॥

నిలువున సంపదలు నిలిచి రూపైనట్టు
తెలివి సొమ్ములపెట్టె దెరచి నట్టు
అలమేలుమంగ వురమున నెలకొనె నిదే
చెలరేఁగి శృంగారాల శ్రీవేంకటేశుఁడు ॥నానా॥

(17-503)

## సామంతం

నిన్నుఁ జూచి వెంగేలు నే నాడఁ జుమ్మీ
నిన్ను కన్న మాటలకే వేరొకతె యాడేను ॥పల్లవి॥

పన్నీట మజ్జన మాడి పైపై తడిసూళ్ళొత్తి
వున్నతి నీవు నిలుచుండఁగాఁ జూచి
మున్నే నీ వెవ్వతెనో ముట్టుదానిఁ బొంది వచ్చి
విన్నాణాలు చూపేవంటా వేరొకతె నవ్వేను ॥నిన్ను॥

కప్పురధూళి మేన కదు నిండా మెత్తుకొని
చిప్పిలఁ దెల్లని రూపై చెలువొందఁగా
చొప్పున వెన్న ముచ్చిమి సోకె నిట్టె మచ్చెమంటా
విప్పుచు నీ కొంగు వట్టి వేరొకతె దీసెను ॥నిన్ను॥

వొట్టుక పుళుగు పూసి వురాన నలమేల్మంగ
గట్టుక శ్రీవేంకటేశ! కదు మించఁగా
యిట్టె చీకటితప్పు సేసిటు నల్లవైతి వంటా
వెట్టికి నీ నా పొందులు వేరొకతె మెచ్చెను ॥నిన్ను॥

(17–491)

## శ్రీరాగం

నీకే తెలుసునయ్య నీ సుద్దులు
పైకొని నేమడిగితే భ్రమయ నేమిటికి ॥పల్లవి॥

చెమటేల వచ్చెనో సిగ్గువడి యంతలోనే
చమరి కప్పురధూళి చల్లుకోనేల
సముకాన నేమింతలో సారె సారె నవ్వితేను
అమరఁ దట్టుపుణుఁగు అందుపైఁ బూసేవు ॥నీకే॥



నీ కంటే ముందు కప్రము నెలఁతకు మీఁదుకట్టి
దాకొని మిగిలించేల ధరియించేవు
జోకతో నేము నీ మోము చూచితేఁ బరాకు చేసి
ఆకెఁ గూడి పన్నీరు అట్టే చల్లుకొనేవు ॥నీకే॥

తెలుపు కప్పురము నలుపు తట్టుపుణుగు
కలగంప రూపు లేల కై కొనేవు
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు నీ
వెలమిఁ గలసి మమ్ము నెంత మన్నించేవు ॥నీకే॥

(13–506)

## శంకరాభరణం

నేఁడె సుక్కురారము నెలఁతలాల
పోఁడిమి సేవ సేయరే పుణుగు కాపు ॥పల్లవి॥

పన్నీటి కాలువలు పారీనిఁ జూడరే
అన్నిటాఁ గొండవంటి శ్రీహరి మీఁదను
యెన్న నభిషేకమంత్రాలిదె చెప్పేరు వినరే
తిన్నని పుళుగు కాపు దేవునికి నేఁడు ॥నేఁడె॥

రాలీని కప్పుర రజ మిదె చూడరే
నీలమేఘము వంటి యీ నీరజాక్షుపై
తాలిమితో జాలువారీ తట్టుపుణుఁ గది గోరే
పోలింపఁ బుణుఁగు కాపు పురుషోత్తమునికి ॥నేఁడె॥

అలమేలుమంగతోడి హారాలు సేవించరే
వెలయ ధరించెను శ్రీ వెంకటేశుఁడు
పలువిందు లారగించె బాగాలు యియ్యరే
చెలఁగీ పుణుఁగు కాపు శేషాద్రి పతికి ॥నేఁడె॥

(8–153)

## రామక్రియ

పదియుఁ బదియుఁ గాను పరమాత్ముఁ డితనికి
వెదకి చవులు దెచ్చి విందు లిట్టె సేయరే ॥పల్లవి॥

పొలుసు పైఁ బారెనట బురుద మేలంటెనట
యిల మన్ను మోఁచెనట యీ దేవుఁడు
నెలవైన రాకాసి నెత్తుటఁ దోఁగినాఁడట
కలపన్నీ రెల్లఁబోసి కడుగరే దేహము ॥పది॥

బాఁపన జిడ్డంటెనట పట్టెనట ముమ్మురము
కై పగు నల్లని కోక గట్టినాఁడట
చాపలానఁ జెంచుదాని సంగడిఁ దిరిగెనట
కోపులఁ గప్పురధూళి గుప్పరే యీతనికి ॥పది॥

కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతలఁ దట్టుపుణుఁగు పూయరే నేఁడు
యింతటి శ్రీవేంకటేశు నెద నలమేలు మంగఁ
గాంతునికి మెడఁగుచ్చి కట్టరే మొక్కుదము ॥పది॥
(19–335)

## శ్రీరాగం

పులు కడిగిన యట్టి పురుషోత్తముఁడు వాఁడె
యెలమి నారతులు మీ రెత్తరే దేవునికి ॥పల్లవి॥

గొప్ప యింద్రనీలాల కొండ మంచు గప్పినట్టు
నెప్పు మింట పాలవెల్లి నెరసినట్టు
విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు
కప్పురధూళి మేనకఁ గప్పిరి దేవునికి ॥పులు॥



నిండు నైరావతముపై నీలి జగ గప్పినట్టు
వెండి మేడపైఁ జీఁకటి విడిసినట్టు
పుండరీకపుఁ గొలను పొరిఁ దేంట్లాగినట్టు
మెండగు తట్టుపుణుఁగు మెత్తిరి దేవునికి ॥పులు॥

అదె నల్లఁగలువలన కరువు లుండినట్టు
మెదగి కస్తూరి భూమి మేరువున్నట్టు
యెదుట శ్రీవెంకటేశు యెద నలమేల్మంగను
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి ॥పులు॥
(17–506)

## ముఖారి

పొద్దొక చాయల వాఁడు పురుషోత్తముఁ డితఁడు
కొద్ది లేని మెఱుఁగులే కుప్పయై నట్టాయనూ ॥పల్లవి॥

చక్కని దేవుఁడదే జలకము లాడఁగాను
వెక్కసపు తిరుమేని వెల్లు లాయను
చొక్కపు గోపిక లెల్లాఁ జూచిన తేటల మాపు
తక్కక యీతని మేన దైవారి నట్టాయ ॥పొద్దొక॥

కప్పుర కాపుమేనఁ గడు నిండా మెత్తుకోఁగా
నెప్పున వెన్నెల వన్నె నిండుకొనెను
అప్పటిఁ బదారు వేలు అందరును నవ్వఁగాను
ముప్పిరి నీతని మేన ముంచిన యట్టాయను ॥పొద్దొక॥

చెలఁగి పుణుగు కాపు శ్రీవేంకటేశుఁడు పూసి
పలు రత్నాల సొమ్ములఁ బరగీని
అలమేలుమంగ కొప్పు నందలి నీల వర్ణము
యెలమిఁ దిరుమేనను యిరవై నట్టాయ ॥పొద్దొక॥
(17–492)

## శుద్ధవసంతం

పొద్దొక వన్నెల వలెఁ బొదలీని చూడఁగానే
వద్ద నుండీఁ దలపోయ వచ్చునా యీ దేవుని ॥పల్లవి॥

అల్ల వాఁడే జలకము లాడీని దేవుఁడు
చల్లని పన్నీటి వాసన మించఁగా
తొల్లిటి జడివానలతోడి యశోకము వలె
వెల్లివిరై వున్నవాఁడు వింత వింత రీతుల ॥పొద్దొక॥

తొప్పఁదోఁగి తిరుమేనుతో మించుకొనీ నితఁడు
కప్పురపు బిండిచేతఁ గాఁక దీరఁగా
పుప్పొడిఁ దోఁగిన కల్పభూజము కొలువువలె
ముప్పిరి నిలుచున్నాఁడు మోహనాకారము ॥పొద్దొక॥

తట్టుపుణుఁ గలఁదీని తగు శ్రీవేంకటేశుఁడు
వొట్టిన యలమేల్మంగ వుర మెక్కఁగా
తొట్టిన బంగారు యేరు తోడి సముద్రునివలె
గట్టియై సంపదలను గంభీరమునను ॥పొద్దొక॥
(17-504)

## శ్రీరాగం

బంగారు మేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁద మీఁద సేయరే చెలులు ॥పల్లవి॥

తట్టు పుణుఁగుల నూనె తగ నిండా నంటుకొని
గట్టిగాఁ గస్తూరి యట కలివెట్టి
మట్టులేని పన్నీట మజ్జనమాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు ॥బంగారు॥



కప్పురపు గందవొడి కడు నిట్టె మెత్తుకొని
కొప్పు దువ్వి ముడిచెను గొజ్జంగ లెల్లా
తెప్పలుగా నించుకొనె తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడెమీరే తలకొని చెలులు ॥బంగారు॥

అలమేలుమంగ నురమందు నిట్టె నించుకొని
తలసి దండలు మోఁచె నిలువునను
చెలరేఁగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాడు మోహాలు గుప్పరే చెలులు ॥బంగారు॥
(23-330)

## శ్రీరాగం

భావించరే చెలులాల! పరమాత్ముని
చేవదేరి చిగురులో చేఁగయై యుండెను ॥పల్లవి॥

మలసి పన్నీట హరి మజ్జన మాడేవేళ
కలశాబ్ధిఁ దేలే మాణికమువలె నుండెను
అలరి కప్పురకాపు అవధరించేటి వేళ
మొలచిన వెన్నెల మొలకయై యుండెను ॥భావి॥

అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటి వేళ
యెంచ నంజనాద్రిపై యేనుఁగై వుండెను
మించిన హారము లెల్ల మేన నించుకొన్నవేళ
మంచి మంచి నక్షత్రమండలమై యుండెను ॥భావి॥

వున్నతి నలమేల్మంగ నురమున నుంచువేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను
వన్నె శ్రీవేంకటేశుఁడు వరము లిచ్చేటివేళ
తిన్ననై యందరి భాగ్యదేవతయై యుండెను ॥భావి॥
(3-165)

## మాళవిగౌళ

భావించి చూడరే పడఁతులాల!
చేవ దీరి మహిమలు చెలఁగి నట్టుండెను ॥పల్లవి॥

పరమపురుషునికి పచ్చకప్పురము కాఁపు
తిరుమేన నమరెను తెల్లని కాంతి
ధరలోఁ బాలజలధి తచ్చేటి వేళను
మురిపెమై తుంపురులు ముంచిన యట్టుండెను ॥భావిం॥

తవిలి యీ దేవునికి తట్టుపుణుఁగు కాఁపు
నవమై మేన నమరె నల్లని కాంతి
తివిరి గోవర్ధన మెత్తిననాఁడు నిండుకొని
ధ్రువమై మేఘకాంతులు తొలఁకి నట్టుండెను ॥భావిం॥

శ్రీవేంకటేశునికి సింగారించిన సొమ్ములు
భావించ మేన నమరె బంగారు కాంతి
తావుగా నలమేల్ మంగ తన వుర మెక్కఁగాను
వేవేలు సంపద లెల్లా వెలసి నట్టుండెను ॥భావిం॥
(23-154)

## నాగవరాళి

భోగించవయ్యా మంచి భోగము లెల్ల
తీగె సాగిన మోహమే దిష్ట సంపదాయను ॥పల్లవి॥

పలుకుఁదేనెలు నీపైఁ బలుమారుఁ జిందఁగాను
కలిమిఁ బన్నీటి జలకము లాయను
కలికి నవ్వులు నట్టె కలయఁగఁ జల్లగాను
అలరి కప్పుర కాపునై మించెను ॥భోగి॥



జిగి సింగార రసము చేరి నీపై నొలుకఁగా
పొగరు మించుల తట్టు పుణుఁగాయను
మగువ కాంతులు నిన్ను మచ్చికతో నొరయఁగా
సొగసుగాఁ జాతుకొన్న సొమ్ములాయను ॥భోగి॥

అలమేల్మంగ నీ పురమందు నెలవు కొనఁగా
బలిమి నన్నిటా నీ భాగ్యమాయను
యెలమి శ్రీ వేంకటేశ! యీకె నినుఁ గూడగాను
కలకాలమును నిట్టె కాణాచాయాను ॥భోగి॥
(23-498)

## దేసాళం

మదనగురుని మంచి మజ్జన వేళ
పొదిగొన్న సింగారాల పోగాయ నితఁడు ॥పల్లవి॥

తేరకొన బంగారు బిందెల నించి పన్నీట
శ్రీరమణునకు నభిషేకము సేయఁగా
తోరమైన పూదేనెలతోడి యంజనాచలము
కారుకమ్మి నటువలెఁ గనుపట్టె నిపుడు ॥మదన॥

కప్పురకాపు మేనఁ గలయఁగ మెత్తి మెత్తి
అప్పని కేకాంతాన నంగముల నించఁగాను
ముప్పిరి నేనుగకును ముత్యాల జల్లులనే
గుప్పె సింగారించినట్టు గుఱుతాయ నిపుడు ॥మదన॥

శ్రీవేంకటేశునకు చేరి యలమేల్మంగకు
ఆవటించి తట్టుపుణుఁ గన్నిటా నలఁద గాను
భావించఁ గల్పవృక్షముపై నీలమేఘములు
వేవేలుగా నిండినట్టి విధమాయ నిపుడు ॥మదన॥
(17-505)

## శంకరాభరణం

మదన జనకునికి మజ్జనవేళ
పదివేలు భోగములు పరగీనదె ॥పల్లవి॥

వున్నతి వేదఘోషాల నుర్వీధరుని మీఁద
పన్నీటి కాలువలు పారీనదె
మున్నిటి మునుల హస్తములఁ గప్పురపు ధూళి
కన్నుల పండుగగాఁ గప్పీనదె ॥మదన॥

సేసలుగా నలువంక శ్రీపతి విభుని మీఁద
వాసన తట్టుపుణుఁగు వడిసీనదె
భాసురపుఁ జంద్రగావి పట్టుదట్టి కాంతలెల్ల
ఆసల మొలఁ గట్టఁగా నమరీనదె ॥మదన॥

చెలరేఁగి సొమ్ములెల్లా శ్రీవేంకటేశ్వరు మేన
నెలకొని కాంతులతో నిండీనదె
అలమేలుమంగ వురమందు నెలకొని యట్టె
సలిగె గృపారసము చల్లీనదె ॥మదన॥

(3-163)

## శ్రీ రాగం

మదనుని తండ్రికి మజ్జన వేళ
పొదిగొనీ సింగారపు భోగము లెల్లాను ॥పల్లవి॥

పదఁతుల నవ్వులెల్లా పై నంటుకొన్నట్టు
కడలేక పొగడొందె ఁగప్పుర కాపు
నిడివిఁ గల్పవృక్షము నిండాఁ బూచినట్టు
కడుఁదెల్లనై యమరెఁ గప్పుర కాపు ॥మదను॥



సుదతుల చూపులు సోరిది పైఁ గప్పినట్టు
పొదిగొని జొబ్బిలీని పుణుఁగు కాపు
అదన నల్ల గలువ లట్టె ముంచుకొన్నట్టు
పొదలెఁ దిరుమేనను పుణుఁగు కాపు ॥మదను॥

అలమేలుమంగ వురమందుండి యనురాగము
కులికినట్టు పన్నీరుఁ గుంకుమ కాపు
యెలమి శ్రీవేంకటేశుఁడిన్ని సొమ్ములు నించుక
కొలువెల్లా నిండుకొని కుంకుమ కాపు ॥మదను॥

(7-493)

## లలిత

మహి మెల్లాఁ దొప్పఁ దోఁగె మజ్జన వేళ
సహజ శృంగారాలు జడిసె శ్రీపతికి ॥పల్లవి॥

ముత్తేల వానలెల్ల ముంచి కురిసిన యట్టు
హత్తి పన్నీట జలకమాయ హరికి
తత్తరానఁ దెల్ల మొయిలు తనుఁ బొదిగిన యట్లు
కొత్తగాఁ గప్పురపు కాపు గుప్పిరి దేవునికి ॥మహి॥

నీలపుఁ బేరులెల్లా నిండాఁ గట్టిన యట్టు
తేలఁ దట్టుపుణుఁగు మెత్తిరి పతికి
అలరి మెఱుఁగుఁ దీగె లలము కొనిన యట్టు
కోలుముందై సొమ్ములెల్లా గుప్పిరి విష్ణునికి ॥మహి॥

పెక్కు నవరత్నములు పెద్దరాసి వోసి నట్టు
యెక్కువ దండలు గట్టిరి మూరితికి
వొక్కట నలమేలుమంగ నురమునఁ గట్టిరిదె
చిక్కని నవ్వులు మించె శ్రీవేంకటేశునకు ॥మహి॥

(7-493)

## బౌళి

ముగురు వేలుపులకు మూల మీతఁడు
జిగి మీరి నెదుటను సేవించరే ॥పల్లవి॥

అంచలఁ బన్నీటి బిందె లందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా
వంచి సముద్రము మీఁద వానలు కురిసినట్టు
పొంచి యన్నిటాను ఉప్పొంగుచు నున్నాఁడు ॥ముగు॥

పచ్చకప్పురము మేనఁ బలుమారు మెత్తఁగాను
తచ్చి పున్నమ చంద్రుఁడే తానై వున్నాఁడు
అచ్చపుఁ దట్టు పుణుఁగు ఆ మీఁదఁ బుయ్యఁగాను
నిచ్చఁ గల్పకతరువు నీడయై వున్నాఁడు ॥ముగు॥

అలమేలుమంగ తోడనన్ని సొమ్ములు నించఁగా
పలు పంచవన్నెల సంపద యైనాఁడు
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ బ్రతాపించి
కులికి పుణ్యాల కెల్లా గురియైనాఁడు ॥ముగు॥

(17–530)

## శ్రీరాగం

మున్నే వేదాలు భూమి మోచుక వున్నాఁడవు
మొన్న నిన్నటి మాటలు మోఁపగలవా ॥పల్లవి॥

పన్నీరే చల్లుకొనేవు పదనెక్కీ వలపులు
పిన్న పిన్న ససులొత్తి పెరిగీఁ జుమ్మీ
కన్నెలు పదారు వేలు గలవాఁడవు మొదల
చన్నుల పంటరాసులు సరి మోవఁ గలవా ॥మున్నే॥



పూసేవు కప్పురధూళి పొది యెక్కీఁ గోరికలు
ఆ సలఁ దీగెలు వారి యలమీఁ జుమ్మీ
బేసబెల్లి గొల్లెతలు పెక్కులు గలవాఁడవు
సేసపంట పిడికెళ్ళు చేరి మోఁపఁగలవా ॥మున్నే॥

తట్టుపుణుఁ గలఁదుక తాళిగా నలమేల్మంగ
గట్టుకొంటి బంతిరతే కంకేయఁ జుమ్మీ
యిట్టే శ్రీవేంకటేశ! యెనమంద్ర మగఁడవు!
చెట్టదువఁ జేటఁడేసి సిగ్గు మోపఁగలవా ॥మున్నే॥

(17–497)

## సౌరాష్ట్రం

శ్రీ వేంకటేశ్వరునికి చెలి యలమేలు మంగ
వోవరిగా నెలకొని పురముపై నున్నది ॥పల్లవి॥

పొంచి మచ్చమైన నాఁటి పొలసుకంపులు వాయ
సంచులఁ బన్నీట మజ్జన మార్పరే
అంచెఁ గూర్మ వరహము లైనట్టి సొగటు దీర
మించఁ గప్పురధూళి మెత్తరే మేనను ॥శ్రీవేం॥

నరసింహపు గదరు నాఁటి వామనపు జిడ్డు
పరశురాముని గబ్బు పచ్చి నీడను
పరిమళము గట్టిన బంగారు గిన్నెఁ దెచ్చి
పొరిఁ దిరుమేనఁ దట్టుపునుఁ గిట్టె నించరే ॥శ్రీవేం॥

గొల్లముంజు రాచజడ్డు, కోరి బుద్ధుడైన సిగ్గు
చొల్లుగుఱ్ఱపు నూఁగు రొచ్చులు మానునా
ఇల్లిదె శ్రీవేంకటేశుఁడీ రూపై తానున్న వాఁడు
యెల్ల పూదండలు సొమ్ము లెక్కించరే ॥శ్రీవేం॥

(7–198)

## సాళంగనాట

సేవింపరో జనులాల చేరి మొక్కరో
భావింప నున్నాఁ డందరి భాగ్యము వలెను ॥పల్లవి॥

జలకమాడి వున్నాఁడు సర్వేశ్వరుఁడు నిగ్గ
గలిగిన మంచి కల్ల కలువ వలె
యెలమిఁ గప్పుర కాపు ఇదె చాతుకున్న వాఁడు
వెలలేని యట్టి పెద్ద వెండికొండ వలెను ॥సేవిం॥

అందముగఁ దట్టుపుణుఁ గలదుక వున్నవాఁడు
కందువ ఇంద్ర నీలాల గవి వలెను
ముందరి వలెనే తా సొమ్ములు నించుకున్న వాఁడు
పొందిన సంపదలకు పుట్టినిల్లువలెను ॥సేవిం॥

మించి యలమేలుమంగ మెడఁ గట్టుకున్న వాఁడు
పొంచి బంగారు తామెర పువ్వువలెను
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిదె కొలువై వున్నవాఁడు
నించిన దాసుల పాలి నిధానము వలెను ॥సేవిం॥
(20-406)



## అనుబంధం - 1

# కీర్తనలలోని కొన్ని పదాలకు అర్థాలు

పుట 57 భాగ్యవంతుఁడవు : అదృష్టవంతుఁడవు
సుకృతవంతుఁడవు : ధనవంతుడవు
పన్నినందుకు : సిద్ధపడినందుకు
దోమటి : మాయ, కపటము
అంగంపు : దేహాంగములకు కూర్చిన

పుట 58 జలజాక్షుడు : పద్మము వంటి కన్నులు కలవాడు
జలజాకరము : పద్మములకు ఆకరమయిన సరస్సు
ఘనశంఖపాణి : గొప్పదయిన పాంచజన్యమనే శంఖం పాణిలో ధరించినవాడు, మేఘగర్జనమువంటి సవ్వడి సేయగల శంఖం కలవాడు
నిధానము : పాతఱ
బరణి : కాటుక మొదలగునవి ఉంచుకొను పాత్ర

పుట 59 దైవాలరాయఁడు : దైవములకు రాయడు
సైకము : సూక్ష్మము

పుట 60 కొప్పెర : పెద్దమూతిగల పాత్ర
కాగు : పెద్దబాన, రాగిబిందె
కలపము : పరిమళద్రవ్యము కలిపిన చందనము
గంబూర : కర్పూరము
కుటిల కుంతలలు : వంకరతిరిగిన తలవెంట్రుకలు కలవారు

పుట 61 పాలవెల్లి : క్షీరసముద్రము
అఱుత : కంఠము
నవరసాలు : శృంగారాది రసానుభూతులు

పుట 62 అంగరాగము : మైపూత

వేదమంత్రపాటలు : అభిషేకం వేళ చదివే సూక్తాలు

పుట 63 కోవరపు గొల్లెతలు : గాఢానురాగం గల గొల్లెతలు

పుట 64 కావిరి : నలుపెక్కిన ఎర్రరంగు

కాళిమ : నలువు, వైవర్ణ్యము

పస : గంధపు పస

పుట 65 కవగూడి : ఎదుర్కొని

పుట 67 గారవాన : (ఆగమకార్యనిర్వహణ) గౌరవంతో

ఏఁకట : మిక్కిలి అపేక్ష

పుట 68 నిబ్బరాన : పారవశ్యాన

తాడుపడి : బంధితమగు, లగ్నమగు

పుట 69 గోణము : కౌపీనము

సూళ్ళు : సుడులు

పుట 70 సాలగ్రామము : విష్ణుమూర్తి చిహ్నితశిలావిశేషము

నిర్వాణాన : బిత్తరి వేషాన

తప్పటి చెలులు : సత్యము తెలుసుకోలేని చెలులు

పుట 71 చిట్టకము : శృంగారచేష్ట, పరిహాసము, కపటము

పుట 72 మీనుసోగ : దీర్ఘమయిన మీనాకారము

మిన్నేరు : ఆకాశగంగ

పుట 73 పంచమహావాద్యాలు: భేరి శంఖ కాహళ పటహ జయ ఘంటికలు

సురటి = వీవన, వెట్టదీర = వేసవి తాపము తీర

పుట 74 కడళ్ళతోడి : అలలతోడి

పుట 75 మరుఁడు : మన్మథుడు



పుట 76 నెప్పున : నెలకొనే విధంగా హత్తుకొనుట

ఒట్టుకొన్న : మొత్తముగా పెట్టుకొన్న

పుట 77 మెలుపు : చలించని సౌందర్యము

పుట 78 నవరసముల గుళిక :నవరత్నముల సారముతో తయారుచేసిన గుళిక

చమరీమృగము : సవరపు మెకము

పుట 79 ఒకపరి : ఒక తప, ఒకసారి

ఒయ్యారము : విలాసము, గర్వము, అందము

జిగిగొని : కాంతులతో ప్రకాశించి

మెఱుఁగుబోణి : మెఱపువంటి మేనుకలది

పుట 80 ఇందుముఖి : చంద్రునివంటి మోముకలది

చెందమ్మి : ఎర్రతామర

ఈవి : దానము

పెంటలైన : పెనుగులాటతోకూడిన వయిన

పుట 81 నేమము : నియమము

పుట 82 సూడిగ : ఆడుదాని చేతికడియములు గాజులు

సుంకు : ప్రతిబంధకము

పుట 83 వేష్టువలు : చుట్టుకొను వస్త్రము

పుట 84 సప్తాంగాలు : ప్రసంగం బట్టి మంథరం, వాసుకి, గరుడుడు దేవతలు, దానవులు, శివుడు, కూర్మములా?

పుట 85 కొంగుబంగారము : సులభసాధ్యము, వశము

పుట 86 తంద్ర : తూగు, కునికిపాటు, సోమరితనము

పుట 87 కోనే : కోనేటిరాయా

పుట 88 బొమ్మజంకెనల : బొమముడి జంకెనలు

పుట 89 చెలువములు : సొగసులు
ఉలుకని తమకము : కోరికతో కూడిన తమకము

పుట 90 నెమలి పెంచము చుంగులు = నెమలి పింఛపు అంచు, కొంగు
పుండరీకాక్షుఁడు : తెల్లదామర వంటి కనులు కలవాడు

పుటి 92 ఏతులు : ఉద్ధతి
కమ్మెలు : పోటులు

పుట 93 సుసరాన = వెనువెంటనే(?)
వీట : ఇంట
మరుగు : నురుగు

పుట 94 కసుగందని : మిక్కిలి వాడిపోని

పుట 95 చొక్కపు : హృద్యము
అడియాలపు మజ్జనము : గురుతగు మజ్జనము

పుట 96 నీళ్ళాడు : తానమాడు

పుట 97 ఉడివోని : నశించని, ఎడతెగని
ఒద్దిక : సామ్యము

పుట 98 నవరత్నాలు : వజ్రవైదూర్య మరకత మాణిక్య పుష్యరాగ
గోమేధిక ప్రవాళ నీల ముత్యములు

పుట 100 తెఱవ : స్త్రీ

పుట 101 పురుష సూక్తము : సహస్రశీర్షా పురుషః అని మొదలయ్యే సూక్తము

పుట 102 విన్నాణులు : నేర్పరితనము

పుట 103 సముకాన : సముఖాన

పుట 104 బాగాలు : తాంబూలము

పుట 107 దైవారు : అతిశయించు



పుట 108 బంగారు యేరు : స్వర్ణముఖి

పుట 109 విడెము : తాంబూలము

పుట 110 చేఁగ : శ్రేష్ఠత

పుట 112 మించు : మెఱపుల కాంతి

పుట 113 కుప్పె : శిరోభూషణము

పుట 114 పదివేలు భోగములు : ఆదిశేషభోగము, సేసలు, అక్షతలు

పుట 116 కోలు : మిక్కిలి

పుట 118 ససులు : పైరు, మొలక;
బేసబెల్లి గొల్లెతలు : వేషాలమారి నంగనాచి గొల్లెతలు

పుట 119 నూగు : రోమాంకురము : ఓవరి= సభ్యత, గౌరవము, మర్యాద

* * *

## అనుబంధం - 2

# కీర్తనల అకారాది సూచిక



| | సం.సంఖ్య | రాగం | పుట |
|---|---|---|---|
| అన్నిటా భాగ్యవంతుఁడ | 7-164 | బౌళి | 57 |
| అన్ని సింగారాలకు | 17-490 | ముఖారి | 58 |
| అప్పుడు దైవాల రాయ | 2.50 | శంకరాభరణం | 59 |
| అప్పుడు మజ్జనమాడీ | 5.256 | శంకరాభరణం | 60 |
| అల్లవాఁడె | 19.345 | పాడి | 61 |
| అవధరించవయ్యా | 22.502 | సాళంగనాట | 62 |
| ఇందుకే కాబోలు | 17.528 | దేసాళం | 63 |
| ఇన్నిటికి మూలము | 17.527 | సామంతం | 64 |
| ఇవిఁగొన్ని | 17.487 | శంకరాభరణం | 65 |
| ఈ దేవదేవునికి | 17.501 | రామక్రియ | 66 |
| ఊడిగపు చెలులార | 17.502 | పాడి | 67 |
| ఊడిగపు నిబ్బరాన | 19.91 | ధన్నాసి | 68 |
| ఊడిగపు వారెల్లా | 13.363 | శంకరాభరణం | 69 |
| ఎట్టు వలసినా | 17.486 | సామంతం | 70 |
| ఎన్ని మహిమలవాఁడె | 4.177 | శుద్ధ వసంతం | 71 |
| ఎన్ని రూపులైనా | 17.500 | లలిత | 72 |
| ఏకతాన | 17.532 | మలహరి | 73 |
| ఏమని కొనాడవచ్చు | 17.489 | సాళంగం | 74 |
| ఏమని చెప్పుద మమ్మ | 17.508 | శంకరాభరణం | 75 |
| ఏమని తలతమమ్మ | 17.493 | దేసాళం | 76 |
| ఏమని పొగడవచ్చు | 17.488 | సాళంగనాట | 77 |







| | సం.సంఖ్య | రాగం | పుట |
|---|---|---|---|
| ఏమైనగా | 17.499 | రామక్రియ | 78 |
| ఒకపరి కొకపరి | 17.485 | శ్రీరాగం | 79 |
| కంటిమయ్య | 19.136 | దేశాక్షి | 80 |
| కంటి మిదివో నేడు | 23.142 | శ్రీరాగం | 81 |
| కంటివటవయ్య నీవు | 7.502 | బౌళి | 82 |
| కంటి శుక్రవారము | శేషాచార్యుల | వ్రాతప్రతి | 83 |
| కన్నుల పండుగలుగా | 17-496 | మలహరి | 84 |
| కప్పురమునకు ఁగప్పురమై | 4-నిదు రేకు-7 | | 85 |
| కోటి మన్మథాకార | 17.494 | పాడి | 86 |
| కోనే ఉద్దండను | 17-495 | ఆహిరి | 87 |
| చిక్కని సింగారరాయ | 17-533 | దేసాళం | 88 |
| చెప్పరాదు నీ | 7-129 | నాదరామక్రియ | 89 |
| చెప్పరాదు యీతని | 23-148 | మాళవి గౌళ | 90 |
| చెప్పరాని మహిమల | 3-166 | సామంతం | 91 |
| చేతులెత్తి | 17-529 | శంకరాభరణం | 92 |
| చూడఁజూడ నింతలోనే | 17.526 | శంకరాభరణం | 93 |
| చూడరమ్మ యిదె | 17-498 | బౌళి | 94 |
| చొక్కపు నీ పెండ్లి | 18-558 | సామంతం | 95 |
| జోడు కూడితి | 19-292 | దేవగాంధారి | 96 |
| దీపించఁ జక్కదనము | 19-569 | లలిత | 97 |
| దేవతలు సేవించగా | 23-376 | శ్రీరాగం | 98 |
| దేవదుందుభులతోడ | 3-125 | దేసాళం | 99 |
| దేవ నీ వునికి | 7-137 | శంకరాభరణం | 100 |
| నానారూపధరుడు | 17-503 | ధన్నాసి | 101 |

| | సం.సంఖ్య | రాగం | పుట |
|---|---|---|---|
| నిన్నుఁ జూచి వెంగేలు | 17-491 | సామంతం | 102 |
| నీకే తెలుసునయ్య | 13-506 | శ్రీరాగం | 103 |
| నేఁడె సుక్కరారము | 8-153 | శంకరాభరణం | 104 |
| పదియు పదియు గాదు | 19.335 | రామక్రియ | 105 |
| పులుకడిగిన యట్టి | 17-506 | శ్రీరాగం | 106 |
| పొద్దొక చాయలవాడు | 17-492 | ముఖారి | 107 |
| పొద్దొక వన్నెలవలె | 17-504 | శుద్ధ వసంతం | 108 |
| బంగారు మేడలలోన | 23-330 | శ్రీరాగం | 109 |
| భావించరే చెలులాల | 3-165 | శ్రీరాగం | 110 |
| భావించి చూడరే | 23-154 | మాళవిగౌళ | 111 |
| భోగించవయ్యా | 23-498 | నాగవరాళి | 112 |
| మదనగురుని మజ్జనవేళ | 17-505 | దేసాళం | 113 |
| మదన జనకునికి | 3-163 | శంకరాభరణం | 114 |
| మదనుని తండ్రికి | 7-493 | శ్రీరాగం | 115 |
| మహిమెల్లా | 17-531 | లలిత | 116 |
| ముగురు వేలుపులకు | 17-530 | బౌళి | 117 |
| మున్నే వేదాలు భూమి | 17-497 | శ్రీరాగం | 118 |
| శ్రీవేంకటేశ్వరునికి | 7-198 | సౌరాష్ట్రం | 119 |
| సేవింపరో జనులు | 20-406 | సాళంగనాట | 120 |





## అనుబంధం - 3

# శుక్రవార విశేషము (అభిషేకము)

సకల చరాచర జగన్నియన్తయై శ్రీ వైకుంఠాద్రియని ప్రఖ్యాతి కాంచిన ఈ తిరుమలయందు లక్ష్మీసమాశ్లిష్ట భుజాన్తరుడై అర్చావతారమున వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి తద్వక్షస్థల నిత్యనివాస రసికురాలగు శ్రీలక్ష్మీ అమ్మవారికి ప్రతిశుక్రవారము అభిషేకము జరుగును.

శుక్రవారము ఉదయము శ్రీస్వామివారు గురువారమునాడు రాత్రి ధరించిన పూలంగితోనే విశ్వరూపదర్శనము నిచ్చెదరు.

విశ్వరూపదర్శనము పూర్తి అయిన పిమ్మట అర్చకులు అంతర్ద్వారము తలుపులు వేసి ఏకాంతముగా శ్రీవారి పుష్పాలంకారమును సళ్ళింపుచేసి ద్వారము తలుపులు తెరచెదరు.

### శుద్ధి

పిదప ఆలయశుద్ధి జరిగి, ప్రాతఃకాలారాధనము ప్రారంభమగును.

### ప్రాతఃకాలారాధనము

మామూలు మేరకు తోమాలసేవ, ప్రభుత్వోత్సవము (కొలువు) అర్చనము, ప్రసాదముల నివేదనము, శాత్తుమొర ఏకాన్తముగా జరుగును.

### అభిషేక పూర్వాంగములు

ఇటుల శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనము పూర్తికాగానే అర్చకులు, యవనికను (తెరను) వేసి ఏకాన్తముగా శ్రీవారికి శుక్రవారనిమిత్తమగు అభిషేకమునకు సంకల్పమునుచేసి ఉచితములైన

ఉపచారములు సమర్పించి అష్టోత్తరశతనామార్చనమును చేసెదరు. తరువాత అభిషేకమునకు పూర్వాంగముగా శ్రీవారి ఊర్ధ్వపుండ్రములోని అరభాగమున్ను తగ్గించి సూక్ష్మముగా నూర్ధ్వపుండ్రమునుంచి వస్త్రోత్తరీయముల తొలగించి స్నానశాటీని లేక స్నానకౌపీనమును ధరింపజేసెదరు.

ఈ సమయములో పరిచారకులు శ్రీవారి సన్నిధానమున రెండు వెండి గంగాళముల గోక్షీరములను, రెండు వెండి గంగాళముల శ్రీవారి బంగారు బావి శుద్ధోదకమును సిద్ధపరచెదరు.

ఈ సమయముననే శ్రీస్వామివారి మహాద్వారమున కిరుపార్శ్వముల యందును విచిత్రాలంకారవిభూషితములై విష్ణుభక్తులైన గజరాజులోయన ఊర్ధ్వపుండ్రములను ధరించిన శ్రీవారి మత్తగజములు రెండును గజపాలక శాసనములను పరిపాలించుచూ శ్రీవారి అభిషేక దర్శనానంద సమయమును వెల్లడించుచున్నవోయన మహత్తరములైన ఘీంకారములను చేయుచూ భక్తులగు యాత్రికులచే సత్కరింపబడుచూ మహారాజ చిహ్నములై అభిషేకాన్తము వరకు వేచియుండును.

అభిషేక సమయమును పరిపాలించు శ్రీజియ్యంగార్లు, అధికారుల ఏకాంగులు పరిచారకులు ఆచార్యపురుషులు శ్రీవైష్ణవస్వాములు శ్రీవారి ప్రథమ ప్రాకారములోని పరిమళం అరకు వెళ్ళి అచ్చట యేర్పాటు చేయబడి యున్న రజతపాత్రములలో జియ్యంగార్లు శ్రీవారి ఊర్ధ్వపుండ్రమునకు గాను పచ్చకర్పూరము కస్తూరి కలిగియున్న రజతపాత్రమును (వెండిగిన్నెను), అధికారులు కుంకుమపువ్వుతో తయారుచేయబడిన నలుగుబిళ్ళలు చందన బిళ్ళలు, పసుపు కలిపియున్న రజతపాత్రమును, పరిచారకులు, పచ్చకర్పూరము, కుంకుమపువ్వు, చందనముతో తయారు చేయబడి "పరిమళం" అను పేరుతో వ్యవహరింపబడుచున్న సుగంధ పదార్థముతో నిండియున్న రజత



పాత్రమును, అభిషేక కైంకర్యపరులగు గృహస్థులు వారి వారి భక్తిశక్త్యనుగుణమగు ఆర్జితములననుసరించి కొందరు పూర్ణాభిషేక సేవానుగుణపదార్థపాత్రములను, కొందరు గంబూరా (పచ్చకర్పూరం) పాత్రములను, కొందరు జాఫ్రా (కుంకుమపువ్వు) పాత్రములను కొందరు పునుగు పాత్రములను, కొందరు కస్తూరి పాత్రములను భక్తిశ్రద్ధలతో తీసుకుని అందరు మంగళ వాద్యములతోను శ్వేతచ్ఛత్రాది మర్యాదలతోను పరివారములతోను, ధ్వజదండప్రదక్షిణముగా విమాన ప్రదక్షిణము చేయుచూ సువర్ణ ద్వారమునకు వచ్చి, అచ్చటనుంచి అధికారులు, జియ్యంగార్లు, ఏకాంగులు, పరిచారకులు అభిషేక కైంకర్యపరులు ఆలయములో ప్రవేశించి ఆ పాత్రములను శ్రీవారికి సమర్పించెదరు. యవనిక (తెర) తీసివేయబడును.

## అభిషేక మహోత్సవము

శ్రీలక్ష్మీ సమాశ్లిష్ట భుజాన్తరుడగు శ్రీవారికి అభిషేక మహోత్సవము ప్రారంభమగును. అర్చకుడు శ్రీస్వామివారి పాదాబ్జములకు శ్రీతాయార్ల వారికిని నమస్కరించి ఉష్ణీషాదులతో నియమింపబడినవాడై అభిషేకమునకు అనువగు పీఠమునందు నిలవంబడి వాఙ్నియమము కలవాడై జియ్యంగార్లు అందిచ్చిన ఆకాశగంగా జలముతో పూరింపబడిన సువర్ణశంఖమును తీసుకొని "హరిః ఓమ్" సహస్రశీర్షా పురుషః అని చతుర్వేదశ్రూయమాణ మగు పురుషసూక్తం పఠించుచూ శ్రీతాయార్ల వారితో ప్రకాశించు శ్రీస్వామివారి శిరోభూషణమై పరత్వ జ్ఞాపకమగు కిరీటమునందు భక్తిశ్రద్ధలతో అభిషేకము చేయుచుండును. వేదపారాయణపరులు, వేదవేత్తలు, ఆచార్యపురుషులు శ్రీవైష్ణవస్వాములు ఆ వచనము ననువదించుచూ పంచసూక్తములను పంచోపనిషత్తులను శ్రీవారి అభిషేకాన్తము వరకు అతిమనోహరముగా అతిశ్రావ్యముగా పారాయణమును చేయుచుందురు.

శ్రీస్వామివారికి పురోభాగమున కూర్చునియున్న అధికారులు, అభిషేక కైంకర్యపరులు, అభిషేకదర్శన సేవాపరాయణులైన భక్తులు, భాగవతులు అందరు శ్రీవారితిరుముఖమండల దివ్యసౌందర్యమును బ్రహ్మత్వాదులను ఇవ్వజాలిన కటాక్ష ప్రసారముగల వికసిత పుండరీకముల వంటి విశాలనేత్రముల దివ్యసౌందర్యమును, స్మితపూర్ణములగు గండస్థలముల దివ్యసౌందర్యమును బ్రహ్మత్వాదులను ఇవ్వజాలిన కటాక్ష ప్రసారము గల వికసితపుండరీకముల వంటి విశాలనేత్రముల దివ్యసౌందర్యమును, స్మితపూర్ణములగు గండస్థలముల దివ్యసౌందర్యమును, రుద్రేంద్రాదులచే స్తోత్రము చేయబడు నిరతిశయ సౌందర్య సౌకుమార్యాద్యనన్త గుణగుంభితమైన ఆ స్వయంవ్యక్త దివ్యస్వరూపమును సంసారసాగర సముత్తరణ సేతువులై ప్రసన్న జనతా శరణవరణీయములగు దివ్య శ్రీపాదారవిందములను కన్నులారకాంచి మనసారస్మరించి శ్రీస్వామివారు శ్రీవైకుంఠమును వదలివచ్చినది మనకొరకేనని తలపోయుచూ పరమానంద సముద్రములో మునుంగుచూ తేలుచూ ఆనందమునకు మేరలేక ముక్తుల వలె ఆనందము ననుభవించుచూ నమస్కరించుచూ అంజలి బంధములను చేయుచూ తన్మయులై మైమరచియుందురు.

**క్షీరాభిషేకము**

ఆ సువర్ణ శంఖాభిషేకము పూర్తికాగానే క్షీరాభిషేకము ప్రారంభమగును. అర్చకుడు జియ్యంగారు ఇచ్చెడు క్షీరములతో నిండిన శంఖములను క్షీరములతో నిండిన పాత్రములను తీసుకుని తదేక ధ్యానముతో శ్రీవారికి క్షీరాభిషేకము చేయుచుండును. వేదవేత్తలు వేదపారాయణమును చేయుచుందురు. భక్తులు శ్రీవారి అభిషేక మహోత్సవమును దర్శించు చుందురు. ఆనందము ననుభవించు చుందురు.



ఇటుల రెండు గంగాళముల గోక్షీరములు పై విధముగా శ్రీవారికి అభిషేకము జరుగగా అభిషేకాన్తమునందు శ్రీవారి వైకుంఠహస్తము నుండి వచ్చు క్షీరములను పాత్రమునకు సంగ్రహించెదరు. తరువాత భక్తులకు వినియోగము చేయబడును.

**శుద్ధోదకాభిషేకము**

పిమ్మట శ్రీస్వామివారికి శుద్ధోదకాభిషేకము జరుగుచుండ పరిచారకులు శ్రీవారి బంగారు బావినుండి శుద్ధోదకమును కలశములతో తెచ్చి గంగాళములనింపుచుందురు. ఇటుల కొంత సమయము జరిగిన తరువాత అభిషేకమును ఆపివేసెదరు. వెంటనే అర్చకులు కేసరి బిళ్లలు చందనం బిళ్ళలుగల పాత్రమును తీసుకుని ఆ బిళ్లలను శ్రీవారి శ్రీహస్తమందు సమర్పించి వాటిని శ్రీవారి శ్రీహస్తరేఖాంకితములు చేసి తీసుకుని తరువాత అర్చకులు జియ్యంగార్లు, అధికారులు వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

**ఉద్వర్తనము**

పిమ్మట అర్చకులు పరిమళ పాత్రమును తీసుకుని ఆ పరిమళమును శ్రీస్వామివారికి ఆ పాదకిరీటమును శరీరమందంతయు పూసి నలుగిడి శుద్ధోదకాభిషేకమును ప్రారంభించెదరు.

ఆ అభిషేకములో శ్రీస్వామివారి తిరుమేనునందలి పరిమళముతో కలసి జారుచున్న అభిషేకోదకమును అవయవముల వారిగాను ఆయుధముల వారిగాను అర్చకులు పాత్రములకు సంగ్రహించి అర్చకులు, జియ్యంగార్లు అధికారులు తరువాత వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

మరియు పరిమళచర్చితమగు శ్రీవారి వైకుంఠహస్తము నుండి జారు అభిషేకోదకమును పాత్రములకు సంగ్రహించి పై వారలు తరువాత వారల యేర్పాటు ప్రకారం తీసుకొనెదరు.

ఇంతియేకాక ప్రత్యేకముగా పరిమలచర్చితమగు శ్రీవారి వైకుంఠ హస్తమునుండి వచ్చు అభిషేక పరిమళ తీర్థమును పాత్రమునకు సంగ్రహించి మాయావిమోచకమగు నా తీర్థమును తరువాత భక్తులకు వినియోగము చేయుదురు.

## శ్రీ లక్ష్మీహరిద్రాభిషేకము

తిరిగి శ్రీవారికి శుద్ధోదకాభిషేకము జరుగును. అర్చకులు ఆ అభిషేకములో అనపాయినియై శ్రీవారి వక్షస్థలమునందు వేంచేసియున్న శ్రీలక్ష్మీ అమ్మవారికి హరిద్రాపాత్రమునుండి హరిద్రను తీసి సమర్పించి అభిషేకమును చేయుచుందురు.

ఈ సమయమున శ్రీవారి అభిషేక దర్శన సేవాపరాయణులగు వారలలో కొందరు శ్రీవారి వక్షస్థలమున దేదీప్యమానముగా వేంచేసి యున్న శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనమును కన్నులారచేసి పరమానంద భరితులై యుందురు.

శ్రీస్వామివారు సువర్ణ నాగాభరణములతో యుండిరిగాన రుద్రావతారామా, శుక్రవారము అభిషేకము జరుగును గాన శక్త్యవతారమా, పద్మపీఠమునందుండిరి గాన బ్రహ్మావతారమా, లేక కుమారస్వామి అవతారమా, ఇటుల అనేక విధములుగా డోలాయ మానమానసులగు కొందరు తమ హృదయములయందు చాలా కాలమునుంచి పాతుకొని యున్న తీరని సందేహములు గాఢమైన కళంకములు, దృఢమైన అభిమానములు అన్నియు పటాపంచలై శమించి పోవుటచే నందరు పరమ వైష్ణవులగుచుందురు.

శ్రీస్వామివారు గురువారమున జగన్మోహనకరమగు పూలంగితో దర్శనమిచ్చి దర్శన సేవాపరాయణుల యొక్క హృదయ భూముల యందు భక్తిబీజములను నాటిరి గాన ఈనాడు శుక్రవారము తమ అభిషేక



సమయములో పురుషకారభూతురాలైన శ్రీలక్ష్మీ అమ్మవారితో సహా తమ స్వయంవ్యక్త దివ్య స్వస్వరూపదర్శనమిచ్చి ఆ దర్శనసేవా పరాయణుల యొక్క హృదయభూముల యందు నాటిన భక్తిబీజములను తమ దయారసముతో నభిషేకముచేసి క్రమముగా అంకురితములను గాను పల్లవితములగాను పుష్పితములనుగాను ఫలితములనుగాను చేయు చుందురు. ఇది చేతన జాతము యొక్క మహాదృష్టముగా భావించవలసి యున్నది.

## శుద్ధోదకాభిషేకము

తరువాత శ్రీవారికి తిరిగి శుద్ధోదకాభిషేకము జరుగును. అష్టోత్తర శతకలశములతో (108) అభిషేకము పూర్తియగుచుండ ఆకాశ గంగాజల పూరితమగు సువర్ణశంఖముతో అభిషేకముచేసి అభిషేకమును పూర్తిచేయుదురు. ఆ అభిషేక తీర్థమును పాత్రమునకు సంగ్రహించి, శ్రీస్వామివారి కైంకర్యముచేయు జన్మాన్తర సిద్ధ మహాదృష్టశాలియగు అర్చకుడు తనశిరస్సున ప్రోక్షించుకుని సన్నిధానముననున్న అర్చకుల యొక్కయు జియ్యంగార్ల యొక్కయు ఏకాంగులయొక్కయు ఆచార్యపురుషుల యొక్క అధికారుల యొక్కయు శిరస్సులయందు "పూతోభవ" అని ప్రోక్షించును.

పిమ్మట యవనికను (తెర) వేయుదురు. అర్చకుడు స్నాన పీఠము నుంచి దిగును. చతుర్వేదపారాయణము నిలిచిపోవును. వెంటనే జియ్యంగార్లు అధ్యాపకులు ఆచార్యపురుషులు శ్రీవైష్ణవస్వాములు ద్రావిడ వేదము నీరాట్టం 10 పాశురములను అనుసంధానము చేయుచుందురు.

## ప్లోత విమార్జనము

అర్చకులు శ్రీస్వామివారి స్నానశాటిని తొలగించి ప్లోతవస్త్రము (తడితుడిచెడు వస్త్రము)తో శ్రీవారి శరీరమందంతయు తడిలేకుండునట్లు

తుడిచెదరు. శ్రీవారి శిరస్సునకు (కిరీటమునకు) ఒక పొడి వస్త్రమును రమణీయముగా చుట్టెదరు. జియ్యంగార్లు ఆలవట్టముతో (పట్టువిసరెతో) శ్రీవారికి విసురుచుందురు. అర్చకులు శ్రీవారికి 24 మూరపొడవుగల సరిపట్టంచు ధోవతిని అతి రమణీయముగా ధరింపచేసి అట్టి 12 మూరగల ఉత్తరీయమును పల్లెవాటుగా వేసి, కర్పూర పాత్రమునుండి పచ్చకర్పూరమును, కస్తూరిని తీసుకొని శ్రీవారి తిరుముఖమండల కాంతులు ప్రకాశించునటుల యథాప్రమాణముగా సుందరముగా ఊర్ధ్వపుండ్రమును (నీరుతిరుమణికాపును) సమర్పించెదరు.

దివ్యప్రబంధానుసంధానము ఆగిపోవును. వెంటనే శ్రీవారికి గోనవనీతం (వెన్న) పంచదార నివేదనముచేసి ముఖవాసము (తాంబూలము)ను సమర్పించెదరు. అంతట సువర్ణ నీరాజన పాత్రమునందు శ్రీవారికి పచ్చకర్పూర హారతి చేయుచూ తెరను తీయుదురు.

అప్పుడు అభిషేక దర్శన సేవాపరాయణులగు భక్తజనులలో మనోహరమైన ఒక కలకలము బయలుదేరును. అందరు, ఆనందమును ఔత్సుక్యమును మొదలగు భావములను అనుభవించుచూ శ్రీవారి స్వతస్సిద్ధ దివ్య సౌందర్య సన్నివేశాపహృతచిత్తులై దేవత్వమును పొందిన వారివలె రెప్పలను వాల్చక తదేక ధ్యానముతో ఉద్గ్రీవులై (మెడలెత్తిన వారలై) శ్రీవారిని దర్శించుచుందురు. అభిషేకము పూర్తియగుటచే జియ్యంగార్లు అధికారులు మొదలైనవారు సన్నిధినుంచి దేవాలయ పురోభాగమునకు వెళ్ళుదురు.

పిమ్మట అర్చకులు, ఇతర అధికారులయొక్కయు శ్రీవారి కైంకర్య పరుల యొక్కయు అభిషేక కైంకర్యపరుల యొక్కయు, అభిషేక దర్శక సేవాపరాయణుల యొక్కయు శిరస్సులయందు శ్రీవారి



అభిషేకోదకమును ప్రోక్షించుచూ వారలను పునీతులను చేయుచూ ఆర్జితమగు శ్రీవారి అభిషేక దర్శనమును పూర్తిచేయుదురు.

**అలంకార సమర్పణము**

వెంటనే అర్చకులు శ్రీవారి ఊర్ధ్వపుండ్రమునకుగాను శ్రీజియ్యంగారు ఇచ్చిన పచ్చకర్పూర కస్తూరి పాత్రమును తీసుకొనగానే వారు ప్రబంధ తొడక్కంచేసి శేషపరిమళమును వారల యేర్పాటు ప్రకారము తీసుకుని అంతర్ద్వారము ముందుభాగమునకు వెళ్లెదురు. అంతట అర్చకులు అంతర్ద్వారము తలుపులువేస ఏకాంతముగా శ్రీవారికి ఊర్ధ్వపుండ్ర వస్త్రాభరణాద్యలంకారములను సమర్పించెదరు. ఆ సమయమున శ్రీ జియ్యంగార్లు, అధ్యాపకులు, ఆచార్య పురుషులు అంతర్ద్వారము యొక్క ముందుభాగమున పంక్తులుతీరి పద్మాసనమున కూర్చుండి దివ్య ప్రబంధమును నాచ్చియార్ తిరుమొళి (150) పాశురలములను గానము చేయుచుందురు. పిమ్మట అర్చకులు తగుయేర్పాట్లు చేసుకుని శ్రీవారికి పచ్చకర్పూరముతో మామూలు ప్రకారము ఊర్ధ్వపుండ్రమును మధ్యభాగమున కస్తూరితో తిలకపుండ్రమును అతిరమణీయముగా సమర్పించెదరు. దివ్యప్రబంధ గానము ఆగిపోవును.

శంఖచక్రోర్ధ్వ పుండ్రాదులచే చిత్రింపబడిన బంగారు సరిగ పట్టంచుతో కూడిన 24 మూర పొడవు 4 మూర వెడల్పు గల అమూల్యమైన బంగారు సరిగ పట్టుధోవతిని అతుసుందరముగా సమర్పించి, 12 మూర పొడవు 2 మూర వెడల్పుగల అమూల్యమైన సరిగపట్టంచుతో కూడిన పట్టు ఉత్తరీయమును వల్లెవాటుగా వేయుదురు. హృదయ ప్రదేశమునందు కపాయిని (గాత్రసంవరణ వస్త్ర విశేషమును) సమకూర్చి కఠారి వస్త్రమును సమర్పించెదరు. ఈ కఠారి వస్త్రముతో శ్రీవారి సూర్యకఠారియను ఖడ్గ సంబంధము కలిగి ప్రకాశించుచూ

భక్తులకు దర్శనమిచ్చుచుండును. పిమ్మట శ్రీవారికి ఆభరణములను సమర్పించుదురు.

సువర్ణపద్మపీఠము – శ్రీపాదముల క్రింద

సువర్ణపాదములు – శ్రీ పాదములకు

నూపురములు (చిరుగజ్జెలతో–శ్రీపాదములకు పైన పాదాభరణములు కూడుకున్నవి)

పాగడాల్ – నూపురములకు పైన పాదాభరణములు

కాంచీగుణము – మధ్యమాభరణము (మొలనూలు)

ఉదరబంధము (నాగఫణ యుతము) – మధ్యాభరణము (బెల్టు)

దశావతారరశనా చిరు గంటలతోకూడినది – దశావతారములు, పంచవ్యూహములు శ్రీభూదేవులు, స్వామివారు, 18 విగ్రహ ములతో కూడిన చిరుగంటల మొలత్రాడు

చిన్నకంఠాభరణము – కంఠభూషణము

పెద్దకంఠాభరణము – వక్షస్థల పర్యన్తము

బంగారు పులిగోరుహారము– హృదయపర్యన్తము

గోపు హారము – నాభిపర్యన్తము అయిదు పేటల హారము

సువర్ణయజ్ఞోపవీతము – రత్నగ్రంథులుగల ఆరుపేటల ఉపవీతము

సాధారణ యజ్ఞోపవీతము – షణ్ణవతిచే తయారైన యజ్ఞోపవీతము

తులసీపత్రహారము – కటిహస్తపర్యన్తము 108 పత్రములహారము

చతుర్భుజలక్ష్మీహారము – జానుపర్యన్తము 108 లక్ష్మీ ప్రతిమలతో కూడిన హారము



సహస్రనామ హారము – పాదపర్యన్తము (1000) వెయ్యి నామ ములు కల వెయ్యి బిల్లలతో కూడిన ఐదుపరుసల హారము

సూర్య కఠారి – నాభ్యాది పాదపర్యన్తము కఠారి వస్త్రమునకు సంబంధించినది

వైకుంఠ హస్తము – దక్షిణహస్తము

కటి హస్తము – వామహస్తము

కడియములు – కర భూషణములు

కడియములు – భుజదండ భూషణములు

నాగాభరణములు – భుజదండ భూషణములు

భుజకీర్తులు – భుజభూషణములు

కర్ణపత్రములు – కర్ణభూషణములు

చక్రశంఖములు – ఇతరహస్తములయందు

కిరీటము – శిరోభూషణ పరత్వ వ్యంజకము

ఈ ఆభరణములన్నియు సువర్ణాభరణములు. ప్రతి దినమందును సామాన్యముగా సమర్పించబడియుండును.

విశేషదినములయందు విశేషాభరణములు అనగా 1 రత్నకిరీటము, మేరుపచ్చ (గారుత్మతము), రత్నమయ చక్ర శంఖములు– రత్నమయకర్ణపత్రములు, రత్నమయ వైకుంఠహస్తము, రత్నమయ కటిహస్తము రత్నమయమగు మకరకంఠి (మూడుతరగతులుగా వుండును) సువర్ణ పీతాంబరము – ఈ పదిరత్నాభరణములు సమర్పించుబడు చుండును. కొన్ని కొన్ని దినములయందు వేరుగా సంరక్షింపబడి యున్న సువర్ణాభరణములు రత్నాభరణములు

రత్నహారములు పలువిధములైనవి ఉత్సాహానుగుణముగా సమర్పించబడుచుండును.

ఇటుల శ్రీ స్వామివారికి అమూల్యములగు వస్త్రములచేతను, ఆభరణములచేతను హారములచేతను అతిరమణీయముగా వైభవాలంకారము పూర్తి అయిన పిమ్మట అంతర్ద్వారము తలుపులు తీసెదరు.

**సువర్ణలక్ష్మి అభిషేకము**

శ్రీస్వామివారి వక్షస్థలమునందు సువర్ణప్రతిమా రూపముగా వేంచేసియున్న శ్రీలక్ష్మీతాయార్ల వారికి గర్భాలయమునందు సమంత్రకముగా పరిమళముతోను హరిద్రతోను అభిషేకము జరుగును. దక్షిణ భాగమున అధికారులు, శ్రీవైష్ణవస్వాములు అందరు కులశేఖరపడికి ముందుభాగమునకు వచ్చియుందురు.

అర్చకుడు పంచపాత్రములతో కూడిన వెండిపల్లెరమునందు శ్రీలక్ష్మీ తాయార్లవారిని సువర్ణపాత్రముపైన స్థానకములో వేంచేపుచేసి శ్రీతాయార్ల వారికి అభిషేకానుగుణములగు ఉపచారములను సమర్పించి పంచ పాత్రములలోని పరిమళ తీర్థమును సువర్ణశంఖముతో తీసుకొని భక్తితో విధేయతతో "హరిః ఓమ్", 'హిరణ్యవర్ణాం హరిణీం' అని శ్రీ సూక్తమును పఠించుచూ అభిషేకము చేయనారంభింపగానే వేద పూతగాత్రులగు వేదపారాయణపరులు అర్చకముఖోద్గతమైన ఆ వాక్యము ననువదించుచూ శ్రీసూక్తమును అతిశ్రావ్యముగా పఠించుచుందురు. అర్చకుడు శ్రీతాయార్లవారికి ఈ శ్రీసూక్తముతో పరిమళాభిషేకమును హరిద్రాభిషేక మును పూర్తిచేసి ప్లోతవస్త్రముతో (తుడిచెడు పొడివస్త్రముతో) తడిలేకుండునట్లు, తుడిచి అనువైన సరిగపట్టు వస్త్రమును ధరింపజేసి తిలకమును దిద్ది శ్రీవారి వక్షస్థలములో



దక్షిణభాగమున సువర్ణహారముచే మహాభరణముగా వేంచేపుచేయుదురు. భూదేవీవారును శ్రీవారి వక్షస్థలములో వామభాగమున సువర్ణ ప్రతిమా రూపముగా వేంచేపు అయియుందురు. ఇది అనాది ఆచారము.

ఇటుల మనోహర వస్త్రభూషణాద్యలంకృతులై వక్షస్థలమునందు శ్రీభూదేవులతో ప్రకాశించు శ్రీస్వామివారికి నీరాజన పాత్రముచే కర్పూర హారతి జరుగును. ఇదియే అభిషేకమహోత్సవము.

(– కీ॥శే॥ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు రచించిన శ్రీవేంకటేశ్వర వైభవము – శ్రీస్వామివారి నిత్యారాధన కార్యక్రమము. పుట 26....39)

## అనుబంధం - 4

కన్నడ కీర్తనలలో అభిషేకప్రశంసలు –

పూవినంగియ చన్న పుళికాపు మజ్జన
నవ్యోత్సహదల్లియ నరముని సురసహ
సేవ్యానందనిలయ సామగాయనప్రియ (పుట122)

ఉదయాస్తమాలె సేవె పుళికాపు
మొదలాద దివ్య సేవె
ఒదగిద వసనంగళు (పుట 168)

**ఆధారం : హరిదాసరు కంద శ్రీనివాస**

## అనుబంధం - 5

# శ్రీపాదరేణు ప్రభావము

శ్రీ గిరిపై పై మూఁగిన రేణువు
పుష్కరిణీ తట పుష్కల రేణువు
తింత్రిణి మూల నియంత్రణ రేణువు
వనముల మినమిన ఘనమగు రేణువు
కోనల నిండిన సోనల రేణువు
పొదలను జెదలను బోలిన రేణువు
తరులను విరులను బొరలిన రేణువు
పొన్నల గున్నల జెన్నగు రేణువు
మల్లెల మొల్లల కొల్లగు రేణువు
పొగడల మొగడల నెగడిన రేణువు
సంపెఁగ గుంపుల సొంపగు రేణువు
తమ్ముల తెమ్మెర ఘుమ్ముల రేణువు
కలువల చలువల మిలమిల రేణువు
వలసిన తులసిన గలసిన రేణువు
శేమెత తామెత నామెత రేణువు
గోరట యూరట పేరట రేణువు
మరువపు గరువపు పరువపు రేణువు
దవనపు ప్రవణపు టవణపు రేణువు
విడవలి గొడవలి వెడవలి రేణువు
సదళుల కదళుల కదళుల రేణువు
వగరుల యగరుల పొగరుల రేణువు
మంకెన పంకెన జంకెన రేణువు



వరుసన విరిసిన మొరసిన రేణువు
ప్రోదిరి పాదిరి మాదిరి రేణువు
దాసన మాసన వాసన రేణువు
కప్పూర ముప్పూర మొప్పురి రేణువు
కస్తురి దస్తురి దస్తరి రేణువు
కుంకుమ పొంకమి కుంకుమ రేణువు
పునుగున ననుగునఁ బెనగొను రేణువు
గంధపు టందపు చందపు రేణువు
ధూపపు పరువపు రూపపు రేణువు
నత్తరు వుత్తమ వత్తమ రేణువు
గొజ్జగి యుజ్జగి బుజ్జగి రేణువు
మొగలిని పొగలిని మిగిలిన రేణువు
జాచుల చోచుల మోచుల రేణువు
గంటెను జంటెన వింటిన రేణువు
నేలకి మేలికి పోలికె రేణువు
మృద్వికె యుద్దికె యొద్దికె రేణువు
గుత్తుల పొత్తుల మెత్తుల రేణువు
పువ్వుల నవ్వుల రివ్వుల రేణువు
తేనెల గోనెల తూనెల రేణువు
చక్కెర యుక్కెర గ్రిక్కురు రేణువు
ఘుమ్మన ఘుమ్మన కమ్మన రేణువు
త్రిమ్మరి గ్రుమ్మరి గ్రమ్మరు రేణువు
లవలిని యువలిని దవిలిన రేణువు
నమృతపు టమితపు దమితపు రేణువు
తొలుతను దలఁతును వలతును గొలుతును

పాషాణోత్కట యోషాదుర్ఘట
చటుల చటులతర కుటిలపటల భర
పరిపూర్ణ రేణువు హరిపాద రేణువు

అలఘు స్వచ్ఛములై యభీష్టదములై
యత్యంత సాంద్రంబులై
విలసద్ద్రవ్యములై విలక్షణములై
విశ్వప్రచారంబులై
లలితామోదములై లతాంత గతులై
లాస్యాధితత్వంబులై
చెలువందెన్ ఫణిరాజశైలనిలయ
శ్రీపాదరేణువుల్

* * *

# రథోత్సవ సంకీర్తనలు

## రథం – పర్యాయపదాలు

సంస్కృత వ్యాకరణ గ్రంథాలలో పాణిని అష్టాధ్యాయి పరమప్రామాణిక గ్రంథం. ఈ వ్యాకరణం వల్ల రమ్‌ధాతు జన్యం రథమని స్పష్టమవుతుంది. ఇంతేగాక దివాదుల్లో రథాదిభ్యశ్చ అనే సూత్రం కూడా ఉంది. వ్యుత్పత్తిని బట్టి 'రమన్తే అనేనేన ఇతి రథః' అని చెప్పడం సంప్రదాయం. పిల్లలు ఆడుకొనే బండి విశేషం రథమని శబ్దార్థం. పాణిని అష్టాధ్యాయిలో అనేక రథాలను కూడా చెప్పాడు.

'రథ'శబ్దానికి పర్యాయంగా తెలుగు పర్యాయపదనిఘంటువులో అరదము, కంచరము, కూబరము, కూబరి, గాడీ, చంకురము, చక్రపాదము, తార్క్ష్యము, తేరు, ద్వివేశర, ధ్వజి, నిషంగధి, శతాంగము, స్యందనము లాంటివి చెప్పబడ్డాయి. వీటిలో 'తేరు' అన్న శబ్దానికి తమిళంలో వ్యాప్తి ఎక్కువ. తేరడి (తేరు నిలిపినచోటు) తేరోట్టం (తేరు సంచారం) తేర్‌వీధి (తేరు తిరిగే వీధి) శబ్దాలిందుకు సాక్ష్యాలు. తమిళుల వ్యవహారంలో ఆలయ సంబంధి పదజాలంలో 'రథ' శబ్దంకూడా వాడబడుతుంది. ఆలాగే తెలుగులో రథము, అరదములకు వ్యాప్తి ఎక్కువ. అయినా తెలుగు పదవాఙ్మయంలో 'తేరు' శబ్దం దేవాలయ సంబంధిగానే నేడు వాడబడుతూవుంది. కన్నడంలో 'రథ' శబ్దానికే ప్రాచుర్యముంది. సాహిత్య గ్రంథాలలో మాత్రం కన్నడాంధ్రభాషలలో స్యందనం, శతాంగం లాంటివి కూడా కవిప్రయోగాలలో కనిపిస్తాయి.

## వైదికవాఙ్మయంలో రథాంశాలు

భారతీయులకు వేదములు పరమప్రామాణికములు. ఆ వేదాలలో కూడా 'ఋగ్వేదం' మొదటిది. ఋక్కు లంటే ప్రార్థనలు. వివిధదేవతల ప్రార్థనలు కలది ఋగ్వేదం. ఈ వేదం 10.37 సూర్యసూక్తంలో 'రథర్యసి' అనే ప్రయోగ ముంది.

'సూర్య దేవా! శరవేగంతో పయనించే గుర్రాలను నువ్వు రథానికి పూన్చితే ప్రాచీన అసురులు సైతం నీ దరి దాపులలో ఉండరు. ఒక ప్రకాశంతో నువ్వు పయనించేవేళ మరొకటియైన అంధకారం పటాపంచలవుతుందని ఆ సూక్తార్థం.

ఈ వేదంలోనే సూర్యుని రథానికే ఒకే చక్రమని, ఆ రథం శిథిలం కాదని, వీగిపోదని, దీని యందే సమస్త భువనాలు ఆధారపడివున్నాయని 'సప్త యుంజన్తి రథమేక చక్రం (1.164.2) మంత్రం' వివరిస్తుంది. ఆలాగే 5.90.3 మంత్రం చక్రమే లేని రథం గురించి వర్ణిస్తే (5.90.3) మరోచోట త్రిచక్ర రథ ప్రస్తావన కనిపిస్తుంది.

ఋగ్వేదంలో రథాలతోపాటు రథాలకు కట్టే గుర్రాలను గురించిన వివరణ కూడా ఉంది. కొన్ని రథాలకు ఎర్రని ఎద్దులు, అరుణ వర్ణ గోవులు కట్టేవారట. ఇంద్రరథానికి 10,000 గుర్రాలు కట్టేవారని 6.47.18 మంత్రం సాక్ష్యమిస్తున్నది. ఋగ్వేదంలో మాత్రంగాక ఇతర వేదాలలోను రథప్రస్తుతి లేకపోలేదు. కొన్ని యజ్ఞాలతో ఋత్విక్కులకు రథాలిమ్మనే ఆదేశం ఉంది.

యాగాదుల సందర్భంలోనే గాక వివాహ సమయంలో రథారోహణం చేసేపట్టున చెప్పబడే 10-85.26వ మంత్రం ఆశంసా పూర్వక మంత్రం.

'పూష చేయి పట్టుకొని పితృ గృహం నుండి భర్తృగృహమును పొందించు గాక! అశ్వాలు నిన్ను రథంచేత వెడలించునుగాక' అనడంలో పెళ్ళి అయ్యాక కింశుక శాల్మలీ దారువులతో కూడిన రథంపై వధువును కూర్చో బెట్టుకొని రథానికి చక్కని గుర్రాలను కట్టి భర్త గృహానికి నవవధువును తీసుకు వెళ్ళేవారని భావించవలసి వస్తుంది.



## శాస్త్రాదులలో రథాంశాలు

వేదధర్మాన్ని అనుసరిస్తూ పరమాత్మను అర్చావతారరూపంలో సేవిస్తూ మోక్షమార్గంవైపు మళ్ళించేవి ఆగమాలు. ఈ ఆగమాలకు పట్టుగొమ్మలు ఆలయాలు. ఈ ఆగయాలలో శైవం, శాక్తేయం, వైఖానసం. పాంచరాత్రం ప్రధానమైనవి. ఇవి అర్చనకు సంబంధించిన శాస్త్రాలు.

వైఖానస ఆగమంలో రథసంబంధి ఉత్సవాలు చెప్పబడ్డాయి. సంకీర్ణ ప్రకరణంలో ఏకవింశతి దినోత్సవాల చివరి రోజున ఉదయం రథయాత్ర చేయాలని నిర్దేశింపబడింది. ఈ ప్రకరణంలో ఏయే మంత్రాలతో స్వామిని రథంలో అధిష్ఠింప చేయాలో వివరణవుంది. వాద్యబృందంతో గ్రామ మంతటా ప్రదక్షిణం చేయాలని, రథోత్సవ సమయంలో ప్రమాద వశాత్తు మనుష్యులు ఎవరైనా పడి మరణిస్తే ప్రాయశ్చిత్తవిధులు నిర్వహించాలని, రథ చక్రం విరిగిపోతే అక్కడే స్వామిని ఉంచి పూజలు జరపాలని ఆపై బాగుచేయాలని సూచన లివ్వబడ్డాయి.

శ్రీకారణాగమంలో ఒక విశిష్టప్రకరణం 'రథ సంగ్రహణనిధి పటలం'. ఈ పటలంలో రథాంగాలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు, రథ భాగ అధిష్ఠిత దేవతల పూజలు, రథంపయనించే మార్గంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆచార్య సత్కారం, రథముఖ్యస్థానం లాంటివి చర్చించబడ్డాయి. సర్వపాపహరం పుణ్యం సర్వదుఃఖ నివారణం గ్రామాదిషు విశేషణ రథయాత్రాం శివస్యతు ఇహభోగానవాప్నోతి తత్ప్రసాదాచ్ఛివస్యతు లాంటి ఫలితాలు చెప్పబడ్డాయి.

## స్మృతివాఙ్మయంలో రథం

వేదాల తరువాత స్మృతులు ధర్మసూత్రాలు పరమ ప్రమాణాలు. వివాహ విధులలో రథారోహణ గురించి అన్ని స్మృతులలో నిర్దేశ విధులు

చెప్పబడ్డాయి. లౌగా, వారాహీ, గోభిల మొదలయిన గృహ్యాసూత్రాలలో అత్తవారింటికి వెళ్ళేముందు రథాన్ని ముందుగా తూర్పుగా పోనిచ్చి తర్వాత వారు గమ్య దిక్కులవైపు సాగించాలని, నూతనంగా రథోరోహణ చేసేవేళ 'వనస్పతే వీడ్వంగ' మంత్రం పఠించాలని, హోమంచేసి ఆ తరువాత అధిరోహించాలని వివరణ ఇవ్వబడింది. పెళ్ళయ్యాక భర్త ఇంటికి వెళ్ళేటప్పుడు రథచక్రాలు విరిగితే గృహాగ్నిని ప్రజ్వలింపజేసి, వామదేవ్య గానం చేసి, రథాదికం అధివసించి వెళ్ళాలి అని విధి. గౌతమ ధర్మసూత్రంలో రాజు పట్టణంలోగాని, వెలుపలి రాష్ట్రంలోగాని సంచరించేవేళ రథంలోనే పయనించాలని, చేత ధనుస్సు ధరించాలని నిర్దేశింపబడింది.

## ఉపనిషద్వాఙ్మయంలో రథం

వేదాల తరువాత ఉపనిషత్తులకే ప్రమాణ్యం, అయితే రథ సంబంధి అంశాలు కొన్ని ఉపనిషత్తులలోనే ఉన్నాయి. 'రైక్వుడు' ముని. అతని దగ్గరికి జ్ఞానశ్రుతి అనే రాజు బ్రహ్మవిద్యాగ్రహణార్థం వచ్చాడు. రైక్వుడు గృహస్థాశ్రమ స్వీకారానికి సిద్ధంగా ఉన్నాడని తెలిసి అతనికి వేయిగోవుల్ని, కంఠాభరణాలను ఇచ్చాడు. అంతేకాదు తన కుమార్తెతోబాటు ఎక్కువభారాన్ని మోసేదీ, ద్విరేతస్కంగా ప్రసిద్ధి పొందిన రథాన్ని కూడా ఇచ్చాడు. 'తస్మార్గర్ధభో ద్విరేతాః.

'అశ్వతరీ రథః' అనే ఉల్లేఖం ఉత్తమగార్ధబాలతో కూడిన రథాన్ని తెలియజేస్తుంది.

## భారతదేశంలో ప్రసిద్ధ రథాలయాలు

లలితకళలలో శిల్పం ఒకటి. శిలలపై చెక్కబడడం శిల్పమయినా తరువాతి కాలంలో దారువులు, లోహాలు ఇతర వస్తువులపై చెక్కడం కూడా శిల్పంగా పరిగణింపబడుతూ వుంది. భారతీయశిల్పం



మహోన్నతం. ప్రత్యేకించి దాక్షిణాత్య శిల్పం. 'శిలలపై శిల్పాలు చెక్కినారు మనవాళ్ళు, సృష్టికే అందాన్ని తెచ్చినారు' అని సినిమాపాట. 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అని కూడా సామెత. 'కల్లిలే కలై వణ్ణం కండేన్' – రాతిలో శిల్ప నైపుణ్యం దర్శించానని ఒక తమిళసినిమా కవి అందమైన పాట వ్రాశాడు. ఒక వస్తు సౌందర్యానికి, ఆరాధనకు చేసే అనేక ప్రక్రియాలలో శిల్పమొకటి. ఈ శిల్పశాస్త్రంలో రథశిల్పనిర్మాణం కూడా ఒక భాగమే.

అసలు 'రథం'. ఆలాయకారం. రథచలనం సంచారదేవాలయం. ఆలయకైంకర్యాదులన్నీ రథస్వామికి చేయడం సంప్రదాయం. అంతేకాదు. రథాకృతిలో ఆలయనిర్మాణం చేయడం భారతీయతకు గుర్తు. ఒరిస్సాలోని కోణార్కలోని సూర్యాలయం, తమిళనాడులో మహాబలిపురం సముద్రతీరంలోని పాండవులరథాలు, కర్ణాటకలో హంపిలోని విఠలాలయం, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి వెంకటరమణస్వామి రథం, గుంటూరు జిల్లా మంగళగిరిలోని గరుడాళ్వారు ఉపాలయం, సింహాచలంలో ఈశాన్యదిశలో రథాకృతిలోని చిన్నమండపం లాంటివి ప్రసిద్ధాలు. అన్నిటికన్న కుంభకోణంలోని 'శార్ఙ్గపాణి ఆలయం' రథాకృతి కలిగివుండడం విశేషాంశం. అలాగే చిదంబరంలోని 'నాట్యసభ' కళాకృతిలో శోభించే కమనీయ రమణీయసభ. ఈ రంగంలో ఎంతో కృషిచేసి అత్యద్భుతమయిన అంశాలను వెలికితీసి భారతి పత్రికలో మంచి వ్యాసాన్ని ప్రకటించినవారు డా॥ వేదాంతం రాజగోపాలచక్రవర్తిగారు.

## రథ సంబంధి మరికొన్ని అంశాలు

సంస్కృతంలో 'రథద్రు' అనే శబ్దం వుంది. రథానికి వాడబడే ద్రుమం. అది నిమ్మ, ప్రబ్బలి, తినాస కావచ్చు. రథం మొత్తం 100 చెక్కలకూర్పు. రథానికి అనేక అంగాలున్నాయి. ధూర్యానం, అవస్కరం, రథాంగం, నేమి, ప్రధి, పిండికా, నాభి, అక్షం, అణి మొదలయినవి.

భూమి మొదలు శిఖరం దాకా ఉన్న ఎత్తును 7 భాగాలు చేయగా ఒకదానికి చతురం సరి చేసి శేషాన్ని చక్రం మొదలయిన వాటికి వాడాలి. చాణక్యుడు అర్థశాస్త్రంలో 10 పురుషముల ఎత్తు 12 పురుషముల వెడల్పు గల ఒక రథం నుండి దాని వెడల్పులో ఒక్కొక్క పురుషం చొప్పున 6 పురుషముల వరకి తగ్గిస్తే 7 రకాల రథములు ఏర్పడతాయి. సూర్యలగ్న యుక్త నక్షత్రాలు కలిగిన రోజులలో రథాన్ని నిర్మించడానికి పూనుకోవాలని నిర్దేశం.

మరీచి విమానార్చనకల్పంలో రథపరిణామం గురించి సూచన లిచ్చాడు. రథం 5 లేదా 7 లేదా 9 లేదా 11 తాళప్రమాణాలతో కూడినదిగా ఉండాలని నిర్దేశం. రథం మూడంచలు కలదిగా ఉండాలి. రథం నలుమూలల్లో సింహాలు, వ్యాళాలు, గజరూపాలు నిలపాలని అదే ఉత్తమ రథమని విశదం చేసింది.

**రథోత్సవాలు**

ఆలయాలలో జరిగే ఉత్సవాలలో 'రథోత్సవాలు' ఒకటి. కొన్ని ఆలయాలలో గర్భగుడి చుట్టూ చిన్న రథం త్రిప్పడం లాంటి సంప్రదాయా లున్నాయి. కొన్ని ఆలయాలలో రథగమనం, రథచలనం ఆలయం మాడవీధులవరకే పరిమితం. కొన్నిట సుదూర గమనం ఉంది. ఆలాగే ఆలయం పక్కనే రథం నిలపడం కొన్నిచోట్ల కనిపిస్తే సుదూరంలో 'తేరడి' ఉండడం కంచిలో చూడవచ్చు. ఆలాగే ప్రతిసంవత్సరం కొత్త రథాలను తయారుచేసుకోవడం కొన్ని ప్రాంతాలలో ఉంది. ఏది ఏమయినా రథమంటే మొదట శిలారథం. రెండవది దారురథం. ఆపై లోహరథం.

మరీచి రథోత్సవ ప్రారంభం గురించి కూడా కొన్ని విశేషాలు చర్చించాడు. శుభలగ్న చర్చచేశాడు.

మొదట వారగణన (ఆదివారం, సోమవారం 2 అని), రెండవది తిథిగణన ( పాడ్యమి 1 విదియ 2), మూడవది నక్షత్రం (అశ్విని 1, భరణి 2), నాల్గవది లగ్నం ( మేషం, వృషభం 2) తదనంతరం అన్నిటిని కూడాలి. 9తో భాగించాలి. శేషం 1, 2, 4, 6, 8 అయితే ప్రశస్తం కావు. 3, 5, 7, 9 అయితే ప్రశస్తం. ఈ అంశాలను డా॥ రమేశ్ గారు "The Festivals and Rituvals at Tirumala Temple" అనేగ్రంథంలో విశదం చేశారు.



బ్రహ్మోత్సవ వాహనసేవలో అందరికి ప్రాధాన్యం కుదరదు. అందుకే బ్రహ్మోత్సవం చివర 'రథోత్సవం' ఏర్పడింది. రథాలంకరణ విశిష్టకళ. జాతి సంస్కృతిని ప్రతిబింబించే కళ. రథాలంకరణలో రెండు మూడుదశలున్నాయి. మొదటిది పటిష్ఠమా కాదా అని పరిశీలించే దశ. రెండవది పండగలకు మల్లే స్వచ్ఛమైన జలశుద్ధి, అరటి స్తంభాలు నాటడం, మామిడి తోరణాలు కట్టడం, కొబ్బరిమట్టలు తీర్చడం, పుష్పాలంకరణ లాంటివి. మూడవదశ మతప్రధానమయింది. ఆయా ఆలయాలకు సంబంధించిన పతాకాన్ని శిఖరంపై పెట్టడం. నాల్గవది ఉత్సవ విగ్రహం వేంచేపు, పూజలు వగైరాదులు. ఈ సందర్భంలో మరొక్క ముఖ్యవిషయం గుర్తుంచుకోదగ్గది.

అన్ని ఆలయాలకు రథాలుండవు. ఒకవేళ పూర్ణరథం లేకున్నా ఉత్సవ విగ్రహాలు మాత్రం ఉంచిన వేదికలు గల రథాలుంటాయి. ఉత్సవ సమయంలో అప్పటికప్పుడు పైకప్పు ఏర్పాటుచేసి అలంకరించమూ కద్దు. కొన్ని ఆలయాలలో రెండు మూడు రథాలు కూడా ఉండవచ్చు.

ప్రాచీన సంప్రదాయాలలో రథాలంకరణ అనేక రకాలుగా ఉండేవని డా॥ చక్రవర్తిగారు 'భారతదేశచరిత్ర రథముల వైశిష్ట్యం' అనే వ్యాసంలో తెలియజేశారు. పులితోలు కప్పిన రథం ద్వైపం, వైయాఘ్రం, తెల్ల కంబళిపై కప్పబడిన రథం పాండుకంబళి' వస్త్రాలతో కప్పబడేది వాస్త్రం.

**తిరుమలలో రథోత్సవాలు**

తిరుమలలో నెలకొన్న స్వామి వేంకటేశ్వరుడు. శ్రీనివాసుడు, వైకుంఠ విరక్తుడయిన స్వామి ఏడుకొండలపైన అధివసించగా బ్రహ్మదేవుడు

"దేవ! మీరును రమాదేవి నా విన్నప
మాలింపవలె నదెట్లన్న వినుఁడు
వేంకట గిరిమీద విఖ్యాతి నుండు మీ
కున్నతమైన రథోత్సవంబు
జేయింపవలె 2-117 అని విన్నవించాడు

అపుడు విశ్వకర్మ

'విపులాద్భుత చిత్ర విచిత్ర రీతులన్ బెనుపుగ ఁదప్త
హేమపుట భేదనముల్ రచియించి, పిమ్మటన్ ఘనతర
మేరుతుల్యముగ ఁగాంచనరత్నరథంబు దీర్చి యి
చ్చినాడట 2-118

విఖనసుడు బ్రహ్మోత్సవక్రమం తెలియజేశాడు. ఉత్తరాషాఢలో రథోత్సవ మని నిర్దేశించాడు. ఎనిమిదదినం షోడశమహాదానాది విహిత కృత్యములు నడిపించినాడు. ఈ రథోత్సవాన్ని తరిగొండ వెంగమాంబ

'ఘనతరోన్నతముగా ఁగనకాద్రితుల్యమై
రంగునిగ్గుల నొప్పు రథమునందు
నెలవుగా శ్రీభూమి నీళలతో ఁగూడ
హరినుంచి బ్రహ్మాదు లలఘురథము
సాగించుచుండఁగా సకలదిక్పాలకుల్
గరుడ గంధర్వ కిన్నర గణములు



సిద్ధ విద్యాధరుల్ సేవింప, దేవదుం
దుభులు మ్రోయగ మహాద్భుతముగాను
బారిజాత సుమంబు లా బ్రహ్మారథము
పైన రంభాదు లట ఁజల్లి పాడియాడి
కనుల పండువుగా జూడగా, ధరిత్రి
యందుగల మానవులు వేంకటాద్రి మీఁద 2-129

అని వర్ణించింది.

తరిగొండ వేంగమాంబ శ్రీవేంకటాచల మాహాత్మ్యంలోనే స్వామి తనకు రథోత్సవమను వందఁగఁ జేయు (5-295) మని ఆదేశించినట్లుగా వర్ణించింది. ఈ కవయిత్రి రచనకు భవిష్యోత్తర పురాణం, వరాహపురాణం, పద్మపురాణాలు ఆధారాలు.

తిరుమలలో బ్రహ్మోత్సవాన్ని బ్రహ్మ ప్రారంభించినా ఆ తరువాత రథోత్సవాదులెవరెవరు నిర్వహించినారనడానికి తి.తి.దే. శాసనాలే ప్రమాణాలు. శాసనాల బట్టి క్రీ.శ. 1476 లో శ్రీశఠగోప దాసర్ నరసింహ ముదలియార్ రథోత్సవకైంకర్యం చేసినట్లు స్పష్టమవుతున్నది. క్రీ.శ. 1476 నుండి క్రీ.శ. 1583 దాక 27 రథోత్సవాల ప్రసక్తి శాసనాలలో కనిపిస్తున్నది.

గ్రంథాల ఆధారంగా పరిశీలిస్తే ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ఈ విశేషాలేవీ కనిపించవు. పదసాహిత్యంలో మాత్రం ప్రత్యేకించి తాళ్లపాక పద సాహిత్యంలో అనేక ఉత్సవాదుల వర్ణనలతో బాటు రథోత్సవ వర్ణనలు కనిపిస్తున్నాయి. తాళ్లపాక పదకవులు అన్నమాచార్య, పెదతిరుమలాచార్య, చిన తిరుమలాచార్యులే. వీరి కాలం క్రీ.శ.1408 నుండి క్రీ.శ 1562 దాక. వీరి రచనలలో రథోత్సవ సంకీర్తనలను అనేకరకాలుగా వర్గీకరించి పరిశీలించడానికి వీలుంది. మొదటిది

క్షేత్రప్రాధాన్యవర్గీకరణ. అంటే జరిగే ప్రదేశాబట్టి తిరుమల రథోత్సవాలు, కడప రాయని రథోత్సవా లని అభిప్రాయం.

తాళ్లపాక అన్నమయ్య కడప మండలం వాడు కావడం, రాజంపేటకు కడపకు పెద్దగా దూరం లేకపోవడం, కడపను దేవుని కడపగా భావించడం, అది తిరుమల శ్రీవారికి గడపగా భావింపబడడం వల్ల కడపరాయుని విశేషించి కీర్తన చేసినవాడు కావచ్చు.

కన్నుల పండుగలాయ కడపరాయని తేరు 3.53

తిరుపతిలోని శ్రీరామ, గోవిందరాజస్వామి, హనుమత్ స్తుతి చేసినవేళ తాళ్లపాక పదకవులు తిరుపతి దిగువ తిరుపతి అవి తప్పక ఉటంకించి చెబుతారు కాని అట్టి నిర్దేశం నిర్దిష్ట రథోత్సవములో లేకపోవడం గుర్తించదగ్గ అంశం. అందువల్ల కడపరాయని తేరు తప్పించి మిగిలినవన్నీ తిరుమల రథోత్సవకీర్తనలని నిర్ధారించడానికి వీలున్నది.

తాళ్లపాక వారు తిరుమలలోను, తిరుపతిలోను చేసిన కైంకర్యాలు అనేకం. వీటిలో 1554లో రథోత్సవ సందర్భంలో సంకీర్తన గానం చేసేవారికి చందన తాంబూలములు సమర్పించడం కూడా ఒకటి (V. 153 టి.టి.డి.)

**ప్రస్తుతం తిరుమలలో నిర్వహింపబడే రథోత్సవాలు.**

తిరుమలలో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మూడేళ్ళకొకసారి అధికమాసం రావడంతో అదనంగా మరొక బ్రహ్మోత్సవం జరుగుతుంది. రెండు బ్రహ్మోత్సవాలలోను మూడు రకాలయిన రథాలు కనబడతాయి.

మొదటిది బ్రహ్మరథం. ఇది శూన్యరథం. ప్రతి వాహనం రోజు సుదూరాన సాగే రథం. బ్రహ్మదేవుడే ముందుండి ఉత్సవాలు



జరుపుతున్నాడని భాసింపజేసే రథం. బ్రహ్మం అంతట నిండింది. ఇది నిర్గుణం నుండి సగుణం చూడడమనే అర్థంలా గ్రహించాలి. ఇక రెండవది బ్రహ్మోత్సవాలలో సువర్ణ రథం – ఇక మూడవది ఎనిమిదవ రోజు జరిగే దారు రథోత్సవం. ఈ రథాన్ని ఆబాల గోపాలం లాగుతారు. తిరుమల మాడ వీధులలో ఈ మూడింటికి ఊరేగే అవకాశం అనాది నుండి వుంది.

చెన్నై తిరువళ్ళికేణి దివ్యదేశంలోని పార్థసారథికి 7వ రోజు, కంచి వరదరాజస్వామికి 7వ రోజు, శ్రీరంగనికి 9వ రోజు రథోత్సవాలు జరుగుతాయి.

తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవ రథోత్సవ విధానం గురించి డా॥ రమేశ్ గారు

'After cerefully selecting a good day and the lagna, the utsava rigraha will be brought to the mantapa outside even before sunrise. Then the acarya will get into the ratha which would have been kept realy prepared in that spot for starting its journey round the four steets of the temple. He will tie punyaha for the sake of suddhi of the ratha. He will tie mango leaves to the pita kept inside the ratha and tie the kurea ie handful darbha grass to the wooden kurca ie handful darbha grass to the wooden pillar in the ratha on the isanya corner i.e. north east corner. He then will recite the following four murti mentras beginning with VIMANAM, VISHNUMAYAM, DEVAVASAM and VAIKUNTODHBHAVAM inviting those four devatas. Then he does 'avahana' first to the rathanga vimana devatha. Here the point to be noted is that the ratha is to be regarded as the miniature replica of the temple itself. As such first the vimanadevatha is invoked

and next the eight dwarapalikas at the rate of two each on the four sides. Thus four devatas and eight dwarapalakas are invited first. Then the eight dvara-devatas we invoked. These devatas are

| | | |
|---|---|---|
| East | -- | Shesha, Vakrathunda |
| West | -- | Panktisa, Bhutesa |
| South | -- | Garuda, Sudarsana |
| North | -- | Sankha, Viswaksena |

Then the Indradi ashta dikpalakas are invoked. The next step in invocation of the following sixteen more devatas viz

Nyaksa, Indra - Devatas in the East

Agni, Haviraksaka - South East.

Vivasvat - Vairasvate - South

Nirrti - Bali - raksaka - South West

Varuna - Mitra - West

Marut - Puspas - North West

Ksatte - Kubera - North

Isana - Bhaskara - North east

Thus all told, 44 devatas are invoked in the ratha by the acharya. Then dhupa and dipa are offered to the utsavavigraha and the acharya is the seek the asirvada of the Gosti which will be standing in front of the ratha. Then utsavavigrah and the images of the consorts then will taken into the ratha by the acharya physically carrying them in his



sends. It is fine for the ratha to start on its holy procession round the four streets around the temple (p.117 - 119) అని వ్రాశారు.

### తాళ్లపాక పదకవుల రథ సంకీర్తనలలో వైవిధ్యం

రథ నిర్మాణం గురించి ఆలోచిస్తే తాళ్లపాక పదకవుల రచనలలో దారురథమని ఎక్కడా ప్రస్తావింపబడలేదు. కనకమయపు తేరు (4.31) కనకపు రథముపై (4.26) కనకపు ఁగొండవంటి ఘనరథముపై (3.122), వంటి ప్రయోగాలతో దారు రథములతో బాటు బంగారు రథము లుండేవేమో అనిపిస్తుంది. ప్రస్తుతం తిరుమలలో స్వర్ణ రథముంది. ఇది 1994లో ప్రవేశపెట్టిన ప్రత్యేక వాహనం. కొయ్య తేరుకు బంగారు కవచం తాపడం ఈ రథనిర్మాణ విశేషం. 780 కిలోగ్రాముల తామ్ర పత్రాలపై 28 కిలో గ్రాముల బంగారపు రేకులను రసాయనిక క్రియతో తాపడం జరిగింది. రామ, కృష్ణ, ఆంజనేయ, గరుడ, వరాహం... మొదలయిన ఉబ్బు చిత్రాలు ఈ రథంలో కనిపిస్తాయి. బ్రహ్మోత్సవకాలంలో హనుమద్వాహనం తరువాత ఈ రథరంగ డోలోత్సవం జరిగేవేళ ఈ వాహనంలో స్వామి ఊరేగుతారు. మూడేళ్లకొకమారు అధికమాసం కల సంవత్సరంలో రెండవ బ్రహ్మోత్సవంలో కూడా బంగారు రథం స్వామికి వాహనం కావడం మరి మహిళలే ఈ రథాన్ని లాగడం విశేషం.

తాళ్లపాక పదకవుల రథోత్సవ సంకీర్తనలను వాటిలోని అంశాలకు అనుగుణంగా ఉత్సవవైభవప్రదీపకాలు, సన్నివేశ కథనాత్మకాలు, ఆధ్యాత్మిక అంతరార్థ ద్యోతకాలు అని వర్గీకరించవచ్చు.

### ఉత్సవ వైభవ ప్రదీపకాలు

రథం ఎప్పుడంటే అప్పుడే వాడబడేది కాదు. చాల దేవాలయాలలో సంవత్సరానికి ఒకసారి వాడబడుతుంది. తిరుమలలో బ్రహ్మోత్సవాలు

ఒకప్పుడు నెలనెల జరిగేవి కనుక ఆయా సందర్భాలలో చివర రథోత్సవాలు జరుపబడేవేమో! పదకవులు రథం గురించి చెప్పే సందర్భంలో తిరుతేరు, తిరువీధులతేరు అని ఎక్కువగా ప్రయోగించడం గమనించదగ్గది. తిరుమల వైష్ణవక్షేత్రం. రామనుజ వైష్ణవానికి తమిళంతో పొత్తు కాస్త ఎక్కువ. పవిత్రము, మంగళప్రదమని చెప్పే సందర్భాలన్నిట 'తిరు' వాడడం వైష్ణవసంప్రదాయం.

| | |
|---|---|
| అదె యెక్కెదిరుతేరు అసురలు బెదరఁగ | 4.178 |
| దిక్కులు సాదించ హరి తిరుతే రెక్కఁగాను | 15.163 |
| దేవదేవోత్తముని తిరుతేరు | 4.320 |
| అదె వాఁడె యిదె వీడె అందునిందు నేఁగీని<br>వెదకి వెదకి తిరువీధులందు దేవుఁడు | 1.424 |
| తిరువీధు లేఁగీని దేవతలు జయవెట్ట<br>హరి వాఁడె పెండ్లి కొడుకై ప్రతాపమున | 3.122 |
| నానా వర్ణముల నడ గొండ వలెను<br>దాన హరి తేరదె తగ తిరువీధుల | 4.55 |
| యెదుట ఁ దిరు వీధుల నేఁగీ సేవించరో | 3.501 |

ఈ రెండు రకాల ప్రయోగాలబట్టి స్వామి రథాలలో తిరు వీధుల రథాలు వేరుగా ఉండేవేమో అనే శంక కలుగుతున్నది. ఇతరత్ర తాళ్లపాక పదకవులు వీధుల, వీధుల వీధుల అని చాలాసార్లు ప్రయోగించవడం వల్ల మాడ వీధులు పరిధి దాటిన రథవిహారముండేదేమో అనే సందేహం సూక్ష్మంగా పరిశీలించేవారికి గాని తెలియదు.

| | |
|---|---|
| ఇదివో వీదివీదుల నీతని తేరు | 2.110 |
| వింతలుగ వీదివీది వినోదించేరు | 18.138 |



| | |
|---|---|
| యీ వేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను | 3.510 |
| వీది వీది వాఁడే వీఁడే వీఁడే చెలఁగీని | 3.274 |
| వీధుల వీధుల విభుఁడేఁగీనిదె | 4.286 |
| వీదుల వీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని | 2.487 |

ప్రాచీనకాలంలో విగ్రహాలను రథాలలో ఉంచి అనేక తావులకు తిప్పి భక్తుల వలన కానుకలు ఆర్జించే సంప్రదాయం ఉండేది. రథాకారంలో ఒక యానం సిద్ధంచేసి కొన్ని ఉత్సవాలు జరుపుతూ వుండవచ్చు. వాహకులు లేనప్పుడు ఈ పద్ధతి సులభమయినది. క్షేమకరమయినది కూడా. తాళ్లపాక పదకవుల కాలమునాటికి ప్రజలలో ప్రతిసంవత్సరం రథోత్సవదర్శన సంప్రదాయముండేదేమో అనడానికి

'యేడేఁడు దప్పకుండాను యేఁగీ సేవించరో" 3.501, అనే వాక్యం బలమిస్తున్నది. అంతేగాదు ఆనాటి స్థితి గురించి ఒక జెస్యూట్ ఫాదిరి దేవుడు రథాన్ని పదివేలమంది జనం పట్టి లాగేవారని, వారందరికి ముందు రాజు కూడా ఉన్నారని వ్రాసాడు. మనకి రోమ్ ఎల్లాగో ....... పేర్‌మల్ (పెరుమాళ్ళు) దేవాలయం అల్లాగ, పెరుమాళ్ల వివాహ మహోత్సవానికి వచ్చిన ప్రజలిచ్చిన బహుమతుల విలువ 21 లక్షల డ్యాకట్లు' ఉందన్నాడు.

**రథముల సంఖ్య**

పూరిలో మూడు రథాలు పక్కన పక్కన ఉంచి లాగుతారు. మొదటిది నందిఘోషమనే కృష్ణరథము. రెండవది అలధ్వజమనే సుభద్రరథము. మూడవది పద్మధ్వజమనే బలభద్ర రథము. మొదటిది 16 చక్రాలు కలది. రెండవది 14 చక్రాలు కలది. మూడవది 12 చక్రాలు కలది.

తాళ్లపాక పదకవుల రచనలలో ఎదురు తేరులు, జంట తేరులు మూడు తేరులు సంఖ్యాపూర్వకంగా కనిపిస్తాయి. ఇద్దరు దేవుళ్ళు దాము నెదురు తేరుల మీద

'జంట తేరులమీద పతులు నీవును నెక్కి
యింటింట వీది విది నేఁగిరాఁగాను' (18.73) ఈ సంప్రదాయం ఈ విధి విధానం ప్రస్తుతం లేదు.

ఆలాగే ప్రస్తుతం రథోత్సవంలో శ్రీదేవీ భూదేవీ సహిత శ్రీనివాసుడే మలయప్పగా అధిరోహించి ఊరేగడం ఉంది. కాని తాళ్లపాకపదకవుల ఒక కీర్తనలో భిన్నంగా ఉంది. చెఱకు విల్లు పట్టిన శ్రీకృష్ణుడు తేరున, చక్రంపట్టిన శ్రీవేంకటేశుడు మరియొక తేరున శ్రీభూసతులోక తేరున కదలినారని

కోనేటిదరులఁ గనుఁగొనరో మూఁడు తేరులు
నానాదేవతలార నరులార మీరు 3.517 అనే కీర్తన నేడు కనిపించని రథోత్సవం. ఆలాగే రథోత్సవం పెండ్లినాటి తిరునాళ్ళుగా తాళ్లపాకపదకవుల కాలంలో సాగేదేమో గాని ప్రస్తుతం లేదు. ఎదురుతేరులు, జంట తేరులు మొదలయినవి పెండిలికి సంబంధించినవి కావచ్చు.

పరగ నీకె ఁబెండ్లాడి పచారించు పంతము 26.30

వొట్టుక వెన్నలనాఁడు వుట్లెక్కి పెద్దవై
యిట్టె రుక్మిణి 'పెండ్లి తేరెక్కితివి'
నిగిడికొని యాడరో నిచ్చకల్యాణములు 15.192

హరి వాఁడె పెండ్లి కొడుకై ప్రతాపమున 3.122

లలి శ్రీ వేంకటేశుఁడలమేలు మంగయు ఁబెండ్లి
నలరగ నమరిరి అమరాదులు 15.163



**రథాలంకరణ విశేషాలు**

రథనిర్మాణంలో అనేక అంశాలున్నాయి. రథంయొక్క ముందు భాగం దూర్యానం. శత్రువులను హింసించేది అని అర్థం. రథ సంబంధోచిత స్థానంలో పెట్టబడే వస్తువు అవస్కరం. దీనినే బండికన్నులంటారు. రథగమనం చేయించేది రథాంగం. రథగమనాన్ని మోసేది నేమి. రథం చివరన ఉండేభాగం ప్రధి. రథ సంబంధమైన కొనలన్నీ ఒక భాగాన కూర్చబడినది పిండికా. ఇరుసులచే కూడు కొన్నది నాభి. గమన సమయంలో మోగేది అణి.

తాళ్లపాక పదకవుల రథాంగాలలో బండికండ్లు ఇరుసు, నొగలు, చీలలు, మేకులు, పగ్గాలు మొదలయినవి చెప్పబడ్డాయి. ఆలాగే అలంకరణకు సంబంధించిన శిఖరం, ప్రతిమలు, కుచ్చు, మేలుకట్లు, గొడుగులు, పడగెలు, పైడికుండలు, పూలహారాలు గంటలు, పగ్గములు చెప్పబడ్డాయి. ఇదేగాక రథంలో ఉంచే ఆయుధాలు, పీటలు, దర్పణాలు, బాణాలు లాంటివి కూడా సందర్భోచితంగా సూచింపబడ్డాయి.

**రథగమనంలో విశేషాలు**

తాళ్లపాక పదకవులు రథం కదలుతుంటే ముందు భాగాన సాగే అంశాలను కూడా వర్ణించారు.

మోకులు - సురలును మునులును సొంపుగ మోకులు
తెరలిచి తెరలిచి తీసేరు 4.26

వేదపఠనం - పేరుకొన్న వేదముల బిరుదుపద్యములలె

ద్రావిడవేదపఠనం-పన్నిద్దరు సూరియుల బండి కండ్లతేరు 2-239

ప్రస్తుతి - నలుగడ ముక్తులు నారదాదులును
సొలుపు మిగుల c గడుఁబొగడేరు 4.26
గోవిందనామపు ఘోషణ లిడుచును 4.286

సేవ. – బలుశేషాదులు బ్రహ్మశివాదులు
చెలగి సేవలటు సేసేరు 4.26

నృత్యం – అమరాంగనలదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు 4.26
నడుమను రంభాదులు నాట్యము లాడcగాను 13.385

వాద్యాలు – పెనగొనగcగదలె భేరులు మ్రోయcగను 3.122
దేవదుందుభులు మ్రోయ 2.239
ఘంటారవములవే 3.164
మోcరసీ భేరువులవే 3.164

ఆరగింపులు – సారె నింటింటి విందులు చవులు 13.385

### తాళ్లపాకపదకవుల రథోత్సవాలలో సన్నివేశకథనాలు

మహావిష్ణువు ధర్మసంస్థాపనార్థం అనేక అవతారాలెత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసినవాడు. కలియుగంలో అర్చామూర్తిగా పూజలందు కొంటున్నాడు. అందువల్ల కృత, త్రేతా, ద్వాపరయుగాలనాటి అంశాలను శ్రీనివాసునికి సంబంధించినట్లు చెప్పడం తాళ్లపాక పదకవుల సంప్రదాయం. వీటిలో రామాయణ సంబంధి అంశాలు, భారతభాగవత కథాసంబంధి అంశాలు ప్రస్తావించారు.

### రామాయణ సంబంధి అంశాలు

రామాయణం మహేతిహాసం, రామాయణంలో దిలీప, రఘు, అజ, దశరథాదుల చరిత్రలలో రథప్రస్తావన ఉంది. పదిదిక్కుల రథముల తోలగలవాడు దశరథుడు, రాముని పట్టాభిషేకానికి తోడ్కొని రమ్మని దశరథుడు పంపితే సుమంత్రుడు 'వరూథినీ' రథమెక్కి వచ్చాడంట.



అది వెండి రథం. దానికి ఏనుగు పిల్లల్లాంటి గుర్రాలు కట్టారు. పులితోలును పరచినారు. రాముడు చాలవరకు పాదచారిగానే రామాయణంలో దర్శన మిస్తాడు. రాముడు విరథుడు కావడంవల్ల రావణునితోడి సమరసమయంలో దేవేంద్రుడు మాతలితోడుగా తన రథాన్ని పంపినట్లు వాల్మీకి రామాయణం చెబుతుంది.

మిగుల గోపగించి మెరయు రావణు మీద
తెగ మెక్కి తోలె నదె దేవేంద్రరథము 1–460

ఆలాగే రావణసంహారానంతరం సీతతో పుష్పకరథంలో అయోధ్యకు పయనమయినట్లు చెప్పబడింది. పుష్పకవిమానమయినా అద్దానిని పుష్పక రథంగా చెప్పడం విశేషం. వాహనాన్ని రథంగా చెప్పడం సంప్రదాయం. గరుడుని విష్ణురథంగా చెప్పడం ఇలాంటిదే.

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకు
బక్కన మరలిచె పుష్పకరథము 1–400

### భాగవత సంబంధి అంశాలు

భగవంతుని లీలావిభూతులను వర్ణించే గ్రంథం భాగవతం. అవతారా లలో కృష్ణావతారంలోనే 'రథమెక్కడం' 'రథంతోలడం' రథారోహణతో విరోధులనణచడం లాంటివి ఎక్కువ కనిపిస్తాయి. తాళ్లపాకపదకవులు ఈ అంశాలను తమ రథోత్సవ కీర్తనలలో పొందుపరచినారు. మచ్చుకు –

### సాందీప పుత్రరక్షణ

బలరామకృష్ణులు సాందీపని కడ విద్యల నేర్చినారు. గురుదక్షిణగా ప్రభాసతీర్థంలో క్రుంకులిడి కానరాకపోయిన కొడుకును తెచ్చి యిండని గురువు కోరాడు. బలరామకృష్ణులు సరేనన్నారు. రథంపై కదిలారు.

సముద్రప్రాంతంలో నిల్చి శంఖారావం చేశారు. లాభం లేకపోయింది. చివరకు వలాహక సైన్య సుగ్రీవ మేఘపుష్ప సన్నాహముతో బలుడున్ తో నేతేరగ రథియై

దానవ రిపుఁడరిగె దండధరుపురికి నృపా 1.421

ఆపై గురుపుత్రుని వెంటబెట్టుకొనివచ్చి గురుఋణం తీర్చారు. ఈ అంశాన్ని

చట్టువడఁ దోలె నాడు సముద్రాలపై ఁదేరు 2.210
జగతిఁబాలునికై జలధులు వేరేజేసి
సగటున దోలె నదె పైడి రథము

**అక్రూరవృత్తాంతం**

కంసుడు బలరామకృష్ణులను పిలుచుకొనిరమ్మని అక్రూరుని పంపినాడు. అతడు కృష్ణసందర్శనలాలసుడు. చాలసంతోషంతో బృందా వనానికి విచ్చేసి కంసుని ధనుర్యాగం గురించి చెప్పాడు. అపుడు బలరామ కృష్ణులు 'నగిరి'. ఆ తరువాత అక్రూర చోదితంబైన రథంబెక్కి (10.1220) నారు. ఈ సందర్భంలో వ్రజాంగనలు

'అదె చనుచున్నవాఁడు ప్రియుఁడల్లదె తేరదె వైజయంతి య
ల్లదె రథఘోటకాంఘ్రి రజమా దెస మార్గము చూడుడు (10.122)

అన్నారు. ఆ తరువాత కృష్ణుడు జీవితంలో బృందావనం వైపు రానే లేదు. దారిలో అక్రూరుడు కాళిందిలో స్నానం చేసి వేదమంత్రాలు పఠిస్తుంటే హ్రదంలో బలరామకృష్ణులే కనిపించినారట. అంత అక్రూరుడు

'కంటిన్ మున్ను రథంబుపై జలములోఁ గంటిన్ తుదిస్ గ్రమ్మఱన్
గంటిన్ దొంటి రథంబు మీద (10.1227) అని ఆశ్చర్యపడ్డాడు.



కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసుని పై నెక్కెఁదేరు 4.35
కోరి మధురమీఁద నక్రూరుఁగూడి తోలెఁదేరు 2.110

**రుక్మిణీ పరిణయం**

రుక్మిణి భీష్మకతనయ. శిశుపాలుడు రుక్మిణి సోదరుడు. సోదరుడు తన మిత్రుడయిన శిశుపాలునితో వియ్యమందదలచాడు. కాని రుక్మిణి శ్రీయుతాకారుని వలచింది. అగ్నిద్యోతనునితో కబురంపింది. తన ఆవేదన ప్రకటించుకొంది. లగ్నసమయాన రుక్మిణి పురము వెలుపలనున్న గుడికి వచ్చి సేవించి మరలినపుడు కృష్ణుడు రథారోహణం కోరుతున్న రుక్మిణిని చూచి' తథరంబుమీద నిడుకొని (10–1748) ద్వారకానగర మార్గంబు వట్టి చనినాడు. ఈ అంశాన్ని తాళ్లపాక పదకవులు స్మరించినారు.

'బలిమి రుక్మిణి దెచ్చి పరుల గెలిచి యెక్కె
అలయేగు పెండ్లి కల్యాణ రథము 1.400

హెచ్చుగా ఁదోలె రుక్మిణి పెండ్లితేరు 2.110

ఆలాగే ఈ సందర్భంలోనే శిశుపాలునికి తన ప్రతాపం చూపించిన తీరును "తెచ్చి శిశుపాలాది దైత్యులపైఁ దోలె ఁదేరు' 2.110 అనే పాదంలోను, రుక్మి గర్వభంగం జరిగిన తీరును తిమురుచు రుక్మకుపై ఁదిరుగఁదోలెఁదేరు 4.35 అనే పాదంలో వివరించారు.

**జరాసంధవృత్తాంతం**

బృహద్రథుని కుమారుడు జరాసంధుడు. జరా అనే రాక్షసిచేత సంధింపబడిన మగధదేశాధిపతి. ఈతనిపురం గిరివ్రజపురం. కంసుడు అల్లుడు. కృష్ణుడు కంసునిచంపినాడని జరాసంధునికి అలక. అనేకసార్లు

కృష్ణునితో పోరాడినవాడు. కృష్ణుడు జరాసంధుని చంపలేకకాదు. భీమార్జునుల కీర్తికోసం ఆగాడు. ఈ వృత్తాంతాన్ని తాళ్లపాక పదకవులు వర్ణించారు.

భ్రమయ జరాసంధుపై c బరపె cదేరు 4.35

జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు 2.110

సమరములో జరాసంధుని c దోలిన తేరు 2.227

**సాల్వవృత్తాంతం**

సాల్వుడు శిశుపాలుని సోదరుడు. కామగమనం కలిగిన సౌంభకమనే నగరం ఇతనిది. అందువల్ల సౌంభకుడని పేరు, కృష్ణుడు శిశుపాలుని చంపినాడని కృష్ణుడు ద్వారకను చేరడానికి ముందే ద్వారకపై దండెత్తి సాధించలేక వెనుదిరిగాడు. ఆపై కృష్ణుడు ద్వారకకు చేరి సాల్వునిపై దండెత్తి చంపేశాడు. ఈ వృత్తాంతాన్ని కూడా తాళ్లపాక పదకవులు వర్ణించారు.

దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాcదోలిన తేరు 4.35

**నరకాసుర వృత్తాంతం**

మహావిష్ణువుకు భూదేవి యందు కలిగిన పుత్రుడు నరకాసురుడు. కృష్ణుడు సత్యభామసహితుడై గరుడారూఢుడై నరకుని వధించాడు. తాళ్లపాక పదకవులు

నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కి తోలె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము 1.400

అని నరకాసురసంహారాన్ని స్పష్టము చేసినారు.



**సృగాలవృత్తాంతం**

సృగాలుడు జరాసంధుని మిత్రుడు. ఇతనికి సృగాలవాసుదేవుడని పేరు. ఇతడు జరాసంధునితో చేరి కృష్ణుని ఎదిరించేవాడు. కరవీర పురాధిపతి. ఇతనిని కృష్ణుడు సంహరించాడు.

ప్రమదాన సృగాలుపై c దోలె cదేరు 4.35

వొట్టి సృగాలవాసుదేవుని భంగించిన తేరు 2-227

**హంసడిభకుల వృత్తాంతం**

హంసడిభకులు జరాసంధుని మిత్రులు. మధురానగరంపై దండెత్తిన వారు. లవణం కప్పంగా చెల్లించవలసిందిగా హంసుడు కృష్ణుని ఆదేశించాడు. కృష్ణుడు సాత్యకిని పంపగా హంసుడు అవమానించాడు. సోదరప్రేమ గలిగినవారిని ఉపాయంతో చంపాలని కృష్ణుడు హంసుడు వినేలా డిభకుడు మరణించాడని వార్త వ్యాపింపచేశాడు. డిభకుడు తమ్ముడు లేక తానెందుకని ప్రాణాలు విడచాడు. ఈ వార్త తెలిసి హంసుడు మరణించాడు. ఈ వృత్తాంతం కూడా తాళ్లపాక పదసాహిత్యంలో ఉల్లేఖితం.

మీఱి హంసడిభకుల మీcదcదోలినట్టి తేరు 4-35

కొట్టి తోలె హంసడిభకులపై తేరు 2-110

**పౌండ్రక వాసుదేవుని వృత్తాంతం**

ఇతడు కరూశాధిపతి. శ్రీకృష్ణుడు కైలాసానికి వెళ్లినపుడు పౌండ్రకుడు ద్వారకకు వెళ్ళి' లోకంలో ఇద్దరు వాసుదేవులా, నాకు గదాదులున్నాయి. నేనే నిజమయిన వాసుదేవుడను అని కృష్ణుని దూషించేవాడు. కాశీరాజు సహాయంతో వాసుదేవ నామం వదలుకోమని ఆదేశించాడు. కృష్ణుడు యుద్ధానికి రమ్మని చెప్పి తేరలవాటుగ cదేరనెక్కి'

అతనిని సంహరించాడు. ఈ వృత్తాంతం తాళ్లపాకపదకవుల రచనల్లో ఉంది.

ఘొట్టుగాఁ దోలెను పౌంఁడ్రకునిపై ఁ దేరు 2.110

బెట్టు పౌంఁడ్రకునిపై దాడిపెట్టిన తేరు 2.227

**భారత సంబంధి సన్నివేశాలు**

కౌరవులు పాండవులను వంచించినారు. పాండవులు ప్రతినమేరకు అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తిచేశారు. తమకు సగము రాజ్యమిమ్మని దూతలపంపారు. దౌత్యం విఫలమయింది. సంజయరాయబారం సాధించిందేమీ లేదు. చివరకు కృష్ణుడే దూతగా కదిలాడు. ఆ వృత్తాంతాన్ని పదకవులు

తూఱి సంధి మాటలకు ఁదోలిన తేరు 4.35 అని వర్ణించారు.

**కృష్ణసారథ్యం**

అర్జునుడు కృష్ణుని సారథిగా ప్రార్థించాడు. కృష్ణుడు వల్లె యనినాడు. అతని రథం విజయరథమయింది. విజయు డెక్కిన రథమని ఒక అర్థం. విజయంచేకూర్చే రథమని మరో అర్థం.

ఈ విజయరథమే అర్జునునికి ఎన్నో విజయాలు తెచ్చి పెట్టింది.

గరుడ వేగమున ఁ గదలె విజయరథ మిరవై 4.299

**ఇతరములు**

శ్రీమద్రామయణ భారతాదులలోని లేని అస్పష్ట సన్నివేశాలు ఈ వర్గంలో చేరతాయి.

పాతాళవాసులైన బలురక్కసుల మీద
యేతులఁబరపె ఁదేరు 4.181



ఆకాశము దూరినట్టి యదటు దైత్యులమీద
డాకలో నడిపించె ఁబంతాన తేరు 4-18,

లలిశ్రీ వేంకటేశుఁడలమేలు మంగయుఁబెండ్లి
నలరఁగ నమరిరి అమరాదులు
వెలయ నితఁడంతట విశ్వరూపము చూపఁగ
సలిగఁ బొడచూపిరి సనకాదులు 15.163

యెడమ చేత శంఖమెత్తినపుడు వేదము
కడగి మొదలెత్తిరి గౌతమాదులు 15.163

గౌతమాదులు మహర్షులు. శంఖమెత్తగానే గౌతమాదులు వేద ప్రస్తుతి చేశారని భావము. కాని ఈ వృత్తాంతము ఏ పురాణములో నున్నదో పరిశీలించదగింది. ఆలాగే అలమేల్మంగా వివాహ సమయంలో విశ్వ రూపము సనకాదులకు చూపడం ఏ పురాణములోనిదో తెలియదు. సనక సనందనాదులకు వైకుంఠాన చూపిన రూపమనుకొన్నచో అది విశ్వ రూపముకాదు. ఈ అంశమింకను పరిశీలింపదగింది.

సరుస దేవతలెల్ల జయవెట్టగా 3.93

పేరుకొన్న వేదములు బిరుదుపద్యములవె 3-274

అనే వర్ణనలు కనిపిస్తాయి. అన్నమయ్యకు పూర్వీకుడయిన నాచన సోమన ఉత్తర హరివంశంలో ఆకాశంలో వేంచేసే హరికి గంధర్వాదులు జయ జయారావాలతో సంస్తుతులు చేశారని 12 పాదాల తోదకవృత్తము ప్రయోగించాడు.

జయ జయ మంగళ సంగత రూపా
జయ జయ పావక సంభృత రూపా

జయ జయ కల్పిత సాగర తాపా
జయ జయ ఖండిత శంకర చాపా

జయ జయ మస్తక శస్త కలాపా
జయ జయ కౌస్తుభ చారు కలాపా
జయ జయ కాళియ సారదురాపా
జయ జయ కంస నృశంసహ కోపా

జయ జయ ధౌత విశంకట పాపా
జయ జయ మోహ నిశామణి దీపా
జయ జయ పాదలసత్పురి దాపా
జయ జయ విక్రమ శాసిత భూపా

జయ జయ శంఖ చక్ర ధర శార్ఙ్గ గదాధర శ్రీ ధరాధరా

జయ జయ భక్త భావిత నిశాచర ఖేచర చిత్త గోచరా
జయ జయ కిల్బిషా పనుదశాంత హృదాస్పద చిత్త సమ్మదా
జయ జయ భూత భావన ప్రజా కలితావన లోక పావనా

జయ నారాయణ పుండరీకనయనా శార్ఙ్గ జగన్నాయకా
జయ పీతాంబర భక్తవత్సల విరించి స్తోత్ర పాత్ర క్రియా
జయ జంభారి విరోధి విక్రమ కథాశ్లాఘావిఘాత క్రమా
జయ గోవింద ముకుంద మందర ధరా శౌరీ మురారీ హరీ

6–18...20

## అంతరార్థక ద్యోతకాలు

రథోత్సవ నిర్వహణలో అనేక అంతరార్థాలున్నాయి. మొదటిది సామాజిక ప్రయోజనం. వాహనసేవలో అందరికి అవకాశం వీలుపడదు. 'శృంగారపల్యంకికావహనంబు' కొన్ని ఆలయాలలో శ్రీవైష్ణవులకే



పరిమితం. రథం ఆలాంటిది కాదు. రథం తిరిగే ప్రదేశం విస్తృతం. రథం బరువయినది. లాగడానికి మనుష్యులు అవసరం. దేవుని పెళ్ళికి అందరు పెద్దలే కావడంతో రథం లాగడంలో అందరికి అవకాశ మేర్పడింది. స్వామిదర్శనం ఉల్లాసకరం. భక్తి ఉద్దీపకం. ఆబాలగోపాలం పాల్గొనడం ఐక్యతకు చిహ్నం.

ప్రాచీనకాలంలో చాటింపు వేస్తే ఎవరు ఊరు కదలకూడదని నియమం. ఎవరికి వారు వెళిపోతే వాహనసేవ రథయానం కష్టతరం. అంతేకాదు రథం బయలుదేరి మరల చేరేదాక ఊరు కదలరాదని నియమం. ఈ నియమంలో భౌతిక అవసరముందనడంలో సందేహం లేదు. ఒకప్పుడు కంచిరథం మరల బయలుదేరేస్థలం చేరుకోవడానికి మూడు నాలుగు రోజులు పట్టేవట. రథోత్సవ వేళ ఊరువదలి పోరాదనడాన్ని రథోత్సవ ఆంతర్యాన్ని దృష్టిలో పెట్టుకొని డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారు 'చతుర్యుగ బంధం' వ్యాసంలో –

'రథం నాలుగు మాడవీధులలో తిరుగాడుతుంది. మానవుడు ధర్మార్థ కామమోక్షాలను చతుర్విధపురుషార్థాలకై జీవించడాన్ని చెబుతుంది. రథం ఎక్కడనుండి కదలుతుందో అక్కడ చేరుకోవాలి. ఆలాగే జీవాత్మ పరమాత్మ సాన్నిధ్యం వదలి బయటికి వచ్చింది. మరల ఆసాన్నిధ్యానికే చేరుకోవాలి. మధ్యప్రయాణమంతా జీవియాత్ర. ఈ యాత్ర సులభంగా నడవదు. అనుకోని ఆటంకాలుంటాయి. రథయాత్ర సక్రమంగా నడవడానికోసం 'మోకులు వాడినట్లే జీవి ఆత్మపరిశీలన చేసుకోవాలి. రథం మలుపులు తిరుగుతుంది. ఆలాగే జీవితంలోనూ మలుపులు, ఆ మలుపులు మంచివి కావాలి. తలపులు మంచిని అయితే మలుపులు బాగుంటాయి. రథం చూడడానికి అందంగా ఉంటుంది. ఆలాగే మానవుని దేహం చూడడానికి అందంగా ఉంటుంది. ఆ అందం బాహిరం కాకూడదు. రథంలోనూ దేవుడున్నాడు. ఆలాగే మనిషిలోనూ

ఈ దేవుని గుర్తించడం కష్టం. తనలోని దేవుని గుర్తించడం చూడడం భక్తులకు యోగులకు సాధ్యం. రథంలాగే వారంతా తమ బలంవల్లనే కదలుతుందని భావిస్తారు. అలాగే జీవి తనస్వప్రయత్నం వల్లనే మనుగడ సాగుతుందని భావిస్తాడు. ఈ రెండూ కల్లే. కల్లను గుర్తించడమే జ్ఞానం, కలను విస్మరించడమే జీవిత ధ్యేయం' అని విశదీకరించారు.

శ్రీమాన్ విష్ణుభట్టాచార్యులవారు రథోత్సవము ఇహపర సుఖములు ప్రాప్తింపజేయు ఉత్సవములలో ప్రధానముగా ఉపనిషద్రహస్యమును ప్రబోధించునది.

రథస్థం కేశవందృష్ట్వా పునర్జన్మ న విద్యతే
రథస్థుడయిన కేశవుని దర్శించిన పునర్జన్మ ఉండదు,
'విజ్ఞాన సారథిర్యస్తు మనః ప్రగహవాన్నరః
సో - ధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్

రథారూఢుడై ఆత్మ ప్రతిబింబమగు దేవదేవుని దర్శించి ఉత్తమ మార్గమున దేహరథమును గమ్యస్థానమున విష్ణు రథము వద్దకు మణి రత్న ఖచిత విభూషిత ధృవస్థానమువద్దకు, చేర్చవలయును. ఇట్టి భావనము జీవులు ఏర్పరచుకొని సన్మార్గములో విష్ణులోకము ప్రవేశింపవలయును. ఇట్లుగా ప్రదేశించిన జీవులు.

'తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతాః పరిముచ్యంతి సర్వే, అని శ్రీవారి బ్రహ్మోత్సవము అను చిరుపొత్తంలో విశదీకరించారు.

భారతీయుల సంప్రదాయాలలో ఆధ్యాత్మికత భావన అందులో ఒక భాగం. రథం చిన్న ఆలయమయినా అది మానవ శరీరంగా భావింపబడుతుంది.

ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథమేవతు
బుద్ధింతు సారథిం విద్ధి, మనః ప్రగ్రహ మేవ చ



ఇన్ద్రియాణి హయానాహుః విషయాంస్తేషుగోచరాన్
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తే త్యాహుర్మనీషిణః' అన్నారు.

ఆత్మరథికుడు, శరీరం రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలు గుర్రాలు, విషయాలు వీధులని భావం. శరీరమనడం వల్ల స్థూల సూక్ష్మ శరీరాలు రెండూ గ్రహించాలి.

"దిట్టయిన మనసనేటి తేజి గుఱ్ఱమునకు
వొట్టిన రేవంతుడవు వుపమింప నీవు" అని వర్ణించిన అన్నమయ్య రథోత్సవ కీర్తనలో

గుఱ్ఱాల cగట్టని తేరు కొంక కెందైనా cబారీ
విఱ్ఱవీగుచు cదీసీని వేడుకతో జీవుcడు

సరిపిఱుదే రెండు జంట బండికండ్లు
సరవితో cబాదాలు చాcపు నొగలు
గరిమ cజూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీ cబో జీవుcడు

పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుటెక్కెలు
మించైన శిరసే మీcద నున్న శిఖరము
పంచేంద్రియ రథము పఱపీ cబో జీవుcడు

పాపపుణ్యములు రెండు పక్కనున్న చీలలు
తోపుల యన్నపానాలు దొబ్బు cదెడ్లు
యేపున శ్రీవేంకటేశుcడెక్కి వీధులనేగcగ
కాపాడి నరరథము నడపీ cబో జీవుcడు 2.152 అని వర్ణించాడు.

ఈ కీర్తనలోని శిరసు, చేతులు, వస్త్రధారణ, చూపులు, పాదాలు, పిఱుదులు బాహ్యదేహంగాలు. ఇవన్నీ చలించేవి. చలనశీలము గలవి

అని వర్ణిస్తూ నరరథాన్ని జీవుడు నడుపుతున్నాడనడం విశేషం. ఇవన్నీ పురుషదేహ పరములు. అందువల్ల అన్నమయ్య వీటిని స్త్రీ దేహానికి కూడా అనువర్తించి శృంగారానికి ఆధ్యాత్మికతను జతపరచాడు.

తరుణిదేహమే నీకు తగు దివ్యరథము
గరుడధ్వజంబాపె కప్పు పయ్యద
తురగములు రతుల cదోలెదు కోరికెలు
సరినెక్కి వలపులు జయించవయ్యా

దిండుకల పిఱుదులు తేరు బండికండ్లు
అండనే పువ్వుల గుత్తు లాపె చన్నులు
కొండ వంటి శృంగారము కోపున cగల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీత గెలువవయ్యా

వెలది కంఠము నీకు విజయ శంఖమదిగో
నిలువెల్ల సాధనాలు నీకు నాపె 8.90

మొదటి కీర్తన కంటె అదనంగా పూలగుత్తులు, విజయ శంఖం జోడింపబడ్డాయి. ఇదే భావంగల మరోకీర్తన

కాంత నిలువెల్లా నీకు కనకరథము 23.375

ఈ పాటలో స్త్రీ కనుబొమలను సింగిణివిండ్లుగా, కప్పును శిఖరంగా చెప్పడం ఒక్కటే మార్పు. ఆలాగే

దేవ దేవ జగన్నాథ దివ్యమూరితి 26.310

సంకీర్తనలో నడవులు హంసవాహనములని, చెక్కులే అద్దాలని హారాలు కుచ్చుల పూదండలని అదనంగా చేర్చి వర్ణించాడు.

అలౌకిక భావనతో రథోత్సవం వర్ణించడం తాళ్ళపాక పదకవుల ప్రత్యేకత. హైందవమతానికి వేదాలు, శాస్త్రాలు, జీవపరమాత్మజ్ఞానం,



ప్రకృతితత్త్వ అవగాహనలు సారభూతములు, ఆదృష్టితోనే తాళ్లపాక పదకవులు వేదాలే గుఱ్ఱాలని, శాస్త్రాలు పగ్గాలని, జీవులు సారథులని, యజ్ఞాలు పడిగల గుంపులని, ప్రకృతి పట్టపు సింహాసనమని, సూర్యచంద్రులు పైడికుండలని, పుణ్యాలే సింగారాలని

ఇందిరయు cదాను cగూడి యిట్టె వరాలొసగుతా 3.146 కీర్తనలో చెప్పాడు.

రథోత్సవ సంకీర్తనలలో వైకుంఠ పరివారాన్ని జత చేసి చెప్పడం మరోవిధానం. వైకుంఠవిరక్తుడయినా తిరుమల కలియుగ వైకుంఠం కావడంవల్ల ఇలాంటి వర్ణనలు సమంజసమే.

పన్నిద్దరు సూరియల బండి కండ్ల తేరు
సన్నుతి శేషాద్రి దేవాసనపు cదేరు

అంచె దేవతలే బొమ్మలై వుండినట్టి తేరు
అట్టె కిందేడు లోకములం తరూవులైన తేరు
నట్టనడుమను బ్రహ్మాండపు తేరు 2.239

ఆళ్వారులు పన్నిద్దరు. వారు నాలాయిర ప్రబంధం పాడినవారు. నిత్యసూరులయిన అనంత గరుడ విష్వక్సేనాదులతో సమానులు. దేవతలు ఏ ఇబ్బంది వచ్చినా క్షీర సాగరశయనుని ఆశ్రయించినవారే. వారెప్పటికి బొమ్మలు. ఆ బొమ్మలను ఆడించేవాడు పరమాత్ముడు. ఆలాగే శేషుడు పర్యంకం, ఆసనం, ఆతపత్రం కూడా. ఈ అంశాన్నే మరోచోట తాళ్లపాకపదకవులు శేషుడే రూపైన తేరు, మూవరుస నిత్యులు ముక్తులును గొలువగా యీరల నే cగివచ్చీ 4.31 అని జోడించారు.

సాక్షాత్ మహావిష్ణువు పంచాయుధాలతో దైత్య సంహారార్థం కదలినట్లు వర్ణించడం తాళ్లపాక పదకవుల ప్రత్యేకత.

దిక్కులు సాదించ హరి తిరుతేరెక్కగాను
యిక్కడ రతికెక్కిరి యింద్రాదులు
వెక్కనపు శార్ఙ్గము వెసచేత cబట్టు cగాను
పక్కున గుండె వటిరి బహ్మాదులు

యెడమ చేత శంఖమెత్తినపుడు వేదము
కడగి మొదలెత్తిరి గౌతమాదులు
కుడిచేతి చక్రము గక్కున మెఱపించు cగాను
సుడిసియు మెఱసేరు సూర్యచంద్రాదులు

వైకుంఠవాసుడే తేరెక్కినట్లు, శ్రీరాముడే అరదం అధిరోహించినట్లు, శ్రీకృష్ణుడే అనేక సందర్భాలలో స్పందనాధిరూఢుడై లీలావిభూతిని ప్రదర్శించినట్లు సుకీర్తించడం తాళ్లపాకవారి విధానాలలో ప్రధానాంశం.

తాళ్లపాక పదకవులు రథోత్సవవర్ణనలలో స్వామి విజయాన్ని, దైత్యుల పరాభవాన్ని, నారదాదుల ప్రస్తుతిని ఘనంగా వర్ణించారు. నాలుగు కీర్తనలలో మాత్రమే స్వామి వరప్రదాత అనే ఉల్లేఖించడం చిత్రం.

వాటపు సింగారముతో వాకిట వచ్చి నిలిచీ
కోటాను cగోటివరాలు కొమ్మని ఇచ్చుచును 3.122

పోడిమి వరము లిచ్చీ cబొసగ దాసులకెల్లా 3.501

కోరిన వరము లిచ్చీ cగుంభినీ రమణుడు 13.385

కోటాన గోటి దాసుల కోరిక లీడేర్చను 3.274

## రథోత్సవ సంకీర్తనలలో సాహిత్యాంశాలు

కావ్యకాంతకు ఉపమాదులు ఆభరణాలు. అలంకార రహితకావ్యాన్ని లాక్షణికులు అంగీకరియలేదు. పైగా వెన్నుడు అలంకార ప్రియుడు. అలంకారాలు వస్తు, పాత్ర, గుణాదులను శోభిల్లజేస్తాయి. కావ్యసంప్ర దాయాలలో అలంకార సంప్రదాయం మహోన్నతం. తాళ్లపాక పదకవులు పండితకవులు. సాహిత్య మర్మజ్ఞులు. అందువల్లనే వస్తు సాక్షాత్కారానికి అలంకారాలను ఆసరా చేసుకున్నారు. రథోత్సవ వర్ణనలలోను ఈ సూత్రం అంతర్గర్భితం.



రథాన్ని కొండతో పోల్చడం ఈ పదకవులకెంతో ఇష్టమయిన అంశం. రెక్కలకొండవలె (3.145) నడగొండ (3.517)

అదె మిన్ను మోచిన నీలాద్రి వలెను
కదిసి చుక్కలు మోచే తన నీలాద్రి కావలెను
అరుదైన ఘనమందరాద్రివలెను
అగ్గలపు శ్రీవేంకటాద్రివలెను 4.55

పై పాటలోని నీలాద్రి, కనకాద్రి, వేంకటాద్రి మొదలయినవి. తిరుమలేశుని కొండలపేర్లు కావడం విశేషం. నీలాద్రి శబ్దంతో జగన్నాథ రథం ద్యోతకం చేయడం విశేషం. కొందరి భౌగోళికుల సిద్ధాంతంబట్టి తిరుమల ప్రాంతం ఒకప్పుడు సముద్రం. శిలాతోరణమన్నది అపుడపుడే ఏర్పడిన భూజగములు. అందుకే స్వామి అక్కడ తొలుత పాదం మోపాడట. అంచేత 'మందరాద్రి' అనడం కూడా సబబే. స్వామి ముగ్గురు మూర్తుల మూలం కావడంతో 'కైలాసపు వెండికొండ' గా పదకవులకు కనపించింది. ఆళ్వారులలో తొలి ఆళ్వారులు 'తాళ్శడైయుం' అనే పాశురంలో హరి హరాత్మకంగానే స్వామిని కీర్తించారు. ఇలాగే తిరుమలకున్న మరోపేరు 'శేషాద్రి' కావడంతో శేషుడే రూపైనతేరు' అని భావించారు. రథం కిందిభాగం చుట్టుకొన్నదేహంలాగా రథం పైభాగం శిఖరం పడగలా కనిపించడం లౌకికభావన.

మునుల్ని అశ్వాలుగా చెప్పడం ఒక వింత ఆలోచన. అశ్వారూఢుడు స్వామి. బ్రాహ్మోత్సవాలలో చివరిది అశ్వవాహనమే. స్వామి హయగ్రీవుడు.

హయగ్రీవమంత్రం సుప్రసిద్ధం. నిగమాంతదేశిక ఆరాధ్యం. కన్నడ హరిదాససంపూజితం. మునులను మంత్రోపాసకులు. అశ్వస్వరూపుని ధ్యానించేవారు కావడం విశేషం. అంతేగాక 'మునులును సొంపుగ మోకులు తెరలిచి తెరలిచి తీసేరు అనడం తాళ్లపాకపదకవులలో తప్ప మరెక్కడ వినని అంశం.

ఇది తత్త్వార్థ సుఖంధి కావడం విశేషం. ఆలాగే గరుడ ధ్వజాన్ని గగనవాహినిగా 15-192 పదకవులు భావించారు.

ప్రకృతిని, ప్రకృతి గమనాన్ని రథోత్సవంలో జతమార్చడం పదకవుల ప్రత్యేకత. రథం అలంకృతమై తెరతీయగా కనిపించడం.

'పదివేలు సూర్య బింబము లుదయించినట్లు
పొడలి మేరువు వచ్చి పొడచూపినట్లు
ముచ్చటలో గరుడుడు ముందట నిలిచినట్లు
మెచ్చుల మెరుగులతో మేఘము వాలినట్టు 8.93

సూర్యుడు కర్మసాక్షి, సూర్యమండల మధ్యవర్తి నారాయణుడు. అతడు ఆదిత్యుడే. వామనుడు అదితిసంతానమే. మహావిష్ణువు నేత్రము సూర్యుడే. స్వామి ఆదిత్యరథమెక్కడానికి పదకవులు ఊహించిన అంశం.

'కమలానందకరుడు 1-4-24' కావడం. సూర్యోదయంతో కమలాలు వికసిస్తాయి. కమలానందకరుడు అంటే లక్ష్మీ ప్రమోదకరుడు. ఆలాగే చంద్రుని తేరిమీద కదలినాడట. కారణం కువలయాహితుడు కనుక. కువలయములంటే కలువలు. కలువలకు హితకారి చంద్రుడు. చంద్రుడు కూడ విరాట్ మూర్తి నేత్రమే. కువలయమంటే భూమి. స్వామి ఆకాశవీధుల్లో విహరించినా మానివేసినా నష్టంలేదు. స్వామి భూలోకవాసుల్ని కాపాడాలి. అందుకే స్వామి ఆదిత్యుని 'దవ్వని' ఇలమీద చనినాడు. ఆలాగే చుక్కలదారెందుకుని తిరువీధులలో సాగించినాడు. చివరకు



రంతుల నదియు cగాన రాని చుట్టరికమని
వింతరీతి నే cగీ శ్రీవేంకటాద్రిదేవు cడు 1-424

అని చమత్కారంగా ముగించినారు.

సామాన్యజనానికి అలంకారాలతో పనిలేదు. కోరేది స్వభావోక్తులే. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సహజాలంకరణ శోభలతో తాళ్లపాక పదకవులు వర్ణించిన రథోత్సవ సంకీర్తనలెన్నో.

బిఱ బిఱ cదిరిగేటి పెనుబండి కండ్లతో
గుఱుత్రైన పడగెల గుంపులతో
తటిమితో ధరణి గ్రక్కగల cగదలెను తేరు
మెఱసీ వీదివీధుల మేటియైన దేవుడు
ధగధగమను నాయుధపు మెరుగులతోడ
జిగిమించు cబగ్గముల చేరులతో
ఘణఘణ మనియెడి గంటలరవముతోడ 3.145

తాళ్లపాక పదకవులకు 'నవరత్నోపమానం' బాల ఇష్టం. ముద్దుగారే యశోద పాట ఇందుకు ప్రత్యక్షసాక్ష్యం. ఆలాగే అమ్మవారిని వర్ణించేవేళల్లో ముత్రాలతో ఉపమించడం వారి సంప్రదాయం. ఆలాగే రథవర్ణనలలో కూడా

పచ్చల ప్రతిమలతో పగడపు నొగలతో
హెచ్చిన వైడూర్యపు బిరుసులతో
కుచ్చుల ముత్యాలతో గుంపు cబైడి కుండలతో
యిచ్చల భూధవు తేరు యేగీ వీధులను
మంచి నీలాల గద్దెతో మణిదర్పణాలతోడ 3.511

ఈ చరణాలలో గరుడపచ్చ, ప్రవాళం, వైడూర్యం, ముత్యాలు, నీలాలు మణులు చెప్పడం విశేషం. రథం నవరత్న ఖచితమని చెప్పడానికే ఈ ఉపమలు.

'రసోవైసః' అని భగవంతుని రసస్వరూపంగా కీర్తించారు పెద్దలు. ఆలంకారికుల దృష్టిలో శృంగారాదులు రసములు. రసాత్మకమయిన వాక్యం కావ్యం. రసస్ఫూర్తి కలిగించని వాక్యం ఎందుకట్టెలాంటిది. చలనం లేని వస్తువు లాంటిది. చైతన్యంలేనిది జడమే. కనుకనే కవులు వస్తు, పాత్ర సన్నివేశాదులలో రసానికి ప్రాధాన్యం ఇచ్చారు. సహృదయులకు రసానందం కలిగించారు.

తాళ్ళపాక పదకవులు ప్రధానంగా భక్తకవులు అయినా శ్రీవైష్ణవంలో మధురుభక్తికి ప్రాధాన్యమముంది గనుక శృంగారాత్మకంగా కీర్తనలు వ్రాశారు. అది లౌకికశృంగారము కాదు. ఆధ్యాత్మికశృంగారం. ఇందులో దాంపత్యశృంగారమున్నది.

యింతుల మనోవీథి నేఁగీ  మరు తేరి మీఁద
నంతటా రతిప్రియుఁడటు గాన 1-424

రతీమన్మథులు, పార్వతీపరమేశ్వరులు ఆదర్శదంపతులు. సతీదేవి ఆహుతి కాగా ఆపై శివుడు 'తపస్సుకై' హిమాలయం చేరినాడు. మన్మథుడు ఆ హిమాలయంలో కాల్పబడగా రతి చింతల దేలింది. రెండింట మనోవ్యాపారమే. అనంగుడుగా మన్మథుడు రతిని చేరితే అర్థాంగుడుగా పార్వతిని చేర్చుకొన్నాడు. పదకవులు కొన్ని కీర్తనలలో సంయోగ శృంగారాన్ని. అంగాఁగవర్ణనను చేసినా అది పారలౌకికంగానే గ్రహించాలి.

ఇద్దరును గూడితిరి పలుజయముల నిట్టే పరగవయ్యా 8.90

చెలఁగి చెఱకు విల్లు చేతఁబట్టి శ్రీకృష్ణుఁడు 3.517

చదల నలమేల్మంగే సామ్రాజ్యము 26.310

మొదలయినవి దివ్య శృంగార విలాసితాలే



లోకంలో పెద్ద వాడయినవానిని ఆ వయసువారు అతని చిననాటి సంగతులు విడమరచి పరిహసించడం తెలిసిందే. అదొక హాస్యక్రీడ. ఈ క్రీడ ఆడేవారు సత్యంగా తాళ్లపాకపదకవులే. కాని చెలులాడినట్లు చెప్పడం కవితాచమత్కారం.

తేరెక్కడం నీకు నేర్పాలా? ఉట్లెక్కావు. ఆపై పెండ్లి తీరెక్కావు. బండికి పాదాలు చాచావు. అర్జునుని బండికి సారథి అయ్యావు. గొల్లెతల చనుగొండ లెక్కావు.

చివరకు వెంకటాద్రిలో చిరురథమెక్కావు. అన్నీ చెప్పి చివరకు

నెట్టన నింత దొరవై నేఁడు సేయవలెనా
కొసరింతవాఁడవై యాగుణములే వలెనా"

అనడమే విసురు. ఆలాగే ఎంత జాణలే మీరు యింతులాల (18-138) కీర్తనలో ఎదురు తేరులలో వస్తూ ఒకరిపై ఒకరు నిమ్మపళ్ళు వేసుకొన్నారట. తనువులు సోక ఁజేతి తామరనాళముల పెనఁగి పైఁబార చూచినారట. రథంలోపలనే చౌకళించి కౌఁగిలించేరట అని దాంపత్య ప్రణయ పరిహాస గతులను వర్ణించారు.

వాయు వేగమున వచ్చె వనజాక్షు నరదము
వేయి సూర్యుల ప్రతాప విభవముతో
చాయల చక్ర వాళాద్రి సముద్రాలు దాఁటి వచ్చె
మునుకొని మనోవేగమున వచ్చె హరితేరు
తనరారు కోటి చంద్రప్రభలతో 3.512

లాంటి కీర్తనలన్నీ అద్భుతరసావహములు. ఇక మిగిలిన దైత్య దళనాదులు. వీరోచిత సంగ్రామాలన్నీ వీరరసస్ఫోరకాలు.

## రథోత్సవ సంకీర్తనలలో సంగీతాంశాలు

తాళ్లపాక పదకవుల రథోత్సవ సంకీర్తనలన్నీ తెలుగు కీర్తనలే. ప్రతికీర్తనకు పల్లవి, మూడు చరణాలుండడం సమాన ధర్మం. కీర్తనలు శంకరాభరణం, పాడి, దేవగాంధారి, శుద్ధవసంతం దేసాళం, సౌరాష్ట్రం, సాళంగనాట, మాళవి, బౌళి, ముఖారి, ఆందోళి, కౌశి, రామక్రియ, మాళవిగౌళ, వసంతం, నాట, గౌళ రాగాలలో పాడదగినవనే సూచన లున్నాయి.ఎక్కువ కీర్తనలు 'సాళంగనాట' లోనివి కావడం విశేషం. కీర్తనలకు 'ఎత్తుగడలు' ప్రదానం. రథోత్సవ సంకీర్తనలలో ఎత్తుగడలు.

### నిర్దేశాత్మకాలు

అదె వాఁడె యిదె వీఁడె అందునిందు నేఁ గీని
వెదకి వెదకి తిరువీధులందు దేవుడు 1-424

అమరాంగనలదె యాడరు
ప్రమదంబున నదె పాడేరు 4-26

### ప్రార్థనాత్మకాలు

చూడరో చూడరో నేఁడు నరులార సురలార 3.512

దేవ దేవ జగన్నాథ దివ్యమూరితి
చేవదేరే సింగారాన చిత్తగించు మికను 26.310

### ఆదేశాత్మకాలు

ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేఁగి వచ్చీని యిందిరానాథుడు 4.31

చేతులెత్తి మొక్కరో జీవకోట్లాల యిదె
యీత లాతల నిండిరదె నారదాదులు 15.163



### వర్ణనాత్మకాలు

దేవ దుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను
హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరంజ్యోతి స్వరూపపు పైఁడి కుండతేరు 2.366

### సహజధోరణి

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువగా తిరు తేరు 4.320

అప్పుఁడైన హరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధులు నేగి తేరు 4.35

తాళ్లపాక పదకవులు మూడవ చరణంలో 'ముద్ర' ప్రయోగించారు. అవి ఏకరూపంలో లేవు. ఒకటవ పాదమో లేదా రెండవపాదమో మూడవపాదమో లేదా చివరి పాదంలో అయినా నిక్షిప్తం.

| | |
|---|---|
| శ్రీ వేంకటాద్రిదేవుడు | 1-424 |
| శ్రీ వేంకటేశుఁడు | 4.35 |
| శ్రీ వేంకట నిలయుడు | 4.26 |
| శ్రీ వేంకటేశ | 8.90 |
| శ్రీ వేంకటేశ్వరుడు | 4.178 |
| శ్రీ వేంకటాద్రి | 4.55 |
| శ్రీ వేంకటోత్తముఁడు | 15.192 |
| శ్రీ వేంకట పతి శిఖరము | 4.286 |
| శ్రీ వేంకటగిరి దేఁరు | 3.145 |

శ్రీ వేంకటేశ అనే ముద్ర రథోత్సవ సంకీర్తనలలో ఎక్కువ.

## రథోత్సవ సంకీర్తనలలో అలమేలుమంగ

తాళ్లపాక పదకవులకు స్వామి ఎంతో అమ్మకూడా అంతే. విశేషించి అన్నమయ్యకు అలమేలుమంగ ప్రసాదం ఇచ్చి అనుగ్రహించిన తల్లి. ఆళ్వారులు 'తిరుక్కండేన్ పొణ్ మేనికండన్'. అని లక్ష్మినే ముందు దర్శించినట్లు వర్ణించారు. మరొక ఆచార్యపురుషుడు 'దేవిలేని దేవరను చూడ నిచ్చగించనని భీష్మించుకొన్నాడు. అందువలననే తాళ్లపాక పదకవులు కీర్తనలో ఆదిలోగాని అంత్యచరణంలోగాని 'అలమేలు మంగమ్మను' స్మరించారు.

| | | | |
|---|---|---|---|
| ఆది | : | అలమేలుమంగ యీకె ఆనుకవద్దనుండది | 8.90 |
| మూడవచరణం | : | అలమేల్మంగతో నటు శ్రీవేంకట నిలయుడు | 4.26 |
| ఆది | | అలమేల్మంగ కాఁటి హస్తములే పగ్గాలు | 23-3-75 |
| రెండవపాదం | : | ఈ వల నలమేల్మంగ ఇచ్చగించగా | 4-178 |
| | | మరిగిన యలమేలు మంగ సిరితో | 3-512 |
| మూడవపాదం | : | అందపు శ్రీవేంకటేశుఁడల మేలుమంగ దాను | 3.146 |
| | | అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలు మంగ cగూడి | 2.110 |
| చతుర్థపాదం | : | ఎన్న నలమేల్ మంగ నెనసినంతవలెనా | |
| | | తాళ్లపాక పదకవుల రథోత్సవ సంకీర్తనలు | |

రమణీయములు, భక్తి భావ రస భరితమనుటలో సందేహం లేదు.

* * *



# సంకీర్తనల అకారాది సూచిక


1. అదె వాఁడె - 45
2. అప్పుఁడైన - 46
3. అమరాంగన - 47
4. అలమేలుమంగ - 48
5. ఇందిరయు - 49
6. ఇదివో మంచివేళ - 50
7. ఇదివో వీదివీదుల - 51
8. ఎంత - 52
9. ఎత్తరే - 53
10. ఎదురేది - 54
11. ఏలమాను - 55
12. కన్నుల పండుగ - 56
13. కన్నుల - 57
14. కొండంత - 58
15. కోనేటిదరులఁ - 59
16. గుఱ్ఱాల - 60
17. చేతులెత్తి - 61
18. చూడరో - 62
19. తిరువీధులేఁగీని - 63
20. దిక్కులెల్లా - 64
21. దిక్కులు - 65
22. దేవదుందుభులతోడ - 66
23. దేవదేవ - 67
24. దేవదేవుఁడెక్కె - 68
25. దేవదేవోత్తముని - 69
26. నానావర్ణముల - 70
27. నిండెను - 71
28. భీకరపు చక్రమద - 72
29. మిన్ను నేలా - 73
30. మునులాల - 74
31. మొక్కరో పరుషలు - 75
32. మొక్కరో మొక్కరో - 76
33. మొక్కరో సేవించరో - 77
34. వీది వీది వాఁడే - 78
35. వీదుల వీధులనెల్లా - 79
36. వీదుల వీదుల - 80
37. రెక్కల కొండవల - 81
38. సిగ్గరి పెండ్లి - 82
39. హరియు సిరియు - 83

## అనుబంధం - 1

# తాళ్లపాకపదకవుల రథోత్సవ సంకీర్తనలు

### శంకరాభరణం

అదె వాఁడె యిదె వీఁడె అందు నిందు నేఁగీని
వెదకి వెదకి తిరువీధులందు దేవుఁడు ॥పల్లవి॥

అల సూర్యవీధి నేగీ నాదిత్యుని తేరి మీద
కలికి కమలానందకరుఁడు గాన
తలపోసి అదియును దవ్వు చుట్టఱికమని
యిల ఁదేరి మీఁద నేగీ నిందిరావిభుఁడు ॥అదె॥

చక్క సోమవీధి నేఁగీఁ జందురుని తేరిఁ మీఁద
యెక్కువైన కువలయాహితుఁడు గాన
చుక్కలు మోచిన దవ్వు చుట్టరిక మిదియని
యిక్కువతో వీధి నేఁగీ నెన్నికైన దేవుఁడు ॥అదె॥

యింతుల మనోవీధి నేఁగీ మరుతేరిమీఁద
నంతటా రతి ప్రియుఁడటు గాన
రంతుల నదియు, గానరాని చుట్టరికమని
వింతరీతి నేఁగీ శ్రీవేంకటాద్రి దేవుఁడు ॥అదె॥

1-424

### పాడి

అప్పఁడైన హరియెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు ॥పల్లవి॥



సముద్రాల మీఁదఁదోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపై ఁబరపె ఁదేరు
తిమురుచు రుక్మకుపై ఁదిరుగఁదోలెఁదేరు
ప్రమదాన సృగాలుపై ఁదోలె ఁదేరు ॥అప్ప॥

కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁదేరు
బమ్మర పో దంతవక్త్రుపై ఁదోలె ఁదేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగా ఁదోలిన తేరు
దొమ్మి రుక్మిణి పెండ్లికి ఁదోలినట్టి తేరు ॥అప్ప॥

మీఱి హంసడిభకుల మీఁద ఁదోలినట్టి తేరు
తూఱి సంధిమాటలకు ఁదోలిన తేరు
ఆఱడి శ్రీవేంకటేశు ఁడలమేలుమంగఁగూడి
చూఱలు గొన నెక్కెను శోభనపు తేరు ॥అప్ప॥

4.35

### దేవగాంధారి

అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు ॥పల్లవి॥

గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు ॥అమ॥

యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కుల గెలిచీని
బలుశేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు ॥అమ॥

అలమేల్మంగతొ నటు శ్రీవేంకట
నిలయుఁడరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగులఁగడుఁ బొగడేరు ॥అమ॥

4.26

## శుద్ధవసంతం

అలమేలుమంగ యీకె అనుకవద్ద నుండది
చెలరేఁగి కందువలు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

తరుణి దేహమే నీకు తగు దివ్యరథము
గరుడధ్వజంబాపె కప్పుపయ్యద
తురగములు రతుల ఁ దోలెడు కోరికెలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥అల॥

దిండుకల పిఱుఁదులు తేరు బండికండ్లు
అండనే పువ్వుల గుత్తు లాపె చన్నులు
కొండ వంటి శృంగారము కోపున ఁ గల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవే గెలువవయ్యా ॥అల॥

వెలఁది కంఠము నీకు విజయ శంఖమదిగో
నిలువెల్ల సాధనాలు నీకు నాపె
యెలమి శ్రీవేంకటేశ! యిద్దరును గూడితిరి
పలుజయముల నిట్టే పరగవయ్యా ॥అల॥

8.90



## దేసాళం

ఇందిరయు ఁదానుఁగూడి యిట్టె వరా లొసఁగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీ నిదివో ॥పల్లవి॥

వేదములే గుఱ్ఱములు విష్ణుని రథమునకు
వాదపు శాస్త్రములే తీవ్రపు ఁబగ్గాలు
పాదగు పంచభూతాలే పరగు బండికండ్లు
ఆదిగాని మనోవీధులందు నేఁగీ నిదివో ॥ఇందిర॥

జీవులెల్ల సారథులు శ్రీ విభుని తేరునకు
కావించు నెజ్జాలు పడిగల గుంపులు
భావించ ఁదన ప్రకృతి పట్టపు సింహాసనము
వేవేలు సంపదలతో వెలసీ నేఁడదివో ॥ఇందిర॥

చందురుఁడు రవియును సరుస ఁబై ఁడికుండలు
చెందిన పుణ్యములెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశు ఁడల మేలుమంగ ఁదాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో ॥ఇందిర॥

3-146

## సౌరాష్ట్రం

ఇదివో మంచివేళ యి ఁక నెన్న ఁడు
యెదుటనే మరుని జయించవచ్చు నిప్పుడు ॥పల్లవి॥

కాంత నిలువెల్లా నీకు కనకపురథము
బంతినున్న పిఱు ఁదులే బండి కండ్లు
పొంతనున్న కుచములే పూవుల గుత్తులు నీకు
ఇంతటను మరుని జయించవచ్చు నిపుడు ॥ఇదివో॥

వెలఁదిపయ్యదకొంగు విజయధ్వజము నీకు
చెలువపు బొమ్మలే సింగిణి విండ్లు
అలరిన చూపులే అక్షయ బాణములు
యెలమి మీరుని జయించవచ్చు నిపుడు ॥ఇదివో॥

అలమేల్మంగ కాఁగిటి హస్తములే పగ్గాలు
చెలఁగిన పెనుఁగొప్పే శిఖరము
నెలవై శ్రీవేంకటేశ! నీవే రథికుఁడవు
యిలలోన మరుని జయించవచ్చు నపుడు ॥ఇదివో॥

23.375

## సాళంగనాట

ఇదివో వీదివీదుల నీతని తేరు
యెదుట శ్రీవేంకటాద్రిని తేరు ॥పల్లవి॥

చట్టువడ ఁదోలె నా ఁడు సముద్రాలపై ఁదేరు
ఘొట్టుగా ఁదోలెను పౌండ్రకునిపై ఁదేరు
జట్టి గొని తోలె జరాసంధునిపై నదె తేరు
కొట్టి తోలె హంసడి భకులపై తేరు ॥ఇదివో॥

ఘోరమై కుంగఁగ ఁదోలె కులగిరులపై ఁదేరు
కౌరవసేనపై ఁదోలె గక్కన ఁదేరు
కోరి మధుర మీ ఁద నక్రూరు ఁగూడి తోలె ఁదేరు
అరసి సంధి మాటలు ఆడ ఁదోలె ఁదేరు ॥ఇదివో॥

తచ్చి శిశుపాలాది దైత్యులపై ఁదోలె ఁదేరు
పెచ్చుగా ఁదోలె రుక్మిణి పెండ్లి తేరు
అచ్చపు శ్రీ వేంకటేశు ఁడలమేలు మంగ ఁగూడి
చెచ్చెర ఁదోలె దిక్కుల సింగారపు ఁదేరు 2.110



## మాళవి

ఎంత జాణలే వీరు యింతులాల
వింతలుగ వీదివీది వినోదించేరు ॥పల్లవి॥

ఇద్దరు దేవుళ్ళు ఁదాము నెదురు దేరులమీ ఁద
కొద్దిమీర నిమ్మపండ్ల గ్రుచ్చి చిమ్మేరు
వొద్దికతో నవ్వుకొంటానుంట వింట గందపు
ముద్దలు దా ఁక వేసి మోదములు చూచేరు ॥ఎంత॥

వెనకా ముందరాను వేడుకతో ఁదేరులు
అనువుగా వెంట వెంట నంట ఁదోలేరు
తనువులు సోక ఁ జేతితామర నాళముల
పెనఁగి పై ఁబార ఁజూఁచి పిలిచేరు మోవులు ॥ఎంత॥

సందడి లోపలనే సంగడి ఁదేరులు నిల్పి
కందువతో ఁజౌకళించి కాఁగిలించేరు
పొంది శ్రీవేంకటేశు ఁడు భూదేవీ నలమేల్మంగా
పెందలి కాడనే పెండ్లి పీటపై నున్నారు ॥ఎంత॥

18.138

## బౌళి

ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేఁగి వచ్చీని యిందిరానాథుఁడు ॥పల్లవి॥

గరుడధ్వజపుతేరు కనకమయపు తేరు
సిరులతో వేదముల చేరుల తేరు
సురలు మునులు ఁబట్టి సొంపుతోడ ఁదియ్యఁగాను
యిరవుగ నేఁగి వచ్చీ నిందిరా నాథుఁడు ॥ఎత్త॥

జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులను ముక్తులును గొలువఁగా
యీవల నేఁగి వచ్చీ నిందిరా నాథుఁడు ॥ఎత్తు॥

పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రి మీఁదటి తేరు
కొంచక యలమేల్మంగ ఁగూడి వచ్చీ నదె తేరు
యెంచ రాని మహిమల నిందిరానాథుఁడు ॥ఎత్తు॥
4-31

## పాడి

ఎదురేది యెంచి చూడ నితని ప్రతాపానకు
పదిదిక్కులను భంగపడిరి దానవులు ॥పల్లవి॥

యెక్కువగా వినోదాన కితఁడు తేరెక్కితేను
యెక్కిరి దైత్యులు కొఱ్ఱు లిందరు ఁగూడి
చక్కఁగా నితఁడు చేత చక్రమెత్తిన మాత్రాన
దిక్కుల ఁబరువెత్తిరి దిమ్మరి అసురలు ॥ఎదు॥

దట్టమై యీతని భేరి ఁదగ నాదు పుట్టితేను
పుట్టె నుత్పాతాలు వైరిపురములందు
అట్టె గరుడధ్వజమటు మిన్ను ముట్టితేను
కిట్టి దనుజుల కపకీర్తి మీద ముట్టెను ॥ఎదు॥

అలమేలుమంగ విభుఁడటు వీధు లేగి తేను
ఖలు లేఁగి యముని కట్టెదెరికి
యెలమి శ్రీవేంకటేశుఁడపు మీర ఁజొచ్చితేను
ములిగి దైత్యసతులు మూలముల చొచ్చిరి ॥ఎదు॥
3.92



## ముఖారి

ఏలమాను నీనోజ యెంతైనాను
నాలి తోడ చెలులెల్లా నవ్వేరు నిన్నును ॥పల్లవి॥

వొట్టుక వెన్నల నాఁడు వుట్లెక్కి పెద్దవై
యిట్టె రుక్మిణి పెండ్లి తేరెక్కితివి
చిట్టకాన చిన్ననాఁడు సేసినట్టు సేసితివి
నెట్టగ నింత దొరవై నేఁడు సేయవలెనా ॥ఏల॥

పసిబాలనాఁడు నీవు బండికి ఁబాదము చాఁచి
దెసల నర్జును బండి తేరు నెక్కితి
శిసువవై నాఁడేమి సేసినా నమరుఁగాక
కోసరింతవాఁడనై యాగుణములే వలెనా ॥ఏల॥

చిన్ననాఁడు గొల్లెతల ఁజేరి చనుగొండ లెక్కి
చిన్ని యా రథమెక్కిడి శ్రీవేంకటాద్రి
పిన్న నాఁటి చేతలే పెద్దనాకు ఁజేసితి
వెన్న నలమేల్ మంగ నెనసింత వలెనా ॥ఏల॥

## సాళంగనాట

కన్నుల పండుగ లాయ ఁగడప రాయని తేరు
మిన్ను నేల శృంగారము మితి మీరినట్లు ॥పల్లవి॥

కదలె ఁగదలె నదె గరుడధ్వజుని తేరు
పోదిగె దేవదుందుభులు మ్రోయ ఁగా
పదివేలు సూర్యబింబములుదయించినట్లు
పొదలి మేరువు వచ్చి పొడచూపినట్లు ॥కన్ను॥

వచ్చె వచ్చె నంతనింత వాసుదేవుని తేరు
అచ్చుగ దేవకామిను లాడిపాడఁగా
ముచ్చటతో గరుడఁడు ముందట నిలిచినట్టు
మెచ్చుల మెరుఁగులతో మేఘము వాలినట్టు ॥కన్ను॥

తిరిగె ఁదిరిగె నదె దేవదేవోత్తము తేరు
సరుస దేవతలెల్ల జయవెట్టగా
విరివి ఁగడపలో శ్రీవేంకటేశుఁడు తేరుపై
నిరవాయ సింహాసనమిదే యన్నట్లు ॥కన్ను॥

3.93

## ఆందోళి

కన్నుల పండుగ లాయ ఁగన్నవారి కిందరికి
వెన్ను ఁడే ఁగీ నిల్లిదివో వీధుల వీధులను ॥పల్లవి॥

అదెయెక్కె ఁదిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదజల్లు ఁగాంతులతో వీధుల వీధులను ॥కన్ను॥

తోలియాడీ ఁదిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్యులెల్ల జయవెట్టఁగ
గాలికి ఁబడగలెల్లా ఁగడు నల్లాడ ఁగఁజొచ్చె
వేలేటి పువుదండలతో వీధుల వీధులను ॥కన్ను॥

తావు చేరె ఁదిరుతేరు ధర్మములు నిలుపఁగ
యీవల నలమేల్మంగ ఇచ్చగించఁగా
శ్రీ వేంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను ॥కన్ను॥

4.178



## కౌశి

కొండంత పొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు ॥పల్లవి॥

పాతాళవాసులైన బలురక్కసుల మీఁద
యేతుల ఁబరపె ఁదేరు యిదె దేవుఁడు
ఆతల జలధి చొచ్చిన యట్టి దానవుల మీఁద
ఘాతతోడ ఁదోలె నదె కడు రభసమున ॥కొండ॥

ఆకాశము దూరినట్టి యదటుదైత్యుల మీఁద
దాకతో నడపించె ఁబంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కుల ఁదిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి ॥కొండ॥

ధరమీఁద ఁగలిగిన దనుజ కోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పార ఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమున ఁబెట్టుకొని
తిరము కొలిపె ఁదేరు దిక్కులెల్ల గెలిచి ॥కొండ॥

4.181

## దేసాళం

కోనేటిదరులఁ గనుఁగొనరో మూఁడు దేరులు
నానాదేవతలార నరులార మీరు ॥పల్లవి॥

తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుడు
వేంకటేశు ఁడెక్కె నదె వేరొక్క తేరు
లంకెలై శ్రీభూపతులు లలినొక్క తేరెక్కిరి
కొంకర వీధుల నడగొండలో యనఁగను ॥కోనే॥

యిరవై శ్రీకృష్ణునిది యిదె వానరధ్వజము
గరుడ ధ్వజము శ్రీవేంకటపతిది
కరిలాంఛనధ్వజము కమలకు మేదినికి
అలరి చూపట్టెను బ్రహ్మాండాల వలెను ॥కోనే॥

చెలఁగి చెఱకువిల్లు చేతఁబట్టె శ్రీకృష్ణుడు
బలు శ్రీ వేంకటేశుఁడు పట్టె ఁజక్రము
అలమేలుమంగ భూమి యంబుజాలు చేఁబట్టిరి
కలసి మెలసేరు బంగారు మేడలనఁగ ॥కోనే॥

3.517

## మాళవి

గుఱ్ఱాల ఁగట్టని తేరు కొంక కెందైనా ఁబారీ
విఱ్ఱవీ ఁగుచు ఁదీసీని వేడుకతో జీవుఁడు ॥పల్లవి॥

సరి పిఱుఁదే రెండు జంట బండికండ్లు
సరవితో ఁబాదాలు చాఁపు నొగలు
గరిమ ఁజూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాల॥

పంచమహాభూతములు పంచవన్నె కోకలు
పంచల చేతులు రెండు బలు టెక్కెలు
మించైన శిరసే మీఁదనున్న శిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాల॥

పాపపుణ్యములు రెండు పక్కనున్న చీలలు
తోపుల యన్నపానాలు దొబ్బు ఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశు ఁడెక్కి వీధుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు ॥గుఱ్ఱాల॥

2.152



## రామక్రియ

చేతులెత్తి మొక్కరో జీవకోట్లాల యిదె
యీత లాతల నిండిరదె నారదాదులు ॥పల్లవి॥

దిక్కులు సాదించ హరి తిరుతేరెక్కఁగాను
యిక్కడ రతి కెక్కిరి యింద్రాదులు
వెక్కసపు శార్ఙ్గము వెస చేతఁబట్టఁగాను
పక్కన గుండె వటిరి బహ్మాదులు ॥చేతు॥

యెడమ చేత శంఖ మెత్తినప్పుడు వేదము
కడఁగి మొదలెత్తిరి గౌతమాదులు
కుడిచేతి చక్రము గక్కున మెఱపించఁగాను
సుడిసియు మెఱసేరు సూర్యచంద్రాదులు ॥చేతు॥

లలి శ్రీ వేంకటేశు ఁడలమేలు మంగయు ఁబెండ్లి
నలరఁగ నమరిరి అమరాదులు
వెలయ నిత ఁడంతట విశ్వరూపము చూపఁగ
సలిగ ఁబొడచూపిరి నసకాదులు ॥చేతు॥

15-163

## సాళంగనాట

చూడరో చూడరో నేఁడు సురులార నరులార
దాడవోయి దనుజుల దండించి తా వచ్చె ॥పల్లవి॥

వాయువేగమున వచ్చె వనజాక్షు నరదము
వేయి సూర్యుల ప్రతాపవిభవముతో
చాయల చక్రవాళాద్రి సముద్రాలు దాఁటి వచ్చె
ఆయితమై పైఁడి టెక్కేలవే కానవచ్చె ॥చూడ॥

మునుకొని మనోవేగమున వచ్చె హరితేరు
తనరారు కోటి చంద్రప్రభలతో
వెనుకొని దిక్కులెల్లా విజయము సేసి వచ్చె
కనకాచలముతో గక్కన సరివచ్చె ॥చూడ॥

గరుడవేగాన శ్రీవేంకటేశురథము వచ్చె
మరిగిన యలమేలుమంగసిరితో
ధరలోన వీధులేఁగి తన నెలవుకువచ్చె
పరగ హరిదాసుల పంతములు వచ్చె ॥చూడ॥

3.512

## సాళంగనాట

తిరువీధులేఁగీని దేవతలు జయవెట్ట
హరి వాఁడె పెండ్లి కొడుకై ప్రతాపమున ॥పల్లవి॥

కనకపుcగొండ వంటి ఘనరథముపై
దనుజ మర్దను cడెక్కె cదరుణులతో
వినువీధిc బడెగెలు వేవేలు కుచ్చులతోడc
బెనగొనcగ గదలె భేరులు మ్రోయcగను ॥తిరు॥

వరుస cజంద్ర సూర్యుల వంటి బండి కండ్లతోడ
గరుడ ధ్వజుcడొరసి cగడు దిక్కులు
పరగు వేదరాసులే పగ్గాలు వట్టి తియ్యcగ
సరుగ దుష్టుల cగొట్టి జయము చేకొనెను ॥తిరు॥

ఆటలు బాటలు వింటా నలమేల్మంగయు cదాను
యీటున శ్రీవేంకటేశుcడెదురు లేక
వాటపు సింగారముతో వాకిట వచ్చి నిలిచీ
కోటాను cగోటి వరాలు కొమ్మని ఇచ్చుచును ॥తిరు॥

3-122



## మాళవి

దిక్కులెల్లా సాధించి దేవదుందుభులు మ్రోయ
నెక్కడ చూచిన cదానే యేcగీ సేవించరో ॥పల్లవి॥

అదివో శ్రీహరితేరు అదె గరుడ ధ్వజము
కదలేటి ఘనతురంగము లవిగో
పొదలు cబూదండ లవే పొంచి వాగే ఘంటలవే
యెదుట cదిరు వీధుల నేcగీ సేవించరో ॥దిక్కు॥

వారె అచ్చరలేమల వారె మునులు రుషులు
వారక కొలిచే దేవతలు వారే
వీరె యనంత గరుడ విష్వక్సేనాదులు
యీరీతి cబ్రతాపాన నేcగీ సేవించరో ॥దిక్కు॥

వీcడె శ్రీవేంకటేశుcడు వీcడలమేల్మంగపతి
వీcడె శంఖ చక్రాదులు వెలసినాcడు
పోcడిమి వరము లిచ్చీ cబొసcగ దాసులకెల్లా
యేcడేcడు దప్పకుండాను యేగి సేవించరో ॥దిక్కు॥

3.50

## సాళంగనాట

దిక్కులు సాదించcబూని దేవదుందుభూలు మ్రోయ
యెక్కువతో శ్రీవేంకటేశు cడెక్కె cదేరు ॥పల్లవి॥

పన్నిద్దరు సూరియల బండి కండ్ల తేరు
సన్నుతి శేషాదిదేవాసనపు cదేరు
కన్నుల పండుగైన గరుడధ్వజపు cదేరు
యెన్నగ శ్రీవేంకటేశుcడెక్కె నిదె తేరు ॥దిక్కు॥

మించు నానామేఘముల మేలు కట్ల తేరు
చుంచుల నక్షత్రాల కుచ్చుతేరు
అంచె దేవతలే బొమ్మలై వుండినట్టి తేరు
యెండనంగ శ్రీవేంకటేశు ఁడెక్కె నిదె తేరు ॥దిక్కు॥

అట్టె కిందేడు లోకములంత రూపులైన తేరు
నట్ట నడుమను బ్రహ్మాండపు తేరు
దిట్ట యలమేల్మంగతో ఁదిరమై వుండేటి తేరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు ॥దిక్కు॥

2.239

## బౌళి

దేవదుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను ॥పల్లవి॥

గరుడ ధ్వజముతోడ కనకపు గుజ్జాలతో
పరపై యష్టదిక్కుల బండి కండ్లతో
నిరతితో పట్టునూలి నిడుపపగ్గాలతోడ
యిరవై శ్రీపతి తేరు యేఁగీ వీధులను ॥దేవ॥

పచ్చల ప్రతిమలతో పగడపు నొగలతో
హెచ్చిన వైడూర్యపు టిరుసులతో
కుచ్చుల ముత్యాలతో గుంపుఁ బైడికుండలతో
యిచ్చల భూధవుతేరు యేఁగీ వీధులను ॥దేవ॥

మంచి నీలాల గద్దెతో మణిదర్పణాలతోడ
పొంచిన సింగారాలతో పూదండలతో
అంచె శ్రీవేంకటేశుతో నలమేలుమంగతోడ
యెంచఁగ దేవుని తేరు యేఁగీ వీధులను ॥దేవ॥

3.510



## మాళవి గౌళ

దేవదేవ జగన్నాథ దివ్యమూరితి
చేవదేరే సింగారాన చిత్తగించు మిఁకను ॥పల్లవి॥

కలికి పిఱుఁదు నీకు ఘనచక్రముల తేరు
బలుచను గుబ్బల పైడికుండలు
అలరిన నడవులె హంసవాహనములు
కెలన నీకె ఁగైకొని గెలువుము మరుని ॥దేవ॥

వరుసమించు ఁబయ్యద వ్రాతల పెను టెక్కెము
యిరుదెసల చెక్కులె యివె యద్దాలు
మెరయు గంటలతోడి మొలనూళ్లె పగ్గములు
పరగనీకె ఁబెండ్లాడి పచారించు పంతము ॥దేవ॥

కొదలేని హారములే కుచ్చుల పూదండలు
చదల నలమేల్మంగే సామ్రాజ్యము
యెదుట శ్రీవేంకటేశ యీకె నిట్టె కూఁడితివి
వదలక మన్నించి వన్నెకెక్కు రతులు ॥దేవ॥

26.310

## సాళంగనాట

దేవదేవుఁడెక్కె నదె దివ్యరథము
మావంటి వారికెల్ల మనోరథము ॥పల్లవి॥

జగతి బాలులకై జలధులు వేరఁజేసి
వగటున తోలె నదె పైఁడి రథము
మిగులఁగ ఁగోపగించి మెరయు రావణ మీఁద
తెగి యెక్కి తోలేనదె దేవేంద్రరథము ॥దేవ॥

దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకుఁ
బక్కన మరలిచె ఁబుష్పరథము
నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కి తోలె
వెక్కసపు రెక్కలతో విష్ణురథము ॥దేవ॥

బలిమి రుక్మిణి ఁదెచ్చి పరులగెలిచి యెక్కె
అలయేఁగు బెండ్లి కల్యాణ రథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁగూడి
కలకాలమును నేఁగె ఘనమైన రథము ॥దేవ॥

1.400

## బౌళి

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువఁగా తిరుతేరు ॥పల్లవి॥

తిరువీధులేగీని తిరుతేరు
తిరుపు గొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజుల ఁదిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు ॥దేవ॥

ధిక్కరించీ మోతల ఁదిరుతేరు
దిక్కరి కుంభా లదర ఁదిరుతేరు
తిక్కు ముత్తెల కుచ్చుల తిరుతేరు
తెక్కులఁ బ్రతాపించీ ఁదిరుతేరు ॥దేవ॥

తీరిచెఁగలకలెల్ల ఁదిరుతేరు
ధీర గరుడ వాహపు ఁదిరుతేరు
చేరి యలమేలు మంగతో శ్రీవేంకటేశ్వరుని
తీరున నెలకొన్నట్టి తిరుతేరు ॥దేవ॥

4.320



## మాళవి గౌళ

నానావర్ణముల నద గొండ వలెను
దాన హరి తేరదె తగ తిరువీధుల ॥పల్లవి॥

కదలె కదలె నదె గరుడధ్వజుని తేరు
అదె మిన్ను మోచిన నీలాద్రి వలెను
యెదిరె నెదిరె నదె యిందిరాధిపుని తేరు
కదిపి చుక్కలు మోచే కనకాద్రివలెను ॥నానా॥

తిరిగె తిరిగె నదె దేవదేవుని తేరు
అరుదైన ఘన మంద రాద్రివలెను
పరువులిడీ నదె పట్టపు శ్రీపతితేరు
విరివి ఁగైలాసపు వెండికొండవలెను ॥నానా॥

దగ్గరె దగ్గరె నదె దైవశిఖామణి తేరు
అగ్గలపు శ్రీ వేంకటాద్రివలెను
అగ్గమై శ్రీవేంకటేశు ఁడలమేలు మంగఁగూడె
తగ్గు లేని మొత్తపు దొంతర కొండవలెను ॥నానా॥

4-55

## వసంతం

నిండెను లోకములెల్ల నెరి నితని కరుణ
పండి రాసులాయ ఁగీర్తి ప్రతాపము లెల్లను ॥పల్లవి॥

గరుడ వేగమున ఁగదలె విజయరథ
మిరవై యందు దేవుఁడేగు చుండఁగా
సారథి ఁబట్టుకుచ్చులు చుక్కలలో సందడించ
గరిమ ఁబైడి కుండలు గగనము దాఁకను ॥నిండె॥

అనిల వేగమున నదె వెడలె రథము
అనిమిషులు పగ్గములందు కొనఁగా
తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కుల నిండ
సునిసి చక్రము దనుజుల సాధింపఁగను ॥నిండె॥

వెలయ మనోవేగాన వేంచేసి మగిడి రథ
మెలమి ఁదారు దాసులు యేచి పొగడ
అలమేలు మంగ దనకట విడె మియ్యఁగాను
బలిమి శ్రీవేంకటాద్రి పతి మించీ నిందును ॥నిండె॥

4.299

## సాళంగనాట

భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె
పైకొని నిలువరాదు పారరో దిక్కులకు ॥పల్లవి॥

బండి కండ్ల రవమదే బంగారు మెఱుఁగులవే
కొండవంటి రథమదె గొడుగులవే
మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే
బందు బండై యసురలు పారరో దిక్కులకు ॥భీక॥

గరుడధ్వజమదే ఘంటారవములవే
సొరిది ముత్యాల కుచ్చులు నవే
బిరుదు శంఖము మ్రోత బెరయించీ దేవుఁడదే
పరగ దానవు లెల్ల ఁబారరో దిక్కులకు ॥భీక॥

ముంగిట బలములవే మొరసీ భేరులవే
సంగతి ఁబ్రతాపమదే సాకారమదే
కుంగ కలమేలుమంగ ఁగూడి శ్రీవేంకటేశుఁడు
భంగపెట్టి దైతేయులు పారరో దిక్కులకు ॥భీక॥

3.164



## సాళంగనాట

మిన్ను నేలా నొక్కటైన మేటి తేరు
కన్నుల పండువయిన శ్రీకాంతుని తేరు ॥పల్లవి॥

జలధుల మీఁదను చక్కగా నేగెను తేరు
బలిమి ఁగులాద్రులపై ఁబారెను తేరు
పెలుచు లంకముంగిట పేరెలు వారెను తేరు
చెలఁగె దిగ్విజయపు శ్రీహరితేరు ॥మిన్ను॥

రమణ ఁగుండిన నగరము చుట్టు కొన్నతేరు
తిమురుచు రుకుమిణి ఁదెచ్చిన తేరు
సమరములో జరాసంధుని ఁదోలిన తేరు
అమరుల వెనుబలమగు శౌరి తేరు ॥మిన్ను॥

వొట్టి సృగాల వాసుదేవుని భంగించిన తేరు
బెట్టు పౌండ్రకునిపై దాడి వెట్టిన తేరు
అట్టె శ్రీవేంకటేశు ఁడలమేలు మంగ ఁగూడి
పట్ట మేలుచు నెక్కిన పరమాత్మ తేరు ॥మిన్ను॥

2.227

## సాళంగనాట

మునులాల జనులాల మంచిన దేవతలాల
పనివూని మొక్కరో పరమాత్మునికి ॥పల్లవి॥

కనకాచలమువంటి ఘనదివ్యరథముపై
వనజాక్షు ఁడెక్కి వీధి వచ్చీ వాఁడె
పెనుదళమై నడచె విష్వక్సేనుఁడిదె దేవిడి
కని మని సేవించడో కన్నుల పండుగలు ॥మును॥

గగన వాహిని వంటి గరుడధ్వజముతోడ
అగడై వీధి నేగే చక్రాయుధుఁడు
పగటు విజయముతో పాంచజన్యము వట్టీని
నిగిడికొని యాడరో నిచ్చకల్యాణములు ॥మును॥

వరుస భాగ్యదేవత వంటి యలమేలుమంగ
వురమెక్కఁగ శ్రీ వేంకటోత్తముఁడు
తిరమై నెలవుకొనె దివ్యనగరులోనను
శరణని బదుకరో సాక్షాత్కరమున ॥మును॥

15.192

## శంకరాభరణం

మొక్కరో పరుషలు మోహనమూర్తికి
వెక్కసమగు శ్రీ వెంకటపతికి ॥పల్లవి॥

హరిరథమదే ముందరి నొగలవిగో
గరుఁడ ధ్వజమదే ఘంట లవే
సరిఁదిరిగేటి కాంచన చక్రము లవే
తిరువీధుల నేతెంచే ఁగనరో ॥మొక్క॥

తేరు పడగలవే తెల్లగొడుగు లవే
తోరణంబులవే సారథి వాఁడే
ధీరతఁగట్టిన దివ్యహయము లవే
మేరువు వలెనే మెరసీ నదివో ॥మొక్క॥

పసిడికుండ యదే పట్టు కుచ్చు లవే
వెసనడుమ వాఁడే శ్రీవేంకటేశుఁడు
యెసఁగి యురమునను యిదే యలమేల్మంగ
వసుధ పెండ్లి తేరు వచ్చీ నిదివో ॥మొక్కరో॥

12-402



## సాళంగనాట

మొక్కరో మొక్కరో మీరు మోమున ఁగళలు దీరె
యెక్కువ శ్రీవేంకటేశు ఁడింతులలో వాఁడె ॥పల్లవి॥

తేరు మీఁదె నెక్కీ హరి దేవుళ్ళు ఁదానును వాఁడె
భోరునను దేవదుందుభులు వాఁగఁగా
తోరపు మోఁకులు వట్టి దొరలు బ్రహ్మాదులెల్ల
ధీరత ఁదీశేరదే తిరువీథులందును ॥మొక్కరో॥

వేడుక రథము మీఁద వెలసే శ్రీపతి వొద్ద
ఆడేరు పాడేరు అచ్చర లెల్ల
వీడెపు సెలవులతో వెలఁదులతో హరి
యీడు లేక యేఁగి వచ్చీ నింటింటి వాకిటను ॥మొక్కరో॥

శ్రీవేంకటేశుఁడు వాఁడె యలమేలుమంగ
సావధానమున సరసము లాడఁగ
దేవాసనం బెక్కి తేఁకువ నారగింపులు
వావిరి ఁజేకొనీ వాఁడె వాడవాడలను ॥మొక్కరో॥

11-304

## సాళంగనాట

మొక్కరో సేవించరో మునులాల ఋషులాల
దిక్కుల సాధించీ నదే దేవుఁడు ॥పల్లవి॥

అరదము మీఁద నెక్కి అమరులు గొలువఁగ
సిరితో వీథుల నేఁగీ శ్రీవిభుఁడు
గరుడధ్వజముతోడ ఘనచక్రాయుధముతో
దొరదైవ మదిగో పొందుగ మెరసీని ॥మొక్కరో॥

గొడుగులు cబడిగెలు కోటాన cగోట్లాడcగా
వెడలె వెడలె నదే విష్ణు దేవుcడు
నడుమను రంభాదులు నాట్యము లాడcగాను
అదరి వుత్సవ మందీ నాదిమూరితీ ॥మొక్కరో॥

సారె నింటింటి విందులు చవులు చూచుకొంటాను
సారెకు రథము దోలీ సర్వేశ్వరుcడు
ఆరీతి శ్రీవేంకటేశుcడలమేలుమంగ cగూడి
కోరిన వరము లిచ్చీ cగుంభినీరమణుcడు ॥మొక్కరో॥

13-385

## నాట

వీది వీది వాcడే వాcడే వీcడే వీcడే చెలcగీని
ఆదిదేవుcడు శ్రీవేంకటాద్రి మీcదటను ॥పల్లవి॥

గరుడధ్వజంబదె ఘనవిష్ణురథమదె
సరి శంఖ చక్రములు శార్‍ఙ్గమునదె
హరి యందు మీcదటను ఆయిత్తమై యున్నాcడదె
అరులనెల్ల గెలిచి అమరుల cగావను ॥వీది॥

సారథి యల్లవాcడె చాలి రణభేరి యదె
అరయ నిరుమేలా బ్రహ్మాదులు వారే
పేరుకొన్న వేదముల బిరుదు పద్యములవె
శ్రీరమణుcడు మెరసె చిక్కులు వాపcగను ॥వీది॥

ఆటలపాటలు నవె అచ్చరలేమలు వారె
చాటున నలమెల్మంగ సంగడి నదె
యీటులేని శ్రీవేంకటేశు cడేcగీ నల్లవాcడె
కోటాన cగోటి దాసుల కోరిక వీడేర్చను ॥వీది॥

3.274



## మాళవిగౌళ

వీదుల వీధులనెల్లా విష్ణుcడు సంచరించీని
పోది మాని కన్న గతై పొందు మీ రసురలు ॥పల్లవి॥

తేరుమీcద నెక్కీ నేcడు దేవోత్తముcడు వాcడె
సారమైన శంఖచక్ర శార్ఙ్గాయుధము లవే
కారుకమ్మీ నాకాసాన గరుడధ్వజం బదే
పారరో దానవులాల పంతముల విడిచి ॥వీదుల॥

దండవెట్టె నల్లవాcడే దైవాల రాయcడు
దండి నెట్టెపు cజుట్ల త పారపు చుంగు లవే
కొండవంటి రథమిదె కొనపైcడి కొండ లవే
గుండు గూలి విరుగరో గొబ్బున దైతేయులు ॥వీదుల॥

విజయ శంఖము వట్టె వీcడె శ్రీవేంకటేశుcడు
భజన నలమేల్మంగ పలుమారు మెచ్చీ నదె
త్రిజగాన నాతని cజేరిన దాసు లిదె వీరె
గజబెజ లిcక నుడుగరో రాక్షసులు ॥వీదుల॥

2.487

## సారాష్ట్రం

వీదుల వీదుల విభుcడేcగీ నిదె
మోదము తోడుత మొక్కరో జనులు ॥పల్లవి॥

గరుడధ్వజమదె కనకరథంబదె
అరదముపై సూరి యలవాcడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరcగc బగ్గములు పట్టరో జనులు ॥వీధుల॥

ఆడే రదివో యచ్చర లెల్లను
పాడేరు గంధర్వ సతు లెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరును ఁజూడరో జనులు ॥వీదుల॥

శ్రీవేంకటపతి శిఖరము చాయదె
భావింప బహువైభవము లవే
గోవింద నామపు ఘోషణ లిడుచును
దైవం బితఁడని తలఁచరో జనులు ॥వీదుల॥

4-286

## మాళవిగౌళ

రెక్కల కొండవలె మీరిన బ్రహ్మాండమువలె
వెక్కసమైన తేరుపై వెలసీని దేవుఁడు ॥పల్లవి॥

బిఱబిఱ ఁదిరిగేటి పెనుబండి కండ్లతో
గుఱుతైన పడగెల గుంపులతో
తటిమితో ధరణి గ్రక్కదల ఁగదలెను తేరు
మెఱసీ వీధివీధులు మేఁటియైన దేవుఁడు ॥రెక్క॥

ధగధగమను నాయుధపు మెరుఁగులుతోడ
జిగిమించుఁ బగ్గముల చేరులతో
పగలు రాకాసులపై ఁబారీ నదె తేరు
నిగిడి నలుదిక్కుల నీటు చూపీ దేవుఁడు ॥రెక్క॥

ఘణఘణమనియెడి గంటల రవముతోడ
ప్రణుతి నలమేల్మంగ పంతాల తోడ
రణములు గెలిచి మరలె నదే తిరుతేరు
గణుతి కెక్కెను శ్రీవేంకటగిరిదేవుఁడు ॥రెక్క॥

3.145



## సాళంగనాట

సిగ్గరి పెండ్లి కొడుకు చెలుల ముందర నెల్లా
యెగ్గెరఁగక మెరసీ నిదివో యనుచు ॥పల్లవి॥

జంట తేరుల మీఁద సతులు నీవును నెక్కి
యింటింట వీదివీది నేఁగి రాఁగాను
పెంటల గోపికలెల్లా పెదపెద మేడలెక్కి
నంటున ఁజూచి సిగ్గుతో నవ్వులు నవ్వేరు ॥సిగ్గరి॥

గొడుగుల నీడను కోటు పడిగెలతోడ
యెడనెడ వాతల నీవేఁగి రాఁగాను
మెడలెత్తి నీ పొందుల మెలుత లబ్బుర మంది
జడిగొని తోఁగి చూచి జాణతణాలాడేరు ॥సిగ్గరి॥

విరులదండలలోన వింజామరలలోన
యిరవై దేవుళ్ళు నీవు నేఁగి రాఁగాను
పరగ నలమేల్మంగ పతివి శ్రీవేంకటేశ!
సొరిది ఁబుర సతులు చూచి పొగడేరు ॥సిగ్గరి॥

18-73

## గౌళ

హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరంజ్యోతి స్వరూపపు పైఁడి కుండతేరు ॥పల్లవి॥

గరుడధ్వజపు ఁదేరు కనకమయపు ఁదేరు
సురలు బొమ్మలైనారు చుట్ల ఁదేరు
మెరుఁగుల మేఘముల మించు ఁగొణిఁగెల తేరు
సిరుల ధ్రువలోకపు శిఖరపు ఁదేరు ॥హరి॥

బలుకుల పర్వతాలె బండి కండ్లైన తేరు
నలుదిక్కులంచుల వున్నతపుఁ దేరు
కొలఁది లేని చుక్కల కుచ్చుల ముత్తేల తేరు
మెలుపు నాకాశ గంగ మేలుకట్ల తేరు ॥హరి॥

మునులనే వుత్తమశ్వములుఁగా, గట్టిన తేరు
ఘనమహిమలనే సింగారపు ఁదేరు
యెనసి శ్రీవేంకటేశుఁ డెపుడూ నలమేల్మంగ
దినదిన భోగముల ఁదిరమైన తేరు ॥హరి॥

2.366

* * *



## అనుబంధం - 1

# తి.తి.దే శాసనాలలో రథోత్సవాలు

| సంఖ్య | సంపుటం | శాసన సంఖ్య | సంవత్సరం | కైంకర్యపరులు |
|---|---|---|---|---|
| 1 | II | 68 | 1476 | శ్రీశఠగోపదాసర్ నరసింహరాయ మొదలియార్ |
| 2. | II | 109 | 1479 | కుమార తాతయ్యంగార్ |
| 3. | II | 96 | 1491 | అరవణై పెరుమాళ్‌దాసర్ ఇళైయ పెరుమాళ్ అప్పయన్ |
| 4. | II | 104 | 1493 | కుమార తాతయ్యంగార్ పొట్టి భట్టార్ సప్తగిరి నాదర్ అలగప్పినార్ |
| 5. | II | 105 | 1493 | పెరియపెరుమాళ్ దాసర్ |
| 6. | II | 108 | 1493 | అరిరాయ ముదలియార్ అయ్యప్పన్ |
| 7. | II | 113 | 1494 | తిమ్మన తనాయకర్ |
| 8. | II | 132 | 1495 | పల్లవరాయర్ చందిర పిళ్ళైయార్ మలైనిన్ఱ పెరుమాళ్ మలై ఏరుం పెరుమాళ్ |
| 9. | | 134 | 1495 | కందాడై రామానుజయ్యంగార్ |
| 10. | III | 2 | 1504 | అనుసంధానం తిరువెంకట జియర్ |

| | | | | |
|---|---|---|---|---|
| 11. | III | 11 | 1507 | తిప్పుసెట్టి |
| 12. | III | 15 | 1508 | నరసింహరాయ ముదలియార్ రామయ్యన్ |
| 13. | III | 113 | 1516 | దైవత్తాన్ అరసు |
| 14. | III | 142 | 1520 | కందాడై మాధవయ్యంగార్ |
| 15. | IV | 93 | 1530 | కందాడై రామానుజయ్యంగార్ |
| 16. | IV | 06 | 1530 | తాళ్లపాక తిరుమలయ్యంగార్ |
| 17. | IV | 27 | 1533 | నాగుసెట్టియార్ కుమార నారాయణ సెట్టియార్ |
| 18. | IV | 81 | 1537 | అడైప్పం విశ్వనాథనాయక్కర్ |
| 19. | IV | 87 | 1537 | కృష్ణప్ప సెట్టియార్ |
| 20. | IV | 110 | 1538 | అడైప్పం బయ్యప్పనాయకర్ |
| 21 | IV | 129 | 1539 | పెద్ద తిరుమలయ్యంగార్ |
| 22 | V | 02 | 1542 | కోయిల్ కేళ్విజీయర్ వానమామలై జీయర్ |
| 23 | V | 08 | 1543 | ఎల్లప్పపిళ్ళై మరియు 8 మంది |
| 24. | V | 60 | 1545 | వెంకటత్తుతైవర్ |
| 25. | V | 96 | 1547 | తిమ్మరాజర్ |
| 26. | V | 99 | 1547 | తాళ్లపాక తిరుమలై అయ్యంగార్ |
| 27. | VI | 05 | 1583 | ఏట్టూర్ తిరుమలై కుమార తాతాచార్యర్ అయ్యన్ |



## అనుబంధం - 3

# తిరుమల రథోత్సవము - వెంగమాంబ

వెంగమాంబ తరిగొండను వీడి తిరుమల చేరి ఇంచుక స్థిరపడిన నాటినుండి ప్రతిదినము సాయంవేళలో స్వామివారి కైంకర్యములు ముగియు ఏకాంతసేవా సమయమునకు ఆలయమున కరిగి కర్పూరహారతి యొసగి వచ్చుచుండెడిది. తరతరములుగా మహాత్ముల, మహనీయుల కైంకర్యము లందు కానిన శ్రీవేంకటేశ్వరునకు, ఒకానొక స్త్రీ - ఆమె యెంతటి భక్తురా లైనను - పూర్వాచార విరుద్ధములుగా సకేశియై యున్నట్టిది. కర్పూర హారతి యిచ్చుట, ఆ హారతిలో శ్రీస్వామివారి నిత్యపుజాక్రమము ముగియుట యను విషయములు తత్రత్యులగు అర్చక శిఖామణులకు అసూయావకము లయ్యెను. అందుచే వారొక నాడా యమకు వినిపించునటుల ఈసడింపు పల్కులు పలుకుకొనిరి. నిత్యకైంకర్యపరులైన వారి పల్కులు స్వామివారికిని సమ్మతములై యుండు ననెడు సద్భావముతో, హారతి యొసగి, వెంగమ్మ, ఆ మఱునాడు గుడి కేగక తన యింట అర్చనలోనున్న శ్రీనివాస ప్రతిమకు హారతి యిచ్చి సంతృప్తి నొందెను. అట్లామె గుడికి రాకపోవుట అంతకు ముందటి దినమున తమలో తాము పల్కుకొన్న పల్కుల యొక్క ప్రభావమేయని అర్చకులు తనిసి, ఆ యుత్తమ భక్తురాలి కైంకర్యమును గూర్చి యెగతాళిగా మాటలాడుకొనిరి.

ఆ మఱుసటి దినము రథోత్సవము. భక్త బృందము యొక్క మేరమీఱిన యుత్సాహముచే తిరువీధులలో నడగొండవలె కదలి వచ్చుచున్న వేంకటేశ్వరుని తేరు వెంగమాంబ యింటి వద్దకు వచ్చునప్పటికి నిశ్చలము నిలిచిపోయెను. రథమును ముందునకు కొనసాగించుటకు మహంతు మొదలగు అధికారులెంత ప్రయత్నించినను

భక్తాదులు బలము కొలది లాగినను కట్టు కదలదయ్యెను. అయ్యది మహాభక్తురాలగు తరిగొండ వెంగమాంబ ప్రభావమై యుండునని అర్చకస్వాము లప్పటికిని గ్రహింప గల్గిరి. ఆ పూజారులు తడుముకొనుచు ఆమె సమక్షమున కరిగి తమ తప్పులను క్షమింప వేడికొనిరి. శ్రీవారి రథము సాగిపోవునటుల, వచ్చి కర్పూర హారతి యిచ్చి ప్రార్థింపవలసినదిగా మిగుల బ్రతిమాలు కొనిరి. పశ్చాత్తాప తప్తులైన వారి యభ్యర్థనల నంగీకరించి మహంతు మున్నగువారి కోరిక నమస్కరించి వెంగమ రథముకథ కేతెంచి రథా రూఢుడై యున్న శ్రీ భూసమేత వేంకటేశ్వరునకు పరమభక్తితో కర్పూర నీరాజన మొసంగెను. ఆ పిమ్మట తేరుమెల్లగా కదలిపోయి గమ్యము చేరినది. ఆనాటినుండి వెంగమాంబ హారతి ఆలయాధి కారులచే నిత్యహారతిగా అంగీకరింపబడెను.

**– తరిగొండ వెంగమాంబ కృతులు – సవిమర్శక పరిశీలనము పు.28**

* * *



**అనుబంధం - 4**

## రథోత్సవ సంకీర్తనలలో రథాలు – తేరులు

| | | |
|---|---|---|
| అర్జును బండి తేరు | : | నందిఘోషము – అగ్నిదత్తము |
| ఆదిత్యుని తేరు | : | 1–424 |
| ఇంద్ర రథము | : | 4–26 అపరాజితము లేక కౌతకం |
| చందురుని తేరు | : | 1–424 |
| దేవేంద్రరథము | : | 1–400 |
| దైవశిఖామణి తేరు | : | 4.55 |
| మరు తేరు | : | 1–424 |
| వనజాక్షునరదము | | |
| వాసుదేవుని తేరు | : | 3.53 |
| విష్ణుని రథము | : | శతానందము – అనేక ఘంటలు కలది |
| శ్రీకాంతుని తేరు | : | 2.227 |
| శీపతి తేరు | : | 4.55 |
| శ్రీవిభుని తేరు | : | 3.146 |
| శ్రీవేంకటాద్రుని తేరు | : | 2.110 |
| శౌరి తేరు | : | 2227 |
| హరి తేరు | : | 3.227 |
| ఉన్నతపు తేరు | : | 2.360 |
| కనకపురథము | : | 23.325 |
| కనకమయపు తేరు | : | 4.31, 4.286 |
| కల్యాణ రథము | : | 1.400 |

| | | |
|---|---|---|
| కుండ తేరు | : | 2.366 |
| ఘనరథము | : | 3.122 |
| ఘన దివ్యరథము | : | 15.192 |
| ఘనమైన దివ్యరథము | : | 1.400 |
| చిన్నరథము | | |
| తిరుతేరు | : | 18.145 |
| ధ్రువలోకపు తేరు | : | 12.55 |
| పెండ్లి తేరు | : | 12.402 2.110 |
| పైడి కుండ తేరు | : | 2.366 |
| పైడి రథము | : | 1.400 |
| బండి తేరు | | |
| బ్రహ్మాండమైన తేరు | : | 4-31, 2-239 |
| మేటి తేరు | : | 2.227 |
| సింగారపు తేరు | : | 2.110, 4.31 |
| శోభనపు తేరు | : | 4.35 |

* * *



## అనుబంధం - 5

## (అ) రథసంబంధి పదాలు

| | | |
|---|---|---|
| కంచిరథం | : | 60' అడుగుల రథం ఎత్తు, 10 అడుగుల వ్యాసం గల చక్రం. దక్షిణ దేశరథాలలో అందమయిన రథం |
| కుంభకోణరథం | : | ఆరావముదన్ పెరుమాళ్ గర్భగృహమే రథాకారం ఇదేకాక చిత్తిరత్తిరుత్తేర్ (చైత్రమాసంలో ఊరేగే తేరు) వాడుకలో ఉందేది ఇపుడు చిన్నరథమే |
| కోణార్కరథం | : | 12 జతల చక్రాలు, సప్తాశ్వములు గల 70 మీ. ఎత్తు రథం |
| జగన్నాథరథాలు | : | నందిఘోష, అలధ్వజ, పద్మధ్వజరథాలు |
| తాడిపత్రిరథం | : | చింతల వెంకట రామస్వామి ఆలయంలోని రథం |
| నాట్యసభారథం | : | చిదంబరంలోని నటరాజమూర్తికి ఎదురుగాగల రథాకృతి మండలం |
| బహుశిలారథం | : | హంపిలో విఠలాలయం దగ్గరి రథం. 4 చక్రాలలో ఒక చక్రం తిరిగేదట. రాయలవారు ఆ చక్రాన్ని త్రిప్పి సమరానికి వెళ్ళేవాడట |
| అతిరథులు | : | ధర్మజ, ధృష్టద్యుమ్న, దుర్యోధనాదులు. ఏనుగులతో, గుర్రాలతో, యోధులతో, రథసారథులతో యుద్ధం సలిపేవాడు |

| | | |
|---|---|---|
| అతిరథోత్తములు | : | భీష్మ, ద్రోణ, అర్జున, భీమ, అభిమన్యులు |
| అర్జునరథం | : | దేవుని ఊరేగించే రథాకృతి కలిగినది (మహాబలి పురం) |
| అర్ధరథులు | : | కర్ణవిందాను విందులు |
| ధర్మజరథం | : | దేవుని ఊరేగించే రథాకృతిగలది. (మహాబలి పురం) |
| ద్రౌపదీరథం | : | మహాబలిపురంలో పాండవరథాల మధ్య చిన్న రథం |
| పరంరావాహన రథం | : | గుర్రం మొదలగు వానిచే అన్ని మార్గాలలో సంచ రించగలిగే రథం |
| పైనీత రథం | : | ఇతర రథాలకు శిక్షణ ఇచ్చే రథం |
| పుష్య రథం | : | యుద్ధంలో వాడబడని రథం |
| భీమరథం | : | కిందిభాగం దీర్ఘచతురస్రంగా ఉండి పైకప్పు గజపృష్ఠాకృతి గలది |
| మహారథులు | : | సైంధవ, ద్రుపద, విరాటాదులు, 10,000 మంది ధానుష్కులతో పోరాడే వ్యక్తి |
| రజతరథం | : | రామేశ్వరంలో శివరాత్రినాడు పరమశివుడు ఊరేగే రథం |
| రథంతరుడు | : | దుష్యంతుని తండ్రి |
| రథకారః | : | రథం తయారు చేసేవారు. మహిషులు, కరణులు, భృగువులు మనువు సంతతివారు, కుమ్మరులు, విశ్వకర్మశిష్యులు |



| | | |
|---|---|---|
| రథబంధం | : | బంధకవితా విశేషం – చిత్రకవితా విశేషం తమిళ సాహిత్యంలో, వైష్ణకవులు, శైవ కవుల రథబంధాలున్నాయి. |
| రథ రంగవల్లి | : | రథాకారంలో వేసే ముగ్గు |
| రథాకృతి దీపాలయం | : | దిగువ మంగళగిరి గరుడాళ్వార్ ఉపాలయం |
| రథాకృతి మండపం | : | సింహాచలంలో దేవాలయానికి ఈశాన్య దిశలోని చిన్న మండపం |
| రథవాద న్యాయం | | |
| రథసప్తమి | : | మాఘమాసంలో శుద్ధ సప్తమి నాటి పర్వదినం. తిరుమలలో సూర్యప్రభ, శేష, గరుడ, హనుమద్వాహనాలపై ఊరేగే పర్వదినం |
| రథస్థా | : | మహాభారతంలో పేర్కొనబడినది |
| రథాంశధరుడు | : | కృష్ణుడు, విష్ణువు |
| రథాంగపాణి | : | రథాంగమైన చక్రాన్ని చేతియందు కలవాడు |
| రథావర్తం | : | ఒక తీర్థ విశేషం |
| రథ్యాదీపన్యాయం | : | |
| రథి | : | 12 సౌవీర వీరులలో ఒకడు తన సారథిని గుర్రాలను సేనను రక్షిస్తూ యుద్ధం చేసేవాడు |
| రథితరగణం | : | ఆంగీరస సంతతిలోని ఒక ఉపగణం |

రథీతరగోత్రం : ఒక గోత్ర పురుషుడు

శ్రీవిల్లిపుత్తూర్‌రథం : వానమామలై జీయర్ నిర్మించిన రథం. '160' అడుగుల ఎత్తు 15 వేల మంది లాగ వలసిన రథం. తిరుమల నాయకర్ రథం ప్రస్తుతం లేదు.

రాతిచక్రరథం : కొలను పాక శివాలయ రథం

రథోద్ధతం : ఒక ఛందోరీతి

సమరథులు : దుర్యోధనుని సోదరులు, శకుని మొదలైనవారు

సర్వపథగం : అన్ని మార్గాలలో సంచరించ గల రథం

సహదేవరథం : క్రింది భాగం దీర్ఘచతురస్రంగా ఉండి పైకప్పు గజపృష్ఠాకృతి కలచి (మహాబలిపురం)

స్వర్ణరథం : మధురలోని మీనాక్షి ఆలయంలోని రథం

## (ఆ) రథ రథాంగ సంబంధి ఉపమలు

రథం :

దేహరథము 2.152, నరరథము 2.152, దేహరథము 8.90
పంచేంద్రియరథము 2.152, పైడికొండ 2.487
గరుడుడు మందట నిలిచినట్లు 3.93
పదివేలుసూర్యబింబములుదయించినట్లు 3.93
మెచ్చుల మెరుగులతో మేఘము వాలినట్లు 3.93
కోటి చంద్రప్రభలతో 3.512
వేయిసూర్యుల ప్రతాపవిభవముతో 3.512



శేషుడే 4.31, కనకపుకొండ 3.122
కనకాద్రి 4.55, నీలాద్రి 4.55, మందరాద్రి 4.55
వెంకటాద్రి 4.55
కాంత నిలువు 23.375

శిఖరం : శిరసు 2.152, కోపు సొబగు 8.90, పెనుకొప్పు 23.373

ధ్వజం : కప్పుపయ్యద 8.90 గగన వాహిని 15.192
పయ్యదకొంగు 23.377 వెలది పయ్యద 23.375

టెక్కెము : చేతులు 2.152 పయ్యద 26.310

కుచ్చులు: నక్షత్రాలు 2.239, కొలదిలేని హారాలు పట్టుకుచ్చులు 2.366
ముత్యాలకుచ్చులు 3.166
పంచవన్నెభూతములు

పంచవన్నెకోకలు 2.152 మేఘాల మేలుకట్లు 2.239

పైడికుండలు చందురుడు రవి 3.146, బలుచనుగుబ్బలు 26.310

సింహాసనము – ప్రకృతి 3.146

అద్దము చెక్కులు 26.310

సింగిణి విండ్లు చెలువపు బొమ్మలు 23.375

బాణములు. చూపులు 23.375

విజయ శంఖము కంఠము 8.90

బొమ్మలు దేవతలు 2.366 సురలు 2.366

పువ్వుల గుత్తులు – చన్నులు 8.90 కుచములు 23.375

తురగములు మునులు 2.366 వేదములు 3.146 కోరికలు 8.90

| | |
|---|---|
| సారథులు | జీవులు 3.146 |
| నొగలు | పాదములు 2.152 |
| పగ్గలు | చూపులు 2.152 శా(స్త్రాలు 3.146 |
| | కాగిటి హస్తములు 23.375 |
| | గంటలమొలనూళ్ళు 26.310 |
| బండికండ్లు. | పన్నిద్దరు సూరియలు 2.229 |
| | సరిపిఱుదు 2-152 పాదాలు2-152 |
| | పంచభూతములు 3.146 |
| | దిండుకల పిరుదులు 8.90 |
| | బంతినున్న పిరుదులు 23.375 పిరుదు 26.310 |
| చీలలు | పాపపుణ్యములు 2.152 |
| తెడ్లు | అన్నపానాలు 2.152 |

* * *



## అనుబంధం - 6

# కతిపయ శబ్దాలకు అర్థవిశేషాలు

1.424 సూర్యవీధి, తూర్పున ఉన్న వీధి
సోమవీధి, ఉత్తరమున ఉన్న వీధి
సోమ సూర్యవీధులు తిరగడమంటే (ప్రదక్షిణం ఆచరించడం
మరుతేరు మన్మథుని తేరు - చిలుక

2.366 పలుకుల పర్వతాలు : వేదములనే పర్వతాలు

4.26 శేషాదులు , అనంత, గరుడ, విష్వక్సేనాదులు

3.146 పంచభూతాలు. పృథ్వి, అప్, తేజస్సు, వాయువు , ఆకాశం

2.3.375 అక్షయ బాణములు - అమ్ములు పొదిలో ఎన్ని బాణాలు తీసుకొని వేస్తున్నా తరుగని బాణాలు

2-110 జట్టి = మల్లయోధుడు

1.8.138 సంగడి = సమీపము, పార్శ్వము, వెనుక, జత

4.131 ఆరతులు = హారతులు
నిత్యులు=ఏనాడు సంసార సంసర్గంలేక జ్ఞానసంకోచం లేక పరమపదంలో నిత్యనివాసం చేసే ఆత్మలు; ముక్తులు ముందు సంసారబంధం కలవారై అనంతరం నివర్తింపబడిన సంసారబంధం కలవారు మోక్షము కలవారు ముక్తులు

3.92 కొఱ్ఱు - మేకు. వెన్నెల నా ఁడు = పూర్ణిమ

3.93 దుందుభి : భేరి

6.178 (త్రిదశులు = దేవతలు

3.517 కరిలాంఛనధ్వజము = ఏనుగు గుర్తుగలిగిన ధ్వజము – లక్ష్మి రథధ్వజము

15.163 శార్ఙ్గము – మహావిష్ణువు విల్లు పేరు
పాంచజన్యము – విష్ణువు శంఖము పేరు
సుదర్శనము – విష్ణువు చక్రాయుధము పేరు

3.512 చక్రవాళము – చుట్టుcగొండ

2.2.29 పన్నిద్దరు సూరియలు. 12గురు ఆళ్వారులు
పొయ్‌గై (సరోముని) పూదత్తాళ్వార్ (భూతము) పేయాళ్వార్ (భక్తి సారగురు) తిరుమళిశై (భక్తి సారయోగి) నమ్మాళ్వారు (శ్రీశఠకోప) మధురకవి, కులశేఖరాళ్వార్, తిరుప్పాణాళ్వార్ (గాయకయోగి)

తొండరడిప్పొడియాళ్వార్! (విప్రనారాయణ) పెరియాళ్వార్ (విష్ణుచిత్తయోగి) ఆండాళ్ ( గోదాదేవి) తిరుమంగై ఆళ్వార్ (పరకాలయోగి) కిందేడు లోకములు = అతల వితల తలాతల రసాతల మహాతల పాతాళములు

4.320 తిరుపు = తిరుగుట
దిక్కరికుంభాలు – ఐరావతము, పుండరీకము, అంజనము, కుముదము పుష్పదంతము, సార్వభౌమము, సుప్రతీకము

4.55 మందరాద్రి – కైలాసానికి ఆరువందల యోజన దూరం గలపర్వతం అమృతమథనం ఈ అద్రిని దేవదానవులు కవ్వంలా వాడారు.



2.222 కుండిన నగరము = రుక్మిణి తండ్రి పాలించునగరము
విష్వక్సేనుడు = దేవతల సేనాధిపతి, సేనాముదలి

11.304 ఆరగింపులు – స్వామికి సమర్పించే తళిగైలు. సుగియన్‌ప్పడి, అతిరసప్పడి,అప్పప్పడి, ఇడ్డిఅప్పడి, దోసైప్పడి, మొదలయి నవి. తాళ్లపాక పెదతిరుమలయ్య బ్రహ్మోత్సవాల కాలంలో రకరకాల ఆరగింపులకు గ్రామాలు దానాలు చేసినవాడు.

* * *

## ఉపకరించిన రచనలు


1. ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర 1, 2 భాగాలు (1993) – కంభం పాటి సత్యనారాయణ.
2. తరిగొండ వేంగమాంబ కృతులు – సవిమర్శక పరిశీలన – డా॥ కె.జె. కృష్ణమూర్తి.
3. తిరుమలలో తిరునాళ్ళు (1985) – డా॥ సి. గోవిందరాజు.
4. తెలుగు పర్యాయ పద నిఘంటువు (1998) – ఆచార్య జి.ఎన్.రెడ్డి
5. భారతదేశ చరిత్ర – రథముల వైశిష్ట్యము (1991), వేదాంతం రాజగోపాల చక్రవర్తి.
6. శ్రీమదాంధ్ర మహాభారత నామ సర్వస్వం (2010) – పుత్తా పుల్లారెడ్డి.
7. శ్రీవారి బ్రహ్మోత్సవము (1993) – వేదాంతం శ్రీవిష్ణు భట్టాచార్య.


* * *

# హనుమత్సంకీర్తనలు



**వేదంలో కపి**

ఋగ్వేదంలో "వృషాకపి" (10.86) అనే మాటవుంది. ఋత్విజులు ఒకసారి సోమయాగం చేశారు. సాధారణంగా సోమయాగం చేసేటప్పుడు ఇంద్రుణ్ణి స్తుతించడం సంప్రదాయం. అతనికే సోమం అర్పించడం విధిగా వుండేది. కాని ఋత్విజులు అలాగాకుండా ఇంద్రునికి బదులు "వృషాకపిని" కొనియాడి అతనికి సోమమర్పించారు. ఈ అకృత్యానికి ఎవరికయినా కోపం రావడం సహజం. కాని ఇంద్రుడు సుతరాము బాధపడలేదు. పైగా "వృషాకపి" నా కొడుకే అని సమర్థించుకొన్నాడు కూడా. ఇంద్రుడిలా తన స్థానాన్ని మరచి మరొకణ్ణి నెత్తికెక్కించుకోవడం ఇంద్రాణికి నచ్చలేదు. అంచేత ఇంద్రుణ్ణి తూలనాడింది. పైగా అక్కసుతో "వేటకుక్కలు వృషాకపిని కాట్లువేసి చిత్రహింసపెట్టి తిననీ" అని శపించింది. పై "వృషాకపి" మాట ఒక వానరాకారం కల్గిన దేవతను సూచిస్తుంది.

యాస్కుడు నిరుక్తంలో "వృషాకపి" శబ్దాన్ని ఆదిత్యపరంగా సమన్వయించాడు. ఎవడు తన కిరణాలతో ప్రతివస్తువును కంపింపజేస్తాడో అతడే వృషాకపి అని యాస్కుడు వివరణ ఇచ్చాడు.

"బృహద్దేవతా" అనే గ్రంథంలో "వృషాకపి" (2-10) హరితవర్ణం గల మృగంగా చెప్పబడింది.

**పురాణాలలో కపి**

అష్టాదశపురాణాల్లో బ్రహ్మపురాణమొకటి. ఈ పురాణం 77 నుండి 175 అధ్యాయాల్లో "వృషాకపి" ప్రస్తావన వుంది. రాక్షసుల్లో మొదటివాడు హిరణ్య. అతని కొడుకు మహాశని. అతని అకృత్యాలు అసంఖ్యాకం. అతడు మహాశక్తిమంతుడు. మహాశని ధైర్యసాహసాదులు ప్రదర్శించి ఇంద్రుణ్ణి వోడించి బంధించి తండ్రికి కానుకగా ఇచ్చాడు. హిరణ్యుడు

ఇంద్రుణ్ణి కారాగారంలో బంధించాడు. ఇంద్రుణ్ణి జయించిన సంతోషంతో మహాశని వరుణుని మీదికి దాడితీశాడు. వరుణుడు మహాశని పరాక్రమాదుల్ని ముందే విన్నవాడు కనుక తన అమ్మాయిని ఇచ్చి బాంధవ్యం పెంచుకొన్నాడు. ఇంద్రుడు బందీకావడం, వరుణుడు మహాశనితో వియ్యమందడం దేవతల్ని కలవరపెట్టాయి. అంచేత దేవతలందరు కూడబలుక్కొని విష్ణువును ఆశ్రయించారు. విష్ణువు దేవతలతో ఈ వ్యవహారాన్ని వుపాయంతో సరిదిద్దు కోవాలని చెప్పాడు. దేవతలకు కలిగిన ఇబ్బందుల్ని విష్ణువు వరుణునితో విశదంగా చెప్పాడు. వరుణుడు విష్ణువు మాటల్ని పెడచెవి పెట్టలేదు. అల్లుణ్ణి ప్రార్థించి ఇంద్రుణ్ణి విడిపించాడు. ఇంద్రుడు బంధవిముక్తుడయ్యాడు. అయినా ఇంద్రుడు ఈ అవమానాన్ని భరించలేకపోయాడు. భార్య శచీ దేవితోకూడా వెళ్ళి గోదావరినదీతీరంలో హరిహరుల నుద్దేశించి తపస్సు మొదలెట్టాడు. అప్పుడు గోదావరినుండి ఒక మహాశక్తిమంతుడు పుట్టాడు. అతడే వృషాకపి. ఈ వృషాకపి రసాతలానికి వెళ్ళి మహాశనిని చంపేశాడు. ఇంద్రునికి పట్టరాని సంతోషం కలిగింది. వృషాకపి అంటే ఇంద్రునికి గౌరవ ఆదర అభిమానాలు పెరిగాయి.

వాల్మీకిరామాయణంలో దానవసంహారకార్యాలలో శివప్రసక్తి కని పించదు. కాని శైవసంబంధ పురాణాలలో హనుమజ్జననానికి రుద్ర సంబంధమున్నట్లు అనేక కథలు చెప్పబడ్డాయి. ప్రత్యేకించి స్కాందపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, బృహద్ధర్మ గ్రంథాలలో వాటిని పరిశీలించవచ్చు.

భస్మాసురసంహారార్థం విష్ణువు మోహిని అవతారమెత్తాడు. ఆ లోకోత్తర సౌందర్యానికి శివుడు మరులు గొన్నాడు. అపుడు శివునికి వీర్యస్ఖలన మయింది. సప్తర్షులు అద్దానిని ఒక ఆకులో ఉంచి అంజన చెవిలో పోశారట. అంజన గర్భవతియై హనుమంతుని కన్నదని శతరుద్రీయం చెబుతుంది.



బృహద్ధర్మపురాణంలో హనుమంతుడే శివుడుగా ప్రత్యక్షమై లంకా పట్టణాన్ని పాలించే చండికను కైలాసానికి వెళ్ళమని ఆదేశించినట్లు వర్ణితం. హనుమంతుని ప్రవేశాన్ని చండిక అడ్డగించింది. అపుడు శివుడు సాక్షాత్కరించాడు. చండిక కైలాసానికి వెళ్ళిపోయింది.

## వివిధ రామాయణాలలో హనుమజ్జనన వృత్తాంతాలు

సంస్కృత వాఙ్మయంలో రామాయణాలు అనంతం. వాటికి వాల్మీకి రామాయణం మూలమయినా కవుల కల్పనలబట్టి అనేక కథాంశాలు చేరాయి. వాటికి రామకథలుగా వింగడించడం పరిశోధకుల సంప్రదాయం. తత్త్వసంగ్రహరామాయణం, ఆనందరామాయణం, దేవీ రామాయణాలలో హనుమజ్జనన వృత్తాంతాలు భిన్నంగా ఉన్నాయి.

## వాల్మీకి రామాయణం

రామాయణ భారతాలకు ఇతిహాసాలని పేరు. వీటిలో రామాయణం ఆది మహాకావ్యం. రామాయణా లెన్నో వున్నాయి. వాటిలో వాల్మీకి రామాయణం మొదటిది. ఈ రామాయణం కిష్కింధా కాండలో (66.8.18) హనుమంతుని జన్మవృత్తాంతం కనిపిస్తుంది. ఇక్కడి కథప్రకారం హనుమంతుడు అంజనాదేవి కుమారుడు. "పుంజికస్థల" అనే అందగత్తె శాపం కారణంగా కుంజరుడనే వానరునికి కుమార్తెగా పుడుతుంది. ఆవిడే అంజన. కేసరి అంజన భర్త. ఆవిడ కామరూపిణి కూడా, ఒకసారి అంజన మానవరూపంలో బాగా అలంకరించుకొని విహరిస్తుంది. వాయువు అంజనను చూశాడు. ఆవిడ అందచందాలకు ముగ్ధుడయ్యాడు. అంజనను కావలించుకొన్నాడు. అయితే వాయువు చేష్టలకి అంజన మండిపడ్డది. అపుడు వాయువు "అంజనా! నేను నిన్ను బాధ పెట్టలేదు. నీ పాతివ్రత్యానికి ఏలాంటి అపచారమున్నూ కలిగించలేదు. నీ అందానికి పరవశించాను. మానసికంగా నిన్ను

వలచాను. నీకే లోపమున్ను రాదు. పైగా దీని వల్ల మంచే జరుగుతుంది. పరాక్రమంలోను, తపస్సులోనూ, చివరకు అద్వితీయమయిన మేధాసంపత్తిలోను గొప్పవాడయిన కుమారుణ్ణి కంటావ్'' అని నచ్చచెప్పాడు. కొంతకాలానికి అంజన కొండగుహల్లో హనుమంతుణ్ణి ప్రసవించింది.

**తత్త్వ సంగ్రహరామాయణం**

రామాయణాలలో తత్త్వసంగ్రహ రామాయణమొకటి. రామాయణంలోని పాత్రల్ని, సంఘటనల్ని వేదాంతపరంగా అన్వయించి చెప్పడం దీని ప్రత్యేకత. ఇందులో రామాయణకథ సంగ్రహంగా ప్రస్తావించబడింది.

పార్వతీపరమేశ్వరులు కైలాసపర్వత సానువుల్లో విహరిస్తున్నారు. అపుడు రతిక్రీడలాడుతున్న వానర మిథునాన్ని చూశారు. వారికిని రతికాంక్ష కలిగింది. వానరుల్లా క్రీడించాలనే తపన కలిగింది. ఇద్దరు వానరాకారం దాల్చారు. పార్వతి గర్భవతి అయింది. పార్వతి శివతేజస్సును భరించలేకపోయింది. శివునితో తన మొఱ విన్నవించుకొంది. శివుడు ఆ తేజస్సు పార్వతి బొడ్డునుండి ఇవతలికి పడేలాగా చేశాడు. తేజస్సు భూమిమీద పడ్డది. భూమి ఆ గర్భాన్ని భరించలేక పోయింది. వాయువును ఆ తేజస్సు భరించమన్నాడు శివుడు. వాయువు ఆ తేజస్సు మోశాడు. అపుడే గౌతముని కూతురు అంజన సంతానం కోసం తపస్సు చేస్తూవుంది. వాయువు ఆ శివతేజస్సును అంజన చేతిలో పెట్టాడు. అంజన దాన్ని మింగేసింది. ఫలితంగా గర్భవతి అయింది. సుందరాకారుడయిన కొడుకు పుట్టాడు. అతడే హనుమంతుడు.



**ఆనందరామాయణం**

రామాయణాల్లో ''ఆనందరామాయణం'' ఒకటి. ఈ రామాయణానికి మహారాష్ట్రలో వ్యాప్తి ఎక్కువ. ఈ రామాయణం ప్రధానంగా హనుమంతుని మహిమల్ని విశదీకరిస్తుంది. ఇందులోను హనుమజ్జనన వృత్తాంతం వుంది.

దశరథుడు పుత్రకామేష్టి చేశాడు. యాగపురుషుడు పాయస మిచ్చాడు. ఆ పాయసాన్ని దశరథుడు భార్యలకు ఇచ్చాడు. ఆలా ఇచ్చేటపుడు కొంత భాగాన్ని గ్రద్ద ఎగరేసుకుపోయింది. అందులో కొంతభాగం అంజనకు దక్కింది. ఆమె గర్భవతి అయింది. ఈ కథ ప్రకారం హనుమంతుడు రాముని సోదరుడు.

**దేవీ రామాయణంలో 'హనుమత్కథ'**

సమరరంగంలో రామలక్ష్మణులు అలసి శిల తలగడగా నిదురించారు. రావణుడు తన మిత్రులయిన ఐరావణ మైరావణులతో వచ్చి రామ లక్ష్మణులకు నిద్రాభంగం కలిగించకుండా పాతాళానికి తీసికెళ్ళి కాళికాశక్తికి బలి ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. హనుమంతుడు గుర్తించి వారి వెంబడి వెళ్ళి మాయోపాయంతో వారిని వధించి రామలక్ష్మణులను తమ భుజాలపై కూర్చుండబెట్టుకొని తిరిగి వచ్చాడు.

**జైన రామాయణాలు**

జైనసాహిత్యంలోని 'రామాయణకథల్లో రెండు సంప్రదాయాలున్నాయి. మొదటిది గుణభద్రుని ఉత్తరపురాణ కథను అనుసరించింది. రెండవది విమలసూరి ''ప ఉమ చరి అ''ను అనుసరించింది.

గుణభద్రుని ఉత్తరపురాణంలో సీత మండోదరి కుమార్తెగా చెప్పబడింది.

"పౌమ చరియలో" వానరులు కపిధ్వజులయిన విద్యాధరులు. రాక్షసులకు వానరులకు సంబంధ బాంధవ్యాలున్నాయి. హనుమంతుడు రావణుని కూతురు సత్యవతిని, శూర్పణఖ కూతురు అనంతకుసుమను, సుగ్రీవుని కూతురు పద్మరాగను, నలుని కూతురు హరిమాలినిని వివాహ మాడినట్లు ఈ రామాయణం చెబుతుంది. ఈ బాంధవ్యం కారణంగానే రావణుడు హనుమంతుణ్ణి కర్ణమండల పురానికి రాజు చేశాడు. సీతాపహరణం తగదని హనుమంతుడు రావణునికి హితబోధ చేశాడు. కాని రావణుడు వినలేదు. అంచేత రాముని పక్షం చేరాడు హనుమంతుడు. ఈ రామాయణం ప్రకారం సంజీవి పర్వతాన్ని తెచ్చినవాడు భామండులుడు. హనుమంతుడు కాదు.

## విదేశాలలో హనుమత్కథలు

రామకథ జగత్ప్రసిద్ధం. ఈ కథ ఖండ ఖండాంతరాలకు ప్రాకింది. ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఈ కథలో మార్పులు చేర్పులు కూర్పులు జరిగాయి.

### బర్మాదేశంలో హనుమత్కథ

బర్మాలో 'పోపా' అనే కొండ వుంధి. ఆ కొండ ఓషధులకు నిలయం. హనుమంతుడు ఈ కొండనే తీసికెళ్ళాడని అంటారు. మరల యథాస్థలంలో హనుమ ఉంచేవేళ రెండుగా చీలిందట. ఐన్‌బౌంగ్ సరస్సులో ఒక భాగం పడిందట. అందుకే అక్కడ ఎపుడూ సుడిగుండాలు, ఉప్పెనలు.

### కాంబోడియాలో హనుమత్కథ

ఈ దేశంలోని రామాయణంలో హనుమంతుడు వాలి స్నేహితుడయిన సంబురాణుని రామసహాయార్థం పిలుచుకొని వచ్చాడు.



హనుమంతుడు సంజీవినితోబాటు నందిమూత్రం, దేవగంగాజలాలు తెచ్చాడు.

### ఫిలిఫైన్స్‌లో హనుమత్కథ

రామలక్ష్మణులు సీతకోసం వెదుకుతుంటే రాముడు అలసట చెందాడు. నిదురపోయాడు. కలలో నీరసించినట్లు, ఒక వానరుడు కొడుకై పుట్టినట్లు కలగన్నాడు. రాముడు నిద్రనుండి లేచి తన కల చెప్పాడు. అపుడే చెట్టుమీద కోతి దిగివచ్చి రాముని చూచి 'తండ్రి' అంది. సీతాన్వేషణకు సహాయపడతా నంది.

### టిబెట్‌లో హనుమత్కథ

సుగ్రీవుడు పంగ్సు సింతు, హనుమాన్లను ఎంపిక చేసి సీతాన్వేషణ కోసం పంపాడు. హనుమాన్ ద్వారరహిత వప్రాకార కోట మధ్యలో సీతను చూచాడు. ఇతర కథాంశాలన్నీ వాల్మీకి రామాయణంలో లాగే ఉన్నాయి.

### తాయ్‌లాండ్‌లో 'హనుమత్కథ'

రామలక్ష్మణులు సీతాన్వేషణ చేస్తూ కదిలారు. చెట్టు కింద నిదురిస్తుంటే చెట్టుమీద కోతి, తచ్చాడుతున్న వారెవరో తెలుసుకోవడానికి కొమ్మ విదిలించింది. ఆకులు రాలాయి. లక్ష్మణుడు పైకి చూచి విల్లెక్కుపెట్టాడు. వానరం 'విల్లును' మాయం చేసింది. చివరకు అన్నను లేపాడు. వానరుడు దిగి వచ్చి రాముని చూచి నారాయణుడని నమస్కరించాడు. హనుమంతుడు సముద్రంపై పయనించేవేళ నారదుడు హనుమంతుని గర్వం అణచాడు. హనుమంతుడు సముద్రం మధ్యవున్న కొండపై దిగాడు. మహర్షి సంతోషించాడు. కుటీరం చూపించాడు. హనుమంతుడు తనకది చాలదన్నాడు. నారదుడు మంచువర్షం కురిపిస్తే గడగడ వణకిపోయాడు హనుమంతుడు. తన్ను క్షమించమన్నాడు.

సముద్రంలో రాళ్ళు వేస్తుంటే రావణుని కుమార్తె 'సువర్ణమచ్ఛ' వీటిని లాగేసేది. హనుమంతుడు 'ఆరాతీసి' ఆమెను పట్టుకొంటే ఆమె తనకు పుత్రసంతానం కలిగించమని కోరింది. 'మచ్ఛను' అనే కొడుకు వారికి పుట్టాడు. రావణుని ప్రాణరహస్యం ఉన్న పంజరాన్ని రామునికిచ్చాడు. రాముడు సువిశాల సామ్రాజ్యాన్ని విభజించి హనుమంతునికి 'సమిపురి ఫ్రయ అనుజిత్' రాజ్యాలు ఇచ్చాడు.

## ఇండోనేషియాలో హనుమత్కథ

హనుమంతునికి సముద్రం దాటడానికి మూడురోజులు పట్టింది. లంక చేరిన హనుమంతుడు తెల్లవారే వరకు కొన్నిగంటలు నిదురపోయాడు. సాయంకాలం ఒక సేవకురాలు 'సీత' ఉన్నచోటు చెప్పింది. తాను లంకాదహనం చేస్తానని హనుమంతుడు ముందుగానే సీతకు చెప్పాడు, రావణుడు హనుమంతుని దేహానికంతా నిప్పుపెట్టమన్నాడు. హను మంతుడు ఇంద్రజిత్తును మెడకొరికి చంపాడు.

## మలేషియాలో హనుమత్కథ

హనుమంతుడు సముద్రలంఘనం చేయడానికి రామ సహాయం కోరాడు. రాముడు చేయి చాచాడు. ఆ చేయి ఆధారంగా హనుమ లంక చేరాడు. లంక చేరి నీళ్ళబావిదగ్గర వృద్ధ బ్రాహ్మణవేషంలో కూర్చుంటే రాక్షసస్త్రీలు వచ్చారు. అపుడు అంగుళీయకాన్ని కుండలో వేశాడు. ఆ కుండ సీతదగ్గరికి చేరితే ఉంగరాన్ని చూచి సంతోషించింది. రామ సేవకుడు వచ్చాడని తెలుసుకొని అతనిని పిలుచుకు రావలసిందిగా పురమాయిస్తుంది. వారు 'ఆలాగే' చేశారు.

## లావోస్‌లో హనుమత్కథలు

లావోస్‌లో అనేకరకాలయిన రామాయణ కథలున్నాయి. ఒక కథలో రాముడే హనుమంతుని బలాన్ని పరీక్షించాడు. హనుమ



సముద్రలంఘనంలో ఒకచోట ఆగి అక్కడి రాక్షసునికి తెలియకుండా తప్పించుకొన్నాడు. అంతఃపురంలో 'రావణుడు మండోదరి' నిదరపోతుంటే వారి శిరోజాలకు ముడివేశాడు. గోడమీద ముష్టిఘాతం చేస్తే ముడివిడివడుతుందని వ్రాసి వెళ్ళాడు. మండోదరి రావణులు లేచారు. మండోదరి గోడమీద వ్రాత చూచి ముష్టిఘాతం చేసింది. ముడులు వీడి పోయాయి. కాని రావణుని కున్న దూరదృష్టి నశించింది. రావణుడు బాధపడి 'దోషిని' బంధించ మన్నాడు.

రాముడెన్ని బాణలు వేసినా రావణుడు చావలేదు. అపుడు విభీషణుడు 'థసషాస్' దివ్యాస్త్రంతోనే రావణుడు చస్తాడని చెప్పాడు. ఆ అస్త్రం కోసం హనుమంతుడు వెళ్ళిన దారిలో ఒక రాక్షసుని చూశాడు.

ఒక కీటకంగా ప్రవేశించి రాక్షసుడి కంఠంలో ప్రవేశించి శరీరాన్ని పెంచి రాక్షసుణ్ణి తికమక పెట్టాడు. రాక్షసుడు శరణు కోరి అస్త్రమిచ్చాడు. ఆ అస్త్రాన్ని రామునికి హనుమంతుడిచ్చాడు. ఒక కొండమీద నిలబడి రాముణ్ణి భుజాలకు ఎత్తుకొని బాణం వేయమన్నాడు. ఆ దివ్యాస్త్రం ప్రయోగంతో రావణుడు మరణించాడు.

లావోస్‌లోని మరో రామాయణంలో 'ప్రలమ్' రాజు. అతడే రాముడు. అతని భార్య సీత. రావణుడు రాముని సోదరిని భార్యను అపహరించాడు. ప్రలమ్ కర్మ విశేషాన మూడేళ్ళు వానరవుతాడు. అతనికి 'హనుమాన్' అనే కొడుకు పుడతాడు. కొడుకు వెంటరాగా లంకపై దండెత్తి చెల్లెల్ని భార్యను విడిపించాడు.

## చైనాలో హనుమత్కథ

చైనీస్ భాషలోని బౌద్ధ త్రిపిటకంలో రెండు రామకథలున్నాయి. ఒకటి పేరు తెలియని జాతక కథ. ఈ కథలో లక్ష్మణ, భరత, శత్రుఘ్న పాత్రలు లేరు. హనుమ, వాలి, అంగద పాత్రలు కూడాలేవు. కాని శుక్ర కపి అనే వానర పాత్ర మాత్రం ఉంది.

## తమిళ వాఙ్మయంలో హనుమత్ప్రశంస

ద్రవిడ భాషలలో తమిళం ప్రాచీనం. తమిళులు రామయణాన్ని ఆదరించినవారే. తమిళ వాఙ్మయంలో "శ్రీ పురాణమనే" జైన కావ్యముంది. ఇందులో ఇరవైయవ తీర్థంకరుడయిన మునీశ్వరస్వామి కథ కీర్తింపబడింది. ఈ కథలో రామకథా ప్రస్తావన కనిపిస్తుంది. ఈ కథ ప్రకారం వానరులు విద్యాధరులు. ఇతడు రాముని రాయబారికూడా, రావణుని దగ్గరికి హనుమంతుడు వెళ్ళి సీతను వదలిపెట్టవలసిందిగా రాయబారం నడిపాడు.

తమిళ వాఙ్మయంలోని "నాలాయిర దివ్యప్రబంధం" వైష్ణవులకు పారాయణగ్రంథం. ఇందులో నాలుగువేల పాశురాలు వున్నాయి. పన్నిద్దరాళ్వారుల పాశురాల సంకలనమిది. ఈ ప్రబంధంలో రామాయణ వృత్తాంతాలెన్నో వున్నాయి. ప్రత్యేకించి కులశేఖరాళ్వారు, తిరుమంగై ఆళ్వారు, పెరియాళ్వారులు హనుమంతుణ్ణి బహుధా కీర్తించారు.

వాల్మీకిరామాయణంలో హనుమంతుడు ముద్రికను, సీతకిస్తూ రాముడు తనతో చెప్పిన కొన్ని ఘట్టాలను ఆనవాలుగా చెప్పాడు. పెరియాళ్వారు వాల్మీకి చెప్పని మరికొన్ని సన్నివేశాలను హనుమంతుని చేత చెప్పించాడు. హనుమంతుడు సీతారాముల వివాహంతో ప్రారంభించి ముద్రికాప్రదానంతో తన కార్యాన్ని నిర్వహించినట్టు పెరియాళ్వారు చిత్రీకరించారు.

మిథిలలో సీతారాముల వివాహం జరిగింది. నూత్న దంపతులు అయోధ్యలో సుఖజీవితం గడుపుతున్నారు. వేసవి వచ్చింది. మల్లెపూలు తోటనిండా విరగపూశాయి. సీతమ్మ మల్లెపూలను మాలగా కూర్చింది. శ్రీరామచంద్రునికి ఆ హారమర్పించి కన్నులారా చూచి మురిసిపోయిందట. ఈ సన్నివేశాన్ని రాముడు హనుమంతునితో ఆనవాలుగా చెప్పమన్నాడు.



మల్లెలమాల సీతమ్మనే సూచిస్తుంది. మల్లెపూలు గుబాళించేట్టు సీతమ్మ సౌశీల్యం గుబాళిస్తుంది. రాములవారికి మల్లెల మాలవల్ల అందం వచ్చింది. పేరుకు రామాయణమన్నా సీతమ్మవారి వల్లనే ప్రఖ్యాతి అన్న రహస్యాన్ని పెరియాళ్వారు సూచించారు.

కులశేఖరాళ్వారు హనుమంతుని లంకారదహనాన్ని విస్తృతీకరించారు. రావణుని మీదున్న కోపంతో హనుమంతుడు లంకను గాల్చినట్టు వర్ణించారు.

**"సిణ మడంగ మారుతియాల్ శుడువిత్తానై**
**త్తిల్లైనగర్ తిరుచ్చిత్రకూడన్తణ్ణుళ్**
**ఇణిదమర్న్ద అమ్మానై ఇరామన్ తణ్ణై**

తిరుమంగై ఆళ్వారు కూడా పెరియత్తిరుమొళి (10.2.6) లో 'ఓడమాకడవై కడందేరి' అను పాశురంలో హనుమంతుని లంకాదహనాన్ని వర్ణించారు. లంకలోని ప్రజలు రామునికి నమస్కరించారట. హనుమంతుని పరాక్రమాదుల్ని మనసారా పొగిడారట.

ఆళ్వారుల తరువాత హనుమంతుణ్ణి కీర్తించిన కవులలో "కంబన్" ప్రముఖుడు. హనుమంతుడు లంకను దహించినవేళ అతడు త్రివిక్రముని లాగా కంబమహాకవికి కనబడ్డాడు. నిప్పునుండి పుట్టిన పొగ పైకెగబ్రాకి విస్తరించిన దృశ్యం వామనుడు విజృభించి లోకాలను పాదాలతో కొలిచినట్టు ఉందట. చతుర్దశ భువనాలు ప్రళయకాలంలో నశిస్తూవుంటే రుద్రమూర్తి నిలబడ్డట్టు నిప్పురవ్వ లెగురుతుంటే హనుమంతుడు నిలబడ్డాడు. త్రిపురాలను కాల్చిన శివునిలాగా హనుమంతుడు తన తోకను లంకపై సాగించాడు.

కంబమహాకవి హనుమంతుణ్ణి పంచభూతాత్మకునిగా వర్ణించాడు.

హనుమంతా! నీవు అంజనా వాయుదేవుల కుమారుడివి. వాయుదేవుని తండ్రిగా భావించి వాయుమూర్త్యాత్మకుడయ్యావు. పంచభూతాలలో ప్రాణస్వరూపుడయ్యావు.

నీ బలాన్ని తెలుసుకొని ఆకాశం కేసి ఎగిరి లంకను చేరావు. ఆకాశంలో తేలిపోయి మందుల కొండ తెచ్చావు. ఆకాశమంతా నీదయినట్టు విహరించావు. పంచభూతాలలో వ్యాప్తుడయ్యావు.

నీళ్ళు నిండిన అపార అగాధసముద్రాన్ని రామాజ్ఞతో దాటేశావు. సముద్రలంఘనానికి రాముడే కాచుకు కూర్చోవలసి వచ్చింది. పంచభూతాలలో నొకటైన "అప్పు" ను గెలిచావు..

భూమిలో పుట్టింది భూమాతలాంటి సహనం కలిగింది అయిన సీతను చూశావు. లంకలో నీ ధైర్యసాహసాలు మెచ్చుకోదగ్గవి.

ముద్రిక ఇచ్చి మరల చూడామణి స్వీకరించి రావడం ఎపుడూ మరచి పోవడానికి వీలులేని సన్నివేశాలు. పంచభూతాలలో ఒకటయిన భూమిని దర్శించిన వాడవయ్యావు.

వాలానికి పెట్టిన నిప్పుతో లంకను గాల్చావు. నీ ఆజ్ఞకోసం ఆ నిప్పు కాచుకు కూర్చొన్నట్టుంది. నిప్పునే నీవు గెలిచావు.

**అంజిలే ఒణ్ణు పెట్రాన్ అంజిలే ఒన్టైత్తావి**
**అంజిలే ఒణ్ణు అఱాగ అరియర్కాగ ఏగి**
**అంజిలే ఒణ్ణు పెట్ర అణంగైక్కణ్ణు అయలార్ ఊరిల్**
**అంజిలే ఎన్ణు వైత్తాన్ అవన్ నమ్మై అళిత్తుక్కాప్పాన్**

నాలాయిరం ప్రబంధంలో పూదత్తాళ్వార్ 'పోదఱిన్దు' పాశురంలో తిరుమలలోని కోతులు బ్రాహ్మముహూర్తంలో లేచి మంచి పువ్వులు గల పర్వతతీర్థాలలో చొరబడి అక్కడి మనోహరములయిన సుమములను కోసికొని ఆసర్వేశ్వరుని సందర్శించి స్తోత్రం చేయడంకోసం వెళుతున్నాయని వర్ణించారు. ఈ భావం కలగడానికి పూర్వజుడయిన హనుమంతుడే మార్గదర్శికానోపు. తిరుమలకొండలలో 'అంజనాద్రి' ఒకటి కూడా.



## కన్నడ హరిదాస సాహిత్యంలో హనుమంతుడు

తెలుగులో తాళ్లపాక పదసాహిత్యంలాగే కన్నడంలో హరిదాస సాహిత్యం ప్రసిద్ధికెక్కింది. శ్రీవైష్ణవులు రామానుజులను ఆదిశేష సంభూతులుగా లక్ష్మణ స్వరూపులుగా భావించినట్లు ద్వైతమతానుయాయులు, మధ్వాచార్యులను వాయ్వంశసంభూతులుగా, హనుమదవతారంగా భీమావతారులుగా భావిస్తారు. అంతేగాక విజయనగర సామ్రాజ్య కాలంలో వ్యాసరాయలు అనేక మారుతి విగ్రహాలు ప్రతిష్ఠ చేసినట్లు చెబుతారు. విజయనగర సామ్రాజ్యపు ఎల్లలు విస్తరిస్తున్నకొద్దీ ఆ ప్రాంతాల రక్షణకు తగ్గినట్లు ఆంజనేయస్వామి ఆలయాలు వెలశాయని పెద్దలు చెబుతుంటారు.

హరిదాసులలో శ్రీ పాదరాయలు మొదలు నేటిదాక వెలసిన వారందరు హనుమత్ప్రశంస చేసినవారే. వారికి స్వామి ప్రాణదేవరు. హరిదాసులలో పురందర దాసులవారిది పెద్దపీట. వారు హనుమంతుని కీర్తించిన తీరు భిన్నమయినది. వారి రచనలలో క్షేత్రకీర్తనలున్నాయి. భారత రామాయణ సంబంధ కథాంశాలున్న 'దేవర నామగళు'న్నాయి. అలాగే ద్వైత సంప్రదాయాలకు అనుగుణంగా సంకీర్తనం చేసిన పాటలు కూడా ఉన్నాయి. ఈ క్రింది సంకీర్తన షోళింగపురం (ఘటికాచలం) కొండమీది ఆంజనేయ మూర్తికి సంబంధించింది.

ఘటికాచలది నింత శ్రీహనుమంత
ఘటికా చలది నింత పటు హనుమంతన
పఠనెయ మాడు లుత్కటది పొరెవె నెందు

చతురయుగది తాను ముఖ్యప్రాణను
చతురముఖనయ్యన
చతురమూరుతిగళను చతురతనది భజిసి
చతుర్ముఖనాగి జగకె చతుర్విధఫల కొడుతె

సరసిజ భవ గోస్కర కల్మషదూర
వర చక్రతీర్థ సర
మెరెవా చలది నిత్ర నరహరిగెదురాగి
స్థిరయోగాసనది కరెదు వరగళ కొడుతె

శంఖ చక్రవ ధరిసి భక్తర మనః
పంకవ పరిహరిసి
పంకజనాభ శ్రీపురందర విఠలన
బింకద సేవక సంకట కళెత

ఆలాగే హంపిలోని యంత్రోద్ధారక (ప్రాణదేవరు) ఆంజనేయుని కీర్తించారు. యంత్ర మధ్యంలో యోగముద్రావశిష్టుడయిన ఆంజనేయు డున్నాడు. యంత్రం చుట్టూ గ్రంథిస్థలాలలో వానరపరివారముంది. హనుమంతుని చుట్టూ షట్కోణ యంత్రం ఉంది. వృత్తమధ్యంలో గ్రంథాక్షరాలలో మంత్రోల్లేఖనం ఉంది.

స్వామి ముఖ్యప్రాణ నీ మలెవర గంటల గాణ
సకల విద్యాప్రవీణ నీ హిడిదెయో రామర చరణ
ఏకాదశీయ రుద్ర నీ హిడిదెయో రామర ముద్ర
సేతువె గట్టి సముద్ర నీ హారిదెయో బలభద్ర

సంజీవిని పర్వతవన్ను అంజదె తందెయో నీను
అంజనె తనుసంభవను నిన్న బేడికొంబెనో నాను



వైకుంఠస్థళదంద బందు పంపాక్షేత్రది నిందు
మంత్రోద్ధారక నెందు పురందర విఠలనె సలహెందు

హనుమంతునికి ఏకాదశరుద్రుడని పేరు. అతనికి 'ధృతవ్రత' అనే మరో పేరున్నది.

హనుమంతుని శిశువుగా భావించి దాసులవారు పాడినపాట మనోహరం.

కూసిన కండీరా ముఖ్య ప్రాణన కండీరా
బాలన కండీరా బలవంతన కండీరా
అంజనె ఉదరది జనిసితు కూసు
రామర పాదక్కెరగితు కూసు
సీతగె ఉంగుర కొట్టితు కూసు
లంకాపురవను సుట్టితు కూసు

## తెలుగు సాహిత్యంలో హనుమత్ప్రశంస

ఆంధ్రదేశంలో రామమందిరం లేని పల్లెటూరు కనిపించదు. అంతగా రామకథ ప్రజాజీవితంలో ప్రాముఖ్యం సంతరించుకొంది. అందువల్లనే దక్షిణ దేశ సాహిత్యాలలో తెలుగులో వెలసినన్ని రామాయణాలు మరే భాషలోనూ కనిపించవు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోను రామాయణ కథ విస్తరించి వుంది. వాల్మీకి రామాయణాన్ని అనువదించియో, అనుసరించియో, అనుకరించియో వ్రాయబడ్డ గ్రంథాలన్నిటిలోను, హనుమంతుని వృత్తాంతం సమానంగా కనిపిస్తుంది.

మహాకవులు కృత్యాదిలో ఇతర దేవతలతోపాటు హనుమంతుణ్ణి కొనియాడారు. కవులలో హనుమదుపాసకులును వున్నారు. వసుచరిత్ర (1.8) చంద్రభానుచరిత్ర (1.3) బహులాశ్వచరిత్రము (1-8) అప్పకవీయము (1.15) వాల్మీకిచరిత్రము (1-6) తారాశశాంక

విజయము (1.16) చంద్రికా పరిణయము (1-8) ఉత్తర రామాయణము (1.8) హంసవింశతి (1.7) నృసింహవిలాసము (1.1) కృష్ణభూపాలీయము (1.7) మహేంద్రవిజయము (1.7) రావువంశ ముక్తావళి (1-8) మొదలయిన వాటిల్లో హనుమత్‌స్తుతి కనిపిస్తుంది. ప్రత్యేకించి చిత్రకవిపెద్దన "హనుమోదాహరణమే" వ్రాశాడు. అయినా హనుమంతునికి సంబంధించిన అన్ని వృత్తాంతాలను సమన్వయించి హనుమత్పురాణమనబడే సమీరకుమార విజయాన్ని వ్రాసినవాడు పుష్పగిరి తిమ్మన. ఇవేగాకుండా లింగన శతకంఠ రామాయణం, మాడయ మైరావణ చరిత్రలోను హనుమంతునికి ప్రాధాన్య మివ్వబడింది. మహమ్మద్ అబ్దుల్లా హనుమద్రామ సంగ్రామం, పరాంకుశదాసు హనుమద్విజయమనే యక్షగానాలు కూడా వ్రాశారు. మరి శతకాలు, దండకాలు, ముక్తకాలు, హరికథలు చెప్పపనిలేదు. కృష్ణభూపాలునికి కంకితంగా వ్రాయబడ్డ హనుమచ్ఛతకాన్ని అమలాపురానికి చెందిన ఎర్రమిల్లి సూర్యప్రకాశరావు వ్రాశారు. ఇదే ఆధునిక యుగంలో మొదటి హనుమచ్ఛతకం. ప్రాచీన శతకాలలో 'మరున్నందన శతకం' చాల ప్రాముఖ్యం పొందింది. ఇందులోని ఒక పద్యాన్ని లుప్తవిసర్గకస్వరవళికి ఉదాహరణగా అప్పకవి కూడా వుదాహరించాడు.

కోపాటోపము కుప్పిగంతులు నిజా
కుంఠీభవచ్చౌర్యరే
ఖాపాండిత్యమయారె నీకును నమ
స్కారంబు లంకాపురీ
పాపగ్రంథి కులాంగనా కుచతటీ
పైఠాపతద్గ్రాహ బా
హాపాటచ్చర రామదాస! తవదాసో
హమ్మరున్నందనా!



ఇటీవల శ్రీ వేదగిరి నరసింహరాయశర్మగారు శ్రీసమీర కుమార విజయము పేర పద్యకావ్యం ప్రకటించారు.

## జానపద సాహిత్యంలో హనుమత్కథలు

జానపదులు స్వతంత్రమయిన భావనాశక్తి గలవారు, జానపద వాఙ్మయంలో రామాయణానికి సంబంధించినవి చాలావున్నాయి. వాటిలో కొన్నిటిని మాత్రం పరిశీలిద్దాం.

### జన్మవృత్తాంతాల కథలు

ఒకరోజు పార్వతీ పరమేశ్వరులు తమ నాట్యం చూడవలసిందిగా దేవతల్ని ఆహ్వానించారు. అతిథులు ఒక్కొక్కరే వస్తున్నారు. అపుడు పర్వత సీమల్లో ఒక వానర మిథునం రతిక్రీడ సలుపుతుండడాన్ని పార్వతి చూసింది. అపుడు పార్వతికి తనుకూడా అలా క్రీడిస్తే బాగుంటుందని పించింది. శివుడు కూడా ఆవిడ కోరికను కాదనలేక పోయాడు. ఇద్దరు కొండకేసి నడిచారు. నాట్యం చూద్దామని వచ్చిన అతిథులు ఆతిథ్యమిచ్చే వారు కనబడకపోవడంతో ఆశ్చర్యపడ్డారు. పార్వతీపరమేశ్వరు లెక్కడున్నారో చూసి రావలసిందిగా వాయుదేవుణ్ణి ఆజ్ఞాపించారు వాయువు కొండంతా తిరిగాడు. ఎక్కడా కనబడలేదు. చివరకు నిరాశతో వెనుకడుగువేస్తుంటే పార్వతీపరమేశ్వరులు కనిపించారు. కొంతకాలానికి పార్వతి గర్భవతి అయింది. కపిరూపం ధరించిన ప్రాణికి జన్మ ఇవ్వవలసిరావడం పార్వతికి సిగ్గనిపించింది. అంచేత ఆ గర్భభారాన్ని మరొకరు వహించడానికి వీలుగా వాయుదేవుని సహాయ మర్థించింది. వాయువు ఆ గర్భాన్ని అంజనకిచ్చాడు.

మరొక జానపదకథప్రకారం అంజన అహల్యా గౌతముల కుమార్తె. ఒకానొకరోజు తెల్లారిందని అహల్య గౌతముణ్ణి లేపి స్నానానికి పంపింది. గౌతముడు నదికేసి నడిచాడు. స్నానార్థం నదిలో దిగేవేళ నదీదేవత

"ఓ మహర్షి! అప్పుడే వచ్చేశారేం? స్నానం చేసే వేళ కాదే! కాసేపు ఆగి రండి" అంది.

గౌతముడు ఆశ్రమానికి మరలివచ్చాడు. అపుడు కుమార్తె అంజన ఆశ్రమం ముంగిట్లో కూర్చొనివుంది. గౌతముడు అమ్మాయితో

"అంజనా! ఎందుకిలా దిగాలుగా కూర్చొన్నావ్! లోపలికి వెళ్ళరాదూ" అని అప్యాయంగా ప్రశ్నించాడు.

అపుడు అంజన లోపల కోతి వచ్చిందని చెప్పింది. గౌతమునికి కోపం వచ్చింది. వెంటనే కోపావేశంతో గర్భవతివి కమ్మని అంజనను శపించాడు. అందువల్ల ఆవిడ ఆంజనేయునికి తల్లి అయింది.

మరొక జానపద కథలోకూడా తండ్రి అయిన గౌతముడు కుమార్తె అంజనను అకారణంగా శపించినట్టు వుంది. తండ్రిలేని కొడుక్కి తల్లివి కమ్మని గౌతముడు శపించాడట. అంజన ఈ శాపానికి భయపడింది. అందువల్ల ఒక గోయి త్రవ్వి రొమ్ముదాకా పూడ్చుకొని శివుణ్ణి వుద్దేశించి తపస్సు చేయడం మొదలెట్టింది. ఆవిడకు మంత్రోపదేశం చేయడానికి శివుడు నారదుణ్ణి పంపించాడు. ఆ మంత్రశక్తితో అంజన గర్భవతి అయింది. "కేశి" అనే వానరుణ్ణి చూస్తూ జపం చేయడం వల్ల వానరాకారం గల కొడుకు పుట్టాడట. గుజరాతీ భాషలో ఈ కథకు ప్రాచుర్యం ఎక్కువ.

అహల్యకు గౌతమ మహర్షి వల్ల 'అంజన', మరొకరి వల్ల వాలి సుగ్రీవులు జనించారు. అంజన తన తల్లి స్వేచ్ఛా విహారాన్ని తండ్రికి చెప్పేసింది. గౌతముడు చకితుడయ్యాడు. కుమార్తె అంజనను సూదిమొన మీద నోరు తెరచుకొని నూరు సంవత్సరాలు తపస్సు చేయమని శపించాడు. వాలి సుగ్రీవులను ఒక సరోవరంలో త్రోసి మీరు నా కొడుకులయితే రూపాంతరంతో నా దగ్గరికి రండి అన్నాడు. వారు సరోవరంలో మునిగారు. వానరాకారులై లేచి వచ్చారు.



సీతారామ లక్ష్మణులు వనవాసం చేస్తూ ఒక ఋషిని చూశారు. ఆ ఋషి లక్ష్మణునితో "దారిలో రెండు సరోవరాలున్నాయి. మొదటి దానిలో స్నానం చేస్తే వానరాకారం వస్తుంది" అన్నాడట. లక్ష్మణుడు వద్దన్నా సీతారాములు ఆ సరోవరంలో తానమాడారు. వానరులయ్యారు. అరణ్యంలో యథేచ్ఛగా సంచరించారు. లక్ష్మణుడు ప్రయాసపడి వారిని పట్టుకొని మరో సరోవరంలో మునిగేలా చేశాడు. వారికి పునః మానవాకారం వచ్చింది. అపుడు సీత గర్భవతి. ఆ గర్భాన్ని వాయువు నోరు తెరచి తపస్సు చేసే అంజన నోట్లో పడేశాడు. ఆ గర్భసంజాతుడే హనుమ.

## పాటలలో హనుమంతుని పాత్ర

తెలుగులో రామాయణ సంబంధి పాటలు అనేకం. జానపదులు రామాయణాన్ని రామాయణ పాత్రల్ని తమదిగా తమవారుగా భావించి పాటలుగా చిత్రీకరించారు. వీటిలో సీతాదేవి ఆనవాళ్ళు, లంకాసారథి మొదలయిన పాటలు ప్రసిద్ధమైనవి.

## సీతాదేవి ఆనవాళ్ళు

మూలరామాయణంలో సీత ఆకారం గురించి రూపరేఖా లావణ్యాదుల గురించి హనుమంతునితో ఎవరుగాని చెప్పినట్లు కానరాదు. కాని జానపదుల రామాయణ కథలో ఈ అంశముంది. సీతాన్వేషణం కోసం బయలు దేరుతూ రామునితో హనుమంతుడు.

"శ్రీకాంత రూపమ్ము మాకు యెరిగించి
అతివ మెచ్చేటట్టు ఆనవాలిమ్ము" అని అడిగి సీత రూపు రేఖలు తెలిసికొన్నాడట. లంకలో అశోకవనంలో సీతకూడా 'నీవెవరో తెలియదు'. అయోధ్యకూడ చూడనివాడివి. 'ఏలాగు వస్తివన్న' అని ఆదరంతో అడిగితే హనుమన్న

'వాలి సుగ్రీవులకు మేనల్లుడను నేను
వల్లభుల బంటునమ్మ
ఆ వాయుసుతుడను, హనుమంతుడు నా పేరు
సీతమ్మ నమ్మవమ్మా' అని చెప్పాడు. ఈ మాటలతో నమ్మకం కుదిరి సీత తనవారితో కష్టాలు చెప్పుకొన్నట్టు

'దిన దిన గండాలు దెయ్యాలతో పోరు హనుమన్న చెప్పవయ్యా
రాముణ్ణి బాసి నేపదరానవస్థలూ పడితి నసురచేతను
చెప్పరాదోయన్న చెల్లెలా యంటేను చెడ్డమాటలు పుట్టును'

అని చెప్పుకొందట. ఎంతో ఆప్తులుగా పలకరించుకోవడమే ఈ పాటలలోని నేర్పు. ఈ సన్నివేశం పూర్తిగా తెలుగువారి పలకరింపే.

ఆంజనేయుడు తనకు ఆకలని, అశోకవనంలోని చెట్టు పండు ఇమ్మని లేదా తినడానికి అనుమతి యిమ్మని అడిగితే సీతమ్మ

'పట్టితెచ్చినవాని పండ్లు మనకేటికి పదిలాన వెళ్ళుమన్నా' అన్నదట. సీతమ్మ ఆభిజాత్యానికిది ఒక్కటి చాలు.

**లంకాసారథి**

వాల్మీకి రామాయణంలో హనుమద్రావణ సంవాదం ప్రత్యక్షంగా లేదు. 'అతని గూర్చి తెలిసికొనుదు' అని రావణుడు ఆన ఇడినాడు. ప్రహస్తుడు

తత్త్వ తః కథయ స్వాద్య
తతో వానర మోక్ష్యసే
అనృతం వదత శ్చాపి
దుర్లభం తవ జీవితమ్
అథవా యన్నిమితస్తే ప్రవేశో రావణాలయే 5.1 అన్నాడు. కాని జానపదులు హనుమద్రావణ సంవాదాన్ని పెంచి వ్రాశారు.



'ఏడేడు సముద్రములు యేకమై పారగా యేలాగు వస్తి వోరి
నాకేడు సముద్రములు నీకేడు కాలువలు నిజమనుచు వస్తి నోరి
ఏడు సముద్రములలో మకరి నిను మ్రింగక రానిచ్చెనా
ఏడు సముద్రములలో మకరులు నీవు నా వేలు వంచగ లేరురా
దక్షిణపు యీలంక దానవులకే గాని తరమటర యితరులకునూ
నిన్నును నీలంక నిమిషమాత్రములోన నిర్మూలనముగ చేతును
ఎదిరించి నా తోను యింతి మాటలు పలుక యే రాజుబంటువోరి
ఎదిరించి నా తోను యింత మాటలు బలుకయే రాజు బంటునోరి
కృతత్రేత ద్వాపర కలియుగము లేలేటి గురురాము బంటు నోరి
నీరాజు కొలువులో నీపాటి బంట్లు యేపాటి కద్దు చెప్పరా
నావంటి బంట్లను నీవంటి తృణములు కోటానుకోటిరోరి

హనుమంతుని వాక్చాతుర్యానికి పరవశించి రావణుడు

'మారు రాజ్యమనక మావద్ద కొన్నాళ్ళు కొలిచిన నిలిచేయుందుమా
రాజ్యంబులో సగము రాజ్యమిచ్చెద నీకు నమ్మి నాచెంతనుండుమా'

ఈ పాట రావణుని గొప్పతనాన్ని కీర్తించే పాట.

**సేతుమాహాత్మ్యం**

భోజన సమయంలో రాముడు ప్రత్యేకంగా హనుమంతుని పిలిచి పలికిన పలుకులలో రామునికి హనుమంతుని పట్ల గల ఆప్యాయతను జానపదులు చక్కగా చిత్రీకరించినారు.

"పుత్రుడవు మిత్రుడవు సౌమిత్రికంటె
నీ ఋణము యెన్నటికి తీర్చంగ లేను
కోరి నా ఎత్తు నా కుడవరమ్మనగ
ఇట్లానతిత్తురా ఇనకులాధీశ" అన కోరితే వెనుకడుగు వేయడం హనుమంతుని సౌశీల్యానికి గుర్తు.

అరణ్యవాసానంతరం రామాదులు తల్లులకు నమస్కరించగా రాముని అడవికి పంపిన తల్లి ఎవరిని హనుమ ప్రశ్నించాడు. లక్ష్మణుడు కనుసైగతో కైకేయిని సూచించాడు. హనుమన్న కైకకు నమస్కరించినాడు. 'రాముడొకడే కాన పొమ్మన్నావు. నేడిందరము కలము' అని జవాబిచ్చాడు. అడవికి పంపబట్టే కదా మేము రాముని వారమయినామని చెప్పక చెప్పడం.

## గుహభరతుల అగ్నిప్రవేశం

రాముడు వానరసేనతో రాక్షసరాజుతో నంది గ్రామానికి వచ్చాడు. వారి రాకలు తెలిసి బావ ఋష్యశృంగుడు వచ్చాడు. బంధువులను చూడగానే సీతారాముల దుఃఖం కట్టలు త్రెంచుకొంది. ఈ పరిస్థితిని చూచి హనుమన్న స్వభావోక్తిగా తనభావాన్ని ప్రకటించిన తీరు రమణీయం.

'ఎందరైనా మునులు యేతెంచిరి గాని
ఏడిపించేటి మునిని యెక్కడా చూడ' అన్నాడు.

## లక్ష్మణదేవరనవ్వు

రామునింట సంతర్పణం సాగింది. కవులందరు బారులు తీర్చి భోజనాలకు కూర్చున్నారు. ఉస్తికాయకూర వడ్డించారు. ఒకడు ఉస్తికాయను నొక్కగా అది పైకి ఎగిరినది. పక్కనవాడు నీ కంటె నేను ఎత్తు ఎగర గలనని ఎగిరినాడు. అతనిని చూచి మరొకడు. ఇట్లు ఒకరిని మించి మరొకరు ఎగరగా 'కిష్కింధ' వాతావరణం నెలకొన్నది. హనుమంతుడు తాను ఎగరడానికి సిద్ధపడగా రాముడు సముద్రం పైకి ఎగిరిన 'చతురుడవు' అని అదుపులో పెట్టాడు.



## రత్నాలహారం

పట్టాభిషేక సమయంలో రాముడు సీతతో రత్నాలహారం, ముత్యాల సరాలు హనుమకు ఇవ్వమన్నాడు. సీతమ్మ ఒక హారం తీసి వాయుసుతుని మెడలో వేసింది. ఆ వానరవీరుడు చెట్టెక్కి పణుగు రాతిపై పతకం ఉంచి బద్దలు కొట్టాడు. అందులో తారకం లేదు. 'తారకం లేని తావళంబేల' అంటూ కాళ్ళపై పడ్డాడు. రాముడు తారకమంత్రం హనుమ చెవిలో ఊదాడట.

## మరికొన్ని జానపద కథలు

సేతుబంధన సమయంలో వానరులు రాళ్ళుతెచ్చారు. హనుమంతుడు రాళ్ళపై 'రామ' అని వ్రాసేవాడు. అవి మునిగేవి కావు. రాముడు కూడా రెండు రాళ్ళు వేయడానికి సిద్ధపడితే వద్దన్నాడు హనుమ. కాని రాముడు వేస్తే అవి మునిగి పోయాయి.

'రాముడయినా గాని రామ వ్రాయక తేలదు' అన్నాడట హనుమ.

రాక్షసులు హనుమ తోకకు చీరలు చుట్టారు. తోక పెరుగుతూనే వుంది. ఎన్ని చీరలయిన చాల్లేదు. అపుడు వానరులు సీతమ్మ చీర కట్టగానే తోక చిన్నదయినదట.

రాముడు 'శివలింగం' తెమ్మని హనుమను ఆదేశించాడు. హనుమ కాశికి వెళ్ళాడు. ఆలస్యమయింది. ఈలోగా రాముడు 'సైకతలింగం' చేసి పూజించాడు. హనుమ బాధపడుతుంటే నీవు తెచ్చిన లింగ పూజానంతరమే నా లింగపూజ అన్నాడట.

హనుమంతు లింగంబు నర్చించి గాని
రామలింగని చూడ నరకంబు లేదు
తీర్థ ఫలంబు లేదు త్రిలోకములను

రామేశ్వరంలో ఇప్పటికి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.

పట్టాభిషేక కాలంలో సుగ్రీవుడు మాణిక్యహారం ఇచ్చాడు. ఆ సరాన్ని రాముడు సీతమ్మకు ఇచ్చాడు. అంతేకాదు ఎవరి మూలాన వృద్ధి పొందావో వారికిమ్మన్నాడు. సీత వెంటనే.

'నా ఆత్మబంధుడ జీవ రక్షకుడా
మాయన్న హనుమంత రమ్మనుచు' పిలిచిందట.

లవకుశలవులకు వానరులతో యుద్ధం జరిగింది. వానరులు పట్టు పడ్డారు. తల్లి సంతోషిస్తుందని వారిని వెంటబెట్టుకొని వెళితే తల్లి సీతమ్మ చూచి మందలించిందట. నా ప్రాణరక్షకుల ఇలా చేసారేమిటి అని పరితపించిందట.

లక్ష్మణుడు మూర్ఛలో నుండి తేరుకున్నాడు. రాముడు వాయుసుతుడు వెరపు తీర్చాడని అంటే వినమ్రంగా అక్కడనుండి రాక్షసులున్న కడకు వెళ్ళాడట మారుతి. తెలుగువారికి హనుమంతుడు 'హనుమన్న'.

పట్టాభిషేక సమయంలో రాములవారికి ఎందరో ఎన్నో కానుక లిచ్చారు. సుగ్రీవ మహారాజు నడుమ మాణిక్యం గుచ్చిన సరమొక్కదాన్ని చదివించాడట. రాముడు ఆ సరాన్ని సీత చేతికిస్తూ "ఎవరిమూలంగా వృద్ధి పొందావో వారికి ఆ హారమివ్వమన్నాడట. అపుడు సీతమ్మ "నా ఆత్మబంధువా! జీవరక్షకుడా! మాయన్న హనుమంత!" అంటూ తన చేతిలోని ఆ సరాన్ని హనుమంతునికి ప్రసాదించిందట. అపుడు ఆంజనేయుడు తాను నిమిత్తమాత్రుడనని రామభక్తి ప్రదర్శించాడు. అపుడు సుమిత్రకూడా "సంజీవి పర్వతం బెత్తిన హస్తములా" అంటూ పచ్చలా కడియాలు హనుమంతునికి పెట్టిందట. తన కొడుకును బతికించిన కృతజ్ఞత సుమిత్ర మాటల్లో వ్యక్తమవుతుంది.



అయోధ్యలో పట్టాభిషేక సందర్భంలో గొప్ప విందు జరిగింది. శ్రీరామ చంద్రుడు బంధుమిత్రులతో కలిసి విందు ఆరగిస్తున్నాడు. మధ్య మధ్య లంకావిశేషాలు ఇతరులతో ముచ్చటిస్తున్నాడు. ఆ సందడిలో హనుమంతుణ్ణి మరచిపోయాడు. అప్పుడక్కడికి హనుమంతుడు రానే వచ్చాడు. రామునికి తాను చేసిన పొరబాటు అర్థమయింది. హనుమంతుణ్ణి బతిమాలి భోజనానికి ఆహ్వానించాడు. "ఇంటివాడవు నీవని వూరకున్నా"మని సమర్థించుకొన్నాడు. అయినా హనుమంతుడు మాత్రం వూరకున్నాడా! "నేనేమయినా సమానంగా కూర్చొని తినడానికి వుత్తమపురుషుణ్ణా" అని దెప్పి పొడిచాడు.

చివరికి అందరికి హనుమంతుడు తానే వడ్డించాడు. ఆపై పళ్ళెమెత్తుకొని అవిసి చెట్టెక్కినాడట. ఒక ముద్ద కొమ్మపై వుంచి పళ్ళెం కింద పడవేశాడు. రాముడు కింద నిలబడి హనుమంతుణ్ణి గారాబంతో పిలిస్తే రామచిలుకలాగా వాలాడట!

వాల్మీకి రామాయణంలో కాకాసురుని వృత్తాంతం చెప్పబడింది. జానపద కథల్లో మరికొన్ని వున్నాయి.

సీతమ్మ పెళ్ళయిన కొత్తలో అయోధ్యలో అంతఃపురంలో అలంకరించు కొంటూ వుందట. అద్దంలో ప్రతిరూపం కనిపించింది. సీతమ్మకు అనుమానం వేసింది. రాముడెవతెనో సవతిని తెచ్చాడని అనుమానించింది. రాముడక్కడికి రానే వచ్చాడు. సీతమ్మ రుసరుస లాడింది. రాముడేమి చెప్పినా వినలేదు. సరే నీకు కనిపించిన స్త్రీకి మొగుణ్ణి చూపిస్తానని అద్దంముందు సీతతో నిలబడ్డాడట. అపుడు సీతమ్మకు అసలు విషయం తెలిసింది. ఈ వృత్తాంతాన్ని హనుమంతుడు సీతమ్మతో లంకలో చెబుతాడు. ఈలాంటిదే మరొక సంఘటన వుంది.

ఒకసారి సీతమ్మ స్నానం కోసం కొలనికేసి నడిచింది. కొలనులో తామరలు కనపించాయి. తామరల్ని తుమ్మెదలు ముద్దెట్టుకొంటున్నాయి.

సీతమ్మ జడుసుకొంది. తాను ఆ కొలనులో సనేమిరా స్నానం చేయనని మారాం చేసింది. రాముడు సీతమ్మతో కొలని దగ్గరికి వచ్చి "చూడు! అవి తామరలు కావు. నీ అందాల ముఖమే! తుమ్మెదలు కావు అవి నీకురు"లని చెప్పాడట.

జానపదులకు 'రామాయణం' పొరుగుప్రాంతం కథకాదు. తమ ఊరికథ. తమవారికథ. తమ ఇంట్లో జరిగే సంఘటనల కూర్పుగల కథ. అందుకే తెలుగువారి ఇండ్లల్లో కనిపించే 'ఆలుమగల' సాన్నిహిత్యాన్ని సీతారాములకు కూడా అన్వయించి జానపదులు తమవిగా చేసుకొన్నారు. తెలుగునాట రామచిలుక, సీతాకోకచిలుక, రామాఫలం, సీతాఫలం, రామాయణంవారు లాంటి పదాలు పరిశీలిస్తే తెలుగువారి రామాయణ ప్రీతి సువ్యక్తమవుతుంది. తెలుగువారికి కళ్యాణమంటే సీతాకల్యాణమే. అలాగే రామాయణ పాత్రలపేర్లు తెలుగువారిలోనే ఎక్కువ. వాటిలో హనుమ, హనుమంత, హనుమంతరావు, ఆంజనేయ, అంజనీకుమార్, మారుతి, పావని, పవనకుమార్ లాంటివి చెప్పుకోదగ్గవి. ఇంకా తెలుగునాట ఊరూరా రామమందిరాలు కనిపిస్తాయి. అలాగే రామాయణసంబంధి గ్రామ నామాలు విశేషం. ఇటీవల 'హైవేస్‌లో' పొడుగాటి హనుమద్విగ్రహాలు దర్శనమిస్తున్నాయి.

'పవమానసుతుడు పట్టు పాదారవిందములకు' చేతులు జోడించనిదే హరికథ తెలుగునాట పూర్తికాదు.

* * *



## తాళ్లపాక పదకవుల హనుమత్సంకీర్తనలు విశేషాంశములు

జానపదసాహిత్యానికి శిష్టసాహిత్యానికి వారధిలాంటిది పద సాహిత్యం. ఈ పదసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారు తాళ్లపాక పదకవులు. వారిలో ఆద్యుడు అన్నమాచార్యులు. క్రీ.శ. 1408 నుండి క్రీ.శ.1503 దాకా జీవించిన వారు.

'నరహరికీర్తన నానిన జిహ్వ

ఒరుల నుతింపగ నోపదు జిహ్వ' అంటూ ప్రతినబూని జీవితకాలంలో 32 వేల కీర్తనలు వ్రాసినవారు.

అన్నమయ్య కీర్తనలలో వివిధ దేవతామూర్తుల వర్ణనలున్నాయి. ప్రత్యేకించి మహావిష్ణు పరివార గణముంది. మహావిష్ణువు వివిధావతారాల ప్రసక్తివుంది. అన్నిటాకన్నా మించి అన్నమయ్య తన కాలంనాటి విభిన్న భక్తి సంప్రదాయాలను గౌరవించి శ్రీవేంకటేశ్వరాను బంధంతో కీర్తనలు రచించారు. తిరుమంగై ఆళ్వార్ లాగా విభిన్న ప్రాంతాలలోని విష్ణ్వాలయాలు సేవించి అధ్యాత్మ శృంగార సంకీర్తనలు ప్రకటించినవారు. తనకాలం నాటి రాధామాధవ సంప్రదాయం, దత్తాత్రేయ సంప్రదాయం, గోరక్షనాథ సంప్రదాయం, హనుమత్సం ప్రదాయాలను గౌరవించి ఎన్నో పాటలు వ్రాశారు. వాటిలో హనుమత్సం కీర్తనల్ని వాటి విశేషాలను తెలుసుకోవడం, తెలియచెప్పడం కోసం ఈ చిన్నప్రయత్నం.

శ్రీవైష్ణవులకు గరుడునిలాగే హనుమంతుడు ఆరాధ్యుడు. విష్ణ్వాలయాలలో స్వామికి ఎదుట గరుడుడు, కొంతదూరంలో హనుమదాలయ ముండడం గుర్తించవచ్చు. గరుడుని 'పెరియత్తిరువడి' అని హనుమను 'సిరియత్తిరువడి' అని సంభావించడం వైష్ణవుల విధానం.

ఇక రెండవది ద్వైత సంప్రదాయాలలో హనుమకు ప్రత్యేక ప్రాధాన్యముంది. కర్ణాటక ప్రాంతంలో దాససాహిత్యం కారణంగా, పాలకుల అనుమతి, ప్రోత్సాహాల కారణంగా హనుమదాలయాలు ఎక్కువగా వెలశాయి. స్వామి సుందర చైతన్యానంద మాటల్లో చెప్పాలంటే.

"బలవంతుడైన మల్లయోధుడు అభయకవచము
బలహీనులైన పసిపిల్లలకు రక్షకస్థానము
భక్తజనులకు సద్గురువు
ఆశ్రితజనులకు కల్పతరువు
నిరంతర రామధ్యానంతో తన మాయాశరీరాన్ని
మంత్ర శరీరంగా మార్చుకొన్న వాడు మారుతి"

విజయనగర సామ్రాజ్య అభ్యుదయ కాలంలో పోరాటాలెక్కువ. సైనికులకు 'స్వామి' ప్రోత్సాహ ప్రదాయకుడు. విజయనగర పాలకుల అభివృద్ధిలో విశ్వాసంగల మంత్రుల స్థానం దొడ్డది. ఆ బంటుతనానికి 'స్వామి' మార్గదర్శి. సంపదలు చేరుతుంటే లౌకిక భోగానురక్తి పెరగడం సహజం. కాని ఆధ్యాత్మిక ఔన్నత్యం అవసరమనడానికే ఆలయాల నిర్మాణం జరిగింది. వివిధ సంప్రదాయాలను గౌరవించడం జరిగింది. ఈ దృష్టితోనే తాళ్ళపాక పదకవులు హనుమత్సంకీర్తనలు వ్రాశారు.

ఏది ఏమయినా ముందు హనుమంతుని మహత్కార్యాలను పాఠకులకు, శ్రోతలకు హత్తుకొనేలా చెప్పడానికి అన్నమయ్య ప్రయత్నించినట్లు స్పష్ట మవుతోంది. ఇలా చెప్పడంలో రెండు పద్ధతులు కనిపిస్తున్నాయి.

మొదటి వాల్మీకి రామాయణంలోని సన్నివేశాలు చెప్పడం

రెండవది రామాయణేతర గ్రంథాలలోని సన్నివేశాలు చెప్పడం



### వాల్మీకి రామాయణంలోని సన్నివేశాలు

వాల్మీకిరామాయణాన్ని నిరతం పారాయణం చేసిన వారు అన్నమాచార్యులు. తాను కూడా రామాయణం వ్రాసినవాడే. కాని అలభ్యం. హనుమంతునికి సంబంధించిన అంశాలు శ్రీరామ సంకీర్తనలలోను కనిపిస్తాయి.

### శ్రీరామసంకీర్తనలలో హనుమత్ప్రశంస

"రామచంద్రుని వంటి రాజు కల్గితె కదా
పవనతనయు వంటి భటుడు కలఁడు" అని ఒక శతకకారుడు తన ఆవేదనను ప్రకటించుకొన్నాడు. పాయసం లేక పండుగ లేదన్నట్లు రామకథ చెప్పడమంటే రామాయణాంతర్గత హనుమత్కథను గూడ చెప్పడమే. తాళ్లపాక పదకవులు శ్రీరామసంకీర్తనలలో వానరులను, వానర ముఖ్యుడయిన హనుమను కీర్తించినవారే.

| | |
|---|---|
| సురలు వానరులైరి. | 10.295 |
| వలగొని దేవతలు వానరులై వచ్చిరట | 11.235 |
| కూరుచుక యేలితేను కోఁతులు రాజ్యము సేసె | 10.280 |

లాంటివి. వానరుల ప్రశంసలయితే

| | |
|---|---|
| వారిధి దాఁటి మెప్పించ వాయుజుడనేఁగాను | 15.28 |
| పావని యల్లవాఁడె | 11.1.77 |
| కపిసేనానాయక | 10.170 |
| సరి హనుమంతు పాలి సామ్రాజ్యము | 10.147 |
| అలర రుద్రునెదుట నటు విశ్వరూపు చూపి<br>లలి బ్రహ్మపట్ట మనిలజుని కిచ్చి | 11.4 |

లాంటివి హనుమత్సంబంధి అంశాలు.

**హనుమత్సంకీర్తనలలో వాల్మీకి రామాయణ సన్నివేశాలు.**

అన్నమాచార్యులు శ్రీమద్రామాయణం ఆధారంగా హనుమజ్జననం, బాల్యం, విద్యాభ్యాసం, సముద్రలంఘనం, మైనాకదర్శనం, సింహికపై మారుతి విజయం, లంకిణీతాడనం, అంగుళీయక ప్రదానం, శిరోమణి గ్రహణం, లంకాదహనం, అక్షకుమార సంహరణం, మధువనప్రవేశం, సంజీవి పర్వతం తేవడం, సీతారామకల్యాణం లాంటి వాటిని రమ్యంగా వర్ణించారు. చివరిది తప్ప మిగిలినవన్నీ సుందరకాండ కథాంశాలే.

**హనుమజ్జననం - బాల్యం - విద్యాభ్యాసం**

తాళ్లపాక అన్నమాచార్యుల వారు తమ సంకీర్తనలలో హనుమజ్జననం, బాల్యం, విద్యాభ్యాసం గురించి తలస్పర్శిగానే వర్ణించినారు.

అంజనీదేవి కొడుకు హనుమంతుడు 4.272

ఆంజనేయ యనిలజ హనుమంత 4.458

రుద్రవీర్యము దానై 4.462

తాళ్ళపాక పదకవులు శ్రీరాముని గురించి చెప్పే సందర్భాలలో 'కౌసల్యాతనయ' ప్రసంగం తెచ్చినట్లే హనుమత్ప్రశంసలో 'అంజన'కు ప్రాధాన్యమిచ్చారు. రామపదసేవకుడంతటి వానిని కన్నతల్లిగా తమ భక్తిప్రపత్తులను చాటించుకొన్నారు.

వాల్మీకి సుందరకాండలో హనుమంతుని ద్వారా శ్రీరామలక్ష్మణుల రూపసౌందర్యాన్ని వర్ణింపజేశాడు. ఆలాగే హనుమద్రూపాన్ని, తేజాన్ని కూడా సీత, అక్షకుమార, రావణాదులచే ప్రశంసింపజేశాడు.

'అహో భీమ మిదం రూపం వానరస్య దురాసదమ్



దుర్నిరీక్ష్యమ్ 32-4

విక్రాంతస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ 36-7

రాక్షసాధిపతిం చాపి దదర్శ కపి సత్తమః
తేజోబలసమాయుక్తం తపంత మివ భాస్కరమ్ 48-59

శంకాహతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసావృతమ్
కిమేష భగవాన్ నందీ భవేత్ సాక్షాదిహాగతః 50-2

బాలహనుమంతుని రూపాన్ని

జాతరూపవర్ణుఁడు 4.483

కనకకుండలాలతో కౌపీనముతోడ
జయించినాఁడు 2.207

పుట్టు కౌపీనము మహాద్భుత యజ్ఞోపవీతము 4.85

సిరుల బంగారు కాసె చెలగిన సింగారము 4.413

అని వర్ణించినారు. ఆలాగే సూర్యఫలభక్షణ వృత్తాంతాన్ని

పుట్టిన నాడే భువనము లెరగగ
పట్టితి సూర్యుని పండనుచు 3.421

అందుకొనె సూర్యఫలమని హనుమంతుడు 4.155

కంజాప్త ఫలహస్త 3.522

వో రవిగ్రహణ 4.327

అని వర్ణించారు. ఆలాగే సూర్యుని కడ విద్యాభ్యాసాన్ని తాళ్ళపాక అన్నమాచార్యుల వారు పలుమారులు స్మరించారు.

చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతని మహిమేమని చెప్పేమయ్యా 4.509

వుదయాచలము మీది నొక్క జంగ చాఁచుకొని
వుదటున నపరాద్రి నొక్కజంగ చాఁచుకొని

తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవు లెత్తి చదివె 4.470

మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాఁడు 4.525

**సముద్ర లంఘనం**

హనుమంతుని అపార పారావారలంఘనం గురించి వాల్మీకి సుందరకాండ ప్రథమసర్గలో అతిరమణీయంగా వర్ణించాడు. దుష్కరమయిన, సాటిలేని కార్యాన్ని సాధింపదలచిన హనుమంతుడు ప్రవేశించిన విధమును

ప్రవిశన్ అభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఐవ లక్ష్యతే 1.82

అని మేఘాల మధ్య ప్రవేశిస్తూ, బయటికి వస్తూ పురోగమించే చంద్రుని లాగా గోచరించాడని వాల్మీకి వర్ణిస్తే తాళ్లపాక అన్నమాచార్యుల వారు

వనధిలంఘనశీలవైభవుఁడు 4.483

వనధలంఘన గాత్ర 1.366

జలధిఁబుట మెగసి చంద్రుఁడు దానైనాఁడు 4.462

అని వర్ణించారు.

**మైనాక దర్శనం**

హనుమంతుడు సముద్రంపై ఎగురుతుంటే సాగరుడు తిలకించాడు. తన వైభవానికి ఐక్ష్వాకులే కారణమని, శ్రీరామ కార్యనిర్వాహణార్థం కదలుతున్న హనుమకు విశ్రాంతి కలిగించమని మైనాకుని ఆదేశించాడు. ఈ వృత్తాంతం వాల్మీకి రామాయణం



సుందరకాండ 1-95 -122 శ్లోకాలలో వర్ణితం. అయినా హనుమంతుడు విశ్రాంతి అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించి మీ ఆదరములకు తృప్తిపడ్డాను. ఆతిథ్యం స్వీకరించినట్లే భావించు" అని కదలి వెళ్ళాడు.

ఏక ముక్తః కపి శ్రేష్ఠః తం నగోత్తమ మబ్రవీత్
ప్రీతోస్మి కృత మాతిథ్యం మన్యురేషో - పనీయతామ్ 1-130

**సురసపై మారుతి విజయం**

మహావేగంతో సముద్రంపై పయనం సాగించే హనుమంతునికి క్షణ కాలంపాటు ఆటంకం కలిగించాలని దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు భావించారు. అందుకు నాగమాత అయిన 'సురసను' ఆశ్రయించారు. ఆమె భయంకరాకారంతో హనుమను అటకాయించింది. తనకు బ్రహ్మవరముందని ఎవరయినా నోట ప్రవేశించి వెళ్ళక తప్పదని షరతు విధించింది. హనుమంతుడు శరీరం పెంచగా ఆ నాగమాతకూడా శరీరం పెంచింది. మారుతి సమయస్ఫూర్తితో తన దేహాన్ని సంకుచితం చేసి అంగుష్ఠమాత్రుడై ఆమె నోట ప్రవేశించి చిటికెలో బయటికి వచ్చాడు. ఈ వృత్తాంతం వాల్మీకి రామాయణం సుందరకాండ 1-145-170 శ్లోకాలలో వర్ణితం.

తం దృష్ట్వా వదనాన్ముక్తం చంద్రం రాహుముఖాదివ 1.170

రాహుముఖం నుండి చంద్రుడు విడివడినట్లు సురసముఖం నుండి బయలు వెడలినాడు..... ఆకారం పెంచడం వంటివన్నీ మాయలే. కనుకనే తాళ్లపాక అన్నమాచార్యుల వారు. సీతాన్వేషణ సంబంధి మరియు ఒక వృత్తాంతాన్ని కూడా స్ఫురించేలా

'మాయాబిలము చొచ్చి' 2-276 అని

సూక్ష్మంగా ఈ వృత్తాంతమును తడిమినారు.

## సింహికపై మారుతి విజయం

సింహిక ఒక రాక్షసి. మారుతికి సముద్రలంఘన సమయంలో అడ్డుపడిన అసుర. మారుతి ఛాయను ఒడిసి పట్టి అతని వేగాన్ని అణచింది. ఆంజనేయుడు తన్నెవరో లాగుతున్నారని గ్రహించాడు. 'సముద్రంలో ఛాయాగ్రాహిణి ఉన్నది. జాగ్రత్త' అని సుగ్రీవుని హెచ్చరికను గుర్తుకు తెచ్చుకొన్నాడు. పాతాళకుహరం లాంటి సింహిక నోట సూక్ష్మాకారంతో ప్రవేశించి తదనంతరం ఆమె ఆయువు పట్టులను చీల్చి చెండాడినాడు. ఈ వృత్తాంతం వాల్మీకిరామాయణం సుందరకాండ ప్రథమసర్గ 194... 196 శ్లోకాలలో వర్ణితం.

"స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః
సంక్షిప్య ముహూరాత్మానం నిష్పపాత మహాబలః
తతః తస్యా నఖైః తీక్ష్ణైః మర్మాన్ ఉత్కృత్య వానరః
హృతహృత్ సా హనుమతా పపాత విధురాంభసి" అని వర్ణిస్తే

తాళ్లపాక అన్నమాచార్యుల వారు

మాయాబిలము జొచ్చి మగుడి యంబుధిలోని
ఛాయాగ్రహముఁ జంపి చయ్యన దాటి 2.216

అని వర్ణించారు.

## లంకిణీ తాడనం

లంకాధిదేవత లంకిణి. హనుమంతుడు లంకలో ప్రవేశించకుండా అడ్డు తగిలిన రాక్షసి. హనుమంతుడు ఆమెను ముష్టిప్రహారాలతో దెబ్బ తీశాడు. ఈ వృత్తాంతం వాల్మీకి రామాయణం సుందరకాండ 3-23-40 శ్లోకాలలో వర్ణితం. హనుమంతుడు

స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధః స్వయం కృతః
సా తు తేన ప్రహారేణ విహ్వాలాంగీ నిశాచరీ 3-41



హనుమంతుని తన్నిని దెబ్బకే ఆమె 'త్రాయస్వ! హరిసత్తమ' అన్నది. తాళ్లపాక పదకవులు ఈ వృత్తాంతాన్ని

లంకిణీ ప్రాణలంఘన 1.366

ఆ యెడ లంకిణిఁ గొట్టి 2.216

ఘాతతో లంక గాలిచి గక్కన లంకిణిఁ జంపి 3.503

అనే పాదాలలో సువ్యక్తం చేశారు.

## అంగుళీయకప్రదానం

సుందరకాండలో ఆశ్చర్యకరమయిన సన్నివేశమిది. రామలక్ష్మణుల స్వరూపస్వభావములను, తన పుట్టుకను, సుగ్రీవ సాంగత్యమును తెలియ జేసి అంగుళీయకమును ఆనవాలుగా ఇచ్చి సీత దుఃఖోపశమనం చేసిన వాడు హనుమంతుడు. శ్రీమద్వాల్మీకిరామాయణం సుందరకాండలో

వానరోహం మహాభాగే దూతో రామస్య ధీమతః
రామ నామాంకితం చేదం పశ్య దేవ్యంగుళీయకమ్ 36-1

అని వర్ణితం. సీత అంగుళీయకాన్ని పుచ్చుకొని భర్తను పొందిన దానివలె మహదానంద భరితురాలయినదట. ఈ వృత్తాంతాన్ని తాళ్లపాక అన్నమాచార్యుల వారు

వుద్దవిడి లంక చొచ్చి వుంగరము సీతకిచ్చి 2.272

వొల్లనె రాముల ముద్దుటుంగరము సీతకిచ్చె 4.155

జలనిధి దాటి లంక సాధించి చొచ్చి సీతకు
నలర నుంగర మిచ్చె నతి సాహసమున 4.141

అని వర్ణించారు.

**శిరోమణిగ్రహణం**

సీతాదేవి శ్రీరాముని అంగులీయకమును పుచ్చుకొన్నదై తన వస్త్రంలో ముడిచి వుంచిన దివ్యచూడామణిని హనుమకిచ్చి రాముని కర్పించ వలసిందిగా కోరింది. ఈ అంశం వాల్మీకి రామాయణం సుందరకాండ 38వ సర్గలో విస్తృతంగా ఉంది.

ప్రతి గృహ్యా తతో వీరో మణిరత్న మనుత్తమమ్
అంగుల్యా యోజయామాస నహ్యస్య ప్రాభవద్భుజః 38-68

అంగులీయకం భుజమున ఇముడదు గావున దాన్ని తన చేతి వేలియందు భద్రపరచుకొన్నాడట. వాల్మీకి దివ్యం చూడామణిం, మణిరత్న మనుత్తమమ్, మణివర ముపగృహ్య" అని వర్ణించాడు. హనుమంతుడు చూడామణిని రాముని కొసగిన వేళ లేగదూడపై గల వాత్సల్యంతో ధేనువు పాలను చేపునట్లు ఆ చూడామణి చూచి ద్రవించాడు.

అయం హి శోభతే తస్యాః
ప్రియాయా మూర్ధ్ని మే మణిః
అస్యాద్య దర్శనే నాహం
ప్రాప్తాం తామివ చింతయే 66.7

'ఈ మణి నా ప్రియురాలు సీత శిరస్సునందు ఇంతవరకు అలంకృత మగుచు శోభిల్లుచున్నది. నేను దీనిని చూచి ఆమెను పొందినట్లు తలచుచున్నాను' అన్నాడు. ఈ చూడామణి వృత్తాంతాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు వర్ణించారు.

చేకొని శిరోమణి చేతబట్టి జలనిధి 4.155

అకసాన దాటి వచ్చె
సీతాదేవి యానవాలు శ్రీరామునికిచ్చి 4.141



సీతాశిరోమణి శ్రీరామునకు నిచ్చి 3.503

**లంకాదహనం**

'చూసి రమ్మంటే కాల్చి వచ్చాడని' సామెత. ఇది రామయణ సంబంధి సామెత. హనుమంతుడు సీతా సందర్శనానంతరం చేసిన ప్రతిక్రియ. ఈ దహనకార్యప్రణాళిక హనుమంతుని స్వనిర్ణయం. ఈ అంశం గురించి శ్రీమద్వాల్మీకి రామాయణంలో ఒక ధర్మం ప్రతిపాదింపబడింది.

కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్
పూర్వకార్యా విరోధేన స కార్యం కర్తు మర్హతి 41.5

అప్పగింపబడిన కార్యాన్ని సాధించి. దానికి భంగం వాటిల్లకుండా మరి ఎన్ని కార్యములనైన సాధింవచ్చు. అట్టివాడే నిజంగా కార్యదక్షుడని శ్లోక తాత్పర్యం. ఇక్కడి శత్రుబలాన్ని, రాక్షసుల ఆలోచనావిధానాలను స్పష్టంగా తెలుసుకోవడం అవసరమని భావించి ముందు అశోకవనం పాడుచేయడానికి సిద్ధమయ్యాడు. రాక్షస స్త్రీలవలన ప్రమదావన విధ్వంసనం తెలిసి రావణుడు 80 వేల సైన్యం పంపితే హతమయింది. బ్రహ్మాస్త్రం కారణంగా హనుమంతుడు బంధితుడయ్యాడు. ఆపై సభలో రావణునికి హితబోధ చేశాడు. దూతను వధించుట న్యాయము కాదని. వానరులకు వాలంపై మక్కువ ఎక్కువని వాలానికి నిప్పుపెట్టించాడు. 'తేన దగ్ధేన గచ్ఛతు' వాలం కాలుతుండడంతో వానరుడు వెళతాడని భావించాడు. కాని ఆ వానరం విభీషణ ప్రాసాదాన్ని తప్ప లంకనంతా కాల్చింది. లంకానగరమంతా చూడ డానికి వీలయింది. 'నన్ను చల్లగా చూచిన అగ్నిదేవునకు కృతజ్ఞతగా భవనాలను ఆహుతి చేయడం న్యాయమని హనుమ భావించి అట్ల చేశాడు. ఈ లంకాదహన వృత్తాంతాన్ని వాల్మీకి సుందరకాండ 54వ సర్గలో రమణీయంగా వర్ణించాడు.

యుగాంత కాలానల తుల్య వేగః
సమారు తోగ్నిర్వవృధే దివస్పృక్
విధూమరశ్మిర్భవనేషు సక్తో
రక్ష శ్శరీరాజ్య సమర్పితార్చిః 54-33

పొగలేని మంటలు వ్యాపించాయి. రాక్షసుల శరీరాలు అగ్నిజ్వాలలకు ఆహుతులయ్యాయి. ఆకాశం అంటే మంటలతో ప్రళయాగ్నివలె అది మహాశక్తి కలదై వృద్ధి చెందిందని భావం. ఈ సన్నివేశాలను దృష్టిలో పెట్టుకొని తాళ్లపాక అన్నమాచార్యుల వారు

లంకయెల్లా అవల యివల జేసె 2.207

నిండునిధనపులంక నిమిషాన నీరు సేసె
అనుపమ లంకాదహన 2.347

అని వర్ణించారు.

**అక్షకుమార సంహరణం**

తాళ్లపాక పదకవుల హనుమత్సంకీర్తనలలో బహుధా ప్రశంసింప బడిన సన్నివేశం అక్షకుమార సంహరణం. ఈ అక్షకుమారునికి సంబంధించిన వృత్తాంతం వాల్మీకి రామాయణం సుందరకాండ 47వ సర్గలో ఉంది. ఈ సర్గలో అక్షకుమారుని వర్ణన. అక్షకుమారుని రథం. అక్షకుమారుని సమరోత్సాహం గంభీరంగా వర్ణించడం బట్టి అక్షకుమారుడు సామాన్యుడు కాడని విశదమవుతుంది.

సమీక్ష్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమార మక్షం ప్రసమైక్షతాగ్రతః 47.1

రణకండూతితో గర్వముతో విర్రవీగుచు సమరోత్సాహముతో ఎదురుగానున్న అక్షకుమారుని రావణుడు చూచాడట. అతడు



బ్రాహ్మణోత్తములచే అర్పింపబడిన హవిస్సుతో ప్రజ్వలించిన అగ్నిలాగా తటాలున నిలబడ్డాడట. అతని రథం 'బాలదివాకర ప్రభాసదృశం ప్రతప్త జాంబూనద జాలసంతతం. తపః సంగ్రహ సంచయార్జితం. రత్నవిభూషిత ధ్వజయుతం. మనోజవాష్టా శ్వవర సముపేతం. సురాసురలకు ఎదిరింప శక్యము కానిది. నిరాటంకంగా సాగిపోయేది. అంతరిక్షంలో సైతం సంచరింపగలది. సముచిత స్థానాలలో అమ్ముల పొదులు, ఎనిమిది కత్తులు, శక్తితోమరములు కలది సూర్యరథవేగంతో సాటిరాదగినది' అని వాల్మీకి వర్ణించాడు. అంతేగాదు అతనిని చూచి హనుమంతు డంతటి వాడు

అబాలవద్బాల దివాకర ప్రభః
కరోత్యయం కర్మ మహాన్ మహాబలః
న చాస్య సర్వాహన కర్మ శోభినః
ప్రమాపణే మే యతి రత్ర జాయతే 47.26

ఇతనిని చంపడానికి మనసు అంగీకరించడం లేదు. ఇతడు బుద్ధిశాలి. మహావీరుడు. ఏకాగ్రమనస్కుడు, కార్యసామర్థ్యంలో నిస్సంశయంగా నాగులు, యక్షులు, మునలు మొదలగువారి ప్రశంసలకు పాత్రుడై వుండవచ్చు అని తలచినాడట. అయినా సమరం సాగింది. అక్షకుమారుడు కూడా పరాక్రమశాలి అయిన బాలుని వధించడమేలాగా అని సందేహించా డట. చివరకు హనుమంతుడు బలిష్ఠమైన అరచేతితో అక్షకుమారుని రథమును కొట్టాడు. రథచక్రాలు ముక్కలయ్యాయి. నొగలు వేరై పోయాయి. గుఱ్ఱాలు నేలకూలాయి. అక్షకుమారుని కాళ్ళు గట్టిగా చిక్కించుకొని అనేకసార్లు గిరగిర త్రిప్పి వేగంగా విసరి నేలకేసి కొట్టి చంపేశాడు. అందువలననే హనుమత్ ప్రార్థనలో 'కపీశం అక్షహంతారం వందే లంకాభయాపహమ్' అని చోటుచేసుకొంది. వీటిన్నిటిని దృష్టిలో పెట్టుకొని తాళ్లపాక అన్నమాచార్యుల వారు.

తొక్కి యక్షకుమారునిఁ దుంచి యడగాళ్ళ సంది
నిక్కించెను 4-167

అక్షమర్దనుఁడితఁడా 2-223

అని వర్ణించారు.

కార్యసాఫల్యసంసిద్ధికారణంగా మధువన ప్రవేశం జరిగివుండ వచ్చు. ఇది పెద్దల అంగీకారంతో జరిగిన చేత అని

విచిత్య దక్షిణామాశామ్ ఆగతైః హరిపుంగవైః
ఆగతైశ్చ అప్రధృష్యం తత్ హతం మధువనం కిల 63-17

ధర్షితం చ వనం కృత్స్నమ్ ఉపయుక్తం తు వానరైః
పాతతౌ వనపాలాస్తే తదా జానుభి రాహతాః 63-23

అని సమర్థించినాడు. ఈ వృత్తాంతమన్నిటిని దృష్టిలో నిడుకొని

'మేరమీరి యక్షు గొట్టి మేటివనము వెరికె'

అని అశోకవన చ్ఛేదాన్ని కూడా సూచించారు.

రంజిత వానరకుల రక్షకుఁడ వైతివి 3.522

అనే వాక్యం మధువన విహారానందాన్ని లీలగా స్ఫురింపచేస్తున్నది.

కడలి దరినుండిన కపులతో గూడుకొని
వడి దీరగా మధువనము చొచ్చి 2.216

పాదాలలో 'మధువనం' సుస్పష్టంగా చెప్పబడింది.

## వివిధ రాక్షస సంహార వృత్తాంతాలు

తాళ్లపాక అన్నమాచార్యుల వారు హనుమత్ కృత రాక్షస సంహారాన్ని చాలవరకు సామాన్య వాక్యాలతోనే సమర్థించినారు.



సుందరకాండలో ఎనుబది వేలమంది రాక్షసులను, ఏడుగురు మంత్రి పుత్రులను, రావణుని అయిదుగురు సేనానులను, జంబుమాలినిని సంహరించినట్లు వర్ణనలున్నాయి.

బల్లిదుఁడ్డె లంక జొచ్చి బలు రాకాసులఁ గొట్టి 4-155

కుడిచేత దనుజులఁ గొట్ట నూఁకించినవాఁడు 4-493

వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁ జేసినాఁడు 2-350

రక్కసుల పాలికి రణరంగశూరుఁడు 4-528

శ్రీమద్రామాయణంలో కుంభకర్ణుని వీరవిహారవృత్తాంతం యుద్ధకాండ 67లో విపులంగా వర్ణితం. కుంభకర్ణుడు వానరసైన్యాన్ని కకావికలు చేశాడు.

వానరులు సమరానికి విముఖులయితే అంగదుడు ధైర్యోత్సాహాలు నింపాడు. మరల సమరం సాగింది. కుంభకర్ణుడు హనుమంతుని శూలాయుధంతో ఎదుర్కొన్నాడు. ఈ ప్రసక్తిని వాల్మీకి అనేకమార్లు ఆవృతం చేశాడు.

తాని పర్వతశృంగాణి శూలేన స బిభేదహ 67.16

సశూల మావిధ్య తటిత్ప్రకాశం 67.19

సశూల నిర్భిన్న మహాభుజాంతరః 67.20

తచ్ఛూలం సముపాదాయ సుగ్రీవమ్ అభిదుద్రువే 67.51

వ్యావిధ్యశూలం చ తటిత్ప్రకాశం 67.62

శూలం శితం కాంచన ధామ జుష్టమ్ 67.63

కుంభకర్ణుని శూలం వేయి బారువుల బరువుగలది. అయినా హనుమంతుడు అవలీలగా విరచినాడట.

బభంజ జానున్యారోప్య ప్రకృష్టః ప్లవగర్షభః 6764

భగ్నమయిన శూలాన్ని శూచి కుంభకర్ణుడు
స తత్ తదా భగ్న మవేక్ష్య శూలం
చుకోప రక్షోధి పతిర్మహాత్మా 67-67

ఈ అంశాన్ని అన్నమయ్య వర్ణించాడు

చెదరక కుంభకర్ణు చేతి శూల మందరిలో
సదరాన విరిచె భీషణ హనుమంతుడు 3.138

## సంజీవిపర్వతం తేవడం

హనుమంతుని మహత్కార్యాలలో సంజీవి పర్వతం తేవడం సాహసో పేత మయిన కార్యం. లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. సూర్యోదయం లోపల ఔషధ సేవనం జరగాలి. భార్యావియోగ తప్తుడయిన రామునికి ఐదొక పరీక్ష కాని హనుమంతుని ప్రయత్నంతో సాధ్యమయింది. ఈ వృత్తాంతం వాల్మీకి రామాయణంలో విస్తారంగా వర్ణితం.

దేశే దేశే కళాత్రాణి దేశే దేశేచ బాంధవాః

తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః 13

అని విలపించాడు రాముడు. సుషేణుని సూచనతో హనుమంతుడు కదిలాడు

ఇదమేవ గమిష్యామి గృహీత్వా శిఖరం గిరేః 102.63

ఈ గిరిశిఖరమునే పెల్లగించి తీసికొని వెళ్ళెదనని నిశ్చయించి మనోవేగంలో తెచ్చాడు.



తాళ్లపాక అన్నమాచార్యుల వారు ఈ వృత్తాంతాన్ని శ్రీరామ సంకీర్తనల లోను హనుమత్సంకీర్తనలలోను విశదం చేశారు.

సారెఁ గదలి వచ్చె నీ సన్నల సంజీవి కొండ 10.280

ఇక హనుమత్సంకీర్తనలలో చెప్ప పనిలేదు.

జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె 4.490

దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలున దెచ్చె బాపురే 1.69

సంజీవి దెచ్చినాడు సమరరంగమున 4.499

సంజీవి దెచ్చిన శౌర్యుడవు 3.522

## మధువనప్రవేశం

ఈ వృత్తాంతం వాల్మీకి రామాయణం సుందరకాండలో 61-63 సర్గలలో వర్ణితం - సుగ్రీవ సంరక్షణలోని మధువనంలో వానరులు విశృంఖలంగా విహరించడం కథాంశం. ఈ వనం సుగ్రీవుని పూర్వజు లయిన బుక్షరజసుని కాలం నుండి వర్ధితం. వాలి కాలంలో మహోన్నతం. ఈ వనంలో సంచారానికి కపులు ఆరాటపడడంతో అంగదుడు జాంబ వాదుల ఆమోదం పొంది వానరులకు అనుమతి ఇచ్చాడు. వానరులు వనరక్ష పాలకులను లెక్కసేయక విహరించారు. దధిముఖుడు సుగ్రీవునికి ఫిర్యాదుచేశాడు.

కడలి దరినుండిన కపులతో గూడుకొని
వడి దీరఁగ మధువనము చొచ్చి 2-216

అని తాళ్లపాక అన్నమాచార్యులవారు వర్ణించారు.

## సుందరకాండ పారాయణ సంప్రదాయం

భారతీయులలో ఆంధ్రులకు 'సుందరకాండ పారాయణ సంప్రదాయం' బలీయంగా ఉంది. ఈ సంప్రదాయం పాటించేవారు సుందరకాండా నంతరము హనుమంతునికి లభించిన శ్రీరామ ఆలింగన భాగాన్ని సూచించే యుద్ధకాండం మొదటి సర్గ చదవడం సంప్రదాయం. తదనంతరం 'శ్రీరామ పట్టాభిషేక ఘట్టం'లో పూర్తిచేయడం అలవాటు. ఈ సంప్రదాయం చాలాకాలం నుండి ఉన్నదనడానికి తాళ్లపాక అన్నమయ్య హనుమత్సంకీర్తనలలోని 'పాదాలు' కూడా సాక్ష్యమనక తప్పదు. ఆ కవులు శ్రీరామపట్టాభిషేకాన్ని

అయోధ్యాపురికి వచ్చి
బలురాముని సీతతోఁ బట్టము గట్టి 3.503

అని వర్ణించారు. మరోచోట

రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను 4.458

అని వైవాహికోత్సవంగా చెప్పడం గుర్తించదగ్గది.

## రామాయణేతర గ్రంథాలలో చెప్పబడిన హనుమత్సంబంధి సన్నివేశాలు

హనుమత్సంబంధి కథలు వాల్మీకి రామాయణంలోనే గాక భారత, ఇతర రామాయణాదులలోను కనిపిస్తాయి. వానిని తాళ్లపాక పదకవులు ఉదాహరించారు కూడా.

## భారతంలో హనుమ

భీముడు గంధమాదన పర్వతపు చరియలలో ద్రౌపదితో విహరించే వేళ మనోహరమయిన వేయిరేకులు గల తామర పువ్వొకటి గాలివాటున వారి ఎదుటపడింది. ఆ పుష్పాన్ని చూచి ద్రౌపది పరవశురాలయి



'ఇటువంటి పువ్వులు మరికొన్ని లభిస్తే బావుంటుందని, తనకు ఆ పువ్వులు తెచ్చిపెట్టమని అడిగింది. భీముడు సరేనంటూ కదిలాడు. భీషణశంఖధ్వని చేశాడు. అపుడు ఆ పర్వతగుహలోని హనుమంతుడు భీముడు సాగిపోవడానికి వీలులేకుండ చెట్లను పడవైచి కాలిబాట శయనించాడు. అరటితోపు మధ్య రాతిబండ మీద పొడవయిన తోకతో పవళించిన వానిని చూచి సింహనాదం చేశాడు. హనుమంతుడు మేలుకొనినట్లు నడించి నిదురపాడుచేశావేమిటని గద్దించాడు. భీముడు తన్ను తాను ఎరుక పరచుకొని లంకను దాటిన ఆంజనేయుడలా దాటి వెళతానన్నాడు. అపుడు ఆ కథ చెప్పమని ప్రశ్నించాడు. భీముడు హనుమత్సముద్రలంఘనం చెప్పగా 'ఓహో'. నేను ముసలివాడిని. తోకను అవతలికి నెట్టి దారి చేసుకొని వెళ్ళమన్నాడు భీముడు ప్రయత్నించినా తోక కదల్చడం కుదురలేదు. చివరకు సిగ్గుపడి 'ఎవరవు నీవని' ప్రశ్నిస్తే హనుమంతుడు తన జన్మవృత్తాంతాన్ని చెప్పాడు. మేము జయించలేని వీరులు ఈ లోకంలో లేరని భీముడు జవాబు చెప్పాడు. అపుడు హనుమంతుడు నన్ను రణాంతరంబునం దలంచునది. నీయందు సౌహృదంబున వాహనంబులో నతిరథుండైన యర్జును రథధ్వజంబునందుండి మీ బలపరాక్రమంబులం జూతునని (భార. ఆర. 354) వాగ్దానమిచ్చి సౌగంధికసరోవరమార్గం తెలియజేసి మాయమయ్యాడు. తాళ్లపాక పద కవులు కపిధ్వజాంశాన్ని

తేరిమీద నీరూపు దెచ్చిపెట్టి యర్జునుడు చటులార్జున సఖుదు
కౌరవుల గెలిచె సంగర భూమిని 4.458

అని ఈ అంశాన్నే వివరించారు. శ్రీకృష్ణుడే శ్రీరాముడు. రాముడున్న చోటనే హనుమ. ఆ రాముడు కృష్ణుడయినవేళ రథంమీద 'హనుమ' ఉండడంలో వింతలేదు.

అవతారాలలో శ్రీకృష్ణుడు తన జీవితకాలంలో ఐదుమార్లు తన విరాట్స్వరూపాన్ని ప్రదర్శించాడు. తన విష్ణుత్వాన్ని నిరూపించుకొన్నాడు. హనుమంతుడు సీతాదేవికి విశ్వరూపము చూపినట్లు అన్నమయ్య పేర్కొన్నాడు.

వివరించి సీతకు విశ్వరూపము చూపుతా 2.207

అనే వాక్యం ఇందుకు ఉదాహరణం. ఇంతకంటె హనుమంతుని త్రివిక్రమ మూర్తిగా భావించి చెప్పిన కీర్తనలో విశ్వరూపకత్వం సుస్పష్టంగా ఉంది.

త్రివిక్రమ మూర్తియైన దేవునివలె నున్నాడు
భువి సేవించే వారి పాలి పుణ్యఫల మీతడు
అంచె నుదయాస్తగిరులందు నొక జంగ చాఁచి
వంచించక మిన్నుదాఁక వాలమెత్తి
ముంచి బ్రహ్మలోకము మోవగఁ బ్రతాపమున
పెంచినాఁడు తన మేను పెద్ద హనుమంతుడు
తిరమున హస్తములు దిక్కుల నిండఁ బరపి
వరుసఁ గర్ణము లిరువంకఁ జిక్కించి
దురదుర మస్తకము ధ్రువమండలము సోక
పెరిగి నాఁడిదివో పెద్ద హనుమంతుఁడు 28-496

## 'పురుషామృగ' ప్రస్తావన

తాళ్లపాక అన్నమాచార్యులవారు హనుమత్సం కీర్తనలలో ప్రాస్తావికంగా ఉదహరించిన సన్నివేశం 'పురుషామృగ' వృత్తాంతం. ఇది భీమునకు సంబంధించినది. ఈ వృత్తాంతానికి సంబంధించిన విశేషాలు ఆంధ్రమహా భారతములో కనిపించవుగాని పుష్పగిరి తిమ్మన సమీరకుమార విజయంలో కనిపిస్తాయి.



ధర్మరాజు అశ్వమేధయాగం చేయ తలపెట్టాడు. ఆ యాగానికి 'బహుద్విజులను' ఆహ్వానించాడు. అప్పటి 'ఉచ్ఛిష్ట సమష్టి సృష్టి'ని తిలకించాడు. అద్దాన 'యాగశాలాంతర క్షితి సమ్మర్దం' కావడం గుర్తించాడు. పరిసర శుద్ధి దెబ్బతినడం చూచి కృష్ణుని ఆశ్రయించి తన వేదన ప్రకటించాడు. కృష్ణుడు ఈ శద్ధి మానవ మాత్రులకు సాధ్యము కానిది. పురుష మృగేంద్రానికి మాత్రం సాధ్యం. ఈ మృగేంద్రాన్ని తనవెంట తీసుకురాగలిగిన సమర్థుడు భీముడని కూడా చెప్పాడు. తానే భీమునికి కర్తవ్యం విశదం చేశాడు.

భీముడు ఆంజనేయుని స్మరించాడు. ఆంజనేయుడు 'సురలకు కూడా సాధ్యం కాని ప్రయత్నమిది. అయిన హరిప్రేరితమని' పురుషామృగం ఆచూకి చెప్పాడు.

'ఆకారంలో మొగము మాత్రం పురుషామృగం. ఇతరాంగములు మృగాంగములే. ఆ మృగం 'అశని ధ్యానం' చేయగలిగిన వానిని తరుము తుంది. అతనిని పట్టి వధిస్తుంది. ఆ మృగానికి పట్టువడక పరుగెత్త గలవాడే ఆ మృగాన్ని స్వాధీనం చేసుకోగలడు. వెంట బడుతుంటే అద్దానివేగాన్ని ఆపడానికి ఒక ఉపాయముంది. ఆ పురుషామృగం శివభక్తి పరాయణ. శివలింగం కనబడితే పూజ చేయనిదే కదలదు. ఆ కాలవ్యవధానంలో సుదూరం వెళ్ళవచ్చు. కనుక నీకు ఏడు రోమములు ఇస్తున్నాను. పురుషామృగం దగ్గర పడినవేళ ఒక రోమం పడేయ్. శివలింగం సాక్షాత్కరిస్తుంది. పురుషామృగం ఆగుతుంది. ఎపుడు దగ్గర పడినా ఇదే నీకు శరణ్యం. అయినా ఆగక పరుగెత్తడం నీవంతు అని రోమము లిచ్చింది.

భీముడు భయంకరారణ్యం చేరాడు. గర్జించాడు. పురుషామృగం మేల్కొంది. కన్నుల్లో నిప్పులు కురుస్తుంటే భీముణ్ణి పట్టడానికి పరుగులు తీసింది. భీముడు పరుగిడుతూ పురుషామృగం మరి దగ్గరికి చేరేవేళ

'రోమాలు' పడేశాడు. ఆ రోమం పడ్డచోట లింగం, సరోరుహం, రత్నగోపురాలు, విరుల తోటలు వెలశాయి. పురుషామృగం 'హరహరా' అంటూ ఆగమసూక్తులతో నుతించింది. సరములో మునిగింది. కెందామరలను కల్వలను వివిధ పుష్పాలను సేకరించి శివపూజ ముగించింది. ఆపై భీముని పట్టడానికి పరుగిడింది. నాకు చిక్కకుండా పోగలడా అని అత్యుత్సాహంతో తరిమింది. ఇలా పయనం సాగింది. చివరకు భీముడు హస్తిన చేరి గడప దాటి పాదం పెట్టాడు. మృగం అంతలో లాగడం మొదలెట్టింది. అపుడు ధర్మసూనుడు

పరుగెత్తి భయముతో మా
శరణము సతతంబుఁ దనకు శరణం బనుచున్
శిరమటుగాఁ ద్రెళ్లిన సో
దరునిం గఱకటి యొనర్పఁ దగునే నీకున్ 7.426

శిష్టమృగంబ! నీవె యిటు సేసిన నేమను వారమన్న సం
తుష్టి వహించె నీ సుకృత దోహళబుద్ధికి నామనంబు నీ
యిష్టము దెల్పుమన్నను మృగేశ్వర, నా మఘమైన యంతకున్
స్పష్టి దొలంగ నీయెడ వసింపఁగదే యననుండెనయ్యెడన్ 7.127

అని ప్రార్థిస్తే పురుషామృగం సమ్మతించింది. ఈ అంశాన్ని తాళ్లపాక అన్నమాచార్యులు.

"సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట
నీ రోమములు గావా నిఖిల కారణము 4.458

అనే పాదాలలో వర్ణించినారు. ఇంతేగాక హనుమద్రోమముల గురించి ఇతరత్ర వర్ణించినారు కూడా

పలు నీ రోమములకు బహుదేవతలు రక్ష 4.459
దిక్కులు పిక్కిటిలఁగ దేహరోమములు వెంచె 4.509



కొంచక సురలు రోమకూపముల విహరించ 2.218
చుక్కలు మొలపూసలు సూదుల వాఁడిరోమాలు 4.85
అక్కజపు రోమము లన్ని లోకము లారయ 28.496

**కాలనేమివృత్తాంతం**

వాల్మీకి రామాయణంలో లేని వృత్తాంతాలతో 'కాలనేమి' వృత్తాంతం ఒకటి. రావణుని శక్తి ప్రయోగం కారణంగా లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. సంజీవనేషధి కోసం హనుమంతుడు బహుదూరములోని ద్రోణగిరికి బయలు దేరాడు. సూర్యోదయాత్పూర్వం సంజీవని తీసుకొని రావాలి. హనుమంతుడు ఆకాశవీధిలో పోవుచు ఒకముని వనం చూచాడు. దారితప్పానని భావించాడు. మున్యాశ్రమం చేరుకొని దాహం తీర్చమని కోరాడు. ముని నమ్మకం కలిగించాడు రాత్రి నిద్రించమన్నాడు. తన వనంలోనే సంజీవని ఉన్నదని నమ్మకం కలిగించాడు. కమండలజలం తెమ్మని దగ్గరి సరోవరానికి పంపాడు ముని. హనుమంతుడు సరోవరం చేరగానే ఒక మొసలి అతనిని పట్టింది. మొసలి హనుమంతుని మింగింది. హనుమంతుడు ఆ మొసలి కడుపులోని నరాలు తెంచాడు. జీర్ణం కాలేదు. ఆ మొసలి తాపంతో నోరు తెరిచింది. హనుమంతుడు బయటికి వచ్చి పెంచిన ప్రేగులను మొసలి నోట గుక్కి చంపేశాడు. మొసలి దివ్యసుందరిగా మారింది. ముని సహజముని కాదని, కపటముని అని హెచ్చరించింది. తాను 'ధాన్యమాలి' అనే గంధర్వకన్య అని శాండిల్యుని శాపంచేత మొసలి అయ్యానని చెప్పింది. హనుమంతుడు ముని బాహుమధ్యభాగాన్ని పిడికిట పొడిచాడు. ముని పక్షి అయ్యాడు. హనుమంతుడు ఆ పక్షి రెక్కల్ని తుంచి పడవేశాడు. వాడు సింహమై దర్పిస్తే అణచాడు హనుమంతుడు. వాడు సుగ్రీవాకారం దాల్చి – 'లక్ష్మణుని మూర్ఛ వీడింది. ద్రోణగిరికి

వెళ్ళనవసరం లేదని' నమ్మ పలికాదు. హనుమంతుడు వక్షంపై కొట్టాడు. ఆ ముని శతశృంగుడై శరవర్షం కురిపించాడు. హనుమంతుడు పాదతాడనములతో మర్దించి మదించిన ఏనుగు తామరతూడును తుంచినట్లు త్రెంచివేశాడు. ఆపై ద్రోణగిరికి కదిలాడు.

ఈ కథ వాల్మీకి రామాయణంలో లేదు. ఆధ్యాత్మరామాయణంలో ఆనంద రామాయణంలో మాత్రముంది. రంగనాథ రామాయణంలో ఉంది. అన్నమయ్య రామాయణం వ్రాసినట్లు ప్రతీతి. అలాగే ఎర్రన రామాయణం కూడా అలభ్యం. ఈ కథలో హనుమంతునికి ప్రాతినిధ్యం ఉండడం వల్ల

భంజించెఁగాలనేమిని పంతమున నితఁడా 2-223

అని కాలనేమివృత్తాంతాన్ని తడవినాడు.

## మైరావణ వృతాంతం

యుద్ధరంగంలోని రామలక్ష్మణుల్ని మైరావణుడు చెరబట్టినాడు. పాతాళలంకలో దాచినాడు. పాతాళ లంకలో దాచినాడు. హనుమంతుడు ఆ మైరావణుని చంపి రామలక్ష్మణులను విడిపించినాడు. ఈ వృత్తాంతాల్లో పదకవులు వర్ణించారు.

పాతాళములోపలి మైరావణు
నాతలఁ జంపిన హనుమంత 4-444

## హనుమద్వైభవం

తాళ్లపాక పదకవులు భక్తిమత ప్రచారానికి కంకణం కట్టుకొన్నవారు. ఈ ప్రచారంలో దేవతాసంకీర్తనలు ప్రధానభాగం. ఆ సంకీర్తనలో అధ్యాత్మి కతను, సామాన్యులకు కూడా అత్యంత గౌరవం ఆదరం కలిగే అంశాలను ప్రస్తావించడం వారి విధానాలలో ఒకటి.



హనుమత్సంకీర్తనలలో ప్రత్యేకంగా గణించ దగ్గవి రెండు అంశాలు. సర్వదేవతాసమాహారస్వరూపుడుగా హనుమంతుని చెప్పడం ఒకటి. ఇందులో రెండు భాగాలున్నాయి. మొదటిది సర్వదేవతల ఆశీస్సులు. అనుగ్రహ వీక్షణములు, వరప్రదానములు హనుమంతునికి దక్కడం ఒకటి అయితే హనుమంతుడే దేవతాధికుడుగా గోచరింపచేయడం ఒకటి.

హనుమంతుడు జన్మించినవేళ ఆకలిని అణచుకోలేక ఆకాశంలోని సూర్యబింబాన్ని ఫలంగా భావించి ఎగిరాడని కథాంశం. ఆ సందర్భంలో రాహువు దేవేంద్రుని దగ్గరికి వెళ్ళి 'ప్రత్యబ్దము భాను శీత భానుగ్రసన స్థిత్యాధ్యుఁ జేసి యొండొకనికి ఈ బాధ్యత ఇవ్వక న్యాయమా' అని ప్రశ్నించాడు. ఇంద్రుడు శతకోటికల్పితాశని శతకోటి కఠోరధాటి జళిపించి'నాడు. హనుమ కిందపడినాడు. వాయుదేవుడు కినుక వహించాడు. చివరకు ఇంద్రుడు

తన దంభోళి హనుస్థలిం బెరసియున్ దారింప లేకుండుటన్
హనుమంతుండనుపేర మీరునని జంభారాతి వజ్రాయుధం
బున నిర్భీతుండుగా వరంబొసఁగె 2.181

ఈ అంశాన్నే తాళ్లపాక పదకవులు

జంభారిచే వరములు చయ్యన నందితివి 3.522

అని వర్ణించినారు. వివిధ దేవతలు హనుమకు వరము లిచ్చిన వైనాన్ని (2.180) పుష్పగిరి తిమ్మన రమణీయంగా వర్ణించాడు.

అణిమాదుల ప్రతిహతములై తను గొల్వ
నొకరి కుత్పాదింప నోపు నితడు
కమలజాండము నిరర్గళ మనోవేగంబు
కలిమి నెంచిన మాత్రఁ గాంచు నితఁడు

సతత వైరాగ్యోపరతుల నిష్కాముండై
కామరూపముఁ బూన గలుగు నిత
డనివార్య శౌర్య ధైర్య దయాది సద్గుణ
స్తోమంబులకు జన్మభూమి యితఁడు

కడివిచిత్ర క్రియల్ సేయగలఁడితండు
మహిమ నఘటనఘటనాసమర్థుఁడతఁడు
రామకార్యార్థమై పూని రాక్షసాళి
నెల్ల హరియించి పలికి మేలిచ్చు నితఁడు 2-184

ఈ కథాంశములను తాళ్లపాక అన్నమాచార్యుల వారు చాలరమ్యంగా 5 చరణాల కీర్తనలో ప్రకటించినారు.

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

మొదల నింద్రుడు నీ మోమున కెల్లా రక్ష
యిదె నీ శిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదరని నీ మేని కెల్ల శ్రీరామరక్ష

పిరుదు వాలమునకు బెడిదపు శక్తిరక్ష
గరుడఁడు నీ కరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీరామరక్ష

వడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేద రాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష



నలువ నీ గళరక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీసందులకు హరుడు రక్ష
పలు నీ రోమములకు బహుదేవతలు రక్ష
చెలగు నీ చేతలకు శ్రీరామరక్ష

అంగపు నీ తేజమున కగ్నిదేవుడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీసతి రక్ష
మంగాంబుధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష 4.459

## 'భవిష్యద్బ్రహ్మ' పట్టం

వాల్మీకి రామాయణంలో రాముడు హనుమను కౌగలించుకొని తన అభినందనలను. వాత్సల్యమును, సంప్రీతిని వ్యక్తం చేసినట్లు మాత్రమున్నది. (5.64) ఆలాగే పట్టాభిషేక సమయంలో హనుమంతునికి ఒక హారం బహూకరించినట్లు (40.24) ఉన్నది. భవిష్యద్బ్రహ్మ పట్టాదుల అనుగ్రహం లేదు. బహుశః ఇతర రామాయణాలలో ఉండవచ్చు. ఈ అంశాన్ని అన్నమయ్య పలుచోట్ల వ్యక్తం చేయడం విశేషం.

కిట్టి శ్రీవేంకటేశ్వరు కృపచే ముందరి బ్రహ్మ
పట్టమేల నున్నవాఁడు 4.273

పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ
యనుమతిఁ గాచుకున్నాఁ డిదె 4.490

అజుని పట్టాన నిల్చె హనుమంతుఁడు 3.138

## అష్టైశ్వర్య సిద్ధి చిత్రణ

ఐశ్వర్యం 8 రకాలు. దీనికి సంబంధించిన ప్రసిద్ధ శ్లోకం

అణిమా మహిమా చైవ గరిమా లఘిమా తథా
ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్ట సిద్ధయః

మిక్కిలి చిన్నది కావడం అణిమ. మిక్కిలి పెద్దది కావడం మహిమా. మిక్కిలి బరువు కావడం గరిమ. మిక్కిలి తేలికకావడం లఘిమా. వేలికొనలతో చంద్రాదులను పొందగలగడం ప్రాప్తి. అడ్డులేని ఇచ్ఛ ప్రాకామ్యం. అందరిని మించి వుండడం ఈశత్వం. ఇంద్రియాలను వశంలో ఉంచుకోవడం వశిత్వం. ఈ అష్టైశ్వర్య సిద్ధులు కలవాడు హనుమంతుడు. ఆ యా సన్నివేశ చిత్రణలో ఈ అంశం స్పష్టం చేయబడింది.

## విరాట్స్వరూప చిత్రణ

వాల్మీకి రామాయణం కిష్కింధకాండలో జాంబవంతుడు హను మంతుని చూచి

విక్రమస్య మహావేగో విష్ణుః త్రీన్ విక్రమానివ 67.37

అన్నాడు. వామనావతార సమయంలో పాదత్రయంతో ముల్లోకాలను ఆక్రమించినట్లు మహావేగంతో విజృంభించు అని సలహా ఇచ్చాడు. అశోకవనంలో సీతాదేవి హనుమంతుని శక్తిని నమ్మలేనప్పుడు తన విరాట్స్వరూపాన్ని ప్రదర్శించాడు.

మేరు మందర సంకాశో బభౌ దీప్తానల ప్రభః
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః 37.37

హరిః పర్వత సంకాశః తామ్రవ క్త్రో మహాబలః
వజ్ర దంష్ట్ర నఖో భీమో వైదేహీ మిద మబ్రవీత్ 37.38

ఈ అంశాన్ని అన్నమయ్య

వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె 2.207



భీముడు కోరగా హనుమంతుడు తనపూర్వరూపాన్ని చూపినవైనం భారతం అరణ్యపర్వం తృతీయాశ్వాసంలో వర్ణితం.

నా నాఁటి తనువుఁ జూచియ
కాని యవశ్యంబు పోవం గావునఁ గపినా
థా! నాకుఁ జూపుమనవుడు
వానికిఁ దనరూపుఁ జూపి వానరుఁడంతన్

అతులితమై ద్వితీయ కనకాద్రి యొకో యిదినా నిజాంగమూ
ర్జితముగఁ బెంచి పుచ్ఛమునఁ జేసి దిగంతములందుచున్నయు
న్నతుఁ గపినాథుఁ జూచి కురునందనుఁడప్పు నిమీలితాక్షుఁడై
మతి నతివిస్మితుండగుచు మారుతి కిట్లనియెన్ భయంబునన్

అతి భీషణ మిది యత్య
ద్భుత మోహో! చాలు భూనభోమధ్య వ్యా
పితమయ్యె భవద్దేహ
యతత్వ ముపసంహరింపు మనవుడుఁగపియున్

అన్నమయ్య హనుమంతుని

'త్రివిక్రమ మూర్తియైన దేవుని వలె నున్నాడు' 28.496

అని ఒక గీతంతో విశ్వవ్యాపకత్వాన్ని విశదం చేశాడు. పైగా భగవంతుని లక్ష్యం. భాగవతలక్ష్యం రెండూ ఒకటి అనడాన్ని నిరూపించాడు.

విశ్వరూపు చూపినాఁడు విష్ణుఁడు దొల్లి యట్టె
విశ్వరూపాంజనేయుడు వీఁడె చూపెను

శాశ్వతుఁడై యున్నవాఁడు సర్వేశ్వరుఁడు వీఁడె
శాశ్వతుఁడై యున్నాఁడు జగములో నితఁడు

ప్రాణవాయు సంబంధి పరమాత్ముఁడు అట్టె
ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు
రాణింప రవివంశుఁడు రామచంద్రుఁడు తాను
నాణెపు రవిసుతుని నమ్మిన ప్రధాని

దేవహితార్థము సేసెఁ ద్రి విక్రముఁడు అట్టె
దేవహితార్థమే జలధి లంఘునుఁడు
శ్రీవేంకటేశుడు చిన్మయమూర్తి తాను
కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్ప హనుమంతుఁడు 4.145

ఈ విశ్వరూప ప్రదర్శనలో అన్నమయ్య హనుమంతుని కర్ణ కుండలాదులను వర్ణించిన తీరు రమ్యాతి రమ్యం

పుట్టు గవచ కుండలంబులు తోడనున్నవాఁడు 4.453

గుట్టు చూపని కవచకుండలములు 4.85

పుట్టు కౌపీనము హేమకుండలములతో 3.519

వొక్క మొలగంట చంద్రుఁ డొక్క మొల గంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా 4.470

గరిమ రవి చంద్రులు కర్ణకుండలములుగా
ధరణి మేరువు కటితటము గాగ 2.218

విశ్వరూపంలో సమస్తదేవతలు భాగస్వాములే. ఈ అంశాన్ని అన్నమయ్య

ఒక్కడే యేకాంగ వీరుఁడుర్వికి దైవమైనాడు
యెక్కడా హనుమంతుని కెదురా లోకము
ముందటనేలే పట్టమునకు బ్రహ్మాయినాఁడు
అందరు దైత్యులఁజంపి హరి పే రైనాడు 4-462



అనే కీర్తనలో వర్ణించాడు. త్రిమూర్తుల లక్షణాలన్నీ హనుమకు రావడం విశేషం. భవిష్యద్బ్రహ్మ పట్టంతో బ్రహ్మ, దైత్యసంహారంతో హరిత్వం, రుద్రవీర్యజుడు కావడంతో హరత్వం లభించింది. చుక్కలు మోవ పెరగడంతో సూర్యుడు. పాతాళం దూరడంతో శేషుడు, వాయుజుడు కావడంతో జగత్ప్రాణుఁడు జలధి పుట మెగయడంతో చంద్రుడు కావడాన్ని అన్నమయ్య సమర్థించాడు.

భగవంతుని కంటె భాగవతులు గొప్పవారు. భగవదనుగ్రహంతో చేసే భాగవతుల మహిమలు అత్యాశ్చర్యకరములు. ఈ అంశాన్ని ఇంచుక పరిహాసంతో అన్నమయ్య చెప్పిన తీరు బాగున్నది.

ఇతఁడే యతఁడు గాఁబో లేలిక బంటును నైరి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు
జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరకే దాఁటె హనుమంతుఁడు
గుండు గరఁచె నహల్యకొరకు సీతాపతి
గుండు గరఁగఁగ ఁబాడె కోరి యీతఁడు 4.443

ఈ సందర్భంలో హనుమంతునికి గల రామభక్తిని చర్చించడం సబబు.

స్వామి కార్యమునకే సరిఁ బేరు వడ్డవాఁడు 3.143

రామజపానఁ బెదవులు గదలించీ 3.143

వసుధ మతిలోనిది స్వామికార్య విశ్వాసము
వెసఁదనప నైనది విష్ణుభక్తి 3.232

కదిసి రాము కృప ఁగై కొంటి 3.421

పన్నుగడై రాఘవుని బంట్ల లోపలనెల్లా
పెన్నిధియై యున్నవాఁడు 4.158

### వరప్రదాత

దేవతలలో కొందరు వరాలు పొందినవారు. కొందరు వరదాయకులు. కొందరు వరానుగ్రహపాత్రులు. వరదాతలు కూడా. ఈ సమూహం లోనివాడే హనుమంతుడు. ఈ అంశాన్ని అన్నమయ్య పలుచోట్ల వాచ్యం చేశాడు.

బెడిదపు మహిమల పెద్ద హనుమంతుడు 4.470

కామితఫలదుఁడు యీ ఘన హనుమంతుఁడు 4.490

శిష్టరక్షణమునకై వావిరి నిలుచున్నాఁడు 2.216

తక్కక లోకములెల్లా దయఁ గాచేవాఁడు 3.519

చుట్టి చుట్టి తనకు దాసులయిన వారికి
గట్టివరము లిచ్చె 4.273

### సందేశాత్మక జీవితం

ఒక సేవకుడు యజమాని కడ ఎలా ఉండాలో భంగ్యంతరంగా అన్నమయ్య హనుమత్సంకీర్తనలో సూచించాడు

ఏలికను దైవముగా నెంచి కొల్చేవాఁడు బంటు

తాలిమి గలిగిన యాతఁడే బంటు

పాలుమాలక యే పొద్దు పనిసేయు వాఁడెబంటు

వేళగాచుక వుండేటి వెరవరే బంటు 4.278

హనుమత్సంకీర్తనల పాదాంతంలో చాలవాటిలో 'బంటుతనాన్ని' శ్లాఘించాడు.



శ్రీ వేంకటేశు బంటై సేవింపుచు 2.207

హితవరి బంటాయ 4.529

శ్రీవేంకటేశ్వరుని మన్నన బంటు 4.470

శ్రీవేంకటపతి పాదసరోరుహ పాలకుడా 4.327

శ్రీవేంకటేశ బలు నీబంట్లలోన రసికుడు 3.232

నీ చే నిమ్మపండైన బంటు 4.67

శ్రీవేంకటేశ్వరు సేవాగ్రగణ్యుఁడు 4.528

## పదకవుల హనుమత్ క్షేత్రసంకీర్తనలు

అన్నమయ్య విస్తృతంగా దేశాటనం చేసి భక్తిమతాన్ని ప్రచారం చేసిన వాడు. స్థానిక ఆలయాలను కీర్తించి అక్కడివారికి అనుబంధం పెంచినవాడు. లభ్యమవుతున్న 55 కీర్తనలలో పల్లవి అంతంలోనో, చరణాంతంలోనో, కీర్తనాంతంలోనో లేక అన్నిటా హనుమత్ శబ్ద సంబంధి పదజాలాన్ని విరివిగా ప్రయోగించాడు. వాటిలో హనుమంతుఁడు, హనుహంతా, హనుమంతరాయ, హనుమంత రాయఁడు ముఖ్యమైనవి. కర్ణాటాంధ్ర ప్రాంతాలలో 'హనుమంతరాయ' శబ్దానికి వ్యాప్తి ఎక్కువ కూడా. ఇవేగాక ఒక విశేషణం జతగూర్చి హనుమంతుడు అని చెప్పడం కూడా కనిపిస్తుంది. పెద్ద హనుమంతుఁడు, పెను హనుమంతుఁడు, దొడ్డహను మంతుఁడు, పొడవైన హనుమంతుడు, దివ్యహనుమంతుఁ డు, ఘన హనుమంతుడు, గురుహను మంతుడు, చొక్కపు హనుమంతుడు, భీషణ హనుమంతుఁడు, ఉగ్ర హనుమంతుడు, దిట్ట హనుమంతుఁడు, బిరుదు హను మంతుడు, సొబగు హనుమంతుడు, దేవహనుమంతుఁడు లాంటివి (చూ. అనుబంధం- 1)

ఆలాగే ప్రదేశాన్ని సూచించేవిధంగా మతంగాద్రి, కలశాపుర, మంగాం బుధి, దిగువపట్టణం, విజనగర హనుమంతాదుల కీర్తనలు పరిశీలించదగ్గవి (చూ.అనుబంధం-2)

**క్షేత్ర సంకీర్తనలు**

తాళ్లపాక పదకవులు తమ సంకీర్తనలలో హనుమదాలయాలున్న ప్రదేశాలను కూడా పొందుపరుస్తు పాడిన కీర్తనలున్నాయి. వాటిలో మతంగాద్రి, మంగాంబుద్ధి, విజనగర, దిగువ తిరుపతి హనుమదాలయాలు ప్రసిద్దాలు.

**మతంగాద్రి హనుమంతుడు**

తాళ్లపాక అన్నమాచార్యులు హనుమత్సంకీర్తనలలో మతంగాద్రి హనుమత్సంకీర్తనలు కనిపిస్తాయి. ఈ కీర్తనలలో శ్రీరామాయణ సంబంధి సన్నివేశాలున్నా విగ్రహనిర్మాణం గురించి కూడా కొంతవరకు తెలిసికోవ డానికి ఊహించడానికి వీలుంది.

తాళ్లపాక అన్నమాచార్యుల వారు మతంగ పర్వత హనుమంతుడు మతంగగిరికాడి హనుమంతుడు (2.207) మతంగ పర్వత మాడ (4-158) మతంగాద్రి బిలమువాతనున్నాడు (2.350) మతంగ పర్వతమనుజుఁడు (4.273) మతంగ పర్వతమాడ మాల్యవంతము నీడ (2.2.23) అని వర్ణించారు. పై సూచనల బట్టి ఈ హనుమంతుడు మాల్యవంతము, మతంగపర్వతము దగ్గర నెలకొన్న మూర్తియని, బిలము వాత అనడం వల్ల గుహాలయం కావచ్చని ఊహించవచ్చును. ఈ హనుమంతుడు విజనగరములోని వాడే (2.223) అని భావించడానికి వీలున్నది.

ఇక విగ్రహాకారం పరిశీలిస్తే ఈ హనుమంతుని విగ్రహం పెద్దదని పెద్ద హనుమంతుఁడు (3.143) పొడవాటి హనుమంతుఁడు (2.207)



పెచ్చు పెరుగుచున్నవాఁడు (4.158) మేటి పవనజుఁడు, ఘనపవనజుఁడు (4.273) అని చెప్పవచ్చును. 'పెచ్చు పెరుగుచున్నవాడు' అనడం వల్ల ఈ విగ్రహం క్రమంగా పెరుగుతున్నదని సూచనగా తెలుస్తున్నది. అటువంటి విగ్రహాలు చాలచోట్ల ఉన్నాయి కూడా.

హనుమద్విగ్రహాలు అనేక రకాలు గనుక ఆ దృష్టితో పరిశీలిస్తే మతంగాద్రి హనుమంతుడు వరప్రదాయక హనుమద్ మూర్తి అని చెప్పక తప్పదు.

| | |
|---|---|
| రామజపానఁ బెదవులు గదలించీ | 3.143 |
| వరములిచ్చీ | 2.207 |
| దాసులయినవారికి గట్టివరములిచ్చె | 4.273 |
| అరిది వరములిచ్చీ నందరికి | 2.223 |

**మంగాంబుధి హనుమంతుడు**

తిరుపతి సమీపంలోని తిరుచానూరు అలమేలు మంగాపురంగా ప్రసిద్ధి. చంద్రగిరి సమీపంలోనిది శ్రీనివాసమంగాపురం. ఈ రెండుచోట్ల ప్రాచీన హనుమదాలయాలు లేవు. ఈ అంశం ఇంకా పరిశీలించ దగ్గది. తాళ్లపాక పదకవుల సంకీర్తనల రాశిలో నాలుగు మంగాంబుద్ధి హనుమత్సం కీర్తనలున్నాయి. ఈ కీర్తనలో హనుమత్సంబంధి ప్రతాప ప్రకటన సూచన లున్నా ఈ ఆలయం తిరుమల తిరుపతి సమీపంలోని ఆలయమేమెూ అనడానికి సూచనలున్నాయి. కాకుంటే వేంకటేశ్వరాలయమున్న చోట హను మంతుడు కావచ్చును.

శ్రీ వెంకటపతి యండనే మంగాంబుధి నిలయపు

| | |
|---|---|
| హనుమంత | 4.458 |
| చెంగట శ్రీవేంకటాద్రి | 4.459 |

శ్రీవేంకటేశుబంటై(?) 4.462

చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి
నీతల గొలిచే హితహనుమంత 4.444

ఇక విగ్రహముద్రా భంగిమను పరిశీలిస్తే 'చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి నీతల గొలిచే హతహనుమంతా' అనడం వల్ల ఈ హనుమంతుడు భక్తాంజనేయుడని ఊహించవచ్చు.

**విజనగర హనుమంతుడు**

తాళ్లపాక అన్నమాచార్యుల హనుమత్సంకీర్తనలలో విజనగర హనుమత్సంకీర్తనలు కనిపిస్తున్నాయి. 'విజనగర' మని ఉన్నా విజయనగర మని భావించవచ్చు. సువిశాల పట్టణంలో ఈ ఆలయం ఎక్కడ ఉందో పరిశీలించవలసిందే. ఈ కీర్తనలలో కూడా హనుమత్ ప్రతాప శౌర్యాదుల వర్ణనలున్నాయి.

విజయనగరాన శ్రీవేంకటేశ్వర సేవకుడై
భుజబలుఁడై యున్నాఁడిపుడు 3.138

వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
... ... ... ....
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటైనవాడు 3.519

అనడంవల్ల విజనగరం వేంకటేశ్వరాలయం ఎదుట నెలకొన్న స్వామి కావచ్చు. తాళ్లపాక పదకవుల రచనలలో విజనగర వేంకటేశ్వర కీర్తనలు కూడా ఎన్నో ఉన్నాయి.

కీర్తనాంశముల బట్టి విజనగర హనుమంతుడు, చొక్కపు హను మంతుఁడు, భీషణ హనుమంతుడు (3.138), పెద్ద హనుమంతుఁడు (3.519), ఉగ్రహనుమంతుఁడు (4.85) అని స్పష్టమవుతున్నది.



ప్రత్యేకించి 'పండ్ల గొలలు పిడికిలించినమూర్తి' కావడం విశేషాంశం. స్పష్టమైన విగ్రహ వర్ణన ఎక్కడ నెదురులేక (4.85) కీర్తనలో కనిపిస్తుంది.

**కలశాపుర హనుమంతుడు**

తాళ్లపాక అన్నమాచార్యుల వారి కీర్తనలలో కలశాపుర హనుమత్సం కీర్తనలే హెచ్చు. కలశాపుర మెక్కడో తెలియదు. శ్రీనాథుడు 'కళసాపుర ప్రాంత కదళీవనాంతర ద్రాక్షాల ఫలస్తబకములను' అని వర్ణించాడు. శ్రీమాన్ రాళ్లపల్లివారు మాల్యవంతానికి ఎదురుగా ఉన్న కొండలోని దేవుడే కలశాపురం ఆంజనేయుడన్నారు.

అక్కడ అరటితోటలు హెచ్చుకూడా. ఆనాడే కాదు. ఈనాడు కూడా హెచ్చు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లోని కన్నడాచార్యులు శేషశాస్త్రిగారు ఈ అంశానికి సంబంధించి అనేకాంశాలను నాకు సెలవిచ్చారు.

కలశాపుర ప్రాంత హనుమంతాలయం ఎక్కడ వుందో సూచించే

కలశాపురము కాడ గంధమాకులనీడ 3.521

కొల్లున మంటపములో గొలువై వున్నాడు 3.144

వర్ణనలు తాళ్లపాక పదకవుల రచనల్లో ఉన్నాయి.

కలశాపురము కాడ కదళీవనాల నీడ 4.272

పెక్కు పండ్లగొలలు పిడకిట పట్టుకొని 3.144

పిడికిట ఁబట్టినవి పెద్ద పండుల గొలలు 4.506

తాటించి పండ్లగొల దాపరి చేతఁబట్టక 28.491

పట్టుకున్నాఁడొక చేతఁ బండ్లగొల 3.232

కలశాపుర సంకీర్తనలబట్టి మరికొన్ని హనుమత్ విగ్రహచిహ్నాలు గుర్తించడానికి వీలుంది.

| | |
|---|---|
| ఆతఁడా యితఁడు పెద్ద హనుమంతుఁడు | 4.147 |
| వీడివో కలశాపుర వీరహనుమంతుడు | 4.525 |
| సరిలేరితనికి సాహసవిక్రముఁడీత | 4.499 |
| కుందక వీరరసమే కురిసేటిది మొగము | 4.506 |

తాళ్లపాక పదకవులు కలశాపుర ప్రాంత హనుమంతుని
రసికుడు కలశాపురము హనుమంతుడు 3.232 అనడం విశేషం.

భగవంతుడు రసస్వరూపుడు. 'రసోవై సః' అందువల్ల భక్తుడు రసికుడు కావడంలో వింతలేదు. భక్తి కూడా రసమే.

## విట్ఠల

పండరంగంలోని దేవుడు విఠలుడు. విజయనగర చక్రవర్తుల కాలంలో విఠలాలయములెన్నో వెలశాయి. విట్ఠలము లోనను (3.301) అనడం వలన విట్ఠల ఆలయం ఎదురుగా ఉన్న హనుమంతుడు కావచ్చు. లేదా పండరంగములోని విట్ఠల ఆలయ సమీపంలోని హనుమ కావచ్చును.

'మొక్కరో మొక్కరో వాడదె ముందర నిలుచున్నాఁడు' కీర్తనలో పెనచి తొడల దాక పెద పదకము వేసిన ఆకారం, తనువుపై కదలాడే దండలు వర్ణితం. ఇలాంటి వర్ణనలు ఇతర హనుమత్సం కీర్తనలలో లేవు.

## దిగువ పట్టణ హనుమంతుడు

తాళ్లపాక పదకవులు తిరుపతిలోని పలుదేవాలయాలలోని మూర్తులను కీర్తించినవారే. వాటిలో లభ్యమయిన ఏకైక హనుమత్సంకీర్తన 'మగటిమి గల హనుమంతరాయ'. తిరుపతిలో



రామాలయం, గోవిందరాజ స్వామి ఆలయం సమ్ముఖంలో, ఆలాగే భవానీనగరంలో హనుమదాలయం ప్రసిద్ధమయినవి. మరికొన్నిచోట్ల సింధూర లేపిత హనుమదాలయాలు ఉన్నాయి. కీర్తనలోని అంశాలన్నీ రామాయణ సంబంధి అంశాలు కావడం వల్ల స్పష్టంగా నిర్దిష్ట ఆలయ సమీప ఆంజనేయాలయమని చెప్పలేము.

'దిగువ పట్టణములోని దేవహనుమంత' తిరుపతి హనుమదాలయమే.

తాళ్లపాక అన్నమాచార్యుల హనుమత్సంకీర్తనలలో ఎక్కడగాని తిరుమల హనుమంతుడనిగాని అంజనాచల హనుమంతుడని గాని ఉల్లేఖం నిర్దిష్టంగా లేదు. కనుక గ్రామమో నగరమో నిర్దిష్టంగా చెప్పనివన్నీ తిరుమల హనుమత్సంకీర్తనలుగా గ్రహించడం సబబు.

| | |
|---|---|
| ఘటన నలమేల్మంగకాంతు శ్రీవేంకటేశునకు | 3.522 |
| శ్రీవేంకటాద్రి రాముని దేవి కచ్చితి | 2.249 |
| శ్రీవేంకటేశుని సేవకుఁడై బెరసె | 2.218 |
| శ్రీవేంకటేశు నెదుట ఁబనులుసేసీ | 4.493 |
| వెంకటపతి పాద సరోరుహపాలకుడా | 4.327 |
| శ్రీవేంకటేశు మోహపు బంటై | 28.496 |
| వేంకటేశ్వరు సేవావీర | 1.366 |

## హనుమత్సంకీర్తనలు, తాళ్లపాక పదకవుల రచనావైశిష్ట్యం

తాళ్లపాక పదకవులు వివిధ దేవతల సంకీర్తనలలో చమత్కారానికి, ఉక్తి వైచిత్రికి, విలక్షణ భావ ప్రకటనకు అవకాశమిస్తూ రచనలు చేసినవారు. కాని హనుమత్సంకీర్తనలలో 'స్వభావోక్తికే' అగ్రతాంబూల మిచ్చినట్లు స్పష్ట మవుతుంది. నిరహంకార మయిన భక్తి నిర్మలం కనుక

అలంకారాల జోలికి పోలేదు. కాకపోతే కీర్తనల ఎత్తుగడలలో వైలక్షణ్యం ప్రదర్శించారు.

కొన్ని చేయెట్టుకొని దగ్గరికి చేర్చి చూపించే దృశ్యాలుగా చెప్పడం

అదె చూడరయ్యా పెద్ద హనుమంతుని 4.509

వీఁడివో కలశాపుర వీరహనుమంతుడు 4.525

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు 3.301

కొన్ని సంబోధనాత్మకంగానే సాగించడం.

ఓ పవనాత్మజ వో ఘనుఁడ 4.327

కొన్ని విశ్వాసం పెంచేలా ఎత్తుగడలు

అందరిలోనా యెక్కుడు హనుమంతుడు 2.207

ఎంతని పొగడవచ్చు నితని ప్రతాపము 4.501

కొన్నిట పల్లవిలోనే స్థాననిర్దేశం చేస్తూ చెప్పడం

అంజనా తనయుఁడైన హనుమంతుఁడు
రంజితపు మతంగ పర్వత హనుమంతుడు 3.143

కలశాపురము కాడ గంధమాకుల నీడ 3.521

కొన్నిట అద్భుత, వీర, రౌద్ర, రసస్ఫోరకత్వం ప్రస్ఫుటం కావడం

పెరిగినాడు చూడరో 4.528

సరిలేరితనికి సాహసవిక్రముఁడు 4.499

హనుమంతుని లోకోత్తర క్రియలకు ఆస్వామి పాదాలు, హస్తములు, వీర చలనములే ఆధారభూతములు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని తాళ్లపాక అన్నమాచార్యులవారు జాంఘిక విన్యాసాలు, హస్త



విక్షేపాలు, వాలచలనాదులను సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించి సంకీర్తనలు పాడారు. మచ్చుకు –

**జాంఘిక విన్యాసం**

ఉదయాస్త శైలముల కొక్క జంగగాఁ జాచి
అదె సూర్యుతోఁ జదివె హనుమంతుడు 3.143

నలియతొక్కిన నీ వున్నతపు cబాదము క్రింద
నలమటించె రరులు హనుమంతా 3.500

బాలసూర్య బింబమును పండుగాను భావించి
చాలుకొన cజాదములు జంగ చాచి 28.491

సందడి సమరానకు చాచినది పెనుజంగ 4.506

**హస్తవిక్షేపాలు**

శ్రీహస్తము 4.413

ఎత్తిన కుడిహస్తము 3.500

ఎడమచేతి పిడికిటికి 3.500

రొమ్మువిరుగ చేతనే గుద్దె 1.69

కఠినహస్తాలతోడ 2.207

పండ్లగుత్తి చేతబట్టి 4.272

జంగచాచి చేయెత్తి 2.249

దశదిక్కుల కరముల cగబళించి 2.218

చేతులనే పెరికి సంజీవికొండ 4.501

అమర భయమిచ్చిన 2.250

**వాల విక్షేపం**

| | |
|---|---|
| అల్లార్చిన వాలము | 3.500 |
| నిక్కిన వాలాగ్రము | 4.470 |
| వల్లెగా వేసుకొన్న వాలము | 3.144 |
| అడరి యెత్తిన మహావాలము | 4.506 |
| శిరసుపైకి గక్కన ఁదోఁకనిక్కించి | 28.49 |
| బెడిదంపు ఁబెనుదోఁక బిరబిర దిప్పి మొత్తె | 3.302 |
| బలువాల మల్లార్చి పట్టుకున్నాఁడు | 3.148 |
| కొచ్చి కొచ్చి తోక జుట్టు కొన్నది నింగి | 3.232 |

భాషావిషయంగా పరిశీలిస్తే ఒక్క సంకీర్తన మాత్రం సంస్కృతంలో రచితం. మిగిలినవన్నీ తెలుగు కీర్తనలే. ఒక కీర్తన తప్ప మిగిలిన కీర్తనలలో మూడు చరణాలే కనిపిస్తాయి.

సంగీత రాగాలు పరిశీలిస్తే తాళ్లపాక పదకవులు హనుమత్సంకీర్తనలను సాళంగనాట, మాళతి, నాట, రామక్రియ, బౌళి, గౌళ, శంకరాభరణం, పాడి, శ్రీరాగం, సామంతం, గుండక్రియ, ఆహిరి, ముఖారి, వరాళి, లలిత, దేశాక్షి రాగాలలో వ్రాశారని చెప్పవచ్చు.

**తమిళ కర్ణాటక ప్రదేశాలలో హనుమదాలయాలు**

హనుమజ్జయంతికి సంబంధించి కొంత వివాదం ఉంది. ఆంధ్రశేష గిరిరావుగారు వ్రాసిన 'పండుగలు - పరమార్థములు' అనేగ్రంథంలో చైత్ర పూర్ణిమ హనుమజ్జయంతిగా చెప్పబడింది. ఆలాగే కార్తిక కృష్ణ చతుర్దశి స్వాతి నక్షత్రం భౌమ వారమనే వాదం కూడా ఉంది. మరి కొందరు వైశాఖ బహుళ దశమి శనివారాన్ని, ఇంకా కొందరు మార్గశిర శుద్ధత్రయోదశి శనివారాన్ని జయంతిగా భావిస్తారు.



'వ్రతోత్సవ చంద్రిక' ఉత్తరాదిలో జరిగే జయంతి క్రమాల్ని విశదం చేస్తుంది. వీరబ్రహ్మచారి. దాసబ్రహ్మచారి అని రెండు రకాల హనుమంతుని విగ్రహాలు. కింద చండీవిగ్రహం కలది వీరబ్రహ్మచారి. ఈ హనుమంతుని ప్రసాదాన్ని స్త్రీలు పుచ్చుకోరు. దాస హనుమంతుని అందరు పూజిస్తారు.

ప్రేతపతి అయిన శంకరునికి భూతాల మీద ఏలాంటి ఆధిపత్యం వుందో అట్టి ఆధిపత్యం హనుమంతుని కుందని మహారాష్ట్రుల నమ్మకం. ఆలాగే శనిబాధలను హనుమంతుడు పోగొడతాడని విశ్వసిస్తారు. పూజలలో ఏడవది దాస్యపూజ. ఈ పూజకు హనుమంతుడు మంచి ఉదాహరణం కూడా.

ఉత్తర దేశస్థులకు హనుమంతుడు పౌరుషదేవత. ఎపుడూ కల్లోలాలు. యుద్ధాలుంటాయి కనుక అక్కడి హనుమంతుడు సింధూర లేపితుడగా దర్శనమిస్తాడు. దీనికి సంబంధించి ప్రజలలో కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి.

పట్టాభిషేకానంతరం హనుమంతుడు అయోధ్యలో శ్రీరామపద సేవకుడుగా కాలం గడుపుతున్నాడు. చివరకు శయనాగారంలో కూడా రామాజ్ఞకు ఎదురుచూచేవాడట. సీతమ్మకు ఈ వ్యవహారం ఎబ్బెట్టుగా అనిపించింది. రాత్రిపూట శయనాగారంలో రామునితో ఉండే హక్కు తనకే అని పాపిటలోని కుంకుమ చూపించిందట. హనుమంతుడు బదులు చెప్పక వెళ్ళిపోయాడు. మరుసటిరోజు గంగసింధూరాన్ని ఒళ్ళంతా పూసుకొని సభకు వచ్చాడు. సభలోని వారందరూ నవ్వారట. చివరకు రాముడు 'ఏమిటా రంగులవేషం' అని ప్రశ్నిస్తే పాపిటలోని కాసంత సింధూరానికి తమరు బానిసలయితే ఒళ్ళంతా పూసుకొన్న నా సింధూరానికి బహుమతి ఏమిటని ప్రశ్నించాడట. హనుమంతుని ఆవేదన అర్థమయింది. సీతమ్మ కూడా భక్తుని ఆవేదన అర్థం చేసుకొంది.

చివరకు సింధూరలేపిత హనుమంతుని పూజించే వారి కోరికలు నెరవేరుతాయని అనుగ్రహించాడట.

ఈ సింధూర లేపనానికి మరో కథ కూడా ఉంది. ఒకసారి అర్జునుడు ఆంజనేయుని కలుసుకొన్నాడట. హనుమంతుడు రాముడే గొప్ప అని అర్జునుడు కృష్ణుడు గొప్ప అన్నాడు. రాముడు గొప్పవాడయితే సేతునిర్మాణానికి వానరులా? బాణంతో నిర్మించవచ్చుకదా అన్నాడట. నేను శరసేతువు నిర్మిస్తానని అర్జునుడు ముందుకొచ్చాడు. హనుమంతుడు సేతువు మీద నడిచాడు. సేతువు కుంగిపోలేదు. సేతువుపై నడిచి అవతలివైపుకు చేరుకున్నాడు. అపుడు సేతువు కింద నుండి కృష్ణుడు వచ్చాడట. ఆంజనేయుని భారంవల్ల కృష్ణుని ఒళ్ళంతా రక్తమయమయింది. హనుమ రామకృష్ణులొకరని గ్రహించి ఆ రక్తాన్ని తన ఒంటికి పూసుకొన్నాడట. అప్పటినుండి ఆంజనేయునికి సింధూర వర్ణం నియతమయింది.

ఇంక వారం జోలికి వస్తే హనుమంతుడు మంగళవారం సింధూరం పూసుకోవడం వల్ల ఆరోజు పవిత్ర మయింది. సూర్యుని దగ్గర విద్య నేర్చుకోవడం వల్ల 'ఆదివారం' కూడా ప్రియమయింది. శనిబాధలు లేకుండా చేయగల సమర్థుడు కనుక 'శనివారం' కూడా సంప్రీతి వారంగా నిలిచి పోయింది.

భారతదేశమంతటా హనుమదాలయాలున్నాయి. కొన్నిటికి పౌరాణిక ప్రశస్తి. మరికొన్నిటికి విగ్రహప్రశస్తి. ఇంకా కొన్నిటికి చారిత్రక ప్రశస్తులున్నాయి. వీటిలో తమిళనాడులోని హనుమదాలయాలకు సంబంధించి వంగీపురం సుందరవరదన్ గారు 'అంజనై మైందనిన్ అర్పుదంగళ్' అనేపేరుతో ఒక మంచి పుస్తకాన్ని ప్రకటించారు. ఆ పుస్తకంలోని కొన్ని అంశాలను అనుసంధానించుకోవడం సబబే.



తంజావూరు జిల్లా కుంభకోణం – తంజావూరుమార్గంలో 'ఇరట్టై వసిట్టేశువరార్' ఆలయానికి వెళ్ళేదారిలో నవనీతకృష్ణాలయంలో ఉత్తరాభిముఖుడయిన ఆంజనేయుడు దర్శనమిస్తాడు. పీచుతో కూడిన నారికేళ ఫలాన్ని సన్నిధిలో గుడ్డతో చుట్టిపెడితే అభిషేక సమయంలో ప్రార్థితులకు స్వామి 'అరుణవర్ణుడుగా' కనిపిస్తాడట.

కోయంబత్తూరు జిల్లా మేట్టుపాలయం దగ్గరి ఇడుక్కం పాళయంలో హనుమంతుడు లింగాకారంలో ఉన్నాడట. వ్యాసరాయలకు హనుమ సాక్షాత్కరించిన స్థలాలలో ఇదొకటి. ఈ స్వామిని జయమంగళ ఆంజనేయర్ అంటారు. రామేశ్వరం సమీపంలోని తిరుక్కురక్కావల్‌లో రుద్రాక్షమాల ధరించిన ఆంజనేయ విగ్రహముంది. ఈ స్వామికి శివాంజనేయర్ అనిపేరు. తిరువణ్ణామలై జిల్లా ఊర్మేల్ ముడియనూర్‌లో రాతి సంకెళ్ళు కట్టిన హనుమ విగ్రహమున్నది. కారైక్కుడి దగ్గరలోని 'సిరువయల్ పొణ్ణళగి కోవిల్'లో రాముని పాదాలు పట్టుకొన్న హనుమ విగ్రహముంది. చెన్నైకు సంబంధించిన పాడిగ్రామంలో తిరువల్లీశ్వరర్ ఆలయంలో శివునికి నమస్కరించే ఆంజనేయ విగ్రహముంది. మయిలాడుతురై నాగపట్నం మార్గంలో అనంతమంగళంలో త్రినేత్ర దశభుజ వీరాంజనేయ విగ్రహముంది. వాలాజాపేటలోని ముత్యాల పేట దగ్గర ఆకాశంలో ఎగిరే భంగిమలో తోకకు కట్టిన గంటతో ప్రసన్న ఆంజనేయాలయముంది. కంచి వరదరాజస్వామి ఆలయగోడల దక్షిణమాడ వీధి దగ్గర దక్షిణాభిముఖ ఆంజనేయాలయ ముంది.

ఇవేగాక ఘటికాచలమనబడే షోళింగర్ పర్వతం మీద స్వామి చతుర్భుజుడై శంఖ చక్ర జపమాలలతో దర్శనమిస్తాడు. ఆలాగే జ్ఞానారణ్యమనబడే సుశీంద్రంలో 23 అడుగుల స్వామి, నామక్కల్‌లో పై ఆచ్ఛాదనం లేక పెరుగుతున్న ఆంజనేయుడు, చెన్నైకు దగ్గర నంగనల్లూరులో 32 అడుగుల మారుతి. తిండివనం పాండిచ్చేరి రహదారిలో పంచవటి

అనబడే క్షేత్రంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాలు రమణీయంగా భక్తులకు దర్శన మిస్తాయి. ఇక్కడే నీటిలో తేలే 'రామనామక ఇష్టిక (ఇటుక)' భద్రపరచబడి వుంది.

హనుమదాలయాలు దక్షిణాభిముఖంగా ఉండడం సహజం. కర్ణాటకలోని దొడ్డ పెద్దవన హాళ్ళి ఆంజనేయస్వామి గుడి దక్షిణాభిముఖం. మూర్తి మాత్రం పశ్చిమాభిముఖం. తుంకూరు దగ్గరి బయలాంజనేయ గుడి ఉత్తరాభిముఖం. 8 అడుగులది. హొయసల సంప్రదాయంగల సోమనాథ పుర గర్భగుడిపైన చతుర్భుజ ఆంజనేయస్వామి విగ్రహముంది. ఆనెగొంది శ్రీరఘునాథ బృందావనం ఎదురుగా చతుర్భుజ ఆంజనేయ విగ్రహముంది. బెంగుళూరు డిజైన్ సెంటర్ వారు ఏకనాదం పలికించే వాదాన్ని చేబూనిన హనుమంతుని విగ్రహాన్ని సంపాదించారు.

ప్రపంచంలోనే అతిపొడవైన హనుమద్విగ్రహం హిమాచల్ ప్రదేశ్‌లో సిమ్లాలోని జాఖూ ఆలయం వద్ద ఆవిష్కరింపబడింది. ఆ విగ్రహం ఎత్తు 108 అడుగులు కావడం విశేషం. (ఈనాడు 5-11-2010).

ఇవేగాక తంత్ర శాస్త్రంలో అనేకరకాలయిన హనుమద్విగ్రహ రూపాలు చెప్పబడ్డాయి. ఇవన్నీ ఉపాసనకు సంబంధించిన అంశాలు.

**'వేంకటేశ్వరు సేవావీర మహాధీర**
**కింకరరాయ సుఖీభవ'**

* * *



# హనుమత్సంకీర్తనల అకారాది సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | అంజనాతనయుఁడైన | 3.143 | 80 |
| 2. | అంజనీదేవి | 4.272 | 81 |
| 3. | అందరికి నెక్కుడైన | 4.155 | 82 |
| 4. | అందరిలోనా | 2.207 | 83 |
| 5. | అఖిల లోకైక వంద్య | 3.522 | 84 |
| 6. | అదివో నీ ప్రతాపము | 3.500 | 85 |
| 7. | అదె చూడరయ్యా | 4.509 | 86 |
| 8. | అన్నిటా నీ పెంపు | 2.249 | 87 |
| 9. | అన్నిటా నేరుపరి | 3.138 | 88 |
| 10. | అరుదీ కపీంద్రుని | 4.470 | 89 |
| 11. | అరిముఖి | 4.278 | 90 |
| 12. | అవధారు చిత్తగించు | 4.490 | 91 |
| 13. | అవధారు దేవ | 3.144 | 92 |
| 14. | ఆంజనేయ | 4.458 | 93 |
| 15. | ఆతఁడా యీతఁడు | 4.141 | 94 |
| 16. | ఇతఁడు రాముని బంటు | 2.218 | 95 |
| 17. | ఇతడే యతఁడు గాఁబోలు | 4.443 | 96 |
| 18. | ఈతని దెంత ప్రతాప | 4.493 | 97 |
| 19. | ఎంతని పొగడవచ్చు | 4.501 | 98 |
| 20. | ఎంతని పొగడవచ్చు నీతని ప్రతాపము | 4.506 | 99 |
| 21. | ఎక్కడ నెదురు లేక | 4.85 | 100 |
| 22. | ఎక్కుడు బ్రహ్మ పట్టాన | 4.158 | 101 |

| | | | |
|---|---|---|---|
| 23. | ఏమని నుతించవచ్చు | 2.350 | 102 |
| 24. | ఏలవయ్య లోకమెల్ల | 4.459 | 103 |
| 25. | ఒక్కఁడే యేకాంగ | 4.462 | 104 |
| 26. | ఓ పవనాత్మజ | 4.327 | 105 |
| 27. | కలశాపురము కాడ కందువ తోటల నీడ | 28.491 | 106 |
| 28. | కలశాపురము కాడ కందువ సేసుకొని | 4.467 | 107 |
| 29. | కలశాపురము కాడ గంధమాకుల నీడ | 3.521 | 108 |
| 30. | కలశాపురము కాడ cగాచుకున్నాఁడు | 2.216 | 109 |
| 31. | కొలిచిన వారలకు | 3.232 | 110 |
| 32. | ఘనుఁడాతఁడా | 3.302 | 111 |
| 33. | చెల్లె నీ చేఁతలు | 4.413 | 112 |
| 34. | తలఁచరో జనులు | 4.483 | 113 |
| 35. | త్రివిక్రమమూర్తియైన | 28.496 | 114 |
| 36. | నెరబిరుదిన్నిటాను | 4.67 | 115 |
| 37. | నేలమిన్ను నొక్కటైన | 1.69 | 116 |
| 38. | పంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు | 4.273 | 117 |
| 39. | పంతగాఁడు మిక్కిలి బంటతనమునను | 3.503 | 118 |
| 40. | పదియారు వన్నెల | 4.167 | 119 |
| 41. | పెరిగినాఁడు చూడరో | 4.528 | 120 |
| 42. | బిరుదు బంటితఁడు | 4.486 | 121 |
| 43. | మంగాంబుధి | 4.444 | 122 |
| 44. | మగటిమిగల | 2.250 | 123 |
| 45. | మతంగ పర్వతమాడ | 2.223 | 124 |





| | | | |
|---|---|---|---|
| 46. | మాయపు దనుజుల | 1.279 | 125 |
| 47. | మొక్కరయ్య | 3.148 | 126 |
| 48. | మొక్కరో మొక్కరో | 3.301 | 127 |
| 49. | వీఁడివో కలశాపుర | 4.525 | 128 |
| 50. | వీఁడిగో నిలుచున్నాఁడు | 3.519 | 129 |
| 51. | శరణు కపీశ్వర | 3.421 | 130 |
| 52. | శరణు శరణు | 2.347 | 131 |
| 53. | సరి లే రితనికి | 4.499 | 132 |
| 54. | సీతాశోక విఘాతక | 1.366 | 133 |


* * *

## సాళంగ నాట

అంజనా తనయుఁడైన హనుమంతుఁడు
రంజితపు మతంగ పర్వత హనుమంతుఁడు ॥పల్లవి॥

రాకాసు నెల్లాఁ గొట్టి రావణుని భంగపెట్టి
ఆకాసము మోచె నదే హనుమంతుఁడు
చేకొని యుంగర మిచ్చి సీతకు సేమము చెప్పె
భీకర ప్రతాపపు పెద్ద హనుమంతుఁడు ॥అంజ॥

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాఁడు హనుమంతుడు
స్వామి కార్యమునకే సరిఁ బేరు వద్దవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁ బెద్ద హనుమంతుడు ॥అంజ॥

ఉదయాస్త శైలముల కొక్క జంగగాఁ జాచి
అదె సూర్యుతోఁ జదివె హనుమంతుఁడు
యెదుట శ్రీవేంకటేశు కిష్టుఁడై రామజపాన
బెదవులు గదలించీ c బెద్ద హనుమంతుఁడు ॥అంజ॥

(3.143)

## మాళవి

అంజినీ దేవి కొడుకు హనుమంతుఁడు
సంజీవిని దెచ్చినాఁడు సారె హనుమంతుఁడు ॥పల్లవి॥

కలశాపురము కాడ కదలీ వనాల నీఁడ
అలనాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండల కోనలందలి గుహలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు ॥అంజి॥



పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురల నెల్ల గొట్టీ హనుమంతుఁడు
వసుధ ఁబ్రతాపించి వడిఁ దోఁక కదలించి
దెసలెల్లా c బాలించీ దివ్య హనుమంతుఁడు ॥అంజి॥

వుద్ద విడి లంక చొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవేంకటేశు కటు బంటై వరమిచ్చి
కొద్ది మీర సంతోసాలే గుప్పీ హనుమంతుఁడు ॥అంజి॥

(4-272)

## మాళవి

అందరికి నెక్కుడైన హనుమంతుఁడు
అందుకొనె సూర్యు ఫలమని హనుమంతుఁడు ॥పల్లవి॥

బల్లిదుఁడై లంక చొచ్చి బలురాకాసుల గొట్టి
హల్ల కల్లోలము చేసె హనుమంతుఁడు
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీత కిచ్చె
అల్లదె నిలుచున్నాఁడు హనుమంతుఁడు ॥అంద॥

దాకొని యాకె ముందర తన గుఱుతెరుగించి
ఆకార మటు చూపె హనుమంతుఁడు
చేకొని శిరోమణి చేతఁబట్టి జలనిధి
ఆకసాన దాఁటి వచ్చె హనుమంతుఁడు ॥అంద॥

కొంక కిట్టె సంజీవి కొండ దెచ్చె రిపులకు
నంక కాఁడై నిలిచెను హనుమంతుడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాఁడు
అంకెఁ గలశాపుర హనుమంతుఁడు ॥అంద॥

(4-155)

## నాట

అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు
కందువ మతంగగిరికాడి హనుమంతుఁడు ॥పల్లవి॥

కనకకుండలాలతో కౌపీనము తోడ
జనియించినాఁడు యీ హనుమంతుఁడు
ఘన ప్రతాపము తోడ కఠిన హస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్ద హనుమంతుఁడు ॥అంద॥

తివిరి జలధి దాఁటి దీపించి లంక యెల్లా
అవల యివల సేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుఁడు ॥అందం॥

తిరమైన మహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసుల c గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశు బంటై సేవింపుచు
వరము లిచ్చీ c బొడవాటి హనుమంతుఁడు ॥అంద॥

(2-207)

## రామక్రియ

అఖిల లోకైక వంద్య హనుమంతుఁడా సీత
శిఖామణి రామునికి cజేకొని తెచ్చితివి ॥పల్లవి॥

అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజ దూతవైతి గురుహనుమంతుఁడ
గంభీర ప్రతాపమున cగడcగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి ॥అఖిల॥



అంజనీ దేవికుమార హనుమంతుఁడ
కంజాప్త ఫలహస్త ఘన హనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకుల రక్షకుఁడ వైతివి ॥అఖిల॥

అట లంక సాధించిన హనుమంతుఁడ
చటుల సత్వ సమేత జయహనుమంతుఁడ
ఘటన నలమేల్మంగ కాంతు శ్రీవేంకటేశునకు
దటుకున బంటవై ధరణి నిల్పితివి ॥అఖిల॥

(3-522)

## సాళంగనాట

అదివో నీ ప్రతాపము హనుమంతా
యెదురు లేదు నీకు నెక్కడా హనుమంతా ॥పల్లవి॥

యెత్తిన నీ కుడిహస్త మిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీ యెడమ చేతి పిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా ॥అదివో॥

నలియఁc దొక్కిన నీ వున్నతపుc బాదము కింద
నలమటించే రరులు హనుమంతా
చలవట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలు దానవులు భంగపడిరి హనుమంతా ॥అదివో॥

వడి నీవు మీఁదికి వాల మల్లార్చిన
అడcగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవేంకటేశు పంపున నీవు గెల్వcగ
బెడిదమై పొగడేరు పెద్ద హనుమంతా ॥అదివో॥

(3-500)

### బౌళి

అదె చూడరయ్యా పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా ॥పల్లవి॥

వుదయాస్త శైలములు వొక జంగగాc జాcచె
అదివో ధ్రువ మండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతని మహిమేమని చెప్పేమయ్యా ॥అదె॥

దండిగా బ్రహ్మాండము దాcకc దోcక మీcది కెత్తె
మెండగు దిక్కులు నిండ మేను వెంచెను
గుండు గూడ రాకాసుల cగొట్టcగc జేతులు చాcచె
అండనీతని ప్రతాప మరుదరుదయ్యా ॥అదె॥

దిక్కులు పిక్కటిలcగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకు cబ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయ
మిక్కిలి నీతని లావు మేలు మేలయ్యా ॥అదె॥

(4-509)

### సాళంగ నాట

అన్నిటా నీ పెంపు వింత హనుమంత నీ
వున్నచోటు నిశ్చింతమో హనుమంతా ॥పల్లవి॥

రాముని సేనలc గాచి రావణుగర్వ మడcచి
ఆముకొన్న బలవంత హనుమంతా
గోమున జలధి దాcటి కొండతో సంజీవి దెచ్చి
ధీమంతుcడవైతి వింత దివ్యహనుమంత ॥అన్ని॥



చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోcచె
అక్కజపు నీ రూపంత హనుమంత
చొక్కమై మీరుండcగాను సుగ్రీవాదుల కెల్లా
అక్కడ లే దించుకంతా హనుమంతా ॥అన్ని॥

జంగ చాcచి చేయెత్తి సరిc బిడికిలించుక
అంగము నిక్కించితెంత హనుమంత
రంగగు శ్రీవేంకటాద్రి రాముని దేవి కిచ్చితి
వంగు లియ్యక మొక్కంత హనుమంతా ॥అన్ని॥

(2-249)

### రామక్రియ

అన్నిటా నేరుపరి హనుమంతుcడు
పిన్నివాc డే రవి నంటె పెద్ద హనుమంతుcడు ॥పల్లవి॥

ముట్టిన ప్రతాపపు రాముని సేనలలోన
అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుcడు
చుట్టిరా నుండినయట్టి సుగ్రీవ ప్రధానులలో
గట్టియైన లావరి చొక్కపు హనుమంతుcడు ॥అన్ని॥

వదలక కూడినట్టు వనచర బలములో
నదె యేకాంగ వీరుcడు హనుమంతుcడు
చెదరక కుంభకర్ణు చేతిశూల మందరిలో
సదరాన విరిచె భీషణ హనుమంతుcడు ॥అన్ని॥

త్రిజగములలోపల దేవతాసంఘములోన
అజునిపట్టాన నిల్చె హనుమంతుcడు
విజయనగరాన శ్రీవేంకటేశు సేవకుcడై
భుజబలుcడై యున్నాcడిప్పుడు హనుమంతుcడు ॥అని॥

(3-138)

## మాళవి

అరుదీ కపీంద్రుని యధిక ప్రతాపము
సురలకు నరుల కీ సుద్దు లెందుఁ గలవా ॥పల్లవి॥

వుదయాచలము మీఁది నొక్క జంగ చాఁచుకొని
వుదుటున నపరాద్రి నొక్క జంగ చాఁచుకొని
తుద సూర్యమండలముతోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివెఁ బెద్ద హనుమంతుఁడు ॥అరుదీ॥

వొక్క మొలగంట చంద్రుఁడొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్లఁ బెరిగెను పెద్ద హనుమంతుడు ॥అరుదీ॥

పిడికిలించిన చేత బిరుదుల పండ్ల గొల
తడయక కుడిచేత దశదిక్కుల
జడియక శ్రీవేంకటేశ్వరుని మన్నన బంటు
బెడిదపు మహిమల పెద్దహనుమంతుఁడు ॥అరుదీ॥

(4-470)

## గౌళ

అటిమిటి హనుమంతుఁ డట్టి బంటు
వెఱపులేని రఘువీరునికి బంటు ॥పల్లవి॥

యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమి గలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యే పొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుక వుండేటి వెరవరే బంటు ॥అటి॥



తన మనోవంచన లెంతటా లేనివాఁడే బంటు
ధనము పట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురు మాటాడని వాఁడే బంటు
అనిమొనఁ దిరుగని యతఁడే బంటు ॥అటి॥

చెప్పినట్లనే నడచిన యాతఁడే బంటు
తప్పులేక హితుఁడైన నాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహి గాని హితుఁడే బంటు ॥అటి॥

(4-278)

## మాళవి గౌళ

అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె
భువిలోనఁ గలశాపుర హనుమంతుఁడు ॥పల్లవి॥

రామ నీ సేవకుఁడిదె రణరంగధీరుఁడు
ఆముకొన్న సత్వగల హనుమంతుఁడు
దీమపాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామితఫలదుఁడు యీ ఘన హనుమంతుఁడు ॥అవ॥

జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుఁడు
పూని చుక్కలెల్లా మొలపూసలుఁ గాఁగఁ బెరిగి
భానుకోటి కాంతితోఁ జొప్పడు హనుమంతుఁడు ॥అవ॥

యినవంశ శ్రీవేంకటేశ నీ కరుణతోడ
అనుపమజయశాలి హనుమంతుఁడు
పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ
యనుమతిఁ గాచుకున్నా డదె హనుమంతుఁడు ॥అవ॥

(4-490)

## సాళంగ నాట

అవధారు దేవ హరికుల రామ
వివిధమై నీ బంటు వెలయుచున్నాఁడు ॥పల్లవి॥

అదె కలశాపురము హనుమంతరాయఁడు
కదనములోన రక్కసులఁ గొట్టి
యెదుట నిందరిలోన నేకాంగ వీరుఁడై
కొదలేక ప్రతాపించి కొలువై వున్నాఁడు ॥అవ॥

చల్లని వనాల నీడ సాగుడుఁ గొండలోన
వల్లెగా వేసుకొన్న వాలముతోడ
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని
కొల్లున మంటపములోఁ గొలువై వున్నాఁడు ॥అవ॥

పెక్కు పండ్ల గొలలు పిడికిట ఁబట్టుకొని
చక్కఁగా బెరిగి పెద్ద జంగ చాఁచి
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైన సర్వేశ
గుక్కక నీపై భక్తి ఁగొలువై వున్నాఁడు ॥అవ॥

(3-144)

## రామక్రియ

ఆంజనేయ యనిలజ హనుమంత నీ
రంజకపు ఁజేఁతలు సురల కెంచ వసమా ॥పల్లవి॥

తేరిమీఁద నీ రూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు
కౌరవుల గెలిచె సంగర భూమిని
సారెకు భీముఁడు పురుషామృగము ఁదెచ్చుచోట
నీ రోమములు గావా నిఖిల కారణము ॥ఆంజ॥



నీ మూలమునఁ గాదె నెలవై సుగ్రీవుఁడు
రాముని ఁగొలిచి కపిరాజాయను
రాముఁడు నీ వంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను ॥ఆంజ॥

బలుదైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁ గలిగితిగా
అల శ్రీవేంకటపతి యండనే మంగాంబుధి
నిలయపు హనుమంత నెగడితిగా ॥ఆంజ॥

(4-458)

## శంకరాభరణం

అతఁడా యీతఁడు పెద్ద హనుమంతుఁడు
చేతులారా నక్షుని ఁజెండివేసినాఁడట ॥పల్లవి॥

తొలుత రాముని గాంచి తోడనే సుగ్రీవుని
కొలువ ఁ బెట్టి యాతని కొమ్మ నిప్పించి
జలనిధి దాఁటి లంక సాధించి చొచ్చి సీతకు
నలర నుంగర మిచ్చె నతి సాహసమున ॥ఆత॥

సీతాదేవి యానవాలు శ్రీరామునికి నిచ్చి
నీతి విభీషణుని మన్నించఁ జేసి
చేతులనే పోట్లాడి చెండివేసి రాక్షసుల
ఘాతల సంజీవి కొండ గక్కనఁ దాఁ దెచ్చెను ॥ఆత॥

గక్కన రావణుఁ గొట్టి కాంతను రాముని ఁగూర్చి
అక్కడ నయోధ్యఁ బట్ట మటు గట్టి
నిక్కి కలశాపురిని నిండి శ్రీవేంకటాద్రిని
వుక్కుమీరి హరిఁ గొల్చి వున్నాఁడు వేడుకల ॥ఆత॥

(4.141)

## మాళవి

ఇతఁడు రాముని బంటు యితని కెవ్వ రెదురు
చతురత మెరసె నిచ్చట హనుమంతుఁడు ॥పల్లవి॥

ఆకాస మంతయు నిండి యవ్వలికి ఁదో ఁక చాఁచి
పైకొని పాతాళాన ఁబాదాలు మోపి
కైకొని దశదిక్కులు కరముల ఁగబళించి
సాకారము చూపినాఁ డిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁడు॥

కొంచక సురలు రోమకూపముల విహరించ
ముంచి ధ్రువమండలము మొగమై యుండ
యెంచఁగ లోకము లెల్లా యెడనెడ సందులుగా
చంచు మెరసినాఁడిచ్చట హనుమంతుఁడు ॥ఇతఁడు॥

గరిమ రవిచంద్రులు కర్ణకుండలములుగా
ధరణి మేరువు కటితటముగాఁగా
ఇరవుగ శ్రీవేంకటేశుని సేవకుఁడై
బెరసె నిచ్చట నిదె పెద్ద హనుమంతుఁడు ॥ఇతడు॥

(2-218)

## మాళవిగౌళ

ఇతఁడే యతఁడు గాఁబో వేలిక బంటునునైరి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు

జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరికే దాఁటె హనుమంతుడు
అలుకతో రావణుని యదటణచె నతఁడు
తలఁచి మైరావణుని దండించె నితఁడు



కొండపెల్లగించెఁ దొల్లి గోవర్ధనుఁడతఁడు
కొండతో సంజీవి యెత్తె ఁగోరి యీతఁడు
గుండు గరచె నహల్య కొరకు సీతాపతి
గుండు గరఁగఁగ ఁబాడె కోరి యీతఁడు

అంజనాచలము మీఁద నతఁడు శ్రీవేంకటేశుఁ
డంజనీ తనయుఁడాయ ననిలజుఁడు
కంజాప్త కుల రామఘనుఁడు దానును దయా
పుంజమాయ మంగాంబుధి హనుమంతుఁడు

(4-443)

## సాళంగ నాట

ఈతని దెంత ప్రతాప మీతని దెంత వుదుటు
యీతఁడు రాముని బంటు యీతని సేవించరో ॥పల్లవి॥

వుదయాస్త నగముల కొక జంగ చాఁచినాఁడు
చదివె రవితో సర్వశాస్త్రములు
తుదబ్రహ్మాండము మోవ ఁదోఁక మీఁది కెత్తినాఁడు
పెదపెద కోరల పెనుహనుమంతుఁడు ॥ఈతని॥

కుడిచేత దనుజులఁ గొట్ట నూఁకించి నాఁడు
యెడమ చేఁ బండ్ల గొల పిడికిలించె
వుడు మండలము మోవ నున్నతి ఁబెరిగినాఁడు
బెడిదపు మేనితోడ ఁబెను హనుమంతుఁడు ॥ఈతని॥

పుట్టుఁ గవచకుండలంబుల తోడ నున్నవాఁడు
గట్టి బ్రహ్మపట్టానకు ఁగాచుకున్నాఁడు
ఇట్టే శ్రీవేంకటేశు నెదుట ఁబనులు సేసీ
బెట్టిదపు సంతోసానఁ బెను హనుమంతుఁడు ॥ఈతని॥

(4-493)

## మాళవి గౌళ

ఎంతని పొగడ వచ్చు నీతని సేవింపరో
పొంతనిదే కలశాపుర హనుమంతుఁడు ॥పల్లవి॥

పిడికిట cబట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులc గొట్టినది వలకేలు
పొడచూపీ cగలశాపుర హనుమంతుఁడు ॥ఎంతని॥

సందడి సమరానకు చాcచినది పెనుజంగ
అందముగ నిక్కించిన దదే వురము
కుందక వీరరసమే కురిసేటిది మొగము
పొందగువాఁడు కలశాపుర హనుమంతుఁడు ॥ఎంతని॥

వుదటున మెలcగేని వొద్దికైన పాదాలు
త్రిదశుల మెప్పించేది దివ్యరూపము
అదె శ్రీవేంకటేశు బంటయి నిలుచున్నాఁడు
వొదలుచుc గళశాపుర హనుమంతుఁడు ॥ఎంతని॥

(4-506)

## బౌళి

ఎంతని పొగడ వచ్చు నితని ప్రతాపము
పంతము లెల్లా మెరసి ప్రతాపించీ వాఁడే ॥పల్లవి॥

చేతులనే పెరికి సంజీవి కొండ దెచ్చినాఁడు
ఆతఁడు వో తొల్లి పెద్ద హనుమంతుఁడు
ఘాతలcదా నొక్కఁడే లంక సాధించి వార్ధి దాఁటి
యీతలికి వచ్చినాఁడు ఇదివో వాఁడే ॥ఎంతని॥



ముదమున బ్రహ్మలోకము దాcకాc బెరిగినాఁడు
అదివో ఇప్పుడు పెద్ద హనుమంతుఁడు
వదలక తోcక చక్రవాళ పర్వతము వెంటా
వుదుటున cజుట్టు కొని వున్నాఁడు వాఁడే ॥ఎంతని॥

మెల్లనే జంగ చాcచి మెడ నిక్కించుకొన్నాఁడు
అల్లదివో మించే పెద్ద హనుమంతుఁడు
వెల్లవిరైనాఁడు శ్రీవేంకటేశ్వరుని బంటై
చల్లcగా లోకము లేలీ సంతతము వాఁడే ॥ఎంతని॥

(4-501)

## సాళంగనాట

ఎక్కడ నెదురులేక యీరేడు లోకములందు
వొక్కడే నిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు ॥పల్లవి॥

పెట్టిన జంగ దండ పిడికిటి మొలచేయి
అట్టె వలచే యెత్తిన యాయితము
తొట్టిన పెం జెమటలు తోడనె బుసకొట్టులు
వుట్టిపడీc జూడరమ్మ వుగ్రహనుమంతుఁడు ॥ఎక్కడ॥

నిక్కిన కర్ణములు నింగి మోcచిన బొమ్మలు
చక్క శిరసుపై cబార cజాచిన తోcక
చుక్కలు మొలపూసలు సూదుల వాఁడి రోమాలు
వుక్కు మీరె cజూడరమ్మ వుగ్రహనుమంతుఁడు ॥ఎక్కడ॥

పుట్టుc గౌపీనము మహాద్భుత యజ్ఞోపవీతము
గుట్టు చూపని కనక కుండలములు
పట్టపు శ్రీవేంకటేశు బంటయి ప్రతాప మెల్ల
వొట్టీ విజనగరపు వుగ్రహనుమంతుఁడు ॥ఎక్కడ॥

(4-85)

## నాట

ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్న వాఁడు
పిక్కటిల్లి సంతోసాన (బెద్ద హనుమంతుఁడు ॥పల్లవి॥

తూరుపు (బడుమరాను దొడ్డగా జంగ చాఁచి
సారెకు నర్కుని వద్దఁ జదివీ వాఁడే
ధీరతతోఁ దన మేను దిక్కులెల్లాఁ బిక్కటిల్ల
బీరము చూపీ వాఁడె పెద్ద హనుమంతుఁడు ॥ఎక్కుడు॥

మిన్ను నేల నేకముగా మించిన వాల మెత్తి
సన్నుతిగా వలకేలు చాఁచిన వాఁడు
పన్నుగడై రాఘవుని బంట్ల లోపల నెల్లా
పెన్నిధియై యున్నవాఁడు పెద్ద హనుమంతుఁడు ॥ఎక్కుడు॥

మరిగి రేయుఁ బగలు మతంగ పర్వతమాడ
బిరుదుల తోడను బెరసీ వాఁడే
యిరవై శ్రీవేంకటేశు హితుఁడై యెప్పుడుఁ బెచ్చు
పెరుగుచునున్నవాఁడు పెద్ద హనుమంతుఁడు ॥ఎక్కుడు॥
(4-158)

## ప్రతాపనాట

ఏమని నుతించవచ్చు నితని రూపము
భీమ విక్రము (డితఁడు పెద్ద హనుమంతుఁడు ॥పల్లవి॥

వొక్క జంగ చాఁచినాఁడు వొగిఁదూర్పు (బడమర
తక్కక భుజాలుబ్బించె దక్షిణోత్తరాలు నిండ
మిక్కిలి బ్రహ్మలోకము మీదను శిరసెత్తెను
పిక్కటిల్లు మహిమతో (బెద్ద హనుమంతుఁడు ॥ఏమని॥



వేడుక వాల మాకాశ వీధితో (బెనచినాఁడు
యేడు జలధులు చేసె నదే మోకాళ్ల బంటి
వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁ జేసినాఁడు పెద్ద హనుమంతుఁడు ॥ఏమని॥

జళిపించి వలకేలు సకలము మెచ్చ నెత్తె
కులగిరులు తన తొడల సందినే యడఁచె
బలువుఁడు శ్రీవేంకటపతిబంటు మతంగాద్రి
బిలమువాత నున్నాఁడు పెద్దహనుమంతుఁడు ॥ఏమై॥
(2-350)

## శంకరాభరణం

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష ॥పల్లవి॥

మొదల నింద్రుఁడు నీ మోమున కెల్లా రక్ష
యిదె నీ శిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదరని నీ మేనికెల్ల శ్రీరామరక్ష ॥ఏలవయ్య॥

పిరుఁదు కాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడఁడు నీ కరయుగముల రక్ష
గరిమ నీ కుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీరామరక్ష ॥ఏలవయ్య॥

వడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష ॥ఏలవయ్య॥

నలువ నీ గళరక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీ సంధులకు హరుఁడు రక్ష
పలు నీ రోమములకు బహుదేవతలు రక్ష
చెలఁగు నీ చేఁతలకు శ్రీరామరక్ష ॥ఏలవయ్య॥

అంగపు నీ తేజమున కగ్నిదేవుఁడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీసతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష ॥ఏలవయ్య॥
(4-459)

## పాడి

ఒక్కఁడే యేకాంగ వీరు ఁడుర్వికి దైవమైనాఁడు
యెక్కడా హనుమంతుని కెదురా లోకము ॥పల్లవి॥

ముందట నేలే పట్టమునకు బ్రహ్మాయినాఁడు
అందరు దైత్యులఁ జంపి హరి పేరైనాఁడు
అంది రుద్రవీర్యము దానై హరుఁడైనాఁడు
యెందు నీ హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కఁడే॥

చుక్కలు మోవఁ బెరిగి సూర్యుఁడు దానైనాఁడు
చిక్కఁ బాతాళము దూరి శేషుఁడైనాఁడు
గక్కన వాయుజుఁడై జగత్ప్రాణుఁ డైనాఁడు
యెక్కువ హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కఁడే॥

జలధిఁ బుటమెగసి చంద్రుఁడు దానైనాఁడు
చెలఁగి మేరుపు పొంత సింహమైనాఁడు
బలిమి శ్రీవేంకటేశు బంటై మంగాంబుధి
నిల యీ హనుమంతుని కెదురా లోకము ॥ఒక్కఁడే॥
(4-462)



## శ్రీరాగం

ఓ పవనాత్మజ వో ఘనుఁడ
బాపు బాపనఁగఁ బరగితిగా ॥పల్లవి॥

వో హనుమంతుఁడ వుదయాచల ని
ర్వాహక నిజసర్వ ప్రబల
దేహము మోఁచిన తెగువకు నిటువలె
సాహస మిటువలె ఁజూటితిగా ॥ఓపవనాత్మజ॥

వో రవిగ్రహణ వో దనుజాంతక
మారు లేక మతి మలసితిగా
దారుణపు వినతా తనయాదులు
గారవింప నిటు గలిగితిగా ॥ఓపవనాత్మజ॥

వో దశముఖహర వో వెంకటపతి
పాద సరోరుహ పాలకుఁడా
యీ దేహముతో నిన్ని లోకములు
నీ దేహమెక్క నిలిచితిగా ॥ఓపవనాత్మజ॥
(4-327)

## రామక్రియ

కలశాపురముకాడ కందువ తోటలనీడ
వెలయుచు నున్నవాఁడు వీఁడె హనుమంతుఁడు ॥పల్లవి॥

తాటించి పండ్లగొల దాపరి చేతఁ బట్టక
వాటమై దైత్యుల ఁగొట్ట వలచె యెత్తి
గాఁటాన శిరసుపైకి గక్కనఁ దోఁక నిక్కించి
మేటియై నిలుచున్నాఁడు మించి హనుమంతుఁడు ॥కలశా॥

బాల సూర్యబింబమును పండుగాను భావించి
చాలుకొని cబాదముల జంగ చాcచి
కోలు ముందుగా సత్వ గూడ నురముబ్బించి
నేలా మిన్నూ మోcచినాcడు నిండి హనుమంతుcడు ॥కలశా॥

ముంచిన ప్రతాపమున మొగమున బిగించుకొని
అంచెల నన్నిటాను జయమునc బొంది
యెంచcగ శ్రీవేంకటేశు కితవరి దాసుcడై
మంచి వరము లిచ్చీని మాకు హనుమంతుcడు ॥కలశా॥
(28-491)

## సామంతం

కలశాపురము కాడ కందువ సేసుకొని
అలరుచు నున్నవాcడు హనుమంతరాయcడు ॥పల్లవి॥

సహజాన నొక జంగ చాcచి సముద్రము దాcటె
మహిమ మీరcగ హనుమంతరాయcడు
యిహమున రాముబంటై యిప్పుడూ నున్నవాcడు
అహరహమును దొడ్డ హనుమంతరాయcడు ॥కలశా॥

నిండు నిధానపు లంక నిమిషాన నీరు సేసె
మండిత మూరితి హనుమంతరాయcడు
దండితో మగిడి వచ్చి తగ సీత శిరోమణి
అండ రఘుపతి కిచ్చె హనుమంతరాయcడు ॥కలశా॥

వదలని ప్రతాపాన వాయుదేవుసుతుcడై
మదియించినాcడు హనుమంతరాయcడు
చెదరక యే పొద్దు శ్రీవేంకటేశు వాకిట
నదివో కాచుకున్నాcడు హనుమంతరాయcడు ॥కలశా॥
(4.467)



## పాడి

కలశాపురము కాడ గంధమాకులనీడ
నలరేవు మేలు మేలు హనుమంతరాయ ॥పల్లవి॥

సంజీవి కొండ దెచ్చి సౌమిత్రి బ్రతికించితి
భంజించితి వసురుల బలివిడిని
కంజాప్తకుల రాఘవుని మెప్పించితివి
అంజనీ తనయ వో హనుమంతరాయ ॥కలశా॥

లంక సాధించితివి నీ లావు లెల్లాc జూపితివి
కొంకక రాముని సీతc గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిcబ్రధాని వైతివి
అంకెలెల్లాc నీకుc జెల్లె హనుమంతరాయ ॥కలశా॥

దిక్కుల గెలిచితివి ధీరతc బూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటవైతివి
అక్కజపు మహిమల హనుమంతరాయ ॥కలశా॥
(3-521)

## మాళవి

కలశాపురముకాడ cగాచుకున్నాcడు
వలసిన వరాలిచ్చీ వాయునందనుcడు ॥పల్లవి॥

మాయ బిలము చొచ్చి మగుడి యంబుధిలోని
చాయాగ్రహము cజంపి చయ్యన దాcటి
ఆ యెడ లంకిణిc గొట్టి యంతలో జానకిcగని
వాయువేగాన వచ్చిన వాయునందనుcడు ॥కలశా॥

కడలి దరి నుండిన కపులతో ఁగూడుకొని
వడదీరఁగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతాపరిణామ మెల్లాఁజెప్పె
వడి గలవాఁడితఁడు వాయునందనుఁడు ॥కలశా॥

రావణాది రాక్షసుల రామునిచే సాధింపించి
ఆ విభుని సీతఁ గూర్చి అయోధ్య నుంచె
శ్రీవేంకటేశుఁ గొల్చి శిష్టరక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు ॥కలశా॥
(2.216)

## నాట

కొలిచిన వారికి ఁగొమ్మని వరము లిచ్చీ
వెలయఁ గలశాపురి వీధి హనుమంతుఁడు ॥పల్లవి॥

బెట్టుగా నొకచేత ఁజూపెడి తన ప్రతాపము
పట్టుకున్నాఁ డొకచేత ఁబండ్లగొల
మెట్టుకొన్నవి రాకాసి మెదడు తోడి తలలు
రట్టడి కలశాపుర దిట్ట హనుమంతుఁడు ॥కొలిచిన॥

చెచ్చెర వీనుల నాలించేది సురల నుతులు
కొచ్చి కొచ్చి తోఁక ఁజుట్టుకొన్నది నింగి
తచ్చి చూచేది కన్నుల దాసుల మీఁది కరుణ
రచ్చ కెక్కెఁ గలశాపురము హనుమంతుఁడు ॥కొలిచిన॥

వసుధ మతిలోనిది స్వామికార్య విశ్వాసము
వెసఁ దనపనైనది విష్ణుభక్తి
పసగా శ్రీవేంకటేశ బలు నీ బంట్లలోన
రసికుఁడు కలశాపురము హనుమంతుఁడు ॥కొలిచిన॥
(3–232)



## గుండక్రియ

ఘను ఁడాతఁడా యితఁడు కలశాపురము కాడ
హనుమంతు ఁడితఁడా అంజనా తనయుఁడు ॥పల్లవి॥

పెడచేత లోచేత బెరసి కొందరి ఁగొట్టె
అడరి దానవుల హనుమంతుడు
బెడిదంపు ఁబెను దోఁక బిరబిర ఁదిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు ॥ఘను॥

దాకాల మోఁకాల ఁదాటించె ఁగొందరి
ఆకాశవీధి నుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడఁ దాఁకె ఁగొందరి
ఆకడ జలధిలోను హనుమంతుఁడు ॥ఘను॥

అరుపుల నూరుపుల నందరిఁ బారఁగఁ దోలె
ఔరా సంజీవి కొండ హనుమంతుఁడు
మేరతో శ్రీవేంకటాద్రి మీఁది దేవుని బంటు
ఆరి తేరిన బిరుదు హనుమంతుఁడు ॥ఘను॥
(3–302)

## సామంతం

చెల్లె నీ చేఁతలు నీకే చేరి మేడెగుడి దిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతరాయ ॥పల్లవి॥

జంగ చాఁచి నట్టి నీ సంగడి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁ జేర్చిన చేయి
అంగమాయ నీ సొబగు హనుమంతరాయ ॥చెల్లె॥

పెరిగిన వాలము పెద్దైన పిరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారు కాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీ వునికి హనుమంతరాయ ॥చెల్లె॥

స్వామి కార్యపుఁజింత జానకి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామనామజపముతో రతి శ్రీవేంకటపతి
కామేటి బంటవైతివి హనుమంతరాయ ॥చెల్లె॥

(4-413)

## గౌళ

తలఁచరో జనులు యీతని పుణ్యనామములు
సులభముననే సర్వశుభములు గలుగు ॥పల్లవి॥

హనుమంతుఁడు వాయుజుఁ డంజనా తనయుఁడు
వనధి లంఘన శీలవైభవుడు
దనుజాంతకుఁడు సంజీవశైల సాధకుఁడు
ఘనుఁడు కలశాపుర కాంతహనుమంతుఁడు ॥తలఁచరో॥

లంకాసాధకుఁడు లక్ష్మణ ప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవ సచివుఁడు
పొంకపు రాముని బంటు భూమిజ సంతోషదూత
తెంకినే కలశాపుర దేవహనుమంతుఁడు ॥తలఁచరో॥

చటులార్జునసఖుఁడు జాతరూపవర్ణుఁడు
ఇట మీఁద బ్రహ్మ పట్ట మేలేటి వాఁడు
నటన శ్రీవేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపుర ప్రాంత హనుమంతుఁడు ॥తలఁచరో॥

(4-483)



## అహిరినాట

త్రివిక్రమ మూర్తియైన దేవునివలె నున్నాఁడు
భువి సేవించే వారి పాలి పుణ్యఫల మీతఁడు ॥పల్లవి॥

అంచె నుదయాస్త గిరులందు నొక జంగ చాఁచి
వంచించక మిన్ను దాఁక వాల మెత్తి
ముంచి బ్రహ్మలోకము మోవఁగఁ బ్రతాపమున
పెంచినాఁడు తన మేను పెద్ద హనుమంతుఁడు ॥త్రివిక్రమ॥

తిరముగ హస్తములు దిక్కులు నిండఁబరపి
వరుస ఁగర్ణము లిరువంక ఁజిక్కించి
దురదుర మస్తకము ధ్రువమండలము సోఁక
పెరిగినాఁ డిదివో పెద్ద హనుమంతుఁడు ॥త్రివిక్రమ॥

అక్కజపు రోవము లన్ని లోకము లొరయ
మొక్కుచు శ్రీవేంకటేశు మోహపు బంటై
పక్కన నజాండ కప్పరము నిండాఁ దాను
పిక్కిటిల్లినాఁడిదివో పెద్దహనుమంతుఁడు ॥త్రివిక్రమ॥

(28-496)

## ముఖారి

నెర బిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగన మదివో నీ బంటు ॥పల్లవి॥

ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళ నార్చి
అంచులు మోవఁగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు ॥నెరబిరు॥

గగన లోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందుల కొండకు
నిగిడి కోయనుచు నీ బంటు ॥నెరబిరు॥

ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీ చే
నిమ్మపండైన నీ బంటు ॥నెరబిరు॥

(4-67)

## గౌళ

నేల మిన్ను నొక్కటైన నీ బంటు వొక్క
వేలనే యక్షుని ఁదెగ వేసెఁగా నీ బంటు ॥పల్లవి॥

ఉంగర మెగర వేసి యుదధిలో ఁబడకుండ
నింగికి ఁజెయి చాఁచె నీ బంటు
చంగున జలధి దాఁటి జంబుమాలి నిలమీఁద
కుంగ ఁదొక్కి పదముల ఁగుమ్మెఁగా నీ బంటు ॥నెల॥

వెట్టగా రావణు దొమ్ము విరుగ ఁజేతనే గుద్దె
నిట్ట తాడువంటి వాఁడు నీ బంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్ట పగలుగ ఁదెచ్చె బాపురే నీ బంటు ॥నేల॥

అలర నన్నియుఁ జేసి అజుని పట్టానకు
నిలుచున్నాఁడదివో నీ బంటు
బలువేంకటేశ ఈ పవన నందనుఁడు
కలిగి లోకములెల్లఁ గాచెఁగా నీ బంటు ॥నేల॥

(1-69)



## వరాళి

పంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు
రంతుకెక్కె మతంగ పర్వత పవనజుఁడు ॥పల్లవి॥

వాలాయమై యెంత భాగ్యవంతుఁడో దేవతలచే
బాలుఁడై వరములందె ఁబవనజుఁడు
పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి
యేలిక ముందర ఁబెట్టె యీ పవనజుఁడు ॥పంతగాఁడు॥

సొంటులు సోదించి తెచ్చి సుగ్రీవు రాఘవునికి
బంటుగాఁగఁ బొందు సేసెఁ బవనజుఁడు
వొంటినే రాముని ముద్ర వొసఁగి సీత ముందర
మింటి పొడవై పెరిగె మేఁటి పవనజుఁడు ॥పంతగాఁడు॥

కిట్టి శ్రీవేంకటేశ్వరు కృపచే ముందరి బ్రహ్మ
పట్ట మేల నున్నవాఁడు పవనజుఁడు
చుట్టి చుట్టి తనకు దాసులయినవారికి
గట్టి వరము లిచ్చె నీ ఘనపవనజుఁడు ॥పంతగాఁడు॥

(4-273)

## రామక్రియ

పంతగాఁడు మిక్కిలి బంటతనమునను
అంతటా ఁగలశాపుర హనుమంతరాయఁడు ॥పల్లవి॥

నీరధి చంగన దాఁటి నెట్టన లంక చొచ్చి
శ్రీరాము నుంగరము సీతకిచ్చి
మేరమీరి యక్షు ఁగొట్టి మేటి వనము వెఱికె
ఆరయఁ గలశాపుర హనుమంతరాయఁడు ॥పంతగాఁడు॥

ఘాతతో లంక గాలిచి గక్కన లంకిణి ఁజంపి
యీతలికి మిగుడ ఁదా నేతెంచి
సీతాశిరోమణి శ్రీరామునకు నిచ్చె
ఆతఁడే కలశాపుర హనుమంతరాయఁడు ॥పంతగాఁడు॥

అల రావణుని గెల్చి అయోధ్యాపురికి వచ్చి
బలురాముని సీతతో ఁబట్టము గట్టి
నిలిచె శ్రీవేంకటాద్రి నిలయుని యెదుటను
అలరె ఁగలశాపుర హనుమంత రాయఁడు ॥పంతగాఁడు॥

(3-503)

## వరాళి

పదియారు వన్నెల బంగారు కాంతులతోడ
పొదలిన కలశాపుర హనుమంతుఁడు ॥పల్లవి॥

యెడమ చేత ఁబట్టె నిదివో పండ్లగొాల
కుడిచేత రాకాసి గుంపుల గొట్టె
తొడిఁబడ నూరుపులతో ఁదూరుపు మొగమైనా ఁడు
పొడవైన కలశాపుర హనుమంతుఁడు ॥పదియారు॥

తొక్కి యక్షకుమారుని ఁదుంచి యడగాళ సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవఁ బెరిగి సుతు వద్ద వేదాలు
పుక్కిట ఁబెట్టె ఁగలశాపుర హనుమంతుఁడు ॥పదియారు॥

గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశు బంటు తానాయ
అట్టె వాయువునకును అంజని దేవికిని
పుట్టినాఁడు కలశాపుర హనుమంతుఁడు ॥పదియారు॥

(4-167)



## సాళంగనాట

పెరిగినాఁడు చూడరో పెద్ద హనుమంతుఁడు
పరగి నానావిద్యల బలవంతుఁడు ॥పల్లవి॥

రక్కసుల పాలికి రణరంగ శూరుఁడు
వెక్కసపు యేకాంగ వీరుఁడు
దిక్కులకు సంజీవి దెచ్చిన ధీరుఁడు
అక్కజమైనట్టి యాకారుఁడు ॥పెరిగి॥

లలిమీరిన యట్టి లావుల భీముఁడు
బలు కపికుల సార్వభౌముఁడు
నెలకొన్న లంకా నిర్ధూమ ధాముఁడు
తలంపున రామునాత్మా రాముఁడు ॥పెరిగి॥

దేవకార్యముల దిక్కు వరేణ్యుఁడు
భావింపఁగఁ దపః ఫల పుణ్యుఁడు
శ్రీవేంకటేశ్వరు సేవాగ్ర గణ్యుఁడు
సావధానుఁడు సర్వశరణ్యుఁడు ॥పెరిగి॥

(4-528)

## లలిత

బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుఁడు
సిరులతో రామునికి సీతాదేవికిని ॥పల్లవి॥

మూఁడులోకములు ఁదుదముట్ట ఁబెరిగిన వాఁడు
వాఁడె హనుమంత దేవర ఁజూడరో
పోఁడిమి దైత్యుల గెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపము తోడ వాయుజుఁడు ॥బిరుదు॥

ధ్రువమండలము మోవc దోcక యెత్తుకున్నవాcడు
సవరనై పెనుజంగ చాcచుకున్నాcడు
భువి cగవచకుండలంబులతో cబుట్టినవాcడు
వివరించ నేకాంగ వీరుcడైన వాcడు ॥బిరుదు॥

పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాcడు
ఘనుcడిన్నిటా స్వామి కార్య పరుcడు
వినయపు శ్రీ వేంకటవిభునికి హితవరి
యెనసి మొక్కcగదరో యెదుట నున్నాcడు ॥బిరుదు॥

(4-486)

## సామంతం

మంగాంబుధి హనుమంతుని శరణ
మంగవించితిమి హనుమంతా ॥పల్లవి॥

బాలార్క బింబము ఫలమని పట్టిన
ఆలరి చేcతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలి cజేకొనిన వో హనుమంతా ॥మంగా॥

జలధి దాcట నీ సత్వము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమి cబెరిగితివి భళీ హనుమంతా ॥మంగా॥

పాతాళము లోపలి మైరావణు
నాతల cజంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి
నీతల cగొలిచే హిత హనుమంతా ॥మంగా॥

(4-444)



## రామక్రియ

మగటిమి గల హనుమంతరాయ
దిగువ పట్టణములోని దేవ హనుమంత ॥పల్లవి॥

చక్కcగా దోcక చాcచి జంగవెట్టి చేచాcచి
అక్కజపు ప్రతాపపు హనుమంతుcడా
రక్కసులc దునుమాడి రాముని దేవులకు
దిక్కై వుంగర మిచ్చిన దేవ హనుమంత ॥మగటిమి॥

కీలు గంటు వేసుకొని కెరలి పిడికిలించి
ఆలకించేవు దిక్కులు హనుమంతుcడా
నెలకు మింటికి మేను నిండc బెరిగి యక్షుని
తీలువడc గొట్టినట్టి దేవ హనుమంతుcడా ॥మగటిమి॥

తమితోడ దాసులను తప్పక కాచేనని
అమర నభయ మిచ్చిన హనుమంతుcడా
జమళి శ్రీవేంకటేశు సరస వూడిగానకు
తిమురుచు నుండే యట్టి దేవ హనుమంతా ॥మగటిమి॥

(2-250)

## శంకరాభరణం

మతంగ పర్వతమాడ మాల్యవంతము నీడ
అతిశయిల్లిన పెద్ద హనుమంతుcడితcడా ॥పల్లవి॥

యీతcడా రాముని బంటు యీతcడా వాయుసుతుcడు
ఆతత బలాఢ్యుc డందు రాత cడితcడా
సీతను వెదకి వచ్చి చెప్పిన యాతcడితcడా
ఘాతల లంకలోని రాక్షసవైరి యితcడా ॥మతంగ॥

అంజనాసుతుఁడితఁడా అక్షమర్దనుఁడితఁడా
సంజీవని కొండ దెచ్చె సారె నితఁడా
భంజించెఁ గాలనేమిని పంతమున నితఁడా
రంజిత ప్రతాప కపిరాజసఖుఁ డితఁడా ॥మతంగ॥

చిరజీవి యితఁడా జితేంద్రియుఁ డితఁడా
సురల కుపకారపు చుట్ట మీతఁడా
నిరతి శ్రీవేంకటాద్రిని విజనగరములో
నరిది వరములిచ్చీ నందరికి నితఁడా ॥మతంగ॥
(2-223)

## సామంతం

మాయపు దనుజుల మదవైరి కపి
రాయఁడు వీఁడివో రాముని బంటు ॥పల్లవి॥

పెట్టినజంగయు పెంపు మిగుల మొలఁ
గట్టిన కాసెయు గర్వమున
నిట్టనిలచి పూనిన చేత నడిమి
దిట్ట వీఁడువో దేవునిబంటు ॥మాయపు॥

నవ్వుచు లంకానగరపు దనుజుల
కొవ్వణిచిన కపికుంజరుఁడు
ముప్వురు వేల్పుల మోదవిభూతియగు
రవ్వగు సీతారమణుని బంటు ॥మాయపు॥

పంకజ సంభవు పట్టము గట్టను
వుంకించిన తనవొయనిచే
పొంకపు కలశాపుర హనుమంతుడు
వేంకట రమణుని వేడుక బంటు ॥మాయపు॥
(1-279)



## రామక్రియ

మొక్కరయ్య అన్నిటికి మూల మీతఁడు
చుక్కలు మొలపూసలై సొంపుమీరీ నితఁడు ॥పల్లవి॥

అదె కలశాపుర హనుమంతుఁడు
వుదయార్కు ఫలమని వొగ్గుచున్నాఁడు
వుదటు బాలక్రీడ నుబ్బుచున్నాఁడు
మదించి రాముని బంటై మలయుచున్నాఁడు ॥మొక్కరయ్య॥

జలనిధి కొక జంగ చాఁచుకున్నాఁడు
యిల ఁబ్రతాపమున ఁజేయెత్తుకున్నాఁడు
బలువాల మల్లార్చి పట్టుకున్నాఁడు
వెలయఁగఁ గీలుగంటు వేసుకున్నాఁడు ॥మొక్కరయ్య॥

సరుగ లంకారాజ్యము సాధించినాఁడు
అరిది సీతకు సేమ మందించి నాఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నిలయునికి
పరగిన సేవలను ఁబ్రబలుచున్నాఁడు ॥మొక్కరయ్య॥
(3-148)

## సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు ॥పల్లవి॥

పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుఁడు
పట్టెను యెడమ చేతి బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాశితలలు
కొట్టె ననుచు నెత్తె గొప్ప వలకేలు ॥మొక్కరో॥

వంచెను శిరసు మీఁద వాలుగా ఁదన తోఁక
పెంచెను మిన్నులు మోవ పెను దేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటి దవడల
కాంచనపు పుట్టుకాశ కడు బిగిఇంచెను ॥మొక్కరో॥

పెనచి తొడలు దాఁక పెద్ద పదకము వేసె
తనువుపై వేలాడే దండలతోడ
అనయము శ్రీవేంకటాద్రి దేవుని బంటు
పెనుబలమై యున్నాఁడు విట్ఠలము లోనను ॥మొక్కరో॥
(3-301)

## బౌళి రామక్రియ

వీఁడివో కలశాపుర వీరహనుమంతుఁడు
వాఁడిమి మెరసినట్టి వజ్రపాణి యితఁడు ॥పల్లవి॥

చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తలకొన్న రాముని ప్రతాపపు వాఁడు
యెలమి సీత కుంగర మిచ్చి మెప్పించిన వాఁడు
కలగుండు వడ లంక ఁగాలిచినవాఁడు ॥వీఁడివో॥

మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయము వాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రములు చదివిన వాఁడు
పగటున మీఁది బ్రహ్మ పట్ట మేలే వాఁడు ॥వీఁడివో॥

యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైన వాఁడు
చెప్ప ఁగొత్తైన మహిమ ఁజెన్నొందు వాఁడు
ముప్పిరి శ్రీవేంకటేశు మూలబలమైనవాఁడు
వొప్పగు వరా లిందరి కొసగేటి వాఁడు ॥వీఁడివో॥
(4-525)



## బౌళి

వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
వేఁడు కొన్న ప్రతాపాన ఁబెద్ద హనుమంతుఁడు ॥పల్లవి॥

ఇదె పుట్టు ఁగౌపీనము హేమకుండలములతో
నుదయించి నా ఁడిత ఁదుర్వి మీఁదను
పదరి బాలార్కుని పండనుచు ఁబట్టినాఁడు
వదలక దేవతల వరమందినాఁడు ॥వీఁడిగో॥

నులిచి తా వాలము మిన్నుల మోవఁజూఁచినాఁడు
జలధి దాఁటఁగ జంగ చాఁచినాఁడు
ఇల నసురుల మీఁద వలచెయ్యెత్తిన వాఁడు
నిలువెల్ల సాహసమై నిండుకొనున్నాఁడు ॥వీఁడిగో॥

పెక్కు పండ్ల గొలలు పిడికిలించిన వాఁడు
మిక్కిలి లంక సాధించి మించిన వాఁడు
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటైన వాఁడు
తక్కక లోకములెల్లా దయఁగాచే వాఁడు ॥వీఁడిగో॥
(3-519)

## శంకరాభరణం

శరణు కపీశ్వర శరణం బనిలజ
పరవి నెంచ నీసరి యిఁక నేరీ ॥పల్లవి॥

పుట్టిన నాఁడే భువనము లెరఁగఁగ
పట్టితి సూర్యుని ఁబండనుచు
ముట్టిన చుక్కలు మోవఁగఁ బెరిగితి
లిట్టి ప్రతాపివి యెదురేదయ్యా ॥శరణు॥

అంపిన యప్పుడె యంబుధి దాcటితి
నింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపును cబేర్కొన వశమా ॥శరణు॥

చెదరక నేcడే శ్రీవేంకటగిరిc
గదిసి రాము కృప గైకొంటి
వదలక నీ కృపవాcడనైతి నిదె
యెదుటనె కాచితి విcక cగడమేమీ ॥శరణు॥

(3-421)

## సాళంగనాట

శరణు శరణు వేదశాస్త్ర నిపుణ నీకు
అరుదైన రామకార్య ధురంధరా ॥పల్లవి॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమ లంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపుర నివాస ॥శరణు॥

రవి తనయ సచివ రావణవనాపహార
పవన వేగ బలాఢ్య భక్త సులభ
భువన పూర్ణ దేహా బుద్ధివిశారద
జవసత్వ వేగ కలశాపుర నివాస ॥శరణు॥

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవేంకటేశు కరుణా సమేత
శాంతకుంభవర్ణ కలశాపురనివాస ॥శరణు॥

(2-347)



## నాట

సరిలే రితనికి సాహస విక్రముc డీతc
దరయ కలశాపుర హనుమంతుcడు ॥పల్లవి॥

వుదధి లంఘించినాcడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్టనడుమ cబూజ గొన్నాcడు
సదరాననే లంక సాధించి వచ్చినాcడు
అదివో కలశాపుర హనుమంతుcడు ॥సరిలే॥

సంజీవి దెచ్చినాcడు సమరరంగమందు
భంజించి వానరుల బదికించినాcడు
అంజనీదేవికి cగొడుకైనాcడు యే పనుల
నంజcడు కలశాపుర హనుమంతుcడు ॥సరిలే॥

బలు రాకాసులనెల్లా పట్టి చదిపినవాcడు
ఇల రామునికి cగడు హితుcడైనాcడు
చెలcగి శ్రీవేంకటేశు సేవ సేయుచున్నవాcడు
అలరి కలశాపుర హనుమంతుcడు ॥సరిలే॥

(4-499)

## దేశాక్షి

సీతా శోక విఘాతక వో
పాతాళ లంకాపతి విభాళా ॥పల్లవి॥

హనుమంతరాయ అంజనీతనయ వో
వనధి లంఘన గాత్ర వాయుపుత్రా
యినకులాధిప నిజహిత జగన్నుత
వనజోదరసేవక సత్వధనికా ॥సీతా॥

ప్రళయాంతక రూప బలదీప రవిఫల
గిళన ప్రతాప సుగ్రీవ ప్రియా
కుళక దానవ సంకుల విదారణ
భళిభళి జగత్పతి బలు బంటా ॥సీతా॥

పంకజాసను దివ్యపదవైభవ వో
లంకిణీ ప్రాణ విలంఘన
వేంకటేశ్వరు సేవావీర మహాధీర
కింకరరాయ సుఖీభవ ॥సీతా॥

(1-366)

* * *



## అనుబంధం - 1

**హనుమత్సంకీర్తనలలో వివిధ హనుమద్రూపాలు.**

| | |
|---|---|
| ఉగ్రహనుమంతుడు | 4.85 |
| కాంతహనుమంతుడు | 4.483 |
| గురు హనుమంతుడు | 3.522 |
| ఘన హనుమంతుడు | 4.273, 4.275, 4.490 |
| చొక్కపు హనుమంతుడు | 3.138 |
| చొప్పుడు హనుమంతుడు | 4.490 |
| జయ హనుమంతుడు | 3.522 |
| దిట్ట హనుమంతుడు | 3.232 |
| దివ్య హనుమంతుడు | 2.249, 4.272 |
| దేవ హనుమంతుడు | 2.250, 4.483 |
| దొడ్డ హనుమంతుడు | 2.207, 4.467 |
| పెద్ద హనుమంతుడు | 2.207, 2.218, 2.223, 2.350, 3.138, 3.143, 3.500, 3.519, 4.158, 4.470, 4,486, 4.501, 4.509, 4.528, 28,496 |
| పెను హనుమంతుడు | 4.493 |
| పొడవైన హనుమంతుడు | 2.207 |
| బిరుదు హనుమంతుడు | 3.302 |
| భీషణ హనుమంతుడు | 3.138 |
| మహిమ హనుమంతుడు | 3.521 |
| మేంటి హనుమంతుడు | 4.273 |
| వీర హనుమంతుడు | 4.525 |
| సొబగు హనుమంతుడు | 4.413 |
| హిత హనుమంత | 4.444 |

## అనుబంధం - 2

### క్షేత్ర సంకీర్తనలు

| | |
|---|---|
| కలశాపుర హనుమంతుడు | 1.279, 2.216, 2.347, 3.144, 3.148 3.232, 3.302, 3.347, 3.503, 3.521, 4.141, 4.155, 4.167, 4.272, 4.467, 4.483, 4.490, 4.499, 4.506, 4.525, 28.491 ....... |
| మంగాంబుధి హనుమంతుడు | 4.444, 4.458, 4.459, 4.462 |
| మతంగపర్వత హనుమంతుడు | 2.207, 2.223, 2.350, 3.143, 4.158, 4.273 |
| దిగువ పట్టణము తిరుపతి హనుమంతుడు | 2.250 |
| మేడెగుడిదిన్న | 4.413 |
| విజయనగరం | 2.223, 3.138, 3.519, 4.85 |
| విట్ఠలము? | 3.301 |
| స్థల నిర్దేశంలేని సంకీర్తనలు | 1.69, 1.366, 2.218, 2.249, 3.138, 3.319, 3.421, 3.500, 3.519, 3.522, 4.278, 4.327, 4.413, 4.470, 4.486, 4.493, 4.501, 4.509, 4.528, 28.496, ....... |



## ఉపకరించిన రచనలు

### తెలుగు


1. అన్నమయ్య పదకవితల్లో రామకథ (1981) జి. బాలసుబ్రహ్మణ్యం.
2. ఆంధ్ర జానపద సాహిత్యము – రామాయణము (1986) కె.మలయ వాసిని, ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు.
3. ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర (1961) యస్వీ జోగారావు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు.
4. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము (1975) బాలాంత్రపు రజనీ కాంతరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
5. ఆంధ్రశతక సాహిత్యవికాసము (1976) డా॥ కె.గోపాలకృష్ణ రావు, ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు.
6. కడప ఊర్లపేర్లు (1976) డా॥ కేతు విశ్వనాథరెడ్డి, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.
7. తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవసంచిక (1978) సం॥ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, తి.తి. దేవస్థానం, తిరుపతి.
8. తాళ్లపాక కవుల పదకవితలు – భాషాప్రయోగ విశేషాలు (1976) డా॥ వేటూరి ఆనందమూర్తి, నిజాం కాలేజి, హైదరాబాదు.
9. తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు డా॥ వి.ఆనంద మూర్తి, నిజాం కాలేజి, హైదరాబాదు.
10. తెలుగు కావ్యావతారికలు (1968) డా॥ జి.నాగయ్య శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి.

11. తెలుగు జానపద గేయ సాహిత్యము (1978) డా॥ బిరుదు రాజ రామరాజు, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు.

12. దాక్షిణాత్య సాహిత్య సమీక్ష (1978) డా॥ జి.నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.

13. రామరసవాహిని (విదేశాలలో రామకథ) డా॥ జె.వి. సుబ్బారాయుడు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ.

14. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము (1978) శ్రీతాళ్లపాక చినతిరువెంగళనాథుడు, పరిష్కర, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, తి.తి.దేవస్థానం, తిరుపతి.

15. శ్రీనివాసమంగాపురం మరియు మన ఆలయముల చరిత్ర (1980) గోపీకృష్ణ, తి.తి.దేవస్థానం, తిరుపతి.

16. సమగ్ర ఆంధ్రసాహిత్యం–10వ సంపుటం (1968) ఆరుద్ర యం. శేషాచలం అండ్ కో., మదరాసు.

17. సమీరకుమార విజయము – (1929) పుష్పగిరి తిమ్మన – వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్, మదరాసు.

18. సుందర కాండము – (2009) డా॥ ఎం. కృష్ణమాచార్యులు, డా॥ గోతి వెంకటరామయ్య – గీతాప్రెస్, గోరఖ్‌పూర్.

## కన్నడం

1. కీర్తనకారరు (1975) హెచ్.యస్. వెంకటేశ్వరమూర్తి, సామాన్యనిగె సాహిత్య చరిత్రె, బెంగుళూరు విశ్వవిద్యాలయ, బెంగళూరు.

2. దేవతెగళు మత్తు హబ్బగళు (1981) మ॥ శ్రీధరమూర్తి, పునర్వసు ప్రకాశన, బెంగళూరు.



3. పురందరదాసరపదగళు (1977) సం॥ కలమదాని గురురాయరు, కరడి బుక్ డిపో, హుబ్బళ్లి.

4. హరిదాస సాహిత్య సమీక్షె (1980) డా॥ జి. వరదరాజరావ్, కన్నడ అధ్యయన సంస్థె, మైసూరు విశ్వవిద్యాలయ, మైసూరు.

## ఆంగ్లం

1. History of Tirupati (1982) T.K.T. Veeraraghava Charya, T.T.D. Tirupati.

2. Purandara and The Haridasa Movement (1966) M.V. Krishna Rao, Karnatak University, Dharwar.

3. The Great Composers Book I & II Porf. P.Sambamurthy, The Indian Music Publishing House, Madras-5.

## తమిళం

1. అంజనై మైందనిన్ అర్పుదంగళ్ (2009). వంగీపురం. సుందర వరదన్, నర్మదా పదిప్పగం, చెన్నై.

2. అనుమాన్ (1980) డా॥ జి.టి. గోపాలకృష్ణనాయుడు, తి.తి. దేవస్థానం, తిరుపతి.

## హిందీ

1. అన్నమాచార్య ఔర్ సూరదాస్ సమాజ్ శాస్త్రీయ అధ్యయన్ (1983)– డా॥ ముట్నూరి సంగమేశం, శాంతినగర్, తిరుపతి.

* * *